

# నండూరి రామకృష్ణమాచార్య సాహితీ జీవిత ప్రస్థానము

ప్రధాన సంపాదకులు

నండూరి గోవింద రాజు

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

ప్లాట్ నంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.

పుణ్య దంపతులు



శ్రీ నండూరి రామకృష్ణమాచార్య వారి సతీమణి శ్రీమతి సుభద్ర




"శ్రీ నండూరి రామకృష్ణమాచార్య" వారు నివసించిన గృహము: వారి పుత్రులు మరియు పుత్రిక – ఆత్మకూరి గాంధి; శోభనాద్రి; గోవింద రాజు; రంగ రాజన్; సుజాత; విద్యారణ్య స్వామి; వేద వ్యాస చక్రవర్తి.




2021 లో నిర్వహించిన "నండూరి రామకృష్ణమాచార్య జయంతి సభ"లో ముఖ్య అతిథి డా. మాడభూషి శ్రీధర్ గారితో "నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం కార్యవర్గ సభ్యులు మరియు నండూరి వారి కుటుంబ వారసులు.

# నండూరి రామకృష్ణమాచార్య
# సాహితీ జీవిత ప్రస్థానము

ప్రధాన సంపాదకులు

**నండూరి గోవింద రాజు**

సంపాదక వర్గం

**ఆత్మకూరి గాంధి,**

**డా|| నండూరి విద్యారణ్య స్వామి**

**నండూరి వేదవ్యాస చక్రవర్తి**

ప్రకాశకులు

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

**ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.**

**ఫోన్ నెంబర్ : 9440495887,9866115177**

# నండూరి రామకృష్ణమాచార్య సాహితీ జీవిత ప్రస్థానము

{Literary History (స్వీయ చరిత్ర) of Dr.N.V.R.Krishnamacharya}


First Print (ప్రథమ ముద్రణ) : Sept 2026

Copies (ప్రతులు) : 200

ముద్రణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు,
ప్లాట్ నం .:423,రాజరాజేశ్వరి నగరు,
కొండాపూర్, హైదరాబాద్ -500084.
Cell -9440495887.
: 2. నండూరి విద్యారణ్య స్వామి,
ప్లాట్ నం .:154, స్ప్రింగ్ విల్లా, జర్నలిస్ట్
కాలనీ, నిజాం పేట, హైదరాబాద్ -90.
Cell -9391028231 .

Digital copies : nanduri.co.in

వెల : రూ.200/-.



సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# సంపాదకీయం!

నండూరి రామకృష్ణమాచార్య తనజీవితమును పూర్తిగా తెలుగు పద్యమునకే అంకితము చేసుకున్నారు. ఆయన రచనలలో ఎక్కువ శాతము పద్య రచనలే. తను ఆంధ్ర పద్య కవితా సదస్సుకు పలు సంవత్సరములు అధ్యక్ష పదవిలో కొనసాగాక తెలుగు పద్యం ఇక అజరామరం  అని ధృవీకరించుకున్నారు. తన మనస్సుకి శాంతి చేకూరింది.

మేము ఆరు మంది అన్న తమ్ములము (గాంధి, శోభనాద్రి, గోవిందరాజు, రంగరాజు, విద్యారణ్య స్వామి, వేదవ్యాస చక్రవర్తి), ఒక సోదరి (వేంకట లక్ష్మి సుజాత). మమ్మల్ని ఒక పద్ధతిలో పెంచారు. చిన్నపుడు మాతో భారతము, భాగవతము, సుమతీ శతకము, వేమన శతకము, భర్తృహరి సుభాషితాల ... లోని పద్యములను కంఠస్థము చేయించేవారు. మాకందరికి జ్ఞాపక శక్తికి, తెలుగు భాషాభిమానానికి ఇది పునాది అయ్యింది. అనంతపురమున మా నాన్నగారు కళాశాలకు సైకిలు మీద వెళ్ళి వచ్చేవారు. బహుశా చాలా రోజులు ఆలశ్యంగా వచ్చేవారు. తన భుజముపై కాశ్మీరీ శాలువా, సైకిలుకి పూల దండ చూడటం పరిపాటి.

నేను చదువు రీత్యా ఇంజనీరును. ఎం.టెక్ పట్టభద్రుడను. డిఫెన్సులో "ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్" గాను, కార్పొరేట్ సాఫ్ట్ వేర్ కంపెనీలో "వైస్ ప్రెసిడెంట్" గాను పదవులు చేశాను.  కానీ చిన్నప్పటి నుంచి మా నాన్నగారు (నండూరి రామకృష్ణమాచార్య) నన్ను తన పుస్తకాలు అచ్చవుతున్నపుడు ప్రూఫ్ చూడటానికి  మరియు ఎవరైనా ముఖ్యులు జ్యోతిష్య పరంగా వారి జీవితం తెలుసుకో దలచి వచ్చినప్పుడు వారి జాతకము వేయుటకు ఉపకరించుకొన్నారు.

1976 లో మా నాన్నగారి  పుస్తకము "కవిత్రయము – తిక్కన" ఉస్మానియా విశ్వవిద్యాలయము వారు బి. ఎ. విద్యార్థులకు పాఠ్య పుస్తకముగా పెట్టినపుడు, 10,000 కాపీలను అచ్చువేయుటకు పూర్తి బాధ్యతను నా పై పెట్టి కాకినాడ వెళ్ళారు. ప్రగతిగీత, బుద్ధుడు – ధమ్మపదము వంటి పుస్తకములకు ప్రథమ చదువరిని.

1981 లో నేను జబల్ పూర్ లో ఉద్యోగం చేస్తున్నపుడు నెల రోజులు విశ్రాంతి కోసం మా నాన్నగారు అమ్మగారితో కలసి నా ఇంటికి వచ్చారు. యాదృచ్ఛికంగా తను నా టైపు క్లర్క్ ను కలిశారు.  టైపు క్లర్క్ టైపు చేయడానికి  సమ్మతము తెలుపగా తను నాతో ఆంగ్లంలో మహా భారతం వ్రాస్తా నన్నారు.  మీతో ప్రస్తుతము సంప్రదించుట (Reference)

కు మహా భారతమునకు సంభంధించిన ఏ గ్రంధము లేదు. మీకు ఆంగ్ల వార్తాపత్రికలు గూడ చదవటం అలవాటు లేదు. జబల్ పూర్ లో ఏవి దొరకుట దుర్లభం. ఎట్లా వ్రాస్తారు అని అన్నాను. తనకేమీ అవసరం లేదని ఆంగ్లంలో మహాభారతము వ్రాయటం మొదలు పెట్టారు. రోజుకి 12 గంటలు పైబడి సుమారు 40 పేజీలు వ్రాసేవారు. ఆ పేజీలను చదివి టైపు క్లర్కుకు అర్ధము అయ్యేటట్లు కొన్ని పదములను దిద్ది అతనికి ఇచ్చేవాడిని. టైపు క్లర్క్ ఏ రోజుకు ఆ రోజే జిజ్ఞాసతో ఆ పేజీలను టైపు ముగించేవాడు మహాలింగం (పుస్తక కృతజ్ఞతల భాగంలో ఈ విషయం మా నాన్నగారు ప్రస్తావించారు). ఆ టైపు చేసిన పేజీలను ప్రూఫ్ దిద్దేవాడిని. ఆ విధంగా నేను ప్రప్రధమ చదువరి నయ్యాను. ఈ చదవటంతో నాకు విజ్ఞానం, పరిజ్ఞానం, ఆంగ్లంలో ప్రతిభ సమకూరాయి. ఈవిధంగా 6 నెలలు పై బడి జరిగినది. తుదకు 1300 పేజీల (5 కాపీస్) ఆంగ్ల మహా భారతం వ్రాతప్రతి తయారయ్యింది.

* * * * *

నండూరి రామకృష్ణమాచార్య గారి పుస్తకములను ఇంటర్ నెట్ (internet) లో ఉంచితే, కావసిన వారు, వాటిని పొంద గలుగుతారని భావించి నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం సభ్యులతో సంప్రతించాను. వారు ఆమోదముద్ర వేశారు. వెబ్ సైటును (web site) స్వతహాగా తయారు చేసి హోస్ట్ (host) చేశాను. నండూరి వారి పుస్తకములను చాల మటుక్కి ఇంటర్ నెట్ (nanduri.co.in) లో పెట్టాను. కావాల్సిన వారు ఉచితంగా పొంద (download) గలరు.

కొన్ని పుస్తకాలను మరుసారిగా టైపు (డిటిపి) చేయించి ప్రూఫ్ (Proof) దిద్ధ వలసి వచ్చింది. ఆ పర్యవేక్షనలో నండూరి వారు వ్రాసుకున్న సాహితీ స్వీయ చరిత్ర భాగములు అక్కడక్కడ కానపడ్డవి. ఆవికాక తన సహవ్రతులు, శిష్యులు వ్రాసినవి కలిపి ఒక సంకలనముగా పుస్తకము ఉంటే మంచిదని భావించి నా అన్న (ఆత్మకూరి గాంధి), తమ్ముడు (విద్యారణ్య స్వామి), పీఠం కార్యదర్శి (ఆచార్య ఫణీంద్ర), పీఠం అధ్యక్షులు (శ్రీ కళ్ళేపు సాగర రావు గారు) లతో సంప్రదించగా వారు ఉత్సాహం చూపారు. తత్ఫలితమే ఈ పుస్తక సంకలనము.

ఈ పుస్తకములో వేసిన ప్రతి ఒక వ్యాసం / కవితా ఖండిక యొక్క రచయితలకు పేరు పేరున ధన్యవాదములు.

**నండూరి గోవింద రాజు**

# పద్యం మానుష రూపేణ ...

మహాకవి, స్వర్గీయ నండూరి రామకృష్ణమాచార్య గారి జీవన సాహిత్య ప్రస్థానంపై సమగ్ర సమాచార భాండం .. ఈ గ్రంథం.

సాహిత్య లోకంలో బహుళ ప్రసిద్ధి చెందిన మహాకవి, పూజనీయులు - మా గురువు గారు - డా. నండూరి రామకృష్ణమాచార్యులు గారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు, పింగళి లక్ష్మీకాంతం గారు వంటి మహామహుల శిష్యులైన నండూరి రామకృష్ణమాచార్య సుకవి 'ఆంధ్ర విశ్వకళాపరిషత్తు'లో ఎం.ఏ. (తెలుగు) చేసి, 'మైసూరు విశ్వవిద్యాలయం' నుండి తెలుగు సాహిత్యంలో పి.హెచ్.డి. పట్టాను అందుకొన్నారు. అనంతరం .. భీమవరం, అనంతపురం, చిత్తూరు కళాశాలల్లో తెలుగు శాఖాధిపతిగా పని చేశారు. పిమ్మట తాడేపల్లిగూడెం, విశాఖపట్నం, చీరాల కళాశాలల్లో ప్రాచార్యులుగా పనిచేశారు. పదవీ విరమణ తరువాత, 'తిరుమల తిరుపతి దేవస్థానం' వారి పుస్తక ప్రచురణ విభాగంలో సంపాదకులుగా కొంతకాలం పనిచేశారు. వీరి రచనలలో 'తారాతోరణం', 'ఆలోచనం', 'ప్రగతి గీత', 'కవితా ప్రభాస', 'ముత్యాల గొడుగు', 'కచ్ఛపీ కింకిణీకం' వంటి కవితా సంపుటులు; 'శివాజీ', 'ధర్మ చక్రం', 'జ్యోత్స్నాభిసారిక', 'గోదావరి' వంటి నాటికలు; 'కావ్యాలోకం' అనే లక్షణ గ్రంథం; 'కవిత్రయం', 'పద్య శిల్పం' వంటి విమర్శన గ్రంథాలు ప్రముఖమైనవి. ఇవి గాక ఆంగ్లంలో 'Maha Bharata', 'Gandhian Era' ప్రసిద్ధ రచనలు. 1955 లో ఆచార్యుల వారు రచించిన 'కవిత్రయం' గ్రంథానికి - అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో - 'తెలుగు భాషా సమితి' పురస్కారాన్ని ఆనాటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ గారి చేతుల మీదుగా అందు కొన్నారు. 'కేంద్ర సాహిత్య అకాడమి' 1955 ప్రాంతంలో వీరితోబాటు 'జాషువ', 'కరుణశ్రీ' లను 'నవ్య సంప్రదాయ కవులు'గా గుర్తించింది. ఆ తరువాత, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో నందమూరి తారక రామారావు గారి ప్రభుత్వంలో - 'అధికార భాషా సంఘం' అధ్యక్షులుగా (1987- 1990) పని చేసారు. నండూరి వారు రచించిన 'Gandhian Era' అన్న గ్రంథానికి నాటి రాష్ట్రపతి డా. శంకరదయాళ్ శర్మ 'ముందు మాట' ను వ్రాసారు. ఇటువంటి బృహద్రచనలతో ..

పద్యాన్ని ఆధునిక శైలిలో, ఆధునిక భావాలతో, ఆధునిక సమాజ హితంగా రచించిన ద్రష్ట - నండూరి రామకృష్ణమాచార్యులు గారు ఆధునిక యుగంలో 'నడిచే పద్యం'గా ప్రఖ్యాతి వహించారు.

జీవనోత్తర దశలో నండూరి రామకృష్ణమాచార్యుల వారు వేలాది ఆటవెలది పద్యాలలో సరళ సుందరమైన భాషలో సమ కాలీన సామాజికాంశాలను స్పృశిస్తూ, పండిత పామరులందరినీ ఆకట్టుకొని, "అధి వేమన" గా సకల జనుల మన్ననలు పొందారు. సుమారు 4000 ఆటవెలది పద్యాలతో రూపొందించిన "ఆలోచన ము" అన్న గ్రంథానికి గాను, ఆచార్యుల వారు 2000 సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి 'పద్యకవితా పురస్కారా'న్ని అందుకొన్నారు. అంతే కాకుండా, నండూరి వారు 'ఆంధ్ర పద్య కవితా సదస్సు' రాష్ట్ర స్థాయి అధ్యక్షులుగా తన జీవితంలో చివరి రెండు దశాబ్దాలకు పైగా .. అసమానమైన దీక్షా దక్షతలతో ... ఆమరణాంతం (6 జూలై 2003), పద్య కవితా పునరుజ్జీ వనం కోసమై విశేష కృషిని సలిపారు.

పద్య విద్యా పరమాచార్యులై భాసిల్లిన మహాకవి, కీ.శే. డా. నండూరి రామకృష్ణమాచార్యులు గారు పరమపదించిన తరువాత, ప్రతియేటా వారి జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించడంతో బాటు, వారి సాహిత్య వైభవాన్ని భావి తరాలకు అందించే సదా శయంతో ఏర్పడ్డ మా 'నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం' - 2003 నుండి కృషి చేస్తున్న విషయం సర్వజన విదితమే. అంతే కాకుండా ప్రతి సంవత్సరం పద్యకవిత్వ సంబంధంగా విశేష కృషి చేసిన లబ్ధ ప్రతిష్ఠ సాహితీ మూర్తులకు నండూరి వారి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేస్తూ ఉన్నాం. మొట్టమొదట, 2003 లో నండూరి వారి సాహిత్యానుశీలన సదస్సును నిర్వహించాం. అనేక సంవత్సరాలుగా విద్యార్థులలో నండూరి వారి పద్యాల పట్ల ఆసక్తిని కలిగేందుకు గాను పద్యపఠన పోటీలను నిర్వహించాము. అందుకు ఉపయుక్తంగా ఉండే విధంగా ప్రముఖ అవధాని డా. ఆశావాది ప్రకాశరావుగారి కూర్పుతో కీ.శే. నండూరి శోభనాద్రిగారు 'నడిచే పద్యం నండూరి' అన్న చిన్న పుస్తకాన్ని ముద్రించడం జరిగింది. ఆ పుస్తకాన్ని ఎప్పటికప్పుడు తగిన మార్పులతో గురు పుత్రులు శ్రీ

నండూరి గోవింద రాజు గారు అనేక పునర్ముద్రణలు చేసి, జన బాహుళ్యానికి ఉచితంగా అందిస్తూ ఉండడం ముదావహం.

ఈ 'సాహిత్య పీఠం' ప్రస్థానంలో భాగంగా .. 29 ఏప్రిల్ 1921 నాడు ఆంధ్ర దేశంలోని పశ్చిమ గోదావరి జిల్లాలోని గణపవరంలో జన్మించిన మహాకవి నండూరి రామకృష్ణమాచార్యులు గారి 'శత జయంతి మహోత్సవా'న్ని (2021లో 'కోవిడ్' ఆటంకం కారణంగా) 2022 లో హైదరాబాదు నాంపల్లిలో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించు కొన్నాం.

అంతే కాకుండా గోవింద రాజు గారు ఆన్‌లైన్ లో nauduri.co.in అనే ఒక వెబ్‌సైట్ ను ఏర్పాటు చేసి, అందులో గురువు గారి అనేక పి.డి.ఎఫ్. గ్రంథాలను, వారి కవితలను గానం చేయించి రూపొందించిన ఆడియో రికార్డింగులను, ఇంకా .. గురువు గారికి సంబంధించిన ఎంతో సమాచారాన్ని భావి తరాల సాహిత్యాభి మానులకు అందుబాటులోకి తెచ్చారు. ఇందుకు వారు చేస్తున్న కృషి అనన్య సామాన్యం! వారికి మా సంస్థ పక్షాన మా హార్దిక ధన్య వాదాలను తెలియజేసుకొంటున్నాం. వారితో బాటు, మా 'నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం' నిర్వహించే అన్ని కార్యక్రమాల కు - విశేష సహకారాన్ని అందిస్తూ మార్గదర్శనం చేస్తున్న మా సంస్థ అధ్యక్షులు శ్రీ కళ్ళేపు సాగరరావు గారు. అట్లాగే మా కార్యక్రమాల నెర్వహణలో డా. నండూరి రామకృష్ణమాచార్యుల వారి ఇతర కుటుంబ సభ్యులంతా.. ముఖ్యంగా శ్రీ ఆత్మకూరి గాంధీ గారు, కీ.శే. నండూరి శోభనాద్రి గారు (2013 వరకు), డా. నండూరి విద్యారణ్య స్వామి గారు, శ్రీ నండూరి వేదవ్యాస చక్రవర్తి గారు.. వీరందరికి మా సంస్థ పక్షాన ప్రణామాలను సమర్పించుకొంటున్నాను. ఈ సంద ర్భంగా, మా గురువుగారు నండూరి వారి జయంత్యుత్సవాల నిర్వహణలో మాకు సహృదయతతో సహకరిస్తున్న నవ్యసాహితీ సమితి 'కార్య నిర్వాహక అధ్యక్షులు' శ్రీ వేమరాజు విజయకుమార్ గారికి కూడ మా హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేసు కొంటున్నాను.

సుమారు డెబ్బయ్యేళ్ళ క్రితం వీరు రచించిన 'శీర్ష మేఖల' అన్న పద్య కవితా ఖండిక, 'అజ్ఞాత కౌంతేయం' అన్న మరొక విశిష్ట రచన, ఇంకా .. 'ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః' అన్న ఖండిక ... ఇటువంటి అనేక కవితా సుమాలతో కట్టిన 'తారా తోరణం' గ్రంథం .. కాలానికి ఎదురీదుతూ ఆంధ్ర సాహితీ నందనవనంలో శాశ్వతంగా నిలిచి కవితా కల్పవృక్షంగా భాసిల్లుతున్నది. ఈ 2026 సంవత్సరం నిర్వహించిన గురువు గారి జయంతి ఉత్సవంలో .. వారి ఆ ప్రసిద్ధ కవితా ఖండికల సంపుటి - 'తారా తోరణం' గ్రంథాన్ని, వారి శతజయంతి విశేషాలను కూడ చేరుస్తూ పునర్ముద్రించి, ఆవిష్కరించడం జరిగింది.

ఇప్పుడు ఇక ఈ గ్రంథంలో గురువు గారి స్వీయ సాహిత్య జీవన ప్రస్థానం పై వారే వ్రాసుకొన్న సమాచారాన్ని ముద్రించి భావి పాఠకులకు అందించే ప్రయత్నం చేయడం జరిగింది. ఇది ఒకరకంగా గురువు గారి ఆత్మకథ వంటిది. దానితో బాటు గురువు గారిపై అభిమానంతో, భక్తితో, వివిధ తరాల సాహితీ వేత్తలు, కవులు వివిధ సందర్భాలలో అందించిన వ్యాసాలను, కవితాంజలులను సేకరించి, ఈ గ్రంథంలో చేర్చడం జరిగింది. ముఖ్యంగా గురువు గారు నండూరి రామకృష్ణమాచార్య గారు పరమపదించి నప్పుడు వారికి వివిధ పత్రికలలో ఇతరత్రా సంచికలలో అందించిన నివాళి వ్యాసాలను, కవితా నీరాజనాలను ఒక ప్రత్యేక విభాగంగా సమకూర్చడం జరిగింది. ఇదంతా కూడ .. శ్రీ నండూరి గోవిందరాజు గారు చేసిన మరొక మహోన్నత కృషి! పితౄణంగా ఆయన సమర్పిస్తున్న విశేష శ్రద్ధాంజలి!!

ఈ పుస్తకాన్ని చదివి ఆనందించి, ఈ తరం సాహిత్యాభిమానులు అందరికీ అందించి, తెలుగు సాహిత్య చరిత్రలో, నండూరి రామకృష్ణమాచార్యుల వారి సాహిత్య వైభవానికి సంబంధించిన ప్రచారంలో ప్రతి తెలుగువాడూ .. పునీతం కావలసిందిగా వారి ప్రియమైన శిష్యునిగా నేను ప్రార్థిస్తున్నాను.

డా. ఆచార్య ఫణీంద్ర
ప్రధాన కార్యదర్శి
(తేది. 11 సెప్టెంబర్ 2026) **'నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం'**

# నా సాహితీ ప్రస్థానం




"నండూరి వారి ప్రసిద్ధ పద్యం వారి చేతి వ్రాతలోనే .."

# నా సాహితీ ప్రస్థానం-1

## నండూరి రామకృష్ణమాచార్య

నా జననం తేది: 29-4-1921. మా అమ్మ- అగ్రహార గోపవరం (పశ్చిమగోదావరి పిప్పర – సివారు పల్లెటూరు). ఆత్మకూరి వారి ఆడపడుచు. నేను జన్మించినది అగ్రహార గోపవరంలో. నా మేనమామ ఆత్మకూరి గోవిందాచార్యులుగారు. గాంధీ మహాత్ముని[1] పిలుపు మేరకు సత్యాగ్రహశాంతి సమరంలో జైలుకు వెళ్లిన సుప్రసిద్ధ దేశభక్తుడు. సత్యాగ్రహి తెలుగు వార పత్రికకు సంపాదకుడు, అధినేత.[2]

మా నాన్నగారు - నండూరి శోభనాద్రాచార్యులుగారు, కానుమోలు గ్రామ కరణం. తథా మా తాత నండూరి రామ చంద్రా చార్యులుగారు. తరతరాల నుండి అనువంశికముగా వచ్చినట్టిది ఆ కరణీకం- అన్నారు. నాకు శైశవంలో స్ఫోటకం వచ్చినది. మా అమ్మ నలుపు. మానాన్నగారు తెలుపు. గొప్ప అంద గాడు. నాది తెల్లతోలే గాని - ముఖము నిండ స్ఫోటకం మచ్చలు. చిన్న శిశువుగా స్ఫోటక మంచం మీద ఉండగా - పై నుండి ప్రక్కలో తేలు పడి నా వైపుకు తరలిందట. మా అమ్మ - ఆ తేలును పలుసారులు నేలపైకి త్రోసిందట. తేలు ఎన్నోసారులు ఆమెను కుట్టి కుట్టి పిదప క్రింద పడినదట.

**స్ఫోటక బాధచే ఒడలు సోలి పరుంటిని తల్లి ప్రక్కలో;**
**మాటికి మాటికిన్ మరల మంచము పై కెగబ్రాకు- తేలు-నన్**
**'వ్రేటును వేయకుండ తన వ్రేళులతో విదలించి - యెన్నియో**
**కాటులు తిన్న తల్లి కృప -కారణ జన్ముడనై తరించెదన్ .**

అది మాతృప్రేమ. కన్నతల్లి కడుపుతీపి. ఆవృత్తాంతం నేను ఎదిగిన తరువాత పలుసారులు విన్నాను.

1.మా అమ్మ నాతో చెప్పిన అంశ - నన్ను ఉయ్యాలలో పెట్టినపుడు మా అమ్మ నాకు పట్టు గోచీ పెట్టినదట. నా మామయ్యగారు ఆ పీతాంబరం పీకివేసి ఖద్దరు గోచీ పెట్టినాడట. ఆ మొదలు నాకు తెలియని వయస్సులో శైశవంలో ఖద్దరు ధారణ ఆరంభమైనది.

2.సత్యాగ్రహి పత్రికను ఆంగ్లేయ ప్రభుత్వం నిషేధించి ప్రెస్సును స్వాధీనం చేసుకున్నది.

కానుమోలు గ్రామంలో నేనున్నది స్వల్పకాలమే. ప్రజలలో – శ్రీ వైష్ణవ కుటుంబాలలో కానుమోలు గ్రామం గూర్చి ఆ ఊరి చెరువు గూర్చి ఒక జనశ్రుతి ఉన్నది. కానుమోలు గడ్డ - కానుమోలు చెరువు నీళ్లు తెలివి తేటలకు దోహదం చేస్తాయట.

**నెలవు - కానుమోలు - తెలివి తేటల కెల్ల ;**
**కలదు మహిమ-చెరువు జలము లందు;**
**కానుమోలు జనుల కనులలో - వెలుగొందు.**
**చతుర లలిత చాకచక్య గరిమ.**

కానుమోలు గ్రామం - గుడివాడ - ఏలూరు పట్టణాలకు మధ్య ఇంచు మించు సమదూరంలో ఉన్నది.

కానుమోలు నుండి - నన్ను మా అమ్మమ్మ సుభద్రమ్మగారు – తన పుట్టినింటికి కోరుకొండ తీసికొని వెళ్లి పెంచి పెద్ద చేసినది. ఆవిడ సాతులూరివారి ఆడపడుచు, కొడుకు ఆత్మకూరి గోవిందాచార్యులకు పెద్ద ఆస్తినంతా అప్పగించి - తాను కోరుకొండలో పుట్టింటికి చేరుకున్నది. సాతులూరి వారు సుప్రసిద్ధ పండితులు. జనానురక్తులైన పౌరాణికులు – తూర్పుగోదావరిలో.

**సాతులూరి వారు-సాధు పండిత వరుల్;**
**సంఘ హితము కోరు సచ్చరితులు;**
**కోరుకొండ నుండు - గొప్ప దేవళ మొండు;**
**గరిమ నాభి - లలిత కళల కెల్ల.**

సాతులూరివారు సాల గ్రామ స్వరూపులుగా నిత్యభారత రామాయణ పారాయణ పారీణులుగా సుప్రసిద్ధులు. లేత వయస్సు లోనే నాకు విస్తార శ్రుత పాండిత్యం భారత భాగవతాలలో లభించింది. అది కేవలం శ్రుత పాండిత్యమే. నా మేనమామ గారి మేనమామ శ్రీ సాతులూరి నరసింహా చార్యులుగారు - 'దేవాలయంలో స్థానాచార్యులు వారితో పాటు జోడు కాగడాల వెలుగులో నిత్యం నేను గూడ గుడికి వెళ్లివచ్చేవాడిని. కోరుకొండలో గురుకులపద్ధతిలో ఉచిత భోజనం కల్పించి, వటువులకు సంస్కృతం భోధించేవారు – మహానుభావుడు ద్వాదశోర్ధ పుండ్రధారి

తెలికిచెర్ల కందాలై గోపాలాచార్యులవారి వద్ద నేను సంస్కృతం - పంచకావ్యాలు - కౌముది అభ్యసించినాను.

**గోపాలాచార్య[1] గురు**
**శ్రీపాదుల చేరినాడ - చిన్నతనములో;**
**శ్రీ పేర్మిని సంస్కృత వి**
**ద్యా పరీణునిగ చేసె దయతో నన్నున్.**
**లోకోత్తర ధిషణకు ఏ**
**కైకోదాహరణ మైన - "కౌముది" చదువన్,**
**శ్రీ కాళిదాస కవివరు**
**శాకుంతల నాటకమ్ము చప్పగ తోచెన్.**

ఆ కోరుకొండలో శ్రీమాన్ మరంగంటి వెంకటాచార్యుల వారు – ఆంగ్లం బోధించారు నాకు - నా సహ విద్యార్థులకూ.

**వెలుగు బాట వేసె - వేంకటాచార్యుండు**
**కోరుకొండ వాసి గొప్ప గురువు;**
**ఆంగ్ల భాష నేర్పి - ఐదంయుగీనమౌ**
**తాళపు చెవి - నాకు దాన మిచ్చె [2]**

కోరుకొండ - ప్రాథమిక దశలోనే నాకు సంస్కృతం ఆగ్లంలో లోతైన పునాదులు తీర్చిదిద్దింది.

క్రీ.శ 1934 జూన్ నెలలో ఉన్నత విద్యాభాసమునకై నేను – ఏలూరు చేరినాను. మానాన్నగారపుడు విస్సన్నపేట ఏస్టేటులో ఠాణాదారు.

1937లో విజయవాడలో శ్రీ రాజా రంగయ్యప్పరాయకళాశాల ఏర్పడినది. ఆ కళాశాలలో, చేరే స్థోమత లేక ఉద్యోగార్థినయి విజయవాడలో మేనత్తగారి భర్త మామిళ్లపల్లి వెంకటాచార్యుల[3] వారింటికి చేరినాను. ఆమహానుభావుడు పదునారేండ్లప్రాయములో నున్న - నన్ను – నిర్వ్యాజ కరుణతో కళాశాలలో చేర్పించినాడు.

1. వీరు తదుపరి పెదజియ్యరుస్వామివారికి చిరకాలం సహవ్రతులు. చినజీయరు స్వామివారికి విద్యా గురువులు.
2.1940 లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నాకు బి.ఏ. ఆనర్సులో అగ్లంలో ప్రప్రథమ బహుమతి - స్టాన్‌లే ప్రైజు లభించింది. దానికి మూలకారకుడు ఆయనయే.
3.చాలాకాలము పిదప ఆయన మనుమడు వెంకటాచారి నా అల్లుడైనాడు. అది నా అదృష్టవిశేషములో అంతర్భాగము.

ఫీజులు కట్టి, నాకు విలువగల బట్టలు, కుట్టించి పుస్తకాలు కొని - "దైవం మానుష రూపేణ" ఆయన నాపాలిట దేవుడే. పిదప నా మేనమామగారు వచ్చి, నా విద్యాబాధ్యత స్వీకరించినారు.[4]

విజయవాడ కళాశాలలో ఇంటరు మీడియేటు తరగతిలో నేను కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారికి ప్రత్యక్ష శిష్యుడను. (1938-39) నేను - తెలుగులో చేరుటకు ముఖ్యకారణం- నాపై పడిన విశ్వనాథవారి ప్రభావమే.

కళాశాల వార్షికోత్సవములో - పద్యరచనకు విశ్వనాథవారు నాకు ప్రథమ బహుమానం ఇచ్చారు. పద్యరచన పోటీలో నేను వ్రాసిన పద్యం విశ్వ నాథవారు, సభాసదులకు చదివి వినిపించారు. అంతేగాక "ఈ చిరంజీవి రెండుగంటలు వ్యవధిలో ఒక గొప్ప పద్యం వ్రాశాడు. తీరికగా ఇంటిలో కూర్చుని, సుగృహీత నామధేయులైన వృద్ధకవులు ఇట్టి మధుర కవిత వ్రాయలేరు". నేను వ్రాసిన పద్యం:

**గోదావరికి కల్కి కుల్కుల నాట్య వి**
**న్యాసములను నేర్పె నన్నయ కవి;**
**గరువదనమ్ము వాల్ గనుల అంచుల నింప**
**తెనుగు వాణికి నేర్పె తిక్కన కవి;**
**మందార మకరంద మాధుర్యములు తెల్లు**
**పొలముల పండించె పోతన కవి;**
**స్వర్గలోకము నుండి పారిజాతము దింపి**
**తెలుగు సాహితి నాటె తిమ్మన కవి;**

**మువ్వ గోపాలు చిన్నారి మురళి తోడ**
**తాండివింపగ జేసె క్షేత్రయ్య గీతి;**
**తెలుగు హృదయాల - తంబురా తీగె మీటి,**
**అమృత రస తరంగిణి జేసె త్యాగరాజు**

4.1939 లో నా మాతృమరణాంతరము నేను మేనమామ దగ్గరే పెరిగినాను. తారాతోరణము తొలిగ్రంథము. నేను మా మేనమామ ఆత్మకూరి గోవిందాచార్యులుగారికి అంకితమిస్తూ వ్రాసిన పద్యము

నీ దరిని చేరుటం జేసి నాదు బ్రదుకు
దిద్దుకో గల్గివాడ ఈదృశ విధాన;
నాశిక కడ గౌతమి తూర్పునకు స్రవింప
ఇంత నది యయ్యె ఒక సెలయేరు గాక!

తదుపరి ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో కూడ - గొప్ప గురువులు దొరికినారు. ఆశాఖాధిపతి- శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు

**జంగమ గంగా యమునా**
**సంగమముగ - ప్రాక్ ప్రతీచి సాహిత్యములన్;**
**పింగళి లక్ష్మీకాంతుడు**
**సాంగోపాంగముగ - నన్ను - చతురత దిద్దెన్,**

దక్షిణ భారత చరిత్ర బోధించినది శ్రీ గొర్తి వేంకట్రావుగారు. శాసన లిపిని బోధించిన వారు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు [1].

ఆయనకు ఏ డిగ్రీ లేదుగాని శతాధిక డాక్టరేటు పట్ట భద్రులను మించిన చరిత్రపరిశోధకుడు. శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారు, ఆయనకు ఆంధ్రప్రశస్తి అంకితం చేసినపుడు అన్నమాట

**“డిగ్రీలు లేని పాండిత్యమ్ము వన్నెకు**

**రాని పాడు కాలాన పుట్టి.....**

అపుడు వ్యాకరణం చెప్పిన గురువుగారు. శ్రీ వఝుల చినసీతారామస్వామి శాస్త్రిగారు. తిరుపతి వేంకట కవుల శతావధానం భగ్నం చేసిన ఏకైక ప్రముఖుడు వఝుల వారే అంటారు.

**వ్యాకరణ విద్యా గురువుగ**
**ప్రాకట విఖ్యాతి గన్న – వఝుల కడ -నే**
**సాకల్యంబుగ ఆంధ్ర**
**వ్యాకృతులను చదివినాడ - ప్రాంజలి నగుచున్.**

ఇక పేర్కొన దగిన మేధావి - అబ్బూరి రామ కృష్ణరావుగారు. తెలుగు కవులు, సాంస్కృతిక స్వీయ పరాగ పూరితులు. సాంస్కృతిక పరపరాగ సమ్మేళనమును, ఆరాధించిన మేధావులలో అబ్బూరి రామకృష్ణా రావుగారిని పేర్కొనక తప్పదు.

---

1 నేను వ్రాసిన ప్రాచీన దక్షిణ భారత చరిత్రను. మా గరువు గొర్తివారికి అంకితం చేశాను - శ్రీవారు ఉపాధ్యాయులలో అగ్రగణ్యుడు

ఆంగ్లేయులు రవి అస్తమించని సామ్రాజ్యమును నిర్మించి నారు. అంతకంటె గొప్ప విషయం యావత్ ప్రపంచంలోని గొప్ప గ్రంథాలను ఆంగ్లేయులు తమ భాషలోనికి అనువదించు కొన్నారు. ఆంగ్లలో విజ్ఞాన సర్వస్వమును నిర్మించుకున్నారు. వారిది విశ్వ విక్రాంత దృష్టి అబ్బూరివారు గ్రంథాలయ నేతగా ఉండి - విశ్వ విజ్ఞాన సమగ్రదృష్టిని అలవరుచ్చుకున్నారు.

**వెలుగు వెదకు కొనుచు - తెలుగు సాహితి దాటి,**
**ఎగురునట్లు నన్ను ఎవడు తీర్చె!**
**అద్వితీయ ధిషణు అబ్బూరి గృహనామ**
**రామ కృష్ణరావు - ప్రస్తుతింతు.**

ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నాకు సహాధ్యాయి – మేధావులలో, మేరు శిఖరి కొత్తపల్లి వీరభద్ర రావు. అతడు నాక్తు ఆప్తమిత్రుడు. మంచి వక్త ఉత్తమోత్తమోపాద్యాయుడు - సాహితీ తేజస్వి.

అప్పుడు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు యశస్వి శ్రీ కట్టమంచి రామ లింగారెడ్డి గారు. వారితో నాకు ప్రగాఢ పరిచయం ఏర్పడింది. నా తొలికావ్యం తారా తోరణమునకు, పీఠిక వ్రాసి "క్రొత్త పాతల మేలి కలయిక" అని ప్రవచించారు. ఆ ప్రవచనం శ్రీ గురజాడ అప్పారావుగారిది. నా కవిత నా తారాతోరణం క్రొత్త పాతలకు మేలికలయిక - అని రామలింగారెడ్డిగారి అభి భాషణకు నేను పొంగిపోయాను. అయితే ఆ మాట అతిశయోక్తి కావచ్చు. ఏనాటికైనా రామలింగారెడ్డి గారి సమీక్షను సత్యం చేయాలనే ఆకాంక్ష నా హృదయంలో బీజ ప్రాయంగా నిలబడింది.

ఆనాడు ఆంధ్రవిశ్వవిద్యాలయం సాహితీరంగంతో ఒక వింత సత్రశాల. రామలింగారెడ్డి గారు వ్రాసిన "కవిత్వతత్త్వ విచారం" ఆంధ్రసాహితీ విమర్శకు సరికొత్త మలుపు చేకూర్చింది. శాబ్దిక చర్చనుండి రసనిష్పత్తి వైపు సహృదయుల దృష్టి మరల్చిన ఘనత రామలింగారెడ్డిగారికి దక్కవలె. రెడ్డిగారు కవిత్వతత్త్వ విచారంలో పింగళి సూరనకు పెద్ద పీట వేశారు. ఆయన దృష్టిలో "కళాపూర్ణోదయం" సమగ్రసాహిత్యం. పింగళి సూరన - పీఠికలో చేసినప్రతిజ్ఞ-ఔచిత్యంబు పోషించుట– అనౌచిత్యంబు పరిహరిం

చుట - ఇత్యాది శపధాలు సర్వతో ముఖ సమగ్ర దృక్పథ సూచకములే. నేను శ్రీవారితో వాదించే వాడిని తరచు. " పింగళి సూరన, తెలుగు లో ఏకైక కవి కాడు. కళాపూర్ణోదయం - మెరపుతీగల పుట్ట. అది ఒక లంబాడీ లంగా ఎన్నోతలుకు బెళుకులున్నా - వెలుగు జిలుగులుండవచ్చు. కవిత్రయ భారతంతో సరిగాదు" అని నేను వాద తీవ్రతతో అనేవాడను.

శ్రీ రామలింగారెడ్డిగారు నూనూగు మీసాల నూత్న యౌవనోద్రేకంలో ఉన్నప్పుడు- కళాపూర్ణోదయం చదివినారు. ఆతాలి వలపు మైకం కవిత్వ తత్త్వ విచారంలో కల్పించ వచ్చు అని నా వాదం. అయితే రామలింగారెడ్డిగారు - పింగళి వారి పైఅధికారి. అంతే గాక ఆనాడు ఆంధ్రశాఖాధిపతి పింగళి లక్ష్మీకాంతం. పింగళి సూరన తనవాడే నని ఆయన లోపలి అభిప్రాయం. ఆశాఖలోని పండితుడు- శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు నోరుగల వారు. ఆయన కళాపూర్ణోదయం పరిష్కరించి పిఠాపురం రాజు వారి ఆర్థిక సాహాయ్యంతో ముద్రించారు. పిఠాపురం రాజావారికి పింగళి సూరనపై గల అభిమానం జగద్విదితం. అంతేగాక విశ్వకళా పరిషత్తులో క్రొత్తగ పండిత పదవిని చేపట్టిన శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రి గారు ఉండేవారు. నిజానికి కళాపూర్ణోదయం కావ్యం అక్షరాల కంఠస్థం చేసినవారు ఎవరయినా ఉంటేవారు శ్రీ దువ్వూరు వేంకటరమణ శాస్త్రిగారు అని చెప్పక తప్పదు. ఎందరో మహానుభావులు. అందరకూ వందనములు అనవలసిందే సహృదయులు. పింగళి సూరన ఆనాడు ఆంధ్రదేశంలో సాహిత్య గరిమనాభి అయ్యారు.

నా కావ్యము తారాతోరణమునకు పీఠిక వ్రాసిన రామ లింగారెడ్డిగారిని ఏకాంత సంభాషణలో "శీర్ణమేఖలపై" ఆంతరంగికంగా అభిప్రాయం చెప్పమని అడిగాను. ప్రసంగ ధోరణితో శ్రీరామలింగారెడ్డిగారు అన్న వాక్యాలు.

"మీ గోదావరీ సీమవారికి తెలుగు రాదు. పూర్వకాలంలో గోదావరీ భాషను, సంస్కృతం పాడు చేసింది. ఆధునిక కాలంలో ఆంగ్లం పాడుచేసింది."

“నన్నయ గోదావరీ సీమవాడే - ఆది కవి మా వాడే” అని గర్వంగా సమాధానం చెప్పాను. రెడ్డిగారు మందహాస మండన ముఖుడై అన్నారు. “నన్నయ సంస్కృతాభిమాని. ఆయనను అనుకరించి తదుపరి తెలుగు కవులు సంస్కృతం పులిమినారు తిక్కన కాక” అని సత్వర సమాధానం చెప్పారు.

తిక్కన ఎన్నో సంస్కృత సమాస భూయిష్టమైన పద్యాలు - భీష్మ ద్రోణ కృపాధి ధన్వినికరాభీలమ్ము - వ్రాశారు. తిక్కన ద్రౌపదిచే పలికించిన పద్యం -

**దుర్వారోద్యమబాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫురత్**
**గర్వాంధప్రతివీర నిర్మధన విద్యాపారగుల్ మత్పతుల్**
**గీర్వాణాకృతులేవురిష్టు - నిను దోర్లీలన్ వెసంగిట్టి గం**
**ధర్వుల్ మానము ప్రాణముం గొనుట తథ్యంబిమ్మెయిన్ కీచకా.**

గ్రుక్క తిప్పుకోకుండ చదివి వినిపించాను. ఆ పద్యం విన్న శ్రీ రామ లింగారెడ్డిగారి ఛలోక్తి. “ఆహా ద్రౌపదీ ! నీ ఊపిరి తిత్తు లెంత బలమైనవి”.

“నీ శీర్ణ మేఖలలోని

**క్వణదణుకింకిణీకలిత కాంచన మేఖలయై ఝుణం ఝుణ**

**న్మణిమయ శింజనీధ్వనుల మార్మోగమై విదలించె ఆమె కొం**

**గును అపరంజి కాంచి తెగికూలెను కర్ణుని హస్త వేగ చా**

**రణమున హేమరత్నమణి రంజిత కోమల కుట్టిమ మ్మునన్**

పలువురు మెచ్చవచ్చు - కాని తరువాతి సీసపద్యం - కర్ణుని మనస్తత్వ విచార చర్య - మేల్తరం” అన్నారు. ఆపద్యం - తదుపరి పద్యం

**కట్టెదుటను నున్న కౌరవాదీశ్వరు**
**ప్రాణ మిత్రుని మోము నరయ లేక;**
**హైమ కాంచిని వీడి అందందు పడిపోయి**
**చెదరిన మణులేర చేయిరాక,**

**స్తంభించి నిలిచిన సతి కురు పట్టమ**
**హిషి అవస్థ మది నూహింప లేక**

**ఏమి యెరుగకయె ఇంతలు సలిపిన**
**తన్ను గూర్చి తన కర్మమ్ము గాక**

**కనక తల్పము జారిన కర్ణు హృదయ**
**మందు విద్యుల్లతా రోచి అశనిపాత**
**మగ్ని పర్వత జృంభణ మబ్ధిఘోష**
**ధరణి కంపమ్ము లేకమై తాండవించె.**

"కవిత్వతత్త్వ విచారము" కర్తకు అభిమాన కవి వేమన. అలతి అలతి పదముల కాహళ సంధించినట్టు తిక్కన చెప్పినట్టు శబ్దములు కూర్చిన కవి వేమన.

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి అభిప్రాయాల ప్రభావం - అప్పుడు నా మీద అంతగా పడ లేదు గాని తదుపరి నేను వ్రాసిన ప్రగతి గీత, కవితా ప్రభాస, ఆలోచనము కావ్యాలలోని పద్యాలపై - మూడువేల పై సంఖ్య గల ఆటవెలది పద్యాలపై నా బ్రదుకు మలి సంజకెంజాయలలో నటరాజు లీలాతాండవ సదృశంగా వెల్లి విరిసింది. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు - బ్రదికి యుంటే ఎంత సంతోషించి యుండే వారో!

ఆంధ్రవిశ్వ కళాపరిషత్తును వదలిన పిమ్మట నేను ఆంధ్రక్రిష్టియన్ కళాశాలలో అధ్యాపకుడనుగా 4-8-1942 తేదీన చేరినాను, కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి [1] గారితో పాటు. ఆ తేది కరుణశ్రీ గారి జన్మదినోత్సవం.

గుంటూరులో మా యింటికి తరచు అభ్యాగతుడుగా సుప్రసిద్ధ దేశభక్తుడు వచ్చేవారు - భయంకరాచారి. మా మేనమామ గారు ఆత్మకూరి గోవిందాచార్యులవారు- ఉమ్మడి మద్రాసు రాష్ట్రం శాసన మండలి సభ్యుడు- కాంగ్రెసు నేత వచ్చివెళ్లినారు. పోలీసులు నన్ను అరెస్టుచేశారు. నా ఉద్యోగం పోయింది. కారాగృహంనుండి విడుదల యైన పిదప సెప్టెంబరులో మద్రాసు విశ్వవిద్యాలయంలో రెండేండ్లు కోరాడ రామకృష్ణయ్యగారి దగ్గర తిక్కనపై పరిశోధన చేశాను (1943 సెప్టెంబరు నుండి 1945 వరకు).

1. కరుణశ్రీ గారికి నాకు మైత్రి దినదినాభివృద్ధి గాంచి అర్ధశతాబ్ది దాటి వర్ధిల్లినది.

1945లో భీమవరంలో, ఏలూరులో క్రొత్తగ కళాశాలలు పెట్టారు. నాకు భీమవరంలో ప్రాచ్య భాషాధినేతగా ఉద్యోగం వచ్చింది. అప్పుడు నా వయస్సు 24 యేండ్లు.

## -: భీమవరము :-

భీమవరం - నా జీవిత యాత్రలో పేర్కొనదగిన పెద్ద మజిలీ. 1945 లో అక్కడ కళాశాల ఏర్పడినది. అది "ప్రజల కళాశాల" అన్నారు – కట్టమంచి రామలింగారెడ్డిగారు. ప్రజల విరాళాలు ప్రోగుచేసి కార్యదర్శి శ్రీ దంతులూరి నారాయణరాజుగారు ప్రధాన సూత్ర ధారిగ ఆకళాశాల ప్రారంభించారు. ఉపన్యాసకులపై తమ అభ్యర్థన పత్రాలలో "కులము" పేర్కొన నక్కర లేదని పత్రికా ప్రకటన చేశారు! అధ్యాపకులను కేవలం సామర్థ్యం పరిగణించి ఎన్నుకున్నారు. ఆచార్య శ్రీ మామిడిపూడి వేంకట రంగయ్యగారు మొట్టమొదటి ప్రిన్సిపల్: ప్రాచ్యభాషాధినేత నయ్యాను నేను. గణిత శాఖాధిపతి అర్కసోమయాజి. ఆయన సంస్కృత పాండిత్యం కొలతకు అందనట్టిది. పేరి శర్మగారు ఆంగ్లశాఖాధిపతి, రసాయన శాఖాధినేత పాలగుమ్మి పద్మరాజు. అధ్యాపకులు "అష్టదిగ్గజాలు" అనేవారు ప్రజలు. వయస్సులో అందరి కంటె చిన్నవాడను నేనే. 'యావదాంధ్రంలో - కళాశాల లన్నిటిలో ఆంధ్రశాఖాధి పతులలో వయసులో చిన్నవాడను నేనే. కళాశాలలో క్రొంగొత్త జీతాల స్కేళ్ళు అమలు పరచింది భీమవరం - ఏలూరు కళాశాలలలోనే. యవనికా తరంలో శాసనమండలి సభ్యుడు – త్యాగయోగి మా మేనమామగారు ఆత్మకూరి గోవిందాచార్యుల వారు నన్ను పుత్ర నిర్విశేషుడుగా చూచేవారు. కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీ తుమ్మలపల్లి వీరభద్రరావు గారు. నన్ను తన నెయ్యము – గురువు - సచివుడు – అప్త బంధువుగా చూచేవారు. నాకు కావలసిన వస్తువులు అన్నీ ఆయనే సమకూర్చారు. ఆయన కారును అవసరమైనప్పుడు నాకు పంపేవారు. పరుపు – పాన్పు గృహోపకరణాలు అన్నీ ఆయన నాకు, బహూకరించారు. నా మేనమామ గొప్ప వక్త. మేనమామ చాలికలు నాకు సంక్రమించింది నోరుజోరులో. నాకంఠం దేవదత్తం అనేవారు నా ఛాత్రులు. తెలుగు పండితులు సర్వసాధారణంగా చేసేపని - పద్యాలు వ్రాయటం మొదలు పెట్టాను. సత్వరం కవితా కిరీటిగా "వేషధారినై" రాజువెడలె రవి తేజము లలరగ బదులు

నాకు తెలియకుండ “కవి వెడలె రవి తేజము లలరగ” భరత నాట్యం చోటు చేసు కున్నది నా జీవితచరిత్రలో. భీమవరంలో ఒక దశాబ్దిపాటు నేను సాహితీ రంగ స్థలంపై ధరించిన - కవితా కిరీటి పాత్ర తలచుకుంటే, నేడు నేను సిగ్గు పడటంలేదుగాని - లోలోపల నవ్వుకొనుచున్నాను.

భీమవరంలో నా జీవిత చరిత్రలో ఎన్నో సన్నివేశాలు - విచిత్ర వినోద విద్యా ప్రహసనాలు జరిగాయి. శ్రీ పి.యస్.ఆర్. అప్పా రావు గారు ఆంధ్ర శాఖలో ట్యూటరు 1945-46లో. ఆయనకు ఏడాది తిరుగకుండా ప్రభుత్వ ఉద్యోగం లభించింది. వీడ్కోలు విందులో అప్పారావుగారు అన్నారు - “ఆచార్యులుగారూ! నాకంటే అన్ని విధా లుగా, బహుశ  మీకంటె కొన్ని విషయాలలో ఘనుడు నా సమ హాధ్యాయి శ్రీ దిగుమర్తి సీతారామస్మామిగారికి ఉద్యోగం ఇవ్వండి.”

నేను వెంటనే నిరుద్యోగిగ ఇంటిలో గూర్చుని ఉన్న శ్రీ దిగుమర్తి వారికి ఉద్యోగం అర్డరు పంపించాను. ఆయన "నాకు చిన్నట్యూటరు” పదవియా అని వ్రాశారు. నేనిచ్చిన సమాధానం “గంగా భాగీరథీ సమానుడుగా ఇంటిలో కూర్చోవద్దు. రండి, భీమవరం కళాశాలలో చేరండి. ఇది నా సుహృదరనుశాసనం. తవ యోగక్షేమం వహామ్యహం'” అని. సగర్వంగా కమిటీ వారితో చెప్పి ఆయనను స్పెషల్ ట్యూటరుగా వేయించాను. దిగుమర్తి సీతారామస్వామిగారు వయసులో నాకంటె పెద్దవాడు.

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణ మూర్తిగారు[2] మరియొక ట్యూటరు. ఆయన కోనసీమవాడు. ఆయనకు పిలిచి ఉద్యోగం ఇచ్చింది నేనే.

ఆయన గొప్ప కథలు వ్రాసేవాడు. ఒకసారి “అందిన ఆకాశం ” అనే కథానిక ఆంధ్రప్రభలో కాబోలు ఆయన వ్రాసింది పడింది. అందరూ మెచ్చుకున్నారు. ఆయన అన్నాడు: “అన్నగారి ప్రసంగంలో దొర్లిన ఎంగిలి మెతుకులు ఏరుకొని అక్షరాలుగా మార్చినట్టిదే  నా కథ "అందిన ఆకాశం”.  నేను సంతోషించాను.

---

1. 1955లో ఆయన నా తదుపరి ఆంధ్ర శాఖాదినేత ఆయ్యారు.

2. ఆంధ్రభూమి వార పత్రికలో -"ఆరోజుల్లో” అనే శీర్షికలో (1999) నన్ను గురించి-అనురాగం ఆప్యాయత నిజాయతి మేళవించి వ్యాసాలు వ్రాసారు ఈ మధ్యనే.

ఆయన మాటలు నమ్మినానుకూడా. అయితే ఆ కథ చదివిన పిమ్మట – అందిన ఆకాశంలో ఒక అక్షరం నాది కాదు. అది కేవలం శ్రీ పోలాప్రగడవారి స్వకపోలకల్పితం అని తెల్సుకొన్నాను.. పలువురు మిత్రులు శిష్యులు - కోరి నాకు పెద్దరికం కల్పించటం పరిపాటి అయిపోయింది అంతే. శ్రీ సత్యనారాయణ మూర్తి తదుపరి చక్కని చిక్కని రచనలు ఎన్నో చేశారు. నా వినమ్ర నివేదన, నా ప్రభావం ప్రమేయం ఆయన రచనలలో కేవలం సున్నా-బండిసున్న-

ఆయనకు నా మీద ఉన్న నిర్వ్యాజ భక్తి వేరు. ఆయన నన్ను అన్నగారుగ మన్నిస్తారు. ఆయన భార్య - శ్రీరస్తు చిరంజీవిని సౌభాగ్యవతి శ్రీమతి రాజ్యలక్ష్మి - కథానికలు నవలలు వ్రాసియున్నది. ఆమె రచనలపై భర్త ప్రభావం లేదని నాకు తెలుసు. నా ప్రభావం సత్యనారాయణమూర్తి గారిపై లేదని చెప్పటం - నా కర్తవ్యంగా భావించి వ్రాయుచున్నాను. నేను ఆయనకు ఒకనాడు ఉద్యోగం ఇచ్చి ఆదరించాను. ఆ కృతజ్ఞత శ్రీ పోలాప్రగ్గడ ఈ విధంగా తీర్చుకున్నాడని నా భావన. ఒక మాట చెప్పాలి. ఆనాడు భీమవరంలో - నేను ఆంధ్రశాఖాధినేతను. అంతే అంతే అంతే. ఆ పెద్దరికం నాకు కీర్తి తెచ్చిపెట్టింది.

అయితే - సాంస్కృతిక వాతావరణం - తెలిసీతెలియక కల్పించింది నేనే. అప్పుడు మా యింటికి “కవితా ప్రభాస” అని పేరు పెట్టాను. అదే - ఒక సంస్థగా గూడా పరిణ మించింది. ప్రతిరోజు మేము మా ఇంటిలో సమావేశం అయ్యేవారం. శ్రీ పురాణపండ ప్రకాశ దీక్షితులు (ఉషశ్రీ, తదుపరి), శ్రీ శనగన నరసింహ స్వామి, పోలాప్రెగ్గడ, నన్యాసయ్య (కాలేజీలో వాణిజ్య శాఖాధినేత), సన్నిధి రాజు సుబ్రహ్మణ్యం, నందుల గోపాలకృష్ణమూర్తి ప్రభృతులు చేరేవారు. శ్రీ కేశనకుర్తి వీరభద్రాచారి మునుముందు నేను వ్రాసిన పద్యాలతో సదస్సులకు స్వాగతం పలికేవాడు.

**స్వాగతము నీ కతిథి దేవ స్వాగతమ్ము!**
**సహృదయ సుహృద్వరులకు సుస్వాగతమ్ము;**
**క్రొత్తవా రిక గాదు సంకోచ మేల?**

**ప్రణయ విజితు లగుదురు శాత్రవులె యైన.**
**ఇది కవితా ప్రభాస- వసుధైక కుటుంబి కవీంద్రు సాహితీ**
**సదనము - కావ్య శిల్పమయ శబ్ద తపో మఖశాల - ఆర్ద్ర సౌ**
**హృద సుకుమార భావుకుల కెల్లరకున్ రసరాజధాని - తె**
**ల్గుదనపు సోయగమ్ము లు వెలుంగుత ఇంక జగద్ధితమ్ముగన్.**

ఆ అనియత సభలకు : వరుసకు- నా మేనల్లుడు కేందు = లక్ష్మణదేసికేంద్రుడు (తదుపరి లక్ష్మణయతీంద్రులు = కవి - ముముక్షుజన పీఠాధినేత, పెదముక్తేవి) శ్రీ అడివి బాపిరాజు – విశ్వనాథ సత్యనారాయణ- పింగళి లక్ష్మీకాంతం – దిగుమర్తి సీతారామస్వామి - దేవులపల్లి కృష్ణశాస్త్రి – వేదుల సత్యనారాయణ శాస్త్రి – దర్భావిశ్వేశ్వర శాస్త్రి - చిలుకూరి వీరభద్రశాస్త్రి ప్రభృతులు వచ్చేవారు - అడపాదడపా శ్రీ అడివి బాపిరాజుగారు - అభ్యాగతుడై మా యింటికి వచ్చేవారు. అజ్ఞాతంగా కొన్నిరోజులు గడపేవారు. ఆయన భార్య వచ్చి అడిగినా - "లేడు" అనిపించేవాడు.

దర్భాసర్వేశ్వర శాస్త్రిగారు - కళాశాలలో ఆంధ్రశాఖలో పండితులు జ్ఞాన వయోవృద్ధుడు. ఒకసారి సామర్లకోటలో నాకు సన్మానం, కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తి శాస్తిగారితో పాటు. అనాడు నేను వ్రాసిన "అజ్ఞాత కౌంతేయం" "శీర్ణమేఖల" నటరాజ డాక్టరు సి. యన్. రాజు గారు ప్రదర్శించారు. బెండపూడి 'పేర్రాజు గారు - రాజుగారి మేనల్లుడు సభకు వచ్చారు. ఆ సభలో శ్రీ సర్వేశ్వర శాస్త్రిగారు అన్నమాట:- "నండూరి రామకృష్ణమాచార్యుల తారాతోరణములో వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు లేవు. ఆయన పండితుడు- కాని - ఆయన శిష్యుల రచనలలో అపశబ్దాలను సమర్థిస్తాడు. "అపశబ్ద -భయం నాస్తి నండూరి రామకృష్ణమాచార్య సన్నిధౌ" అని చమత్కరించారు.

'నేను వ్రాసిన నాటకాలు ప్రదర్శించినవారు చాలమంది ఉన్నారు. ఛత్రపతి శివాజి - యన్.వి.యల్ (నరసింహాచార్యులు) గారు చాల సార్లు వేశారు. ధర్మచక్రం – అవిభక్త మద్రాసు ఉద్యోగుల సంఘంవారు పెక్కుపర్యాయాలు ప్రదర్శించారు. ధర్మచక్రం నాటకం కృష్ణాపత్రిక వారపత్రిక వారం వారం ప్రచురించింది.

రాయలసీమ కర్నూలు నుండి వెలు వడిన మనసీమలో 'కృష్ణదేవ రాయలు' నాటకం వారం వారం ప్రచురింపబడింది.

"తెలుగు గడ్డ" ప్రహసనం తెలుగు స్వతంత్రలో గోరాశాస్త్రి గారు ప్రచురించారు. రాజమండ్రి కళాశాలలో అప్పుడు పని చేయుచున్న కొర్లపాటి శ్రీరామమూర్తి - నాకు ఒక "అధిక్షేపణ లేఖ" వ్రాశాడు అయితే ఆ మరునాడే మరి యొక లేఖవ్రాశాడు. :- "నిన్న మీకు తెలుగు గడ్డ నాటికపై నా అధిక్షేపణ తెలిపియున్నాను. ఆ లేఖలో ఏ వాక్యంగాని ఏ అక్షరం గాని నేను నేడు ఉప సంహరించు కోదలచలేదు - అయితే – నేడు నన్ను పిలిచి - మా కళాశాలలో అంగ్లోపన్యాసకుడు అన్నమాట :- "మీ గురువుగారు వ్రాసిన తెలుగు గడ్డ నాటిక లోకోత్తరంగా ఉన్నది. మీ గురువు గారికి తగిన శిష్యుడవా నీవు?".

"తెలుగు గడ్డ" కొన్ని వందల సారులు వాడవాడల తెలుగుదేశంలో ప్రదర్శింపబడింది. శ్రీవాత్సవగారు – తెలుగు స్వతంత్రలో "తెలుగు గడ్డ " కు వార్షిక వాఙ్మయంలో ప్రధాన స్థానం ఇచ్చారు. శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి గారు "తెలుగు గడ్డ" ప్రదర్శనకు దర్శకత్వం వహించారు. ఆయన వ్రాసిన వాక్యం. "తెలుగు నాటక సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఇవ్వదగినవి - రెండు – కొప్పరపు సుబ్బారావు "అల్లీ ముఠా", నండూరి రామకృష్ణమాచార్య "తెలుగు గడ్డ". నా మాట - "తెలుగు గడ్డలో అపహాస్యంగా భాసించే ప్రతివాక్యం వెనుక రచయిత వేడి కన్నీరు మారు వేషంలో దాగియున్నది "

భీమవరములో - నేను కవితా కిరీటధారిగ - తలయెత్తుకొని తిరిగేవాడను. శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి - శ్రీ వీర భద్రంగారి తమ్ముడు. కవి ఆశువుగా కంద పద్యాలు చెప్పేవాడు. అంతేగాక ఆయన దాన-కర్ణుడుగా పిప్పర సర్పంచిగా సుప్రసిద్ధుడు. ఆయన నాకు ప్రాణమిత్రుడు.

**ఊరి కెల్ల ఆత డుపకారమును చేసె**
**పిప్పరకును పెద్ద పేరు తెచ్చె;**
**నాయకుండు సత్య నారాయణుడు సుమ్ము**
**అతడు కవి వరేణ్య డమృత హృదుడు.**

నేను - "శ్రీ కృష్ణదేవరాయలు" నాటకమును.. శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తికి అంకితం ఇచ్చాను. మహాభారతంలో కర్ణదుర్యోధనుల మైత్రి సుప్రసిద్ధం. నా శీర్ణమేఖలలో - స్నేహమును రస స్థాయికి "తెచ్చినాననీ" అందుకు కారణం అట్టి గొప్ప మైత్రిని నేను శ్రీ సత్యనారాయణమూర్తి ద్వారా అనుభవించుటయే అని కొందరు భావించారు గూడ. శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి గారే గాక నాపై అమృతస్నేహం వర్షించిన సహృదయ సమ్రాట్టు నరసాపురం పురపాలక సంఘం అధ్యక్షుడు డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణం. వీరిరువురి కారులు నేను ఎన్ని వందల సారులు వాడినానో !

ఒకసారి సత్యనారాయణమూర్తిని నాకు కారు పంప మన్నాను. ఎందుకని అడగకుండా ఆయన నాకు కారు పంపినారు. ఆయన కారులో నేనొక పెండ్లికి వెళ్లినాను. ఆయన ఆ పెండ్లి పందిరికి – గుర్రపు బండిలో విచ్చేసినారు. ఆయన సహృదయత అట్టిది.

తెలుగు వాఙ్మయ చరిత్రలో - కవులకు జరిగిన సత్కార వైభవాలు మరియే భాషాకవులకు జరుగలేదు. ఆది కవి నన్నయ - రాజరాజనరేంద్ర ప్రభువునకు అనురక్తుడు. కృతిపతి మనుమ సిద్ధి మహారాజు తిక్కనను "మామా" అని పిలిచేవాడట. ఎర్రన - మల్లారెడ్డికి నెచ్చెలి. శ్రీనాథునకు - కస్తూరి – కనకాభిషేకం- రత్నాంబరాలు ఎన్నో సత్కారాలు లభించాయి. మదకదీంద్రము నాపి చేయూత యొసగినాడు పెద్దనకు శ్రీకృష్ణదేవరాయలు. కేవలం అజ్ఞానంలోమునిగి నేను కవిని కాబట్టి నాకుకూడా అటువంటి సత్కారాలు లభించ వలెనని లోలోపల కోరుకునేవాడిని. అది అసమంజసమైన దురాశ అనినాకు ఆనాడు తెలియదు. అయితే ఏతత్ తుల్యములైన సదుపాయాలు – సన్మానాలు నాకు సమకూర్చినవారు - శ్రీ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం - శ్రీ తుమ్మలపల్లి సత్య నారాయణ మూర్తిగారు [1] . వారి సహృదయతకు నా జేజేలు.

---

రాజ కవి - "కవి రాజ అయితే - నా జీవితంలో అపరసంధ్యా సమయంలో ఈ నా "కవితా సంహిత" కృతిపతి, శ్రీ మంతెన వేంకట సత్యనారాయణరాజు కవి నాకు కూర్చుచున్న సదుపాయములు చేయు చున్నసత్కారములు యుగయుగాంతరాలలో తెలుగు కవులు పొందిన సమ్మాన సదృశములే. శ్రీవారు - నన్ను శతాదిక పర్యాయములు ఇంటికి వచ్చి కలుసుకున్నారు. నాకు పెక్కుపర్యాయములు, ధనము -నూతన వస్త్రాలతో సత్కరించారు. ఒక సారి కూడ శ్రీరాజుగారు మాయింటికి ఉత్త చేతులతో రాలేదు. ఇది నమ్మ లేని నిజం.

భీమవరంలో నేను వ్రాసిన కవిత్రయము గ్రంథానికి తెలుగు భాషా సమితివారి బహుమతి లభించినది. ఆబహుమతిని భాగ్యనగరిలో భారత రాష్ట్రపతి రాజేంద్రప్రసాదుగారి చేతి నుండి అందు కున్నాను[2]. భీమవరం గూర్చి నేను ఆనాడు వ్రాసిన పద్యం

**శ్యామల సస్యసంపదకు స్వస్తిక భూమిక సాహితీ కళా**
**కోమల భావవీచికలకున్ గిలిగింతలు పెట్టు నట్టి మా**
**భీమవరమ్ము - ప్రాక్తన నవీన చరిత్ర చిరత్న నందనా**
**రామము త్యాగరాజసము బ్రాహ్మయము క్షాత్రములున్ పరిశ్రమల్_**
**తామర తంపరౌ పసిడి ధాన్య నికేతము-కాపుకోట - వి**
**ద్యామృత వృష్టిచే ప్రజకు అభ్యుదయమ్ముల పెంపునింపుతన్.**

భీమవరంలో నా జీవితచరిత్ర నిత్యసన్మానపరంప రామ్రేడి తమే. 1955లో భీమవరం నుండి నేను అనంతపురం ప్రభుత్వ కళాశాలలో ప్రాచ్యభాషాధినేతగ ఉద్యోగంలో చేరినాను. గెజిటెడు ఉపన్యాసకునిగా ఆ పదవికి అప్పుడు హెూదా ఎక్కువ. తొమ్మిది సంవత్సారాలు ఆ కళాశాలలో పనిచేశాను. రాయలసీమ నలు మూలలనుండి నాకు ఆహ్వానాలు అందేవి. వెళ్లివచ్చేవాడను. అక్కడ ఆర్భాటం - హంగామా.. కనిపించేది కాదు. అప్పుడు రాయల సీమకు ఏకైక ప్రభుత్వకళాశాల అనంతపురంలో ఉండేది. ఇతర కళాశాలలు మదనపల్లిలో తప్ప లేవు. రాయల సీమలో ఉన్నత పాఠశాలలో గొప్ప గొప్ప పండితులు ఉండేవారు. పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణా చార్యులు వారి పితృపాదులు. పెనుకొండలో తెలుగు పండితులు. వారికి వారిపుత్రునకు వచ్చిన పేరు రాలేదు గాని ఆయన ఉద్ధండ పండిత పిండం. అణువణువు కవి. ఆయన చెప్పిన చాటువులు శ్రీనాధుdhuని మరపించే కవి అనిపించేవి.

అనంతపురంలో ఉన్నప్పుడు నాకు కల్లూరి సుబ్బారావు గారితో వుట్టపర్తి నారాయణచార్యుల వారితో – రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ గారితో- కళానిధి ప్రభృతులతో ప్రగాఢ పరిచయం

2.అనాడు ధన్యవాదాలు సమర్పిస్తూ రాజేంద్ర ప్రసాదుగారిని “భారతమాతకు 'బహిరంతరాత్మ’ అన్నాను. రాష్ట్రపతి అన్నమాట- “Among the recipients - I am glad to note that there is N.V.R. Krishnamacharya - Whose career I am following with interest and admiration.”

ఏర్పడింది. రాయసీమలో సగటు సహృదయునిలో దాగియున్న "భువన విజయాలు". అష్టదిగ్గజాలతో అనేక పర్యాయాలు నా మనోనేత్రం ముందు సాక్షాత్కరించాయి. రాయలసీమ ప్రజానీకం చిత్తశుద్ధికి నా జేజేలు పలుసారులు సమర్పించినాను. నేను అప్పుడు వ్రాసినపద్యం

**క్షామము లెన్ని వచ్చిన రసజ్ఞత - ఇంచుక చావ లేదు- జ్ఞా**
**నామృత వృష్టికిన్ కొరత నందని రాయల సీమ లోపలన్.**

అనంతపురంలో నాకు శిష్యరత్నములు పలువురు లభించారు. ఆశావాది ప్రకాశరావు - తదుపరి అష్టావధాని - సుప్రసిద్ధ కవి. అతడు "మెరపు తీగలు"- పద్యకవిత నాకు అంకితం చేశాడు. నా షష్టిపూర్తి సూత్రధారియై అనంతపురంలో నిర్వహించాడు. డాక్టరు సంజీవమ్మ శ్రీమతి సునంద - ఆనాటి నా శిష్యరాండ్రు.

డాక్టరు చెన్నయ్య (డాక్టరు చౌదరితో కలసి వ్రాసిన గ్రంథం) "శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి" నాకు అంకితం చేసాడు. డాక్టరు గంగప్ప నాకు అనంతపురంలో శిష్యుడు.

అనంతపురం కళాశాలలో తెలుగుశాఖకు అధినేతగా నేనున్నపుడు నాకు సహవ్రతులు :- జి. యన్.రెడ్డి (తదుపరి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు), శ్రీనివాసరావు- వేంకట సుబ్బయ్య - జంధ్యాల - డాక్టర్ ఇనాక్ (తదుపరి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు).

అనంతపురంలో నాకు టెన్నిసు ఆట వ్యసన ప్రాయంగా పరిణమించింది.

శతావధాని సి.వి. సుబ్బన్నగారితో ప్రగాఢ పరిచయం నాకు లభించిది అప్పుడే.

తదుపరి 1964లో నేను చిత్తూరు ప్రభుత్వకళాశాలకు బదిలీ అయ్యాను. ఆనాడు నా శిష్యులు మునిరత్నం పిళ్ళె. తదుపరి నా సాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేటు పట్టం శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం నుండి పొందినాడు. తరుపరి చిత్తూరు ప్రభుత్వ కళాశాలలో 1966నుంచి తెలుగు శాఖకు అధినేతగా పనిచేశారు. డాక్టరు భాస్కర చౌదరిగారు- అప్పుడు నాకుసహ వ్రతులు. పిదప

వారు వ్రాసిన గ్రంథం నాకు అంకితం చేశారు. చిత్తూరు కళాశాలలో తెలుగు మాత్రము గాక ఆంగ్లంలో సార్వత్రిక విద్య బోధించియున్నాను.

నేను చిత్తూరులో పనిచేసేటపుడు నరసాపురంలో "భువన విజయం" ప్రదర్శించారు. డాక్టరు సుబ్రహ్మణ్యంగారు సూత్రధారి యే కాక శ్రీకృష్ణదేవ రాయల పాత్రధారి. నేను తెనాలి రామకృష్ణ పాత్రధారిని, దాశరథి- పింగలి సూరన. నాడు దివాకర్ల వేంకటావ ధానిగారు - పెద్దన అనుకుంటాను. దాశరథి - "నరసాపురీ భువన విజయము" న భూతో నభవిష్యతి" అని ఆస్థాన కవిగా ఉన్నప్పుడు రవీంద్రభారతి సభలో చాటి చెప్పారు.

1966లో తాడేపల్లి గూడెంలో ప్రభుత్వకళాశాలలో నేను ప్రిన్సిపలు అయ్యాను.

భీమవరంలో ఒక దశాబ్ది "తీరికే లేని కోరిక". రాయలసీమలో "కోరికే లేని తీరిక" గడచినది. ఇక తాడేపల్లి గూడెం ప్రిన్సిపలు పదవీకాలం "తీరికా లేదు–కోరికా లేదు". ఝుంఝూనిలంగా సాగి పోయింది.

తాడేపల్లిగూడెం సంస్థాపక ప్రిన్సిపలును. నాకు అప్పుడు పురపాలక సంఘం అధినేతగా ఉన్న శ్రీ ఈలి ఆంజనేయులుగారు నన్ను గురువుగా ఒక దివ్యాంశ సంభూతునిగా ఆరాధించి మన్నించే వారు. వారి కారు నా అధీనంలో పెట్టేవారు. సర్వతో ముఖంగా ఆ నాలుగై దేండ్లు నేను శ్రీరాముని కాకపోయినా- తాను ఆంజనేయుని వలె నన్ను కాపాడి సాయంచేశారు.

తదుపరి విశాఖపట్నం కళాశాల. చిట్టచివరకు నేను ఉద్యోగ విరమణ చేసింది పీఠికాపుర రాజా ప్రభుత్వ కళాశాల - కాకినాడ మే 1976.

**కరుణశ్రీ అనుబంధం**: కరుణశ్రీ నేనూ ఒకేరోజున 4-8-1942 ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఉద్యోగంలో చేరినాము. మా ఇద్దరనూ అభిమానించినది తెలుగుశాఖాధిపతి, తెలికిచెర్ల వేంకటరత్నం గారు స్ఫురద్రూపి. నిండైన విగ్రహం. ఆయన నవ్య సాహిత్య పరిషత్తు కార్యదర్శి. గుణగ్రహణపారీణుడు. శివశంకర శాస్త్రి -

వేదుల సత్యనారాయణ శాస్త్రి - దేవులపల్లి కృష్ణశాస్త్రి – అడివి బాపిరాజు ప్రభృతులు ఆయన ఇంటికి వచ్చిపోయే అతిధులు. ప్రతిభ పత్రికకు ఆయన సంపాదకుడు. కరుణశ్రీకి ఉద్యోగం ఇప్పించింది కేవలం ఆయనే. నేను ఆంగ్లంలో విశ్వ విద్యాలయ స్థాయిలో ప్రప్రథమునిగా నిలిచి - స్టాన్లీ బహుమతి పొందటంచేత నాకు తెలుగు శాఖలో ఉద్యోగం ఇచ్చిన సైప్పు- తెల్లదొర - మాతృభాష ఆంగ్లం. శ్రీపాపయ్య శాస్త్రికి నెలకు ముప్పది రూకలు నాకు అరువది రూకలు జీతం. అయితే సైప్పుదొర మరునాడే నన్ను పిలిచి నా జీతం ఎనుబది రూపాయలకు పెంచాడు. ఆ విధంగా అహం పెరిగింది. పాపయ్య శాస్త్రి కి కూడ జీతం ఎంతో కొంత పెరిగేటట్లు చూస్తానని నేను చెప్పాను. ఉభయులం సైప్పు దొరను కలిసేందుకు వెళ్ళాము. ఆయన కార్యదర్శి నన్నులోనికి పంపుతూ - అన్నాడు. "శాస్రిగారూ మీకు ఇంగ్లీషు" రాదు. దొరగారికి తెలుగు రాదు. మీరు దయచేసి వెనుకకు వెళ్లి పొండి." నేను లోనికి ఉత్సాహంతో వెళ్లాను.

శ్రీ పాపయ్య శాస్త్రి గారు చిన్నబుచ్చుకొని ద్వార సమీపంలో నారాక కోసం నిలబడ్డారు. సైప్పుదొరకు నేను వ్రాసిన "జీవితసూక్తం" అమెరికా లాంగ్‌ఫెలో వ్రాసిన కవితకు అనువాదం వినిపించాను. అయనకు తెనుగు రాకపోయినా నన్నుఅభినందించి - నా జీతం నెలసరి పెంచి నూరురూకలు చేశారు. నన్ను అయన ఇంటికి రమ్మన్నాడు. తనతోపాటు అప్పుడే నేను పాపయ్యశాస్రిగారిని ద్వారం దగ్గర పరిచయం చేశాను. జీతం పెంచమని. చెప్పాను గాని సైప్పు దొరకు నామాట తలకు ఎక్కలేదు. సైప్పు దొరతోపాటు నేను ఆయన కారు ఎక్కివెళ్లి పోయాను.

ఆరాత్రి - అవతరించింది క్రొంగ్రొత్త కవిత "బీదపూజ" శీర్షికతో కరుణశ్రీ, కలమునుండి. అందలి వాక్యలు "తెలతెల వారుచుండ జనితిన్" విరిపూజకు "తోటమాలి" = ద్వార పాలకుడు లోనికి పోనీయలేదు. "నా చినిగి పోయిన గుడ్డలు నన్ను జూచి".

"పుష్ప మొక్కటయినన్ లభియింపక పోయె నా కటన్ "వారలు పెద్ద పెద్ద ధన వంతుల బిడ్డలు" అందలి బంగారు బుట్ట ఎం.ఏ డిగ్రీ. పాత తాటాకు బుట్ట విద్వాన్ పట్టము. సులువుగా

గ్రహింపవచ్చు. కరుణశ్రీ, వ్రాసిన కొన్ని కవితలలో 'కధానాయకుడ' నయ్యాను. అది కరుణశ్రీ, ఘనత. నా అదృష్టంగా భావించినాను.

నాకు పెరిగిన జీతంలో సగభాగం ఇస్తానన్నానుగాని - కరుణశ్రీ అంగీకరించ లేదు. ఉదయశ్రీలో కరుణశ్రీ, వ్రాసిన పద్యాలు పెక్కు విన్న ప్రథమ శ్రోతను నేనే.

కరుణశ్రీ వ్రాసిన విజయశ్రీ - పీఠికలో ఆ కావ్యమునకు అంకురార్పణ చేసిన మిత్రునిగా నా పేరు ఉదాహరించియున్నారు.

తాను వ్రాసిన కరుణశ్రీ కావ్యమునకు నన్ను పీఠిక వ్రాయమన్నారు కరుణశ్రీ కవి. ఆ రోజులలో శ్రీకట్టమంచి రామలింగారెడ్డి పీఠికలపై మోజు కవులందరకూ. నేను కట్టమంచివారిని అడిగినాను కరుణశ్రీ కావ్యమునకు పీఠిక వ్రాయమని. శ్రీ కట్టమంచివారు నన్నే వ్రాయమని - ఛలోక్తిగా అన్నమాట. "ఆచార్యవర్య – నీవు గూడ నా వలెనే పీఠికా గ్రంథపరమేశ్వరుడవు అవు గాత ".

కరుణశ్రీ కావ్యానికి నేను ఉపశ్రుతి అనే పేరుతో సుదీర్ఘ పీఠిక వ్రాశాను. ఆ పీఠిక కరుణశ్రీ కవికి నచ్చింది. సాహితీ వేత్తలు కొందరకు నచ్చింది. ఒకసారి సభకు అధ్యక్షత వహించాను – శ్రీపాపయ్యశాస్త్రి గారికి గండపెండేర సత్కారం విజయవాడలో. శాస్త్రి గారే అధ్యక్షతకు నా పేరు సూచించారు. అధ్యక్ష ప్రసంగంలో నేను ఒక చమత్కార వాక్యం విసిరాను. "కరుణశ్రీ" కావ్యానికి పీఠిక వ్రాయటం వలన నాకు నష్టం వచ్చింది. నే వ్రాసిన, కవితలు మరుగున పడి - నా పీఠికలను ప్రజలు స్మరించుచున్నారు. కరుణశ్రీ, హృదయంగమ మైన సమాధానం ఛలోక్తి విసిరినారు. ఆయన అన్నమాట "నాకు కూడా నష్టం వచ్చింది. తెలిసిన పెద్దలకు నా కవితలు బహూకరించి వారి అభిప్రాయం అడిగితే "నండూరివారి పీఠిక చాలా బాగా ఉంది - అంటున్నారు".

కరుణశ్రీ తన కావ్యములకు కోరికోరి నా చే పీఠికలు వ్రాయించుకున్నారు. 'కరుణశ్రీ' కావ్యమునకే గాక ఉదయశ్రీ, ప్రథమభాగానికి తదుపరి అన్ని భాగాలకు, నేను పీఠికలు వ్రాశాను. ఉదయశ్రీ, ప్రథమభాగానికి గుంటూరులో కరుణశ్రీ, ఇంటిలోనే

ఉదయం 8 గంటలకు కూర్చొని 11 గంటలకు పీఠిక వ్రాశాను... లేఖకుడు శ్రీజంధ్యాల మహతీశంకర్ అభినందించాడు నన్ను. "కేవలం మూడు గంటలలో బృహత్ పీఠిక వ్రాశారు మీరు." అన్నాడు. "నా సమాధానం - మూడు గంటలలోముగించినాను. అయితే ఒక దళాబ్ది పట్టింది నా ఆలోచన మొదలుపెట్టి."

నన్ను గూర్చి కరుణశ్రీ శ్రీజంధ్యాల పాపయ్యశాస్త్రిగారు మనోహర శిల్పసుందరమైన సీస పద్యం వ్రాసారు.

**ఎవ్వాని గళములో నవ్వుకొన్నది నంద**
**నారామ మధుర మందార వల్లి !**
**ఎవ్వాని కలములో నివ్వటిల్లెను విశ్వ**
**భారతీ మంజు మంజీర రవము;**
**ఎవ్వాని చెలిమిలో నివ్వాళు లెత్తెను**
**పర్దాలు లేని సౌహార్ద్ర లక్ష్మి;**
**ఎవ్వాని కలిమిలో పవ్వళించెను సుప్త**
**గుప్త దానవ్రత ప్రాప్త తృప్తి;**

**అతడు నండూరి వంశ పయః పయోధి**
**చంద్రముడు రామకృష్ణమాచార్య సుకవి;**
**గద్యపద్య తారాతోరణాద్యనేక**
**కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి.**

నామీద శిల్పసౌష్టవ పరాకాష్టతో చెక్కిన పద్యం వ్రాసినందుకు కరుణశ్రీ కి సుహృదభినందనములు తెలుపగా ఆ మహానుభావుడు అన్నమాట : " ఆచార్యుల వారూ, మీ మీద మీ శిష్యుడు శనగన నరసింహస్వామి అంతకంటె గొప్ప పద్యం వ్రాశాడు అని చదివిన పద్యం:-

**"హృదయ మమృత సముద్రము - వదనము**
**కవితా లతాంగికి నర్తన శాల;**
**సదన మతిథి కోటికి - నాటి ఋష్యాశ్రమము**
**విశాల వసుధా కుటుంబి నీ సాటి నీవె".**

'కరుణశ్రీ' మొదటి భాగం వెలువడిన సుమారు నలభై ఏళ్ళకు మిగిలిన భాగాలు పూర్తి చేశారు శ్రీపాపయ్య శాస్త్రిగారు. అప్పుడు ఆయన నన్ను గుంటూరుకు రమ్మని తంతిద్వారా ఆహ్వానించారు. లబ్ద ప్రతిష్టుడు - తెలుగు సహృదయుల హృదయాస్థానకవి వ్రాసిన కరుణశ్రీ కావ్యమునకు ఎవరి పీఠిక కావాలి "కరుణశ్రీ కావ్యం మీ పీఠిక చేరనిదే పరిపూర్ణం కాదు. మా యింటిలో కూర్చొని వ్రాయాలి" అని అన్నారు కరుణశ్రీ!

నేను - ఆ రోజునే నా పీఠిక పూర్తి చేశాను. కరుణశ్రీ అన్నారు- "నా బిరుదు నామం కరుణశ్రీ. నేను వ్రాసిన కావ్యం పేరు కరుణశ్రీ. మీరు పీఠిక వ్రాశారు. కరుణశ్రీ పూర్తి అయింది. కరుణశ్రీ జన్మ సార్ధకమైంది".

నా పీఠికలో బుద్ధచరిత్ర - పురాణకథ కాదు ఐదంయుగీన గాంధీమహాత్ముడు -"అహింసా ప్రవక్త " బుద్రభగవానునకు మానసపుత్రుడు- కరుణశ్రీ గారి కరుణశ్రీ- అటు హిమాలయాలలో రోహిణీ నదీ తీరాన అవతరించిన బుద్ధుని – సముద్ర తీరంలో పోరుబందరులో పుట్టిన గాంధీని కలిపే పరమ పవిత్ర సాహితీ జాహ్నవి" అని వ్రాసిన వాక్యం పలుమారులు స్మరించారు. "భూలోకంలో మానవ మాత్రుడైన రచయిత ఈ దృశ్యం చూడలేడు. ఎవరో స్వర్గ లోక సంచారి – విద్యాధరుడు మాత్రమే సందర్శించ గల భౌగోళిక దృష్యమ్" అని నన్ను అభినందించారు.

ఆ రాత్రి నాకు విందు భోజనంలో మామిడి పండు కరుణశ్రీ స్వయంగా అందించారు. నాకు పట్టే మంచం వేశారు - సుఖనిద్రకు. అయితే రెండు గంటలు కాలేదు పాపయ్యశాస్రిగారు నిదుర నుండి మేల్కొనిన అలికిడి అయింది నేను వారిపుత్రులు ఆయన దగ్గరకు వెళ్ళాము. పలుకరించాము అయితే ఆయన మా చేతులలోనే నిర్యాణం చెందారు. కరుణశ్రీకి మరణం ఏమిటి ?

"తెలుగు సహృదయుల గుండెలలో కరుణశ్రీ, - చిరంజీవి" అన్నాను - వచ్చిన ఆకాశవాణి వారితో. నా చేతులలోనే కరుణశ్రీ, పరమపదించుట 'హేతువాదమునకు అతీతమైన సన్నివేశం'.

**శ్రీ కరుణశ్రీ** - అంతిము యాత్రకు సూత్రదారి శ్రీవిశ్వంజీ గారు. అంత్యసంస్కారం కాగానే నేను విజయవాడ వెళ్లి – విశాలాంధ్రవారు నాకు చేసిన సన్మాన సభలో పాల్గొని - సంతాప తీర్మానంతో నా శ్రద్ధాంజలి ఘటించినాను[1].

**- : కరుణశ్రీ కవికి నాడు నా సాహితీ శ్రద్ధాంజలి :-**

**నీ యమృతార్ద్ర దివ్య హృది నే చవిచూచితి - సాహితీ చిర**
**స్థాయిగ నిల్చినావు - మన సౌహృద్ బంధము - కావ్య పీఠికల్.[2]**
**వ్రాయగ చేసినావు నను - వాఙ్మయ యజ్ఞ జగత్తులో రసా**
**మ్నాయము నీ కవిత్వము మహాకవి - శ్రీ కరుణా పయోనిధీ.**

**వచ్చె పేరు నీకు వర్తమానము నందె !**
**మేటి కవిగ - నన్ను మెచ్చినావు ;**
**పేర్మి కూర్మి చూపి - పీఠికల్ వ్రాయించి,**
**వేసి తీవు - నాకు పెద్ద పీట**

---

1. ఢిల్లీలో కరుణశ్రీ, ప్రథమజయంతి సభ - ఆంధ్రభవనంలో నా అధ్యక్షతన జరిగినది.

2. కరుణశ్రీ స్మారక సాహితీ పురస్కారము ప్రప్రథమముగ నాకే ఇచ్చినారు.

# నా సాహితీ ప్రస్థానము-2

## నండూరి రామ కృష్ణమాచార్య

కాకినాడ పీఠికా పురాధీశ్వర కళాశాల అధినేతగా 30-4-1976 తేదీన ఉద్యోగ విరమణ చేసినాను. అధ్యాపకులు - విద్యార్థులు - నాకు సన్మాన పరంపరలు చేశారు. అంతే గాక పౌర సంఘాలు చేరి ఒక సమాఖ్య సత్కారం నాకు పురమందిరంలో పెద్ద యెత్తున చేశారు. డాక్టరు శామ్యుల్ రత్న కుమార్, శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులు ప్రభృతులు చూపిన అనురాగ పరంపరలు వర్ణనాతీతములు. దళిత సంఘంవారు కూడా ఆప్యాయంగా సన్మానించారు. కాకినాడ - పీఠికా పురాధీశ్వర కళాశాలలో నా జీవితం ఒక మృదు మధుర మనోహర స్వప్నంగా గడచి పోయింది.

ఉద్యోగ విరమణ చేసి- కాకినాడ నుండి, సకుటుంబంగా నా కారులో సికింద్రాబాదు లోని స్వగృహం చేరుకున్నాను. మార్గ మధ్యంలో శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వర రావు కవి ఆతిథ్యం-బులుసు వారి సన్మానం స్వీకరించి, సరిక్రొత్త జీవిత చరిత్ర– విశ్రాంత యోగం ఆరంభమైనది. శ్రీ గోరా శాస్త్రిగారి ప్రోత్సాహంతో ఆంధ్ర భూమి దిన పత్రికలో "పన్నీటి జల్లు" వ్యాసాలు వ్రాయటం మొదలు పెట్టాను.

**అభినవ కురుక్షేత్రం:-** ఒక పద్యనాటిక - ప్రహసనం- ఆంధ్రభూమిలో నా రచన పడింది. ఆ నాటికకు నేను ఊహించని స్పందన లభించింది. తెలుగు నేల నాలుగు చెరగులలో ఆ ప్రహసనం – ప్రదర్శింప బడింది- కొన్ని వందల సారులు. - అందు లోని ఇతివృత్తం శ్రీమతి ఇందిరా గాంధి పరాజయం. శ్రీ జయప్రకాశ్ నారాయణ్ విజయం. జనతా పక్ష ప్రభుత్వ స్థాపన. అందలి పద్యాలు - ఉద్యోగ విజయ నాటక పద్యాలకు అను సరణలు - ప్రఖ్యాత పద్యములకు పారడీలు. జయప్రకాశ్ అంటాడు రాజ నారాయన్ జీ తో -

**నర వర, నీచే ! నాచే 1!**
**జరిపిన ఎన్నికల చేత! సంజయు చేతన్,**
**వర జగజీవను చేతను !**
**అరయంగా ఇంది రోడె- అందరి చేతన్.**

రాజనారాయణ్ ప్రభృతులు- రంగస్థలంపై - నిలిచి తెలుగు పద్యాలు పాడటం చాల బాగా రక్తి కట్టింది.

**ఏల కోరు కొనుట ఈ ప్రజాసామ్యమ్ము ?**
**దొసగు లిన్ని యున్న దొరతనమ్ము ?**
**ఇంత కంటె చెడ్డ వితర రాజ్యాంగముల్ !!**
**గ్రుడ్డి కంటె మెల్ల - కొంత నయము.**

ఈ అభినవ కురుక్షేత్రములో _ ప్రాచీన సంస్కృత సాహితీ మర్యాదలకు పారడీలు సుస్పష్టం. సూత్రధారి - నటి పాత్రలు ఉన్నాయి. సూత్రధారి ప్రవేశించి ఢిల్లీని గూర్చి

**"ఇచ్చోటనే కదా – ఏకాదశాక్షోహి**
**ణీ నేత మీసాలు నేల గలిసె"**

ఈ సీస పద్యం మహాకవి జాషువా గారు వ్రాసిన సుప్రసిద్ధ పద్యం - "శ్మశానము" లోని సీస పద్యమునకు పేరడీ. "మీసా" లు కూడా పేరడీయే.

**"ఈ సనాతన ఢిల్లీ పురీంద్ర మందు**
**తర తరాల ద్రవీ భూత చరిత -యమున:**
**ఈ మహా ప్రౌఢ కల్లోలినీ మతల్లి,**
**నడచు నవ్వు కొనుచు నంగనాచి వోలె.**

జాషువా కవీశ్వరుని ఈ క్రింది పద్యమునకు పేరడీ.

**తొల్లి - నిన్ను గన్న తుంగభద్రా నది,**
**బ్రదికి యున్న దిపుడు పార్థివేంద్ర!**
**నేటి తుంగభద్ర- నిన్నెరుంగని యట్లు ,**
**నడచు చుండె - నంగనాచి వోలె:-**

ఈ ప్రహసన నాటికలో కవి – తటస్తుడు. సాక్షి మాత్రుడే. ఇందలి ప్రధాన రసం - హాస్యం.

**పాతికేండ్త వయసు పడుచు గాడిద కంటె**
**పరుగు నందు - బ్రదుకు పందె మందు;**
**షష్ఠి పూర్తి అయిన - జవనాశ్వమే మేలు !**
**ఏన్గు మేలు-వంద యేండ్ల డైన.**

కృపలానీ నోటి నుండి చిక్కని తెలుగు పద్యాలు వెలువడ్డాయి !

**ఆయుధాలు కావు – అణ్వస్త్రములు కావు;**
**భరత మాత కేది ప్రాణ రక్ష?**
**చమురు గనులు కావు - హిమవన్నగము కాదు!**
**స్వేచ్ఛ కోరు ప్రజల జీవ శక్తి.**
**దొరతనమ్ము చేయ తోడేళ్ళు సిద్ధమౌ!**
**మనుజు లెల్ల! గొర్రె మంద లైన ;**
**దేశ మందు - ఉన్న తెలివి తేటల బట్టి;**
**దొరుకు ప్రజకు - తగిన దొరతనమ్ము'.**

ఉద్యోగ విరమణ చేసిన పిదప వచ్చిన ధనముతో ప్రగతి గీతా ప్రెస్సు పెట్టినాను. ఆ ప్రెస్సు రెండేళ్ళలో దివాళా తీసింది. వాఙ్మయ దృష్టి వేరు, వాణిజ్య దృష్టి వేరు. ఆ ప్రగతి గీతా ప్రెస్సు లోనే నేను వ్రాసిన గ్రంథాలు "తిక్కన భారత దర్శనం", "తారాతోరణం', "ధర్మచక్రం", "బుద్ధచరిత్ర, 3 హాస్యనాటికలు, "ప్రాచీన దక్షిణ భారత చరిత్ర", "దశరూప కములు", నృత్య నాటి కలు "జోత్స్నాభిసారిక', "గోదావరి"-మున్నగునవి అచ్చువేశాను.

శ్రీ. జి.కృష్ణమూర్తిగారు -ప్రగతి గీతా ప్రెస్సును కొన్నారు. కాని ప్రెస్సు పేరు మార్చలేదు.

1.నేను వ్రాసిన ప్రహసనం :- "తెలుగు గడ్డ" అవి భక్త మదరాను ఎన్.జి.వో ల సంఘం ప్రదర్శించి నవుడు - ఆ సంఘం అధ్యక్షుడు గుమ్మలూరి నత్యనారాయణగారు ఏతత్ కవి వ్రాసిన – ప్రహననం కాని నాటకం - ఉన్నదా ? అని గ్రంథాలయాలు వెదకి "ధర్మచక్రం " పట్టుకొని దానిని వలుసారులు యావద్ భారతదేశంలో పెక్కు చోటుల ప్రదర్శించారు. అందులో శ్రీవారు వేసిన పాత చాణక్యుడు. బహుళ కష్ట వ్యయ ప్రయాసలకు ఓర్చి - "ధర్మచక్రం"- ఆహార్య వస్తు విశేషాలు నమకూర్చుకొని శతాధిక ప్రదర్శలు ఇచ్చారు.

ఆంధ్రభూమి సంపాదకుడు - ప్రియమిత్రుడు శ్రీ గోరా శాస్త్రి దివంగతులైనాడు, మా అబ్బాయి శ్రీ నండూరి గోవిందరాజు- జబల్ పూరులో రక్షణశాఖలో ఇంజనీరు ఆహ్వానం పై నేను నా శ్రీమతి సుభద్ర అక్కడకు వెళ్లి సుమారు పదినెలలు ఉన్నాము. 1981 సంత్సరంలో అప్పుడు నాకు అంతా తీరికే. జబల్పూరులో ఆంగ్లంలో "మహాభారతం" సంస్కృత మూలం అనుసరించి వ్రాశాను. ఆ బృహద్గ్రంథం ముద్రించడం ఎట్లా? తిరుపతి వెళ్ళాను. తిరుమల తిరువతి దేవస్థానం - కార్యనిర్వహణాధికారి అప్పుడు శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ ఐ.ఏ.ఎస్. శ్రీ ప్రసాదు గారు చేసిన మేలు ఆజన్మము మరువరానిది. నా ఆంగ్ర మహాభారతం ప్రసాదు గారి పురుషకారం వల్ల - ప్రచురించుటకు తి.తి.దేవస్థానం వారు అంగీకరించారు. శ్రీ ప్రసాద్ గారు నాకు ప్రచురణల సంపాదకునిగా ఉద్యోగం ఇచ్చారు, ఉచిత వసతితో. అచట నా పర్యవేక్షణ లోనే నా ఆంగ్ల మహాభారతం అచ్చయింది 1982 సంవత్సరంలో.

**శ్రీ ప్రసాదు లోన - హృదయమ్ము మేధతో;**
**గంగ యమున లట్లు సంగమించె !**
**అతని లోని - ఐదు ప్రాణాలు - గణియింప,**
**సేవ - సేవ - సేవ - సేవ -సేవ.**

ఆయన పరోపకార పారీణుడు. శ్రీ ప్రసాద్ గారిని విజ్ఞులు పలువురు "అభినవ విక్రమాది త్యుడు" అనేవారు. ఆయన కొలువు కూటంలో – "అభినవ నవరత్నాల"ను చేర్చారు. అంతే కాదు ఆయన గ్రంథకర్తలకు అందించిన ఆదరాభిమానాలు ఆర్థిక సాహాయ్యం - చారిత్రాత్మకం. ఆ సంఘంలో నేను ఒక సభ్యుడను. అది నా అదృష్ట విశేషం. కొన్నిలక్షల రూపాయలు ఆర్థిక సాహయ్యం రచయితలకు అందించింది తి.తి.దేవస్థానం. ఆ ప్రణాళిక ఇంకా కొనసాగు చున్నది. శ్రీ ప్రసాద్ గారు బదిలీ అయినారు. నేను ఆ పదవికి రాజీనామా చేశాను! నా పర్యవేక్షణలోనే తి.తి.దేవస్థానం వారు ఆంధ్ర భాగవత ప్రణాళిక చేపట్టినారు. (ఆంధ్ర మహాభారతం ప్రణాళికకు కూడ అంకురార్పణ చేసింది నేనే).

ఆ ప్రణాళికలో ఆంధ్ర మహాభారతంలో అరణ్యపర్వము లోని పద్యములకు నేనే ప్రతి పదార్థటీకా వ్యాఖ్యానములు వ్రాసినాను. భీష్మపర్వంలో ఒక ఆశ్వాసమునకు. ఆ బృహత్ గ్రంథ పరంపర టి.టి. దేవస్థానంవారు తదుపరి అచ్చు వేయుచున్నారు.

తిరుపతి నుండి జంట నగరాలలో ఇంటికి వచ్చి ఒక సంవత్సరం పై చిలుకు విశ్రాంతిగా ఉన్నాను. మరల తి.తి. దేవస్థానం వారు పిలిచి - నాకు ధర్మ రక్షణ పరిషత్తు హైదరాబాదు విభాగంలో ప్రత్యేక సూత్రధారిగ - ఉద్యోగం ఇచ్చారు. 1984- 1987 వరకు ఆ ఉద్యోగంలో ఉన్నాను. నా కర్తవ్యాలు :- పండిత ప్రసంగాలు, హరికథలు, జంట నగరాల దేవాలయాలలో ఏర్పాటు చేయటం. "అత్త సొమ్ము అల్లుడు దానం, చేయటం" - పరిహాస రసికుడు ఏ మహానుభావుడు కల్పించిన సామెత యో - శ్రీ వేంకటేశ్వర స్వామి ధనం పాత్రదానం చేసే అవకాశం నాకు లభించింది. ఆ పర్యవేక్షణ సంఘం- అధ్యక్షుడు శ్రీ పల్లెంపాటి వేంకటేశ్వర్లు గారు మహానుభావుడు. పరమ భాగవతోత్తముడు. ఆయన – ఆ 'యజ్ఞహెూమ కుండం'లో ఆజ్యదాత. ఆ త్యాగ యోగి లోని పండిత పక్షపాతం వర్ణనాతీతం. అది నమ్మ లేని నిజం. దేవస్థానం వారు నాకు కొన్ని విధి నిషేధాలు నిర్దేశించారు. ఏ పండితునకూ ఒకే నెలలో 300 రూకలు మించి ఇవ్వరాదు. శ్రీ పల్లెంపాటి వేంకటేశ్వర్లు గారు పలువురకు పండితులకు తన సొంత జేబునుండి 700 కలిపి వేయి రూకలు ఇచ్చారు. వేయి రూకలు నెలసరి ఇచ్చిన నెర దాత పల్లెంపాటి వేంకటేశ్వర్లు సజీవ రక్తమాంసల జంగమ చర్మ విగ్రహం చూస్తే చాలు నాకు కనుల పండువ అనిపించేది. అసలు ఆ తిరుమల వేంకటేశ్వర స్వామి నోరు విప్పి మాటాడని శిలా విగ్రహము కదా? నేను చేసిన కొలువు దొర ఏడు కొండలవాడు అటు - ఇటు పల్లెంపాటి వేంకటేశ్వరుడు. ఆ సంఘంలో ఒక సభ్యుడు. ఆర్ష పుత్ర శతక కర్త, పద్య కవి అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనం ప్రముఖ కార్యకర్త డాక్టరు టి.వి. నారాయణగారు. ఆయనకు ఉపనిషత్తులపై అమిత భక్తి ప్రపత్తులు.

1.నా సూచనమేర ఆ పదవి కరుణశ్రీ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారికి తి.తి.దేవస్థానం వారు ఇచ్చారు.

ఆయన వ్రాసిన "ఆర్యపుత్ర శతకముకు" నాచే 'పీఠిక' వ్రాయించుకున్నారు. ఆయన అంగ్ల విద్యాధికుడు. తెలుగు పండితుడ నైన నన్ను అభి మానించిన సహృదయ చక్రవర్తి. ఆయన ఒక నాడు బాలాజీభవనంలో ఏకాంతంగా కుర్చీలో కూరుచున్న నా దగ్గరకు వచ్చి కాశ్మీరు శాలువ నాకు కప్పి సత్కరించి సంతోష తన్మయత్వంలో తిరిగి వెళ్ళారు ! ఆంధ్రప్రదేశ్ సర్వీసు కమీషనులో కొంత కాలం ఆయన సభ్యుడు- విద్యావేత్త- గుండె పండిన ఆంగ్ల పండితుడు. నావంటి ఒక తెలుగు పండితుడు ఆంగ్లలో వ్రాసిన మహాభారతం మెచ్చుటం నాకు గర్వకారణం.

తి.తి. దేవస్థానంవారు - పురాణ పాత్రలు 500 ఏరి చిరు పొత్తములు వ్రాయింప చేశారు వివిధ విద్వాంసులచే.

"శ్రీకృష్ణుడు" శీర్షికపై వ్రాయమని వారు నన్ను కోరినారు. శ్రీ కృష్ణుని పాత్ర- నాకు లభించటం నా అదృష్ట విశేషంగా భావించి వ్రాసినాను. వారు కొన్నివేల ప్రతులు ప్రచురించినారు. నేను వ్రాసిన విషయాలు ఎన్నో సంక్షేపించారు. శ్రీ కృష్ణపాత్రపై మరి యొక గ్రంథం వ్రాయాలని నాకు సంకల్పం కలిగింది.

నేను ఆగ్గంలో వ్రాసిన మహాభారతమును మెచ్చిన వారిలో రామకృష్ణ మఠం అధిపతి స్వామి రంగనాధానందగారు ఒకరగుట నాకు గర్వ కారణం. సాహితీ సహృదయుడు చీరాల కళాశాలాధి నేత శ్రీ పోలవరపు జగదీశ్వర రావు గారు ఆగ్రంథం నోబెలు సారస్వత బహుమతికి తగినది అని ఉగ్గడించారు.

## అష్టావధాని శ్రీ ఆశావాది ప్రకాశరావు

16-8-1981 తేదీన నా "షష్టిపూర్తి అనంతపురంలో జరిగింది. ఏతదుత్సవ సూత్రధారి అష్టావధాని శ్రీ ఆశావాది ప్రకాశరావు. అనంతపురం ప్రభుత్వకళాశాలలో నాకు శిష్యుడు. అతడు వ్రాసిన "మెరపు తీగలు" నాకు అంకితం ఇచ్చారు- అతని గురు భక్తి ఆదర్శప్రాయమైనది.

"మెరపు తీగలు" -నాకు అంకితం చేస్తూ శ్రీ ఆశావాది వ్రాసిన పద్యాలు.

**అతడు శ్రీ రామకృష్ణమాచార్య గురుడు;**
**ప్రగతి గీతా ప్రవక్త - పుంభావ విద్య,**
**ఋషి - మనీషి – సత్కవితా కిరీట ధారి;**
**ఆంధ్ర సాహితీ సూక్తి రత్నాకరుండు.**

**నను మేల్పాదున పెట్టి దోహదము కావించి నీర్వోసి పూ**
**చిన కళ్గొంచు ప్రమోద మంది విమలాశీర్వాదమున్ కూర్చు ప్రా**
**జ్ఞునకున్ కోసి శరీర మిచ్చినను హెచ్చుం గాదు మత్ పద్య గు**
**చ్ఛ నికాయంబును రామ కృష్ణ కవితాచార్యా ! గ్రహింపంగదే.**

శ్రీ ఆకాశావాది దళిత వంశములో పుట్టి బ్రహ్మర్షి కాగల్గినాడు.

## ఆచార్య శ్రీ తంగిరాల సుబ్బారావు

ఆచార్య శ్రీ తంగిరాల సుబ్బారావు బెంగుళూరు విశ్వ విద్యాలయంలో ఆంధ్రశాఖాధ్యక్షుడు. ఒకనాడు భీమవరం కళాశాలలో విద్యార్థి. తెలుగు విద్వాంసులు పలువురుండ వచ్చు. కవులు తెలుగులో తామర తంపర. డాక్టరు తంగిరాల సుబ్బారావు "కవితాలోలుడు". అతడు "చైతన్య కవిత" అనే తెలుగు త్రైమాసిక పత్రిక బెంగుళూరు నుండి నడుపు చున్నాడు. అతడు ధన్యజీవి.

అతడు "చైతన్య కవిత" నా మీద ఒక ప్రత్యేక సంచిక ప్రచురించాడు (అక్టోబరు 1996).

ఆ సంచిక సంపాదకీయం లోని వాక్యాలు :- "దిగుమర్తి గురు దేవులు చెప్పి నట్లు తెలుగు అధ్యాపక లోకంలో ఇద్దరే ఇద్దరు అదృష్టవంతులు. ఒకరు పింగళి వారు. రెండవవారు నండూరి వారు". మా గురు దేవులు పింగళి లక్ష్మీకాంతం గారి సరస నాకు పెద్ద పీట వేశాడు మా తంగిరాల. నాకు సంతోషమే. ఆ వాక్యం అన్నది "యదార్థవాది" సాహిత్య సత్యసంధుడుగా పేరొందిన నా సహ్రతుడు శ్రీ దిగుమర్తి సీతారామస్వామి గారు. శ్రీ గోవర్ధనం ఫణీంద్రకవి అన్న మాట "ఆధునిక యుగంలో గురు కులములు వినిర్మించు కొన్న కీర్తి చెళ్ళపిళ్ళ వారు- పింగళి వారు- నండూరి వారు కవితా గురు పరంపరగా ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో చిరస్థాయిగ నిలుస్తారు."

ఆచార్య శ్రీ తంగిరాల సుబ్బారావుకు నా ఆశీరభివందన ములు

**ఓ యభిమాన సంభృత మహోదయ ! సంచిక వేసి, సాహితీ న్యాయము కూర్చినాడవు గదా - చరితార్థుడ – తెల్గులో ఉపా ధ్యాయుడ నౌట నా బ్రదుకు ధన్యము - శిష్యుడ వీవె గా - రస స్థాయికి చేర్చినావు - గురు దక్షిణ-మెచ్చితి - సుబ్బరాట్ కవీ!**

## స్వర్గీయ కలుగోట్ల విజయాత్రేయ

నాకు గల ఏకలవ్య శిష్యులలో ప్రాగ్రసరుడు కవి కలుగోట్ల విజయాత్రేయ. అతడు బహు పద్యకావ్యకర్త. ప్రతికావ్యంలో గురుస్తుతి నాపై పద్యాలు వ్రాశాడు. తెలుగుకవులలో ధారాశుద్ధి గల అవధానులు పలువురు. శత ఘంటకవులు ఉన్నారు. శ్రీ కలుగోట్ల విజయాత్రేయ, లోని విశేషం అతని ధారాసిద్ధి. అతని స్వగ్రామం కర్నూలు నంద్యాల మధ్య నున్న గని. ఆగనిలో ఉద్భవించిన కవితారత్నం అతడని అభివర్ణించ వచ్చు. అతని కవిత్వం సెల యేరు కాదు. అతని కవిత ఒక రమణీయ జలపాతం "ఆంధ్రపద్య కవితా నయాగరా" అనే బిరుదుకు విజయాత్రేయ అర్హుడు.

కవి కలుగోట్ల విజయాత్రేయ నంద్యాల ఎస్.పి.వై రెడ్డిగారి ఆస్థాన కవియై శ్రీవారికి కొన్ని కావ్యాలు అంకితం చేశాడు. ఆ విధంగా గురువుగారైన నన్ను నంద్యాల నంది పైపుల దొర ఎస్.పి.వై రెడ్డిగారికి పరిచయం చేశాడు. నేను వ్రాసిన

### "తెలుగు పద్య శిల్పం"

శ్రీ రెడ్డి గారికి అంకితం ఇచ్చాను. ఆ సాహితీ జామాత నేను నిర్వహించిన కార్య క్రమాలు పెక్కింటికి సాయంచేశారు. ఆంధ్ర పద్య కవితా సదస్సు ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా ఉండి - ఆర్థిక సహకారం అందించారు.

తథా : ఆలోచనము కావ్యం ముద్రణకుగూడ శ్రీ ఎస్.పి.వై. రెడ్డిగారు సాయం చేశాడు. నేను వ్రాసిన భువన విజయము - శ్రీ కృష్ణదేవరాయలు (1999) రంగస్థల నాటకం శ్రీ రెడ్డిగారికి అంకితం చేశాను. మదరాసులోని ఆంధ్రులు నంద్యాల నంది పైపుల దొర

రెడ్డిగారిని "వదాన్య శేఖరుని" గా గుర్తించి బహుమతి ప్రదానం చేశారు.

## ఆచార్య శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి

భీమవరం కళాశాలలో నాకు ప్రత్యక్ష శిష్యుడు. "నన్నెచోడుని కుమార సంభవం - ప్రాచీన కావ్యమా" అనే పుస్తకం వ్రాశారు. నాకు అంకితం ఇస్తానన్నారు. నన్నెచోడుని కుమార సంభవంగా ప్రసిద్ధి కెక్కిన కావ్యము - మానవల్లి రామకృష్ణకవి వ్రాసి నన్నె చోడుని పేరు పెట్టాడని శ్రీరామమూర్తి వాదం. "ఆ సిద్ధాంతం నమ్మేవారెవరు ? ఋజువు చేయగల రచయిత ఎవడు ?" అని నా భయం. అట్టి వివాదగ్రస్త గ్రంథమును నేను అంకితం పుచ్చు కొనుటకు మొదట అంగీకరించలేదు. శ్రీరామమూర్తి నే నప్పుడు ఉన్న తిరు పతి వచ్చి ఆ రచన నాకు చదివి వినిపించాడు. నా ఆశ్చర్యమునకు తదుపరి నా ఆనంద మునకు మేర లేదు.

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి- అత్యద్భుత పరిశోధన చేశాడు, "సత్యం" వెలికి తీశాడు. అతనికి- పరిశోధనలో ఓనమాలు నేర్చిన గురువును నేను కావచ్చు. ఇట్టి గొప్ప పరిశోధన గ్రంథం అతడు నాకు అంకితం చేయటం సముచితం. కృతి స్వీకారము నకు నేను సంతోషంతో అంగీకరించాను. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర పరిశోధనలో ఇది అగ్రగణ్య గ్రంథం. అర్థ శతాబ్ది – యావదాంధ్ర విద్వల్లోకం కనిపెట్ట లేక పోయిన ఒక సత్యమును మూడు వందల పుటల మిమర్శ గ్రంథం వ్రాసి కొర్లపాటి శ్రీరామమూర్తి క్రొత్త చరిత్ర సృష్టించాడు. ఇట్టి రచన తెలుగు సాహితీ పరిశోధనలో నభూతో న భవిష్యతి అని నా అభిప్రాయం ఇది "నమ్మ లేని నిజము"

ఆచార్య శ్రీ కొర్లపాటి అత్యద్భుత పరిశోధన "నన్నెచోడుని కుమార సంభవము. 'ప్రాచీన కావ్యమా?' అను గ్రంథమునకు నేను కృతిపతిని కావటం నాకు గర్వ కారణం. 1983లో ఈ గ్రంథం ముద్రింప బడింది. చాలకాలం క్రితమే. యవనికాభ్యంతరంలో- ఆచార్య శ్రీ కొర్లపాటి సారస్వత పరిశోధనలో గుప్త తపస్సు చేయసాగారు. ఏతత్ తపః ఫ లం అతడు వ్రాసిన తెలుగు **సాహిత్య చరిత్ర**- నాలుగు భాగాలు పరమ ప్రామాణిక గ్రంథాలుగ తరతరాల విద్వాంసులకు వెలుగుబాటలుగ ఉపకరింపగలవు. ఆచార్య శ్రీ

కొర్లపాటి శ్రీరామమూర్తి " కారణ జన్మ్మడైన" సాహిత్య పరిశోధకుడు. నన్ను గురువుగ సంభావించుట నా అదృష్ట విశేషము. "ప్రమిద" పలు కాగడాలను ప్రజ్వలింపచేయవచ్చు.

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తికి నా ఆశీరభినందనములు నా జేజేలు

**పెక్కుమంది - ఏటి పిల్ల కాల్వల బోలు**
**వాఙ్మయ కథ లెన్నో - వ్రాసినారు !**
**కోన సీమ సప్త గోదావరిని బోలు**
**గొప్ప రచన గూర్చె – కొర్లపాటి.**

## పరిశోధనములు

నా సాహిత్యంపై వరిశోదన సలిపి - సిద్ధాంత గ్రంథాలు వ్రాసి "డాక్టరేటు పట్టము" పొందినవారు.

1. శ్రీ మునిరత్నం పిళ్ళై - (శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి)
2. శ్రీమతి వింజమూరి లక్ష్మి (ఆంధ్రవిశ్వ కళాపరిషత్తు నుండి)
3. శ్రీమతి నాగలక్ష్మి - ఎం.ఫిల్ - ఉస్మానియా విశ్వ విద్యాలయం
4. శ్రీమతి మంగళగిరి ప్రమీలాదేవి - గేయనాటికలపై అందు రెండు నేను వ్రాసినవి **"జ్యోత్స్నాభిసారిక" "గోదావరి ".**

నండూరి రామ కృష్ణమాచార్య కు లభించిన పురస్కారాలు

1. తెలుగు భాషా సమితి-బహుమతి "కవిత్రయ గ్రంధమునకు"
2. దాశరధి స్మారక పురస్కారం
3. మధునాపంతుల స్మారక పురస్కారం
4. కరుణశ్రీ స్మారక పురస్కారం మున్నగునవి.

## శ్రీ శనగన నరసింహ స్వామి కవి

నిరుపమాన పద్యశిల్పి శ్రీ శనగన నరసింహస్వామి – భీమవర కళాశాలలో విశిష్ట తెలుగు విద్యార్థి - విజయవాడ లయోలా కళాశాలలో ఉపన్యాసక పదవిలో ఉద్యోగ విరమణ చేసినప్పుడు - గురుదక్షిణ శీర్షికతో నాపై శిల్ప సౌష్టవము గల పద్యాలు వ్రాశాడు. అతనికి నా ఆశీరభినందనములు.

**నీవు - సుతాధికుండవు - వినిర్మల చిత్తుడ వీవు - నా వలెన్,**
**జీవిత మెల్ల అంకితము చేసితి వాంధ్ర సరస్వతీ కళా**
**'సేవకు - ధన్య మయ్యెను గద - శిష్యుడ వౌట మదీయ జన్మ - ఆం**
**ధ్రావళి మోదమున్ బొరయ ప్రాణము పోయుము పద్య విద్యకున్.**

## ఆకాశ వాణి

అకాశవాణితో - నాకు చాల కాలము నుండి సన్నిహితమైన అనుబంధం ఏర్పడినది. పెక్కు కవి సమ్మేళనములలో పాల్గొన్నాను. పెక్కు ప్రసంగాలు చేశాను మదరాసు విజయవాడ, విశాఖపట్నం, కడప, ఆదిలాబాదు, అనంతపురం మున్నగు కేంద్రాల నుండి ప్రసంగించాను. నేను వ్రాసిన నృత్యనాటకాలను గోదావరి - వాసవి కన్యకా పరమేశ్వరి - శ్రమ ఏవజయతే ప్రసారం చేసింది. తథా "శ్రీ కృష్ణదేవరాయలు", "ఉరి కంబం" నాటిక కీ.శే. స్థానం నరసింహారావుగారి పర్యవేక్షణలో, "ధర్మచక్రం" నాటకం , శ్రీ బాలాంతపు రజనీకాంతరావుగారి దర్శకత్వంలో ప్రసారం అయ్యాయి చాలానాళ్ళ క్రితం।

ఆకాశవాణిలో- తెలుగు పద్య శిల్ప సౌష్టవంపై వరుసగా నేను కొన్ని ప్రసంగాలు చేశాను. అందులో పద్యాలు - మనోహరంగా రాగయుక్తంగా పాడి- రక్తి కట్టించిన విదుషీ మణి మధురాతి మధుర మనోహర గాయని శ్రీమతి డాక్టరు జ్యోతిర్మయిగారు.

## సభలు

నే ప్రసంగించిన సభలు సహస్రాధికములు- తథా పొందిన సత్కారాలు. పాల్గొనిన కవి సమ్మేళనములు శతాధికములు. నేను పాల్గొనిన ప్రథమ కవిసమ్మేలనం రాష్టస్థాయిలో జరిగినది తెనాలిలో 1944- నవ్య సాహిత్య పరిషత్తు కార్యక్రమం. శ్రీ కాటూరి వేంకటేశ్వర రావుగారు అధ్యక్షుడు. ఆనాటి నుండి విశ్వనాధ సత్యనారాయణ, కరుణశ్రీ - శ్రీ శ్రీ, ఆరుద్ర, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బోయి భీమన్న, దాశరధి, సి.నా.రె., బెజవాడ గోపాలరెడ్డి ప్రభృతులతో ఎన్నో కవినమ్మేళనములలో పాల్గొన్నాను. గురువులతో పాటు ఇంచు మించు సమవయస్కులతో పాటు ఒకసారి రవీంద్ర భారతిలో. నా

ప్రియశిష్యులు శ్రీ శనగన నరసింహస్వామి, కలుగోట్ల విజయాత్రేయ కవులతోపాటు వేరొక సారి రవీంద్ర భారతిలో .

ఎన్నో సారులు - అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనం కవి సమ్మేళనములకు అధ్యక్షత వహించాను. ఈ మధ్య రాంబాబు, రాధశ్రీ - ప్రసాద్ - ఆచార్య ఫణీంద్ర ప్రభృతులతో. కవిసమ్మేళనము లో నా పాత్రధారణ నా జీవిత చరిత్రలో 65 సంవత్సరములనుండి కొనసాగుచున్నది.

## అధికార భాషా సంఘం - అధ్యక్షత

1987-1990

ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుగారు నన్ను అధికార భాషా కమీషన్ అధ్యక్షునిగా నియమించారు. అర్ధశతాబ్ది పైబడి నేను చేసిన సాహితీ తపస్సు మెచ్చి సరస్వతీదేవి నాకు ఆ పదవి అనుగ్రహించినట్లు నా మిత్రులు అన్నారు.

**ఆంధ్ర జాతి కెవడు - ఆత్మగౌరవ ముద్ర,**
**ఆనవాలు గూర్చి నట్టి - ఘనుడు;**
**మేటి నాయకుండు మేధావి; తేజస్వి**
**రామ రావు - తెలుగు సీమ లోన.**

నా సాహితీ సేవ - “పుంభావ తెలుగు తల్లి” గుర్తించాడు. అనే సంతృప్తి నాకు కలిగింది.

అధికార భాషా సంఘంలో నా సహవ్రతులు

1. శ్రీ నాగభైరవ కోటేశ్వర రావు;
2. డాక్టరు మల్లెమాల వేణు గోపాల రెడ్డి
3. ఆచార్య శ్రీ కొలకలూరి ఇనాక్
4. కీ.శే. మధురాంతకం రాజారాం.

వీరు నాకు అక్షరాల సంపూర్ణ సహకారం అందించారు. మధురాంతకం రాజారాం గారు సుప్రసిద్ధ కధానికా రచయిత. ఆయన తమిళ భాషా వేత్త. ఆచార్య శ్రీఇనాక్ గారు నాకు అనంతపురం ప్రభుత్వ కళాశాలలో గూడ సహ వ్రతుడే. ఆయన వ్రాసిన కథలు ఆ నాడే నాకు నచ్చినవి. డాక్టరు మల్లెమాల వేణు

గోపాలరెడ్డి మృదు మధుర మంజుల మనోజ్ఞ హృదయుడు. వైద్యుడే గాక, ఆయన సుప్రసిద్ధ కవి. చలన చిత్ర నిర్మాత కార్య శూరుడు - మల్లెమాల సుందర రామరెడ్డి (ఎమ్.యస్.రెడ్డి) గారి తమ్ముడు. నా యెడ అనురక్తుడు. ఆయన సుకుమార మనస్వి.

శ్రీ నాగ భైరవ కోటేశ్వరరావు గారు ముఖ్య మంత్రికి అంతరంగికుడు. మొదట ఆయనను చూచి నేను భయపడినాను. నేను వ్యాఘ్ర వాహనుడను ఔతానేమోనని, గజ గజలాడిపోయాను. అయితే ఘోర క్రూర వ్యాఘ్ర రాజముగ దూరంలో భాసించిన శ్రీ నాగ భైరవ కోటేశ్వరరావుగారు దగ్గరకు వచ్చినపుడు- గంగి గోవు వలె కామధేనువుగా కన్పించి నారు ! చండ ప్రచండ మార్తాండ తేజస్వి దూరంగా ఉన్నప్పుడు. దగ్గరకు వచ్చి నపుడు పండు వెన్నెలలు కురిసే నిండు జాబిల్లి. శ్రీ నాగభైరవ కవి వ్యాకరణంలో ఏక వచనం, వ్యవహార జగత్తులో నిత్య బహువచనం. అతడు ఒక వ్యక్తి మాత్రుడు కాడు. జీవితంలో జంగమ సజీవ సాహిత్య పరిషత్తు. కేవల నిర్హేతుక జాయమాన కరుణతో నన్ను "అన్నగారు"గ మన్నించాడు. నాకు ఔరస సహోదరుడు లేని లోటు పూరించాడు. లక్ష్మణ సౌభ్రాత్ర సేవ నాకు లభింప జేశాడు.

అప్పుడు అధికార భాష సంఘకార్యదర్శి- శ్రీ సి. ధర్మారావు గారు. అధ్యక్షుడగు నేను సభ్యులు సహ వ్రతులు డొక్క లెగుర వేశాం. అసలు దంచింది కార్యదర్శి ధర్మా రావు. కమీషన్ చేసిన తీర్మానా లన్నీ ముఖ్యమంత్రి రామారావు గారు ఆమోదించటం విశేషమని ధర్మారావుగారు ఆనంద చకితు లయ్యేవారు. తీర్మానాలు తు.చ తప్పకుండా కార్య రూపంలో పెట్టిన కర్మయోగి శ్రీ ధర్మారావు గారు.

అధికార భాషా సంఘ అధ్యక్షుడుగా నేను సాధించింది ఏమిటో ఏమో!!

ప్రభుత్వ వాహన సదుపాయం ఉన్నది. తెలుగు నేల నాలుగు చెరగులు పర్యటించి నాను. ముఖ్యమంత్రి రామారావు గారు శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు గారిని సంఘంలో సభ్యుడుగా నియ మించటం - ఆంధ్ర సామ్రాజ్య సార్వభౌముడు తన పట్ట మత్తేభము ను నాకు వాహనంగా ప్రసాదించటంగా పరిణమించింది. అది ఒక మహారాజ యోగ భాగం. అయితే- ఈ విషయంలో తీర్చు చెప్పదగిన

న్యాయమూర్తి అధికార బాషా సంఘం తొలి అధ్యక్షుడు ప్రాతః స్మరణీయుడు! త్యాగ యోగి "**శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య గారే**"

ఒకసారి - మేము ఇర్వురం ఏక వేదికపై కలిసాము. శ్రీవావిలాల గోపాలకృష్ణయ్య గారు అన్న మాటలు జ్ఞాపకం చేసుకొని వ్రాయుచున్నాను. బైబిలు నుండి ఒక కథ శ్రీ వారు ఉదాహరించారు.

"నేను ఎన్నో విత్తనాలను శక్తి వంచన లేకుండా విసరి వేశాను. కొన్ని విత్తనాలు చెల్లా చెదరై పడిపోయి చచ్చిపోయాయి అప్పుడే :- కొన్ని రాళ్ల మధ్య మొలక లెత్తి- పిదప చచ్చిపోయాయి! ఎండకు ఎండి వానలు లేక- అదృష్ట వశాత్తు ఒక విత్తనం మొలిచి ఎదిగి శాఖోప శాఖలతో విస్తరించి పెద్ద వృక్షమైంది. ఈ కథ అధికార భాషాసంఘా నికి అన్వయించ వచ్చు. విత్తనాలు విసరిన వాడను నేను. ఎదిగిన మహావృక్షం - డాక్టరు నండూరి రామ కృష్ణమాచార్య." నన్ను మెచ్చిన శ్రీ వావిలాల వారి సహృదయత నేను మరువలేను. నా సమాధానం:-

**విత్తనమ్మ నౌచు - వృక్షమ్ముగా మారి,**
**ఆవరింప దలతు ఆకసమ్ము!**
**వీలు కాని యెడల - వేరు విత్తున కైన,**
**ఎరువు నగుట కేను ఇచ్చగింతు.**

అధికార భాషగా తెలుగు అభివృద్ధి చెందే పరిపక్వ సమయం ఎప్పుడు వస్తుందో!! ఆ అవశ్య చారిత్రక పరిణామం కోసం సహృదయులు ఎదురు చూచు చున్నారు. ప్రజల భాషలో పరి పాలన జరుగక పోతే "ప్రజాస్వామికము" సార్ధకము కాదు. అధికార భాషా కమీషను - నిర్వర్తించిన కర్తవ్యముల తీరుతీయములో శ్రీ విజయ రాఘవాచార్యులు సమగ్ర సమీక్ష చేసి "డాక్టరేటు పట్టము" సంపాదించినారు. ఆ గత చరిత్ర అధ్యయనము – వేయబడిన పునాదులు - భావి కాలమునకు ఉపయోగపడ వచ్చు. **నా పదవి గతించింది. భాధ్యతలు కూడ తీరినవి.**

అయితే - పదవి పోయిన పిమ్మట గూడా యథాపూర్వాభి మానం నాపై చూపించిన మహానుభావుడు "శ్రీ నాగభైరవ కవి" ఆయన నా" శీర్ణమేఖల" కృతిని- వేయి ప్రతులు ప్రత్యేకంగా ముద్రించి - మా యింటికి వచ్చి నాకు ఆ పుస్తకాలు బహూ కరించి

వెళ్లినాడు. పిదప - నేటి వరకు శ్రీనాగభైరవ కవి నా మీద చూపించే ఆదరాభిమానములు నాకు అనుభవామ్రేడితములు. అధికార భాషాసంఘం అధ్యక్ష పదవి పోయిన తదుపరి 1990 సంవత్సరంలో కేంద్ర సెన్సార్ బోర్డులో "సభ్యత్వం" నాకు లభించింది. అయితే రెండు నెలలు తిరుగకుండా నేను ఆ ఉన్నత పదవికి స్వచ్ఛందంగా "రాజీనామా" చేసాను. విజ్ఞు లలో విద్యావేత్తలలో చలన చిత్రాలు నిర్వహించే భూమికపై తీవ్రమైన అసంతృప్తి భారత దేశంలో ఉన్నది. ప్రస్తుతం అమలులో ఉన్నచట్టం చలనచిత్ర నిర్మాతలకు అనుకూలంగా ఉన్నది. పలుసారులు ప్రధాన మంత్రులు మొసలి కన్నీరు కార్చుచున్నారు. చట్టం మారాలి. తప్పు - పార్లమెంటుది. చట్టం మార్చితే - భారతదేశం చలన చిత్ర రంగంలో యావత్ ప్రపంచానికి ధ్రువతార కాగలదు. ప్రపంచ చరిత్రలో - భారతదేశం – సాంస్కృతిక గరిమనాభిగ పలుమారులు ప్రసిద్ధి కెక్కింది. కేంద్ర సెన్సారుబోర్డులో అసమర్థ పాత్ర ధరించడం ఇష్టం లేక, ఆ పదవికి రాజీనామా చేసి నా అంతరాత్మకు శాంతి చేకూర్చు కో గలిగాను.

ఈ మధ్య శ్రీ నాగభైరవ కోటేశ్వరరావుగారు నాకు వ్రాసిన 'లేఖ' లోని వాక్యాలు ఉదాహరింప దగినవి. "అన్నగారూ, 1995 లో ముద్రణ పొందిన మీ "పద్యశిల్పం" 1999 లో నాకు చేరింది. కవితా ప్రారంభకులకు ఈ పుస్తకం ఒక మానిఫెస్టో- ఒక సిలబస్. ఈ కారణంగా కూడా మీది ధన్య తరమైన జన్మ.

నేను వ్రాసిన "తెలుగు పద్య శిల్పం" గ్రంథం ఆవిష్కరణ మహోత్సవం జరిపింది ఆంధ్ర సారస్వత పరిషత్తు. ఆవిష్కర్త ఆచార్య శ్రీ సి. నారాయణ రెడ్డి గారు. సారస్వతంలో నా స్థానం గూర్చి చక్కని చిక్కని సమగ్ర సుందరమైన ప్రసంగం చేశారు. వారు ఆనాడు వెల్లడించిన ఒక విశేష విషయం - శ్రీ నారాయణ రెడ్డి గారు విద్యార్థి కార్యదర్శిగా ఉన్నప్పుడు నిజాం కళాశాల ఆంధ్రోత్సవ సభలకు వారు శ్రీ జాషువా కవిని - నన్ను ఆహ్వా నించి సత్కరించారు. అది అర్ధ శతాబ్దికి ముందరి సన్నివేశం. శ్రీజాషువా కవిగారికి నా మీద గల అభిమానం మరువ రానిది. ఆ రోజులలో జాషువా గారికి నాకు నరసాపురం లో జరిగిన సన్మానం చూచిన ప్రత్యక్ష సాక్షులు కొందరు నేటికి సజీవులై యున్నారు. ఆ విషయం

పునః పునః స్మరించి జాషువా సారస్వతసంఘం ఏతత్ సూత్రధారి శ్రీధియోడరు గారు నాకు 1989లో అనుకుంటాను - నరసాపురంలో సముచిత సన్మానం చేశారు. ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన సమకాల భారతీయ సాహిత్యం అనే ఆంగ్ల గ్రంథంలో ఆధునిక తెలుగు సాహిత్యంపై వ్రాసిన ఆంగ్ల వ్యాసంలో శ్రీకోలవెన్ను రామకోటేశ్వరరావుగారు వ్రాసిన వాక్యాలు (1955). "ఈ మధ్య ఒక సరికొత్త ఉద్యమం ఉద్భవించి నది ఆంధ్ర సాహితీ జగత్తులో- నూతన సనాతన తత్వం. అయితే నూతన సనాతన వాదులు - నండూరి కృష్ణమాచార్య, జంధ్యాల పాపయ్యశాస్త్రి, జాషువా ప్రభృతులు, క్రొత్త ఉద్యమం వెల్లివిరియ చేశారు. "సంఘర్షణ" బదులుగా "సామరస్యం" వీరి లక్ష్యం. "సత్యం - సుందరం" ధ్యేయాలకు పునర్వికాస దోహదం కల్పించాలని నూతన సనాతనుల తహ తహ. వాస్త వికతను ఆదర్శ పరాయణత్వమునకు పంచ భౌతిక ప్రపంచానికి అధ్యాత్మక జగత్తునకు మధ్య సామరస్య హేతువు నిర్మించుట నూతన సనాతన వాదుల అభీష్టం."

శ్రీ గుర్రం జాషువా శ్రీ జంధ్యాల పాపయ్య శాస్రి ఎన్నెన్నో ఖండ కావ్యాలు - వ్రాశారు. "క్రొత్త పాతల మేలికలయిక" నూతన సనాతన వాదుల ప్రత్యేక లక్ష్యం. అసలు ఆ ధ్యేయం శ్రీగురుజాడ అప్పారావు గారిదే అనేమాట మరువరానిది.

నా "తారాతోరణము"నకు కట్టమంచి రామలింగారెడ్డి పీఠిక శీర్షిక – క్రొత్త పాతల మేలి కలయిక అసలు కవిత కేవలం సనాతనము మాత్రమే గాక నిత్య నూతనము."

"పురాణ మిత్యేవ న సాధు సర్వం - న చాపి కావ్యం నవ మిత్య వద్యం" అన్న కాళిదాసు మహాకవి నిత్యనూతన సనాతనుడే.

**"ప్రాతదయిన దెల్ల- బంగారమా? కాదు;"**

**క్రొత్త దైన దెల్ల చెత్త కాదు?"** వివేకులు రెంటిని సమిక్షించి - మంచిని ఎంచుకో గలరు గదా.

**కేవల నూతనత్వం - పునాదులు లేని మేడ;**

**కేవలం ప్రాతదనం మేడ కాన రాని పునాది.**

**"గట్టి పునాది గల - మేడ"** సామరస్యవాదుల ధ్యేయం.

## సత్యం - శివం - సుందరం

నా జీవితంలో- అటు శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి "కరుణశ్రీ", ఇటు "శ్రీపాలగుమ్మి పద్మరాజుగారు "పాప" ఉండేవారు. ఆదర్శవాది కరుణశ్రీ. వాస్తవిక వాది పాలగుమ్మి పద్మరాజు. నేను ఆయన సంయుక్త సంపాదకులం "మహాంధ్ర" - మాస పత్రికకు. కొంతకాల ము ఉభయుల వ్యక్తిత్వ 'ప్రభావం- నాహృదయంలో సంగమించా యి. అంతర్వాహినిగా స్వకీయ సరస్వతి ఉండనే ఉంది. ఆ విధంగా నా వాఙ్మయ వ్యక్తిత్వం ఒక ఆధునిక ప్రయాగ – త్రివేణీ సంగమమైనది. నాకు బుద్ధభగవానునిపై మార్క్స మనీషిపై గౌరవ భావం ఉన్నది. గ్రుడ్డి నమ్మకమును నేను నిరసిస్తాను.. "నమ్మకము లేదు నాకు నమ్మకము పై"

**మార్క్సు మాట యైన - మహమూదు పలుకైన !**
**వేద మైన - శాస్త్ర వాద మైన;**
**మార్పు చెంద వలయు - మనుజు లుండెడి చోట;**
**ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు.**

"ఆలోచనము"లు అభిప్రాయములు కావు. స్వేచ్ఛ జిందాబాద్".

**నేనే విశ్వాసములును**
**లేని - స్వతంత్ర సహృదయుడ - లీలా విలస**
**న్మానవ మాత్రుడ - బ్రదుకున**
**నా నాలోచనలు మెరయు - నాలో - సతమున్ .**

నేను వ్రాసిన నృత్య నాటికలు "గోదావరి"- "శ్రమ ఏవ జయతే" నట్టువాంగం నిర్వ హించిన నర్తకీ మణి శ్రీమతి శ్రీలక్ష్మిమోహన్. ధారా కృష్ణ మోహన్ సతీమణి. "శ్రమ ఏవ జయతే" కూచిపూడి బృందం వారు కూడా ప్రదర్శించారు. నేను ఏబదేండ్ల క్రితం వ్రాసిన రంగ స్థల నాటకం "ఛత్రపతి శివాజీ * సంస్కార భారతివారు పలుసారు లు ప్రదర్శించారు. తథా శ్రీకృష్ణ దేవరాయలు నాటక ప్రదర్శనలు. సంస్కార భారతి వారు నాకు సన్మానం చేశారు రవీంద్ర భారతిలో. నర్తకీమణి శ్రీమతి లక్ష్మీమోహన్ నాకు దోహదం కల్పించింది నృత్య నాటికా రచనలో- సాహితీ జీవితంలో నేను – "ఆట వెలది" ని స్వీకరించినాను. నిజ జీవితంలో గూడ - ఆట వెలది=నర్తకీ మణి

సాక్షాత్కరించి, నా నృత్య నాటికలు హృదయం గమంగా ప్రదర్శింప జేసినది.

నేను వ్రాసిన "నృత్య సరస్వతి లోని పలుకుల చెలి" పాట పలు మారులు పాడి - ఆమె నాకు వినిపించి సంతోషింప చేసినది. ఆమె భర్త శ్రీ కృష్ణమోహన్ ఆజానుబాహువు. అందగాడు. అతనికి నా ఆంగ్ల మహాభారతం అంటే మిక్కిలి ప్రీతి. "శ్రమ ఏవ జయతే" లోని - "పని చేయుటయే యజ్ఞము - పని చేయుటయే ప్రార్ధన" అనే పాట అతనికి చాలా ఇష్టం. కళా పిపాసువు లైన ఆ దంపతులు నా పై చూపిన ఆదరాభిమానాలు మరువ లేనివి.

## ఆంధ్ర పద్య కవితా సదస్సు

నిజామాబాదు విశ్వ సాహితీ సభలలో నన్ను "సంప్రదాయ సాహితీ సభాపతిగా" కూర్చోబెట్టినారు, డాక్టరు పోతుకూచి సాంబశివ రావుగారు రెండు దశాబ్దుల క్రితం. కారణం నేను ఛందో బద్ధమైన పద్య కవితలు వ్రాయటం కావచ్చు. అయితే నేను కేవలం సంప్రదా య వాదిని కాను. అనాడు సభలో నేను చదివి వినిపించిన పద్యాలు మినీ కవితారాధకు లు పలువురు మెచ్చుకున్నారు.

**క్రొత్త దనమును కనలేక కుమిలి క్రుంగి**
**ప్రసవ వేదన పడుచుండు, ప్రాతదనము;**
**విశ్వ విప్లవ ప్రస్థాన వేధ నుండి,**
**ఉద్భవించుత నూత్న యుగోదయమ్ము:**

అంతేగాక "ప్రగతిగీతలో - ఆలోచనములో నేను వ్రాసిన పద్యాలు అధునాతన భావతరంగిణులు.

**"ఎంత మంది చెమట ? ఎందరి నెత్తురు ?**
**పీల్చకుండ ఎవడు పేర్చె ధనము ??**
**దొరలు చేసి నట్టి దోపిడీయే - ఆస్తి ;**
**అంతరింప వలయు - ఆస్తి హక్కు"**

ఆధునిక సాహితీ ప్రియంభావుకులు హేతువాదులు ఎందరో మెచ్చు కున్నారు. నేను కోరుకునేది - సంప్రదాయ పునరుద్ధరణ కాదు. నా లక్ష్యం "కొత్త పాతల మేలు కలయిక". నేను ఎన్నో గేయాలు వ్రాశాను. అయితే నా రచనలో అధిక సంఖ్య పద్య కవితలే. అందులో

సుమారు నాలుగు వేల సంఖ్యపై బడి “ఆట వెలది” పద్యాలు ఉన్నవి. పద్య కవిత యతి ప్రాసలు గణాలలో కష్టం అనే అభిప్రాయ ఉన్నది. అది సరి కాదు.

**పరుగు లెత్తు - రైలు - పట్టాలపై వేగ**
**చూడ - పద్య విద్య - సులువు సుమ్మ;**
**గగన యాత్ర - వచన కవనమ్మ - కష్టమ్మ;**
**గొప్ప గేయ కవిత - ఘోర తపము.**

గేయ కవితకు వాద్య బృంద సహకారం కావాలి. రాగ తాళ బంధురం అంత్యాను ప్రాసం అవసరం.

పద్య కవిత - ఏకైక నిష్ట రాగం. స్వేచ్ఛ యాదృచ్ఛికం - ఆ విధంగా స్వేచ్ఛా సౌలభ్యాలను పద్య కవి ఆరాధించవచ్చు. కంఠస్థం చేయటం సులువు. మిక్కిలి సులభం.

నన్ను సంప్రదాయ సాహితీ సభాపతి చేసిన వారు ఉన్నారు. “విప్లవ కవి” అన్న ఫణీంద్ర ఉన్నాడు. సాహితీ ప్రియంభావుకులలో - గడియారం లోని లోలకమును నేను - ఉయ్యాలనే. స్థావర పుష్ప శయ్యను కాను.

నా జీవితంలో నాకు దేని యెడ ఏకాంత భక్తి లేదు.

**“నిండి యుండు జగతి ఖండ సత్యాలతో !**
**పూర్ణ సత్య మేది పుడమి లేదు”.**

నేను సదా సమన్వయ వాదిని. హృదయాంతరాళంలో వ్యాస మహర్షికి - తిక్కనకు - కబీరుకు వెన్నెల దేవళం కట్టు కున్న వాడను.

**మెదడు లోన మార్క్స - హృది లోన బుద్ధుడై**
**విప్లవమ్మ - కరుణ వింగడించి,**
**పుట్టు గాక - “సుకవి” - భువనైక పౌరుడై!**
**ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు.**

విజయవాడ వార్షిక సభలో నన్ను రాష్ట్రస్థాయి ఆంధ్ర పద్య కవిత సదస్సుకు అధ్యక్షునిగ ఎన్నుకున్నారు. 1993 విజయవాడ సభలలో పద్య పఠనం బహుమతులు. అయిదు వేల రూపాయల

నగదు బహుమతులను నేనే సమకూర్చాను. "కవులకు – బహుమతులు పంచటం ముఖ్యం. పద్య పఠితలకు గాయకులకు అగ్రస్థానం ఏమిటి ?" అనే విమర్శ విసురు వచ్చింది. పద్య పఠన బహుమతులు చేకూర్చు భాద్యత నాపై ఆనాడు వేశారు. నా కర్తవ్యం నిర్వహించినాను. అంతే తదుపరి ఆంధ్ర పద్యకవితా సదస్సు జంట నగరాలలో జరిగినది. 1996 మే నెలలో మూడు రోజులు. సభలు – జగజ్జేగేయ మానంగా జరిగినవి. ఇరువది మూడు జిల్లాల నుండి ప్రతినిధులు వచ్చారు. కొందరు అభ్యాగతులు. ఈ సారి కవులకు గూడా, బహుమతులు ఇచ్చాము. "స్వ హస్తం వా – పర హస్తం వా" ఆర్థిక బాధ్యత - నా మీ దనే పడింది. తెలుగు విశ్వ విద్యాలయం వారు సహకరించారు. "రసమయి" సహకారం - ముఖ్యంగా - ఏతధి నేత శ్రీ రాముగారు అందించిన సహకారం చిరస్మరణీయం. సదస్సు సభల నిర్వహించి నా జన్మ ధన్య మైనట్లు ఆనందించాను. మరల నన్ను అధ్యక్షునిగా - శ్రీ శిష్టా వేంకట్రావు గారిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. వివరములు అన్నీ ఆంధ్ర కవితా సదస్సు సావనీరు సంచికలో చూడవచ్చు.

## "సత్యం కంప్యూటర్సు"

విశ్వ విజ్ఞాన చరిత్రలో ఇది "కంప్యూటరు యుగం "సత్యం కంప్యూటర్సు" విశ్వ విఖ్యాతిని ఆర్జించిన అదునాతన భారతీయ సంస్థ. ఈ సంస్థ నిర్మాత మేధావులలోమేరు శిఖరి - బహు ముఖ ప్రతిభా శాలి - శ్రీ బి. రామ లింగ రాజు గారు.

**"పుట్టెను రాచ బిడ్డ్డయయి భూమి ప్రదక్షిణ చేసి వచ్చె - చే**
**పట్టిన వృత్తి కీర్తి - ప్రతిభా సుషమా పరివేష దీధుతుల్**
**చుట్టె శిరాన - సత్య శివ సుందర శోభలు - రామ లింగ స**
**మ్రాట్టు వెలుంగు గాత - శుభ మంగళ తేజముతో - చరిత్రలో.**

**రామ లింగ రాజు - ప్రఖ్యాత మేధావి;**
**అమెరికాకు ప్రాకె అతని ప్రతిభ;**
**ఇంటి కోట బురుజు లిల్లాలి పున్నెముల్ !**
**చిరుత నందనవని పెరట కలదు.**

ఆలోచనము" కావ్యం అవతారిక నుండి -

అసలు ఆది మూల కేదారం శ్రీ రామలింగరాజు తండ్రి గారయిన శ్రీ బైర్రాజు సత్య నారాయణ రాజు గారు.

శ్రీవారు స్వకీయ ప్రతిభతో పైకి వచ్చారు. ఒక సువిశాల సామ్రాజ్యం - పలు శాఖలలో నిర్మించినారు. వీరు "సత్యం" పరిశ్రమలకు అధ్యక్షులు. వీరి హస్తవాసి గొప్ప మహిమ గలది. వీరు "సజీవ పరుస వేది". దేశదేశాంతరాలలో దేదీప్యమానంగా తెలుగు బావుటాను భారతీయ ప్రతిభాధ్వజమును ఎగుర వేయుచున్న శ్రీ రామలింగ రాజుగారి జనకుడు శ్రీ సత్యనారాయణ రాజు గారికి "ముత్యాల గొడుగు" పద్య కావ్యం అంకితం.

ఈ కావ్యం లోని ప్రతి పద్యం ఒక "ముక్తకమే" అలంకారికంగా. నేను - ప్రౌఢ నిర్భర వయః పరిపాకంలో వ్రాసినదీ ముత్యాల గొడుగు. విశ్వ సాహితీ జగత్తులో తెలుగు - ఆణి ముత్యాల గొడుగు అగుగాక. ఒక సారి చాలనాళ్ల క్రితం - విశ్వకవి రవీంద్రుని శాంతి నికేతన్ ఆశ్రమముకు సందర్శించినాను. ఆంధ్ర కవి కుమార బృంద నాయక పాత్ర ధరించి - విశ్వకవి - స్వాగత సూక్తంలో "ఆంధ్రులు విశ్వ సాహితీ జగత్తులో గొప్ప కవితా మార్గ దర్శకులు మౌక్తిక ఛత్ర ధారులు. హాలుడు సారస్వత మౌక్తిక ఛత్రపతి. హాల చక్రవర్తి సంతరించిన గాథా సప్తశతివిశ్వ సాహితీ జగత్తులో ఏకైక ప్రప్రథమ విశ్వవిశాల మౌక్తిక ఛ్ఛత్రం. ప్రాఙ్నన్నయ యుగాలలో ఆంధ్రులు పఠించిన కావ్యాలు - "కాసట బీసటలు = గాథా సప్తశతి బృహత్కథ అన్న ఎర్రన మాటలు నా గుండెలో గూడు కట్టుకున్నవి. సాహితీ సమాధిని సమకూర్చు కున్నవి- ఒక అర్ధ శతాబ్ది నుండి. ఏతత్ ఫలితమే నా యీ ముత్యాల గొడుగు. సంస్కృతంలో చెప్పితే "మౌక్తిక ఛ్ఛత్రం".

"ముత్యాల గొడుగు" కృతి పతిని శ్రీ బైర్రాజు సత్యనారాయణ రాజు గారిని చేకూర్చినది శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణ రాజు గారు. ఆయన కృతికర్త. కృతి భర్త - ఈ సాహితీ కళ్యాణ సంధాత. ముత్యాల గొడుగు కృతిపతి శ్రీ బైరాజు సత్య నారాయణ రాజు గారికి వరుసకు " బావ" గారు.

"కవితా సంహిత కావ్య కృతిపతి శ్రీ సూరయమామ కవిగారు– కృతిపతి సత్యం గారి పుత్ర రత్నము రామలింగ రాజు గారిపై వ్రాసిన పద్యాలు గ్రంథంలో – పుటాంతరములలో 'ప్రచురితములు'.

శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణ రాజు రాజకవి. కవి రాజు. ఆపాద మస్తకము కవి. తర తరాల కృతిభర్తల ప్రాతినిధ్యం వహించే సజీవ సహృదయ సమాహార సారస్వత పతాకం !

ఈ కృతి "ముత్యాల గొడుగు" కు కృతిపతియై ముద్రాపకులైె "సత్యం దొర గారికి" నా ఆశీరభినందనలు. జే జేలు.

'ముత్యాల గొడుగు' లోనివి అన్నీ చాటు పద్యములే. హృదయము నుండి పెల్లుబికి పైకి చిమ్మిన ఊట నీటి పోటు పొంగులే. సాహితీ స్వయంభువ సాక్షాత్కారములే. సూక్ష్మ దర్శన వటు నుషమా నిదిధ్యాన, గొప్ప సూక్తి హృదికి కూర్చ గలదు;

**చాటు పద్య కవిత " సచ్చి దానందమే" !!**
**రస విరాట్టు నృత్య రంగ శాల.**
**ఒక తటిత్ ప్రభాస - ఒక చమత్ విక్రాంతి**
**ప్రతిభ కూర్చు నట్టి - రస సమాధి.**
**కవిత నుయ్యి కాదు - కాదొక్క సెలయేరు !**
**కవిత - పూవు టమ్ము కాదు కాదు;**
**నేల నాభి వెడలి - నింగి చుక్కలు దాకు**
**ఊట నీటి సూటి పోటు కవిత.**

జీవితంలో వృద్ధాప్యం దుర్భర మని అంటారు. నా వయన్సు 79 సంవత్సరాలు. నిత్యం పద్యాలు వ్రాయుచున్నాను. ఈ మధ్య ఆచార్య ఫణీంద్ర - నాకు తన కావ్యం "పద్యప్రసూనాలు" అంకితం చేశారు. ఫణీంద్ర తెలుగు పద్యం చిరంజీవి - అని నిరూపించిన కవి. తధా డాక్టరు. డి.వి.ఆర్.కె. ప్రసాద్ నాకు తన కావ్యం "రస బుక్కులు" అంకితం చేశారు. అందలి కవితలు 'మెరపు తీగెలు – భూకంపాలు'. "వాక్యం రసాత్మకం కావ్యం" పలువురకు ఆమోదం కలిగించే కవితా నిర్వచనం. డాక్టరు ప్రసాద్ రస బుక్కులు చదివిన సహృదయుడు - అభినవ కవితా నిర్వచనం "ఏకైక పదమేవ రసాత్మకం కావ్యం" అన వచ్చు.

నా ఆరోగ్యం బాగా ఉన్నది. శిష్యులే గాక వైద్య శిఖామణులు నాకు షోడశాధికో పచారాలు అందించు చున్నారు. డాక్టరు రఘురామి రెడ్డి - ఉస్మానియా వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపలు - అగ్రగణ్య మేధావి. రోగుల పాలిట కల్పలత అరవింద వైద్య సత్రశాల అధినేత డాక్టరు లక్ష్మీ నారాయణ శర్మ, దంత వైద్య నిపుణుడు - స్వతంత్ర సాహితీ ప్రియంభావుకుడు డాక్టరు తేజేశ్వ రావు– నాకు శిష్య నిర్విశేషులు, ఉదార హృదయులు.

శ్రీ వెనిగెళ్ల రాంబాబు కవి - అదునిక శతఘంట కవి - ప్రభృతులు నాకు పుత్ర నిర్విశేషులు. ప్రత్యేకంగా పేర్కొన దగిన ప్రతిభాశాలి - ఆంధ్ర తుంబురుడు గజలు శ్రీనివాసు- సంగీత సాహితీ జంగమ సజీవ గంగా యమునా సంగమం. ప్రస్తుతం నేను వార్ధక విజేతను. నా యావజ్జీవితం తెలుగు తల్లికి అంకితం చేశాను. అరువది సంవత్సరాల నుండి నా మెడలో పూల దండలు పడుచున్నవి.

**కోరి పూల దండ కొరకె - సర్వస్వమ్ము;**
**ఫణము పెట్టినాను బ్రదుకు లోన !**
**మెడకు పూల దండ పడక - వారము చాలు;**
**గడవ - చుట్టు ముట్టు ఎడద - బెంగ.**

ఆచార్య శ్రీ బేతవోలు రామ బ్రహ్మంగారు ఆంధ్ర భూమి వార పత్రికలో నన్ను గూర్చి "గొప్ప గురువుల శిష్యుడు. గొప్ప శిష్యులకు గురువు" అని ఛలోక్తి విసిరినారు. ఆవాక్యం నా జీవిత చరిత్ర సంగ్రహం.

నేటికి కూడ వయోవృద్ధులైన సత్మవీశ్వరులు శిష్య శేఖరులు శ్రీ మంతెన సూర్యనారాయణరాజుగారి వంటివారు "తవ యోగ క్షేమం వహా మ్యహం" అంటు చేరుచున్నారు. శ్రీ ఏకాంబరా చార్యులవారు మూర్తీభవించిన పద్య కవిత. "పొట్ట గాదది పద్యాల పుట్ట గాని" సమగ్ర సాహితీమూర్తి శ్రీ పిచ్చయ్యగారు, పరిపక్వ కవితా శిల్ప సౌష్టవ మూర్తి. ఆచార్య వి.యల్. యస్ భీమశంకరం, "కవితా ప్రభాస" గరుకుల సంఘ సభ్యులే.

జీవితంలో సంపూర్ణ సంతృప్తి చెందిన వాడను నేను.

# నా స్మృతి పథం లో

**కొన్ని కొన్ని ముఖ్య సన్నివేశమ్ములే**
**జ్ఞాపకమ్ము రావు; సమయమునకు**
**బ్రతుకు గడుచుకొలది ప్రాధమ్యములు కూడ**
**ఉండు గుండె చెదర కుండ కొన్ని.**

ఇప్పుడు నావయస్సు 81 సంవత్సరాలు. నా జీవితంలో ఎన్నో విషయములు మరచి పోయాను. కొన్ని చెదురు మదురుగా జ్ఞాపకం ఉన్నాయి లీలగా.

ఒకసారి అమలాపురంలో అష్టావధానం చేసేటప్పుడు నన్ను పృచ్ఛకుడు వేసిన ప్రశ్న.

"అవధానిగారూ! మీ స్మృతి పథాన తొలి సన్నివేశం గుర్తుకు తెచ్చుకోగలరా? ప్రయత్నించండి"

అది గడ్డుప్రశ్న, అది అవధాన సభ – కోరుకుంది. నేను అప్పుడు చెప్పిన పద్యం.

**"పాటలు పాడి నన్ను పసిబాబును ఊయలలోన ఊచుచున్.**
**ఆటలు నేర్పు దాదిని రహస్యముగా పొదరింటిలోనికిన్**
**పైట చెరంగుపట్టి పెరవాడెవడో తరలించు దృశ్యమున్**
**మాటలు వచ్చి నంతటనె మాతకు చెప్ప దలంచినాడనే"**

ఆ పృచ్ఛకుడు అన్నాడు "అవధానిగారూ మీ కొంటె సమాధానం నేను కూడా మెచ్చు కుంటున్నాను. నేను కోరేది అతిశయోక్తి లేని అచ్చమయిన సత్యం. ఈ సారి చెప్పండి అట్టి ఉత్పల మాలతో ఆ'టకార' ప్రాసంతో. అప్పుడు నేను ఆసువుగా చెప్పిన పద్యం.

**స్ఫోటక బాధచే ఒడలు సోలి పరుంటిని తల్లి ప్రక్కలో**
**మాటికి మాటికిన్ మరల మంచముపై కెగబ్రాకు-తేలు-నన్**
**వ్రేటును వేయకుండ తన వ్రేళులతో విదలించి -యెన్నియో**
**కాటులు తిన్న తల్లి కృప-కారణ జన్ముడనై తరించెదన్**

ఆ పద్యం సభను మిక్కిలి ఆకర్షించింది. తల ఊపుతూ ఒక సదస్యుడు లేచి తన చేతి ఉంగరం నా చేతికి తొడిగాడు, హర్షధ్వానాలమధ్య.

## అమ్మ

మా అమ్మగారి ప్రేమ నాకు అనుభవామ్రేడితం. యావత్ ప్రపంచ చరిత్రను ఉర్రూత లూపిన అర్థశాస్త్రమే మానవ జీవితమునకు పునాది అనే సందేశం అందించి "మార్క్స్" మాతృ హృదయాన్ని విస్మరించాడు. మార్క్స్ మనీషి సిద్ధాంతం మాతృ ప్రేమకు వర్తించదు.

తథా - శ్రీ శంకరాచార్యుల వారు అన్న "జగన్మిధ్యా' సిద్ధాం తం కూడ తల్లి ప్రేమకు వర్తించదు. నన్ను - చుట్టుప్రక్కలవారు - "అమ్మగత ప్రాణం" అనేవారు. తల్లి ప్రేమకు నేను చిరకాలం నోచుకోలేదు. నా పదునారవ ఏట తల్లి మరణించింది. నా జీవితంలో ప్రాతః స్మరణీయులు నా మేనమామ ఆత్మకూరి గోవిందాచార్యులుగారు. నన్ను చేరదీసి విద్యాబుద్ధులు గరిపి కాపాడినారు. ఆయనకు పిల్లలు లేరు. ఆయన తల్లి, నా అమ్మమ్మ సుభద్రమ్మగారు. నన్ను తల్లి లేని లోటు లేకుండ పెంచి పెద్ద వాడిని చేసింది. ఆ విధంగా నేను మా తండ్రిగారు శ్రీశోభనాద్రా చార్యుల వారికి దూర మైనాను.

ఒకే ఊరు ఏలూరులో ఉన్నా, నేను మేనమామగారి ఇంటిలో ఉండేవాడను. మానాన్న గారికి వీర రసం అంటే ఇష్టం. నెపోలియన్ సప్తాహం నిర్వహించారు - విస్సన్న పేటలో ఆయన ఠాణాదారుగ ఉద్యోగంచేసినప్పుడు. 1936లో మానాన్నగారికి నేను వ్రాసిన నాటకం ఛత్రపతి శివాజీ అంకితం చేశాను. ఆయన అవసాన కాలంలో సర్వ సేవలు చేశాను 1970లో.

నా కుటుంబం అంటే 1939 నుండి నా మేనమామ ఆత్మకూరి గోవిందా చార్యుల గారి ఇల్లే. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు. గాంధీమహాత్ముని అనుచరుడు. "సత్యాగ్రహి పత్రికా సంపాదకుడు. సంపన్నుల ప్రతినిధిగా 1940లో శాసన మండలి సభ్యుడుగా ఎన్నికైనారు శాసన మండలి పశ్చిమ గోదావరినుండి. గోవిందా చార్యుల వారికి నేను వ్రాసిన కావ్యం, తారా తోరణం

అంకితం చేశాను. ఆయన నన్ను పుత్ర నిర్విశేషునిగా చూశారు. ఆయన చాలయేండ్లు అఖిల భారత కాంగ్రెసు సభ్యుడు. అందుచే భారత దేశంలో కాంగ్రెసు అగ్రనాయకులు పలువురితో గాంధీ, పటేలు, నెహ్రూ, కృపలాని, పట్టాభి, ప్రకాశం, నేతాజీ ప్రభృతులతో నాకూ ప్రత్యక్ష్య పరిచయ భాగ్యం లభించింది. చెన్నపురి నందర్శించినపుడు 1946 జనవరి 21వ తేదీన గాంధీమహాత్మునకు 'ఆర్యాంజలి' సమర్పించాను. నా పద్యాలు ఆంధ్రపత్రిక ముఖపత్రంలో ప్రచురింప బడ్డాయి. నేను 1921లో పుట్టాను. మా అమ్మ నాకు పట్టుగోచీ పెట్టి ఉయ్యాలలో పడుకోబెడితే చెరసాలనుండి వచ్చిన మామేనమామ గారు అది తీసేసి ఖద్దరు గోచీ పెట్టారట. నాకు పరిశుద్ధ ఖద్దరు ధారిగా పేరు ప్రతిష్ఠ పెరిగింది. గాందీ యుగంలో దేశభక్తి వాతావరణంలో ఉన్న అందరూ ప్రధానంగా దేశ భక్తునిగా కవిగా గౌరవంగా చూచేవారు. నా ఆ పరివేషం నేడు పొడిపొడి మాటలతో చెప్ప రానిది. నేను నివసించింది ఆ 'మరోప్రపంచంలో'.

"ఎందరో మహానుభావులు అందరకును వందనములు" అన్నాడు మహాను భావుడు త్యాగరాజు. నా దృష్టిలో మహాత్ముడు గాంధీ ఒక్కడే. ఆమహాత్ముని శిష్యుడను నేను. అనాటి నా గర్వం తలచుకుంటే నేడు నేను సిగ్గుతో తలవంచు కొను చున్నాను. నేను దేశభక్తుడను. కవిని అని మనసారా నాడు నమ్మినాను. ఉన్మాద ప్రాయ మైన నా మానశిక భ్రాంతిని తొలగించుటకు ఎవరూ ప్రయత్నించలేదు ఒక్క బెజవాడ గోపాలరెడ్డి గారు తప్ప. నాకు గర్వ భంగం చేయటానికి ఆయన ప్రయత్నించి విఫలుడు అయ్యారు. నేను ఎదిరించి నాకు జానెడు ఉంటే ఆయనకు మూరెడు గర్వం ఉందని అధిక్షేపించాను. ఆవిధంగా చాలా కాలం బలవద్విరోధం తెచ్చి పెట్టు కున్నాను.

నెల్లూరులో తిక్కన పురస్కారం - నేను తిక్కనపై డాక్టరేటు పట్టం పొందిన ప్రథముడను. ఆ పురస్కారం నాకు ఇవ్వమని పలువురు బెజవాడ గోపాలరెడ్డిగారికి సూచించారు. శ్రీ ముదివర్తి కొండ మాచార్యులుగారు ఆసూచన చేసినపుడు బెజవాడ గోపాలరెడ్డిగారు కన్నులు చేతులతో మూసు కొని మౌనంగా, ఉండిపోయారని కొండమాచార్యులువారు ఆశ్చర్యంతో నాకు

చెప్పారు. శ్రీబెజవాడ గోపాలరెడ్డిగారు బ్రతికి ఉండగా నాకు ఆ పుర స్కారం రాదని అనుకున్నాను. అయితే ఆయన కొన్నినాళ్ళకు పెద్దమనస్సు, చేసుకొని ఎట్టకేలకు తిక్కన పురస్కారం నాకు ఇచ్చారు. శ్రీబెజవాడ గోపారెడ్డిగారే విశాల హృదయుడని ఋజు వైంది - 1984లో అనుకుంటాను.

నా గర్వాగ్నికి ఆజ్యం పోసిన మొదటి వ్యక్తి కవిసమ్రాట్ విశ్వనాథసత్యనారాయణ గారు. వారు 1939లో బెజవాడ యస్.ఆర్.ఆర్.కళాశాలలో నాకు తెలుగులో - ప్రత్యక్ష గురువు. నేను పద్యాలపోటీలో వ్రాసిన పద్యం.

**"గోదావరికి కల్కి కుల్కుల నాట్యవి**
**న్యాసములు నేర్పె నన్నయ కవి;**
**తెలుగు దనము వాల్ గనుల అంచుల నింప**
**తెలుగు వాణికి నేర్పె తిక్కన కవి**
**మందార మకరంద మాధుర్యముల తెల్లు**
**పొలముల పండించె పోతనకవి;**
**స్వర్గ లోకమునుండి పారిజాతము దింపి**
**తెలుగు సాహితి నాటె తిమ్మన కవి;**

**మువ్వ గోపాలు చిన్నారి మురళితోడ**
**తాండవింపగ చేసె క్షేత్రయ్య గీతి;**
**తెలుగు హృదయాల తంబురా తీగె మీటి**
**అమృత రస తరంగిణి చేసె త్యాగరాజు."**

సభలో చదివి వినిపించి "మూడుగంటల వ్యవధిలో చిరంజీవి ఆచార్యులు ఈ పద్యం వ్రాశాడు. మూడునెలల వ్యవధి ఇచ్చినా నేను ఇంతటి మృదుమధుర పద్యం "వ్రాయలేను." అన్నారు. అది విశ్వనాథ వారి ఔదార్య హృదయం అయితే ఆదేశికోత్తమ స్వామి చేసిన ప్రశంస నిజమని నేను భ్రమించినాను. 1939లో తెలుగు ఆనర్సులో చేరాను. 1940లో నాకు ఆంగ్లంలో Sir George Stanlee Prize (సర్‌జార్జి స్టాన్‌లీ బహుమతి) వచ్చింది - విశ్వవిద్యాలయంలో ఆంగ్లంలో 'ప్రప్రథముడుగా వచ్చినందుకు. అపరీక్షలో గణితం, ఆర్థికశాస్త్రం, భౌతిక రసాయన శాస్త్ర విద్యార్థులు అందరూ ఉన్నారు. నా గర్వం ఇనుమడించటానికి అది మరొక

కారణం. 1942లో ఎం.ఏ పట్టం పొందగానే నాకు ఆంధ్ర క్రైస్తవ కళాశాల (గుంటూరులో) తెలుగుశాఖలో ఉద్యోగం వచ్చింది. బహుశా నాకు ఆంగ్లంలో వచ్చిన బహుమతి కారణం.

తదుపరి చెన్నపురి విశ్వవిద్యాలయంలో శ్రీకోరాడ రామకృష్ణయ్యగారి పర్య వేక్షణ క్రింద తిక్కన పై పరిశోధన చేశాను. 1945 భీమవరం కళాశాలలో ప్రాచ్యశాఖాధిపతిగా ఉన్నత పదవి నాకు లభించింది. అప్పుడు నావయస్సు 24 సంవత్సరాలు. హెచ్చు జీతం. కాలం కలిసివచ్చి మొట్టమొదటి సారిగా ఏలూరు భీమవరం కళాశాలలలో హెచ్చు జీతము 1945లో ప్రవేశ పెట్టినారు. అందులో నా ప్రతిభ సామర్థ్యం ఏమాత్రము లేక పోయినా అనుబంధ కళాశాలల ఉపన్యాసకులలో విశేష గౌరవం లభించింది. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు అధి నేత - నా కావ్యం తారాతోరణమునకు శీర్చిక వ్రాశారు. అది ఒక ఘనత। నేను వ్రాసిన ధర్మచక్రం నాటకం కృష్ణా పత్రికలో వారం వారం ప్రచురింపబడింది. కళాప్రపూర్ణ డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణ్యం గారు నా నాటకాలు పలుచోట్ల ప్రదర్శించారు. నన్ను ఒక 'కవీశ్వరుని'గా మన్నించేవారు. వారు నాకు తల పెట్టిన సన్మాన సభకు అధ్యక్షుడు పింగళి లక్ష్మీకాంతంగారు. సరిగ్గా ఆ నాడే చెళ్లపిళ్ల వెంకట శాస్త్రిగారు దివంగతులైనారు. ఆ సభలో పింగళి వారన్న మాట ఇంత వరకు నేను చెళ్లపిళ్లవారి శిష్యుడనుగా బ్రతికినాను. మాగురు దేవులు ఆస్త మించారు. ఇక మీద నేను శ్రీనండూరి రామకృష్ణమాచార్యుని గురువునని చెప్పుకో గలను. అప్పుడు భీమవరంలో కవి అంటే నేనే నని నేను అనుకునేవాడిని. బహుశా కొందరు ప్రజలు ఆ భ్రమలో పడేవారు. భీమవరంలో 1945నుండి 1955వరకు ఉన్నాను. భీమవరంలో నేను వ్రాసిన గ్రంథం కవిత్రయమునకు తెలుగు భాషా సమితివారి పురస్కారం 1954లో లభించింది. 1945-46లో శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు (తదు పరి తెలుగు అకాడమి అధినేత), భీమవరం కళాశాలలో తెలుగు శాఖలో ట్యూటరు. ఆయనకు ప్రభుత్వంలో ఉద్యోగం వచ్చింది. ఆయనను నేను అడిగాను "'మీ వంటి సమర్థుని ఎవరినైనా మీ పదవికి సూచించండి" అని. శ్రీ అప్పారావు గారు శ్రీదిగుమర్తి సీతారామ స్వామిగారి పేరు సూచించారు. నేను

శ్రీస్వామికి ఉద్యోగం ఇచ్చాను. శ్రీఅప్పారావు గారి మంచి తనమునకు అది ఒక నిదర్శనం.

ఒకసారి నన్ను ఒక మిత్రుడు ప్రశ్నించాడు. "అంత పెద్ద ఉద్యోగం అధికార భాషా సంఘం అధ్యక్షపదవి మీకు ఎట్లా లభించింది?" నిజానికి ఆ ప్రశ్నకు సమాధానం నాకు తెలియదు. నేను చెప్పిన సమాధానం - 'శ్రీ దిగుమర్తి సీతారామస్వామికి నేను యోగ్యత గుర్తించి ఉద్యోగం ఇచ్చి సాయం చేశాను. నేను చేసిన ఆ పుణ్యం గుర్తించి భగవంతుడు నాకు సాయం చేశాడు'. అట్లాగే పలువురికి యోగ్యులకు నేను ఉద్యోగాలు ఇచ్చాను పిమ్మట.

## రాయల సీమ

అనంతపురం ప్రభుత్వ కళాశాలలో తొమ్మిది సంవత్సరాలు. 1955-1964వరకు తెలుగు శాఖాధి పతిగా గెజిటెడ్ ఉపన్యాసక పదవి నిర్వహించాను. అప్పుడు నా దగ్గర పనిచేసిన జి.యన్.రెడ్డి గారు, తదుపరి శ్రీవేకంటేశ్వర విశ్వ విద్యాలయాధినేత అయ్యారు. రాయల సీమలో పలు ప్రాంతాల వారు నన్ను సాహితీ నభలకు ఆహ్వానించే వారు. అనంతపురం నివాసం నా వ్యక్తిత్వాన్ని సాన పెట్టింది. ఆ విధముగా శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారితో ప్రగాఢ పరిచయం ఏర్పడింది. అనంత పురం రావడంతో మాయింటికి మూడవ ఇంటిలో పక్కనే రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యుల వారు శ్రీ అనంతకృష్ణశర్మగారి అన్నగారు, ఆయన కొడుకు ఉండేవారు. అన్నగారు పాండిత్యంలో ప్రతిభలో, తమ్మునకు తీసిపోడు. వసు చరిత్రగూర్చి ఆయన ప్రామాణిక ప్రసంగాలు చేసేవారు. వారితో నన్ను తరచు పెను కొండ తీసుకొని వెళ్ళేవారు. ఒక విశేషం- పెనుకొండలో నాకు శ్రీపుట్టపర్తి శ్రీనివాసా చార్యు లు - సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యుల తండ్రి గారితో పరిచయం ఏర్ప డింది. పుట్టపర్తి నారాయణాచార్యులు గారు సుగృహిత నామధేయుడు. అయితే ఆయన తండ్రి గారికి రావలసిన కీర్తి రాలేదు. ఆయన వ్రాసిన చాటువులు వేల సంఖ్య. అయితే అవి అచ్చు కాక పోవటం ఆంధ్రుల దురదృష్టమే. ఆయన నోట విన్న ఒక చాటువు నాకు కంఠస్థంగా నిలిచింది.

**బొబ్బిలి రాజట! ఎవరో**
**దబ్బర నా కొడుకు! వాడి తస్సాదియ్యా;**
**అబ్బడి సొమ్మేమిచ్చెను**
**ఎబ్బెరగా గవర్నమెంటు స్కేలొనరించెన్.**

పెనుకొండ సబ్‌కలెక్టర్ హార్వేల్ దొరపై ఆయనను పద్యాలు రాయమన్నారు. ఆయన చేసిన చమత్కారం. ఉత్తర రామచరిత్ర పీఠికలో కంకంటి పాపరాజు కవి అర్వేల నియోగులను ప్రశంసిస్తూ గొప్ప సీస పద్యాలు వ్రాశారు 'ఆర్వేల వారు' అని. దానిని హార్వేలు వారు అని మార్చి చదివారు శ్రోతల హర్షధ్వానాల మధ్య. నాకు స్వప్నంలో అయినా శ్రీనాథుని చూడాలని శ్రీనాథునితో మాటాడ వలెనని కోరిక ఉండేది. శ్రీపుట్టపర్తి శ్రీనివాసాచార్యుల వారిని చూచి వారితో మాటా డిన పిమ్మట ఇక శ్రీనాథుని చూడలేక పోయానన్న విషాదం అంతరించింది. వారి పుత్రరత్నం నారాయణాచార్యుల వారిని తరచు కలుసుకున్నాను. ఆయనను చూచినపుడు నాకు ఆనంద తన్మయత్వం కలిగింది. ఆయన తండ్రి శ్రీపుట్టపర్తి శ్రీనివాసా చార్యుల వారిని చూచినప్పుడు ఆశ్యర్య చకితత్వం కలిగింది. విశ్వనాథ సత్యనారాయణగారికి పుట్టపర్తి నారాయణాచార్యుల వారికి మధ్య కొన్ని పోలికలు వున్నాయి. ఇరువురు గర్విష్ఠులుగా ప్రసిద్ధి కెక్కారు. ఆ అభిప్రాయం స్థూల దృష్టికి కొంత నిజం కావచ్చు; సూక్ష్మదృష్టితో చూస్తే ఇరువురు ఆంతర్యంలో వినయ విద్య దురంధరులు. శ్రీరాళ్ళపల్లి అన్న దమ్ములను చూడ ముచ్చట గా ఉండేది. శ్రీరాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు తిరు పతిలో ఉండేవారు. నేను తరచు తిరుపతి వెళ్లేవాడిని. వారి ఆతిథ్యం నాకు అనుభవా మ్రేడితం, గోధుమ రొట్టెలు అరటి చక్కర పచ్చడి వారికి ఇష్టం. ఆ రుచి నేనుకూడ మరిగినాను. శ్రీరాళ్ళపల్లి వారి 'శతజయంతి'. అనంతపురంలో జరిగినప్పుడు నన్నే ఆ సభలకు అధ్యక్షునిగా పెట్టారు.

రాయలసీమలో నాకు పలువురు శిష్య ప్రముఖులు ఏర్పడ్డారు. వారిలో ఒక ఏకలవ్య శిష్యుడు 'కలుగోట్ల విజయాత్రేయ కవి అతని పద్యకవితలో జలపాత సదృశ మైన దూకుడు ఉంది. అతను ఎన్నో పద్యకావ్యాలు వ్రాశాడు. ప్రతికావ్యంలో 'గురు స్తుతి' గా నామీద కొన్ని పద్యాలు వ్రాశాడు. నేను పుట్టి పెరిగింది కృష్ణాగోదావరి

మధ్య సీమ. కర్నూలు జిల్లా గని యెక్కడ? విజయాత్రేయ కవి నన్ను గురువుగా అభివర్ణించడం నాలో ఆత్మ ప్రత్యయం కలిగించింది.

రాయలసీమ సగటు పౌరునిలో సహృదయత హెచ్చు. చిత్తశుద్ధి హెచ్చు. నాగరికత కొంత తక్కువ. సాగరతీరంలో ఆంధ్ర సీమలో నాకరికత హెచ్చు. తెలుగుదనం రాయలసీమలో హెచ్చు. తెలుగు నుడికారపు వంపు సొంపులు రాయలసీమ వ్యవహార భాషలో తామర తంపరలు. నా రాయలసీమ నివాసంలో పాత తెలుగు పలుకు బడంత స్వారస్యం గ్రహించ గలిగి నాను పెద్దన్న వర్ణించిన ప్రత్యూష పవనాంకురాలు రాయల సీమ వారికి అనుభవా మ్రేడితములు. సాగరతీరముల చెమట ఎక్కువ. రాయల సీమ వాసయోగ్యమైనది. రాయలసీమ పౌరులు గుండె లలో నేటికి కూడా అదృశ్యంగా అష్ట దిగ్గజ కవులు, వర్ధిల్లిన భువన విజయం దాగి ఉన్నట్టు అనిపిస్తుంది. అనంతపురంలో కల్లూరి సుబ్బారావు గారితో నాకు ప్రగాఢ పరిచయం ఏర్పడింది. కల్లూరి వారి శిరము చుట్టు అదృశ్యంగా శ్రీకృష్ణదేవరాయల కిరీట పరివేషాలు కమ్ముకొని ఉండేవి. శ్రీపప్పూరి రామాచార్యులుగారు పరిహాస రసికుడు.

ఆంధ్రజాతీయగీతం అన దగిన మా తెలుగు తల్లికీ మల్లె పూదండ - పాట వ్రాసిన శ్రీశంకరంబాడి సుందరాచార్యులు గారితో నేను చిత్తూరులో ఉన్నప్పుడు, 1965-66లో పరిచయం ఏర్పడింది. హైదరాబాదులో ప్రథమ ప్రపంచ తెలుగు మహా సభలు జరిగి నప్పుడు నేను విశాఖపట్నం ప్రభుత్వ కళాశాలకు అధినేతను. నన్ను ఆహ్వానించారు. '"మాతెలుగు తల్లి" పాట పాడేందుకు టంగుటూరి సూర్య కుమారిని లండను నుండి రమ్మని ఆహ్వా నించారు. ఆపాట వ్రాసిన కవి సుందరాచారిని ఆహ్వానించ లేదు. అయితే కవిగారు అభ్యాగతుడుగా సికింద్రాబాదు మా ఇంటికి వచ్చారు. ఆయనను నాకారులో ప్రపంచ తెలుగుమహాసభలకు వెంట పెట్టుకొని తీసుకొని వెళ్ళి విద్యామంత్రి శ్రీమండలి వేంకట కృష్ణారావుగారికి పరిచయం చేసి నాజన్మ ధన్య మైనట్లు సంతో షించాను. పలువురు "మాతెలుగు తల్లి" పాటను ఘాటుగా అధిక్షే పించారు. శ్రీసుందరాచారి గారు నాతో అంతరంగికంగా అన్నమాట. 'ఆపాట సినిమాకోసం వ్రాశాను. ఆ దర్శకుడు తిరస్కరించాడు. అంతకంటె మంచిపాట మీరు వ్రాయగలరని నా అభిప్రాయం.

మీరు వ్రాయాలి, ఒకటి రెండు సార్లు ఆయన మీరు పాట 'వ్రాశారా? అని ప్రశ్నించారు.

నా సమాధానం - నేను పలుసారులు తెలుగు తల్లిపై మంచి పాట వ్రాయాలని ప్రయత్నించాను గాని "మాతెలుగు తల్లికీ మంగళారతులు" అనే పాటను మించలేక పోయాను". ఆయన నామాటలకు ఎంతో సంతోషించి నా సహృదయతను పొగడినారు. 1998లో నేను తెలుగు తల్లిపై పాట వ్రాశాను గాని శ్రీసుందరాచారి గారు అప్పటికే దివంగతు లైనారు. నా 'తెలుగుతల్లి" పాటకు భవ్యకవితావేశం కల్పించిన కవి శ్రీ శంకరంబాడి సుందరాచారి గారిని కృతజ్ఞతతో ఇపుడు స్మరించుచున్నాను.

నాకు ఇష్టమైన కావ్యనిర్వచనం "వాక్యం రసాత్మకం కావ్యం" నేను వ్రాసిన శ్లోకము

**"వాక్యం రసాత్మకం కావ్యం**
**తథా శబ్దో రసస్రువుః**
**ఏకాక్షరం రసస్నిగ్ధం**
**కావ్యం భవతే న సం శయః"**

నారచనకు మా తెలుగు తల్లికీ పాట ఆధారం.

చిత్తూరులో ప్రభుత్వ సాంస్కృతిక శాఖ శ్రీసుందరాచారి గారికి సన్మానం చేశారు. ఆనాడు ఆ సభాపతిగా ఉండే అవకాశం అధికారిగా పి.యస్.ఆర్. అప్పారావు గారు నాకు అనుగ్రహించారు.

తిరుపతి తిరుమల దేవస్థానం వారు నేను ఆంగ్లంలో వ్రాసిన Maha Bharata ప్రచురించారు. ఆ సమయంలో నాకు ప్రత్యక్ష శిష్యుడుగా అంతేవాసిగ ఉన్నవాడు (1984లో) శ్రీ మాడుగుల నాగఫణిశర్మ- రాయలసీమ తాడిపత్రి వాస్తవ్యుడు. రాయల సీమపై అనుభవ పూర్వకంగా నేను రాసిన పద్యం.

**క్షామము దాపురించి పలుసారుల చచ్చెను, జంతు సంతతుల్**
**వేమరు చచ్చినారు ప్రజ వేనకువేలు చరిత్ర చాటునన్**
**క్షామము లెన్ని వచ్చిన రసజ్ఞత ఇంచుక చావలేదు జ్ఞా**
**నామృత దృష్టికిన్ కొరత నందని రాయలసీమలోపలన్**

1976లో నేను కాకినాడ పీఠికాపురాధీశ్వర కళాశాల అధినేతగా ఉద్యోగం విరమణ _ చేసి సికింద్రాబాదు స్వగృహం చేరుకున్నాను.

గో.రా.శాస్త్రిగారు ఆనాటి ఆంధ్రభూమి సంపాదకులు. శాస్త్రిగారి ప్రోత్సాహంతో ఆంధ్రభూమిలో పన్నీటి జల్లు శీర్షికతో వ్యాస పరంపర వ్రాశాను. అంతకుముందు గోరాశాస్త్రిగారు తెలుగు స్వతంత్ర్య సంపాదకుడుగా ఉన్నప్పుడు నేను వ్రాసిన ప్రహసనం తెలుగు గడ్డ _ఆపత్రికలో వేశారు. నా హెచ్చరిక "ఈ ప్రహసనంలోని హాస్య వాక్యాల వెనుక నాకన్నీటిబిందువులు మారు వేషములో దాగివున్నాయని నా విన్నపం."

ఆ ప్రహసనం యావదాంధ్రంలో మారుమూల పల్లెల్లో కూడా వందలు వేల సార్లు ప్రదర్శింపబడినది. తెలుగు స్వతంత్ర్యవార్షిక సాహిత్య సమీక్షలో 'తెలుగు గడ్డ' ఉత్తమ రచనగా శ్రీవాత్సవగారు ఎన్నిక చేశారు. శ్రీకూర్మావేణుగోపాలనాయుడుగారు ఆంధ్రనాటక అకాడెమీ అధ్యక్షులు - తెలుగుగడ్డ + ఆలీముఠా (శ్రీకొప్పరపు సుబ్బారావు గారి రచన) ఉత్తమ నాటకములు అని ప్రశంసించారు.

ఆంధ్రభూమిలో శ్రీగోరా శాస్త్రిగారు ప్రచురించిన నా ప్రహసనం అభినవ కురు క్షేత్రం పలుచోట్ల 'ప్రదర్శింపబడింది. శ్రీరావి రంగారావుగారు ఆనాటికను ప్రదర్శించారు. మహబూబ్ నగరంలో డోకూరి రాజేశ్వరరావుగారు ఆనాటకం ప్రదర్శించినారు. సన్మానం చేశారు. నేను జన్మించిన కృష్ణాగోదావరి సీమ ఎక్కడ? మహబూబ్ నగర్ ఎక్కడ? ఆ నాటక సంగీత దర్శకుడు నరహరి రాజుగారు - ఒక కావ్యం నాకు అంకితం చేశారు.

## శ్రీ పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారి జన్మదినోత్సవం

డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణ్యం గారి 55వ జన్మదినోత్సవం 1965లో నరసాపురంలో జరిగింది. ఆయన ఆనాడు నరసాపురం పురపాలక సంఘాధ్యక్షుడు. ఆ సందర్భంగా భువన విజయం జరిగింది. అందులో శ్రీ దివాకర్ల వెంకటావదాని - దాశరధి - కరుణశ్రీ, - డాక్టర్ వివియల్ నరసింహారావు - శ్రీవావిలాల సోమయాజులు- జంధ్యాల నారాయణ శాస్త్రి ప్రభృతులు పాల్గొన్నారు. నటిగా శ్రీమతి కోటేశ్వరి పాల్గొన్నారు.

ఆనాడునేను (నండూరి రామకృష్ణమాచార్య) వ్రాసిన నృత్య నాటికలు 1. జ్యోత్స్నాభిసారిక 2. గోదావరి 'ప్రదర్శింపబడ్డాయి. అభినేత్రి సావిత్రి గోదావరిగా వేసింది. సభాభవనం క్రిక్కిరిసి పోయింది.

ఆ భువన విజయం "నభూతో న భవిష్యతి" - అని ఆస్థానకవి _ శ్రీ దాశరథి - హైదరాబాద్‌లో రవీంద్ర భారతిలో ఒక ఉగాది నాడు జరిగిన కవి సమ్మేళనంలో ఉద్ఘాటించారు. డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం గారు శ్రీ కృష్ణ దేవరాయల పాత్ర వేసి అష్టదిగ్గజ కవులను సన్మానించారు. సుప్రసిద్ధ చలన చిత్ర నటీమణి "అంజలి" ముఖ్య అతిధి.

## శ్రీ యస్.పి.వై. రెడ్డిగారు

నా శిష్యుడు - "కవి" - శ్రీ కలుగోట్ల విజయాత్రేయ శ్రీయస్.పి.వై. రెడ్డిగారి ఆస్థానకవి ..... అతని వలన నాకు నంద్యాల నంది పైపుల దొర యస్. పి.వై. రెడ్డి గారితో పరిచయం ఏర్పడినది. శ్రీ రెడ్డి గారికి నా తెలుగు పద్య శిల్పం అంకితం చేశాను.

ఆయన ఆంధ్ర కవితా సదస్సుకు కూడా భూరివిరాళాలు ఇచ్చారు. ఆయన దానకర్ణుడు. ఆయనను నెఱదాతగా గుర్తించి చెన్నపురి ఆంధ్ర మహాసభవారు పురస్కారం అందించినారు.

ఒక విచిత్ర స్వప్న గాధ

భీమవరం కళాశాలలో నేను తెలుగు శాఖకు అధినేతను. ఆశాఖలో పని చేసినవారు ఉద్దండ పండిత ప్రకాండులు. శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు, శ్రీ పోలాప్రెగ్గడ సత్య నారాయణ మూర్తి, శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి, శ్రీ నందుల గోపాల కృష్ణమూర్తి ప్రభృతులు.

శ్రీ దిగుమర్తి సీతారామ స్వామి, శ్రీ చిలుకూరి వీరభద్రశాస్త్రి, శ్రీ దర్భా సర్వేశ్వర శాస్త్రి ప్రభృతులు నాకంటే జ్ఞానవృద్ధులు, వయోవృద్ధులు కూడ. అయితే వారు నాయెడ నిష్కళంక విధేయత చూపేవారు. కారణం బహుశ వారికి ఉద్యోగం ఇవ్వటంలో నేను ఏకైక నిమిత్త మాత్రుడను కావటమే. ఏతత్ శాఖాధిపత్యం నాకు ఒక విచిత్రమైన అనుభూతి. నాకంటే పెద్దలైన వారిపై పెత్తనం!

అప్పుడప్పుడు నాకు అనుపించేది - 'రాజ్యాంతే నరకం ధ్రువం" అన్నారు పెద్దలు. నేను ఏ నరకంలో పడిపోతానో!

ఒకనాడు ఒక విచిత్ర స్వప్నం వచ్చింది - చాలా రోజులు గడచిన పిమ్మట. నేను మరణించాను సుఖనిద్రలోనే. నా ఆత్మకోసం - విష్ణు భటులు వచ్చారు. యమ కింకరులూ వచ్చారు. నాకనుల ముందరనే యుద్ధం జరిగింది. విష్ణు భటులు ఓడిపోయి పారిపోయారు. గెలిచిన యమకింకరులు నా దగ్గరకు వచ్చి - నన్ను నరకలోకానికి రమ్మన్నారు. నేను వారితో వాదించాను. నా గొప్పతనం అభివర్ణించి వారికి చెప్పాను. యమకింకరులు అన్నారు. "మేము సేవకులం. మీరు గొప్ప వారే కావచ్చు. మీ కోసం నరకలోకాధిపతి సమశీత విమానం పంపించారు. దయచేసి అక్కడకు వచ్చి మీ వాదం వినిపించండి."

నేను - సమశీత విమానం ఎక్కి నరకంలో దిగాను. అక్కడ ఉన్నవి ఆకాశం అంటు హర్మ్యములే. నేను యమకింకరులను అడిగాను. "ఇదేమిటి? నరకలోకం ఇంత అందచందాలతో ఉన్నదేమిటి! ఆహా ఏమి ఈ విమానాశ్రయం! ఏవీ సల సల కాగే తైల కుండలు? ఎక్కడున్నారు మీ యమధర్మరాజు?"

నరక భటులు చెప్పిన సమాధానం

**విశ్వ విప్లవ విజ్ఞాన వీర సమితి**
**నరకవాసులు స్థాపించినారు చేరి;**
**విప్లవమ్ము వర్ధిల్లె దిగ్విజయమొంచు**
**ప్రాణముల్ వీడె యమధర్మరాజు గారు.**

**పాతాళమును అంటు లోతైన బురదలో**
**అగ్నిగోళాల్ వేసి ఆర్పినారు!**
**నదుల నాజ్ఞాపించి నడల మారిచి క్రొత్త**
**పొలములకు పురుడు పోసినారు!**
**స్వేదజలమ్మును సింహపీఠిని నిల్పి**
**పట్టాభిషేకమ్ము కట్టినారు!**

**విశ్వశాంతికి నవ్య విజ్ఞాన గరిమతో**
**సేవ లొల్కగ పెండ్లి చేసినారు!**

**విశ్వవిప్లవ విజ్ఞాన వీరసమితి**
**విజయముల్ వాడి పోనట్టి విరుల వోలె**
**విశ్వచరిత మకుట మందు వెలుగు చుండు**
**దశదిశల్ పులకించు వెత్తావు లొలికి.**

పిమ్మట - నేను 'అభినవ' చిత్రగుప్తుని ముందు నిలువ వలసి వచ్చింది. ఆయన చివరకు అన్నమాట "సరే – యమ కింకరులు నిన్ను నరకమునకు తీసుకొని రావటం తప్పు అని వాదించుచున్నావు. మా చిట్టాలు ఆవర్జాలు అన్ని కాగితాలు విప్ల వంలో దగ్ధమైపోయాయి. నీవు చేసిన ఘనకార్యాలు కొన్ని చెప్పు. నీవు ఎంత పుణ్యం ఆర్జించిందీ లెక్క కట్టగలను" నా సమాధానం మా సంభాషణ ఈ క్రింద పొందుపరచుచున్నాను.

"నేను గొప్పకవిని" - "గొప్పకవులు ఎందరో నరకానికి వచ్చారు.

"నేను పండితుడననీ" – "పరోపకార పరాయణుడను" అనీ పెద్ద ఉద్యోగాలు చేశాననీ చెప్పాను. ఆయన నవ్వాడు తలపంకించి. చిట్టచివరకు అన్నాను - "మహానుభావుడు. శ్రీ దిగుమర్తి సీతారామ స్వామికి - పండితోత్తముడు శ్రీ చిలుకూరి వీరభద్రశాస్త్రి గారికి సూర్య రాయాంధ్ర నిఘంటు విద్వాంసుడు శ్రీ దర్భా సర్వేశ్వర శాస్త్రిగారికి ఉద్యోగాలు ఇచ్చాను". ఆ అభినవ చిత్రగుప్తుడు - తల పంకించి, అన్నాడు నాతో "స్వామీ మహానుభావుడు శ్రీ దిగుమర్తి సీతారామ స్వామికి ఉద్యోగం ఇచ్చావు. ఉపకారాలు ఏ పాపాలను అయినా భస్మీ పటలం చేయటానికి. సరే ఇక వినయం అలవరచుకో. పో భూలోకానికి. వినయం వల్ల, నీకు స్వర్గం రావచ్చు"

నాకు మెలకువ వచ్చింది.

ముఖ్యమంత్రి శ్రీ రామారావుగారు అధికార భాషాకమిషన్ అధ్యక్షునిగా నియమించినప్పుడు శ్రీ సీతారామ స్వామికి నేను ఇచ్చిన ఉద్యోగ పుణ్యమే ఫలించింది అని మనసులో భావించాను.

## శ్రీ నందమూరి తారక రామారావుగారు

1987లో ముఖ్యమంత్రిగా నున్న ఎన్.టి.ఆర్.గారు నన్ను అధికార భాషా కమిషన్ అధ్యక్షునిగా నియమించారు. నేను శ్రీవారికి ముక్కు మొగం తెలియని అపరిచితుడను. అయితే రామారావుగారికి నేను వ్రాసిన "శీర్షమేఖల" మిక్కిలి ఇష్టమని తెలిసింది. శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు కమిషను సభ్యుడు నాతో అన్న మాట - "అన్న గారూ – మీ మీద రామారావుగారికి గల గౌరవ భక్తి ప్రపత్తులకు నేను ప్రత్యేక సాక్షిని. మీరు నిలిచి ఉంటే ఆయన కూర్చునే వారు కాదు. ఆయన నాపై చూపిన

'నిర్హేతుక జాయమాన కరుణ" .. నేను సదా కృతజ్ఞతతో

స్మరింపదగినది. శ్రీ రామారావుగారికి ఒక కావ్యం అంకితం ఇవ్వమని డా॥ నాగభైరవ నాకు సూచించారు ఆయన స్థాయికి తగిన ఉద్గ్రంథం - ఏదైనా మంచి... ఇంతలో రామారావుగారు స్వర్గస్థు లయ్యారు.

పిమ్మట నాకు ఒక సదవకాశం లభించింది. శ్రీ ద్రోణవల్లి రామమోహన రావుగారు అయిదారు లక్షలు వెచ్చించి ఒక బృహద్ గ్రంథం - "దేశ భాషలందు తెలుగు లెస్స" సంకలనం చేశారు. నా సాయం కూడ కోరారు. ఆ బృహద్ గ్రంథం - దేశ భాషలందు తెలుగు లెస్స" స్వర్గీయ రామారావు గారికి అంకితం చేశాము.

నేను వ్రాసిన ఆ అంకితం పద్యాలలో మచ్చునకు ఒకటి రెండు -

**ఆంధ్ర జాతి కెవడు ఆత్మ గౌరవ ముద్ర;**
**ఆనవాలు తెచ్చి నట్టి ఘనుడు?**
**మేటి నాయకుండు మేధావి - తేజస్వి**
**రామరావు తెలుగు సీమలోన.**

**యావదాంధ్రమునకు జీవత్ పతాకమై;**
**తెలుగు వెలుగు సర్వ దిశల నింపి,**

**నట వరుండు బ్రదికె నవ్యాంధ్ర భోజుండు;**
**రామరావు సార్వభౌముడగుచు**

## ఆంధ్ర పద్యకవితా సదస్సు

తెలుగులో పద్యం 'పగిలిన అద్దం అనీ - పద్యం చచ్చి పోయిందనీ" ప్రచారం కొనసాగింది. "నా వచన కవితల 'దుడ్డుకర్ర తో పద్యంనడుం విరుగ గొడతా"నని ఒక 'ప్రబుద్ధుడు ప్రతిజ్ఞ చేశాడు.' అయితే ఆ దుడ్డుకర్రే విరిగింది. పద్యం నడుం బెణక లేదు. పద్యకవిత పునర్జీవించాలనే ధ్యేయంతో **"ఆంధ్రపద్య కవితా సదస్సు"** అవతరించింది. తొలి అధ్యక్షుడు శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు, విశాఖ పట్టణం. ప్రస్తుతం "ప్రసన్న భారతి" పత్రికా సంపాదకులు. కార్యదర్శి – శ్రీ శిష్ట్లా వేంకటరావుగారు. ద్వితీయ సమావేశం విజయవాడలో జరిగింది.

నండూరి రామకృష్ణమాచార్య (నన్ను) అధ్యక్షుడుగా ఎన్నిక చేశారు. తరువాత సమావేశం జంటనగరాలలో జరిగింది. తరువాత తునిలో జరిగింది. తిరిగి నన్నే అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. తొలినాటి నుండి నేటి వరకు కార్యదర్శి శ్రీ, శిష్ట్లా వారే.

రంగంలో దిగిన తరువాత నేను గ్రహించిన అంశాలు.

1. తెలుగు పద్యం చిరంజీవి.

2.పల్లెటూళ్ళలో గూడ నేటికి పద్యాలు వ్రాసే వారు - చక్కగా ఛందోబద్ధ మైన శిల్పసౌష్టవంతో సమస్యలు పూరించే కవులు వేలకొలది ఉన్నారు.

3.ఇది వచన కవితా యుగం అని కొందరు నోరు గల వారు అంటు న్నారు.

సంఖ్యాబలంలో పద్యకవులే హెచ్చు. ఈ మధ్య వెలువడిన కావ్యాలలో సంఖ్యలో పద్య కవితలే హెచ్చు.

4.అవధానాలు చురుకుగా. సాగుచున్నవి. శ్రీమాడుగుల ద్విసహస్రావధానంలో శ్రోతలు ఒకనాడు 40 వేల మంది సంఖ్య దాటింది.

డాక్టర్ మేడసాని మోహన్ అవధానాలు హృదయులను ఆకర్షించు చున్నవి.

శ్రీ గరికపాటి నరసింహారావుగారు ఈ బహుళాంధ్రోక్తి మయ ప్రపంచమును ఉద్రూత లూగించుచున్నారు.

మచిలీ పట్నంలో శ్రీ రాళ్లబండి కవితా ప్రసాదుగారి శతావధానమునకు శ్రోతలు తండోపతండాలుగా వచ్చారు. పై అవధానులు తమ అవధానాలలో నండూరి రామకృష్ణమాచార్య వ్రాసిన చిరుచిరు ఆటవెలదులు చదివి వినిపించారు. శ్రీ అయ్యగారి వేంకట్రామయ్య తుని నండూరి వారి పద్యాలలో సహస్రాధిక సంఖ్యలో పుస్తకాపేక్ష లేకుండా కంఠస్థం చేసి సభలలో చదివి వినిపించుచున్నారు. దూర శ్రవణంలో పద్యతోరణ విభాగం - సమస్యాపూరణ విభాగాలు ఏర్పడ్డాయి. పద్యం ప్రగతి పథంతో పరుగులెత్తుచున్నవి.

**పద్య కవితా జిందాబాద్ !**

**కొండవీటిలో గాడిద**

**నీవు సుమంగ లివి కాదు కదా!**

అను .... కవుల సంఖ్యాబలం గొలిపే చాటువు అవతరించింది. శ్రీ కృష్ణ దేవరాయల కాలంలో భువన విజయం - అష్ట దిగ్గజ కవులు నేడు రాయలు లేరుగాని అష్టదిగ్గజములను ఏరి కూర్చవచ్చు.

రసరాజు సార్ధక నాముడు. మల్లవరపు జాన్ 'జాషువా'ను స్మరింప చేస్తారు. కవులలో ఎందరో మహానుభావులు అందరకును వందనములు

శ్రీ దుగ్గిరాల రామారావుగారి 'అమృతకలశం' గొప్ప కావ్యం. అలాగే శ్రీ, గాడేపల్లి సీతారామ శాస్త్రిగారి 'అశ్వత్థామ'.. భీమశంకరం గారి 'రసస్రువు' పేర్కొనదగినది.

వర్ధమాన కవులలో ఆచార్య ఫణీంద్ర ప్రభృతులు ఉన్నారు. సుప్రసిద్ధులు - శేషేంద్రశర్మ, ప్రసాదరాయ కులపతి, ఆచార్య తిరుమల, తిరుమల శ్రీనివాసాచార్యులు, వేము గంటి నరసింహా చార్యులు ప్రభృతులు పద్యకవులు ఉన్నారు. ఉదాహరణ ప్రాయంగా _ శ్రీ కృష్ణరాయ గ్రంథాలయం వారు నిర్వహించిన కవి

సమ్మేళనం 4-9-2001 పేర్కొనవచ్చు. అందులో పాల్గొన్న కవులు - 1.నండూరి రామకృష్ణమాచార్య 2.మల్లెమాల 3.డాక్టర్ బాపురెడ్డి ప్రభృతులు.

## కవి సమ్మేళనములు

ఆంధ్రదేశంలో అవశ్య సాంస్కృతిక కార్యక్రమం కవి సమ్మేళనం. నేను పాల్గొనిన ప్రధమ కవిసమ్మేళనం ఏలూరులో హిందూ యువజన సంఘంవారు ఏర్పాటు చేసింది 1939లో, వి.వి. గిరి గారి అధ్యక్షతలో. ఆనాటి నుండీ నేను నేటి వరకు సెప్టెంబరు 2001 వరకూ కవి సమ్మేళనాలలో పాల్గొనుచునే ఉన్నాను. విశ్వనాథ సత్యనారాయణగారు, కాటూరి వెంకటేశ్వరరావు, శ్రీశ్రీ, ఆరుద్ర శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి, దేవులపల్లి కృష్ణ శాస్త్రి, ఉత్పల సత్యనారాయణాచార్యులు, శేషేంద్రశర్మ వంటి పేరుకెక్కిన కవులతో పాటు 60 సంవత్సరాల పైబడి కవి సమ్మేళనాల అనుభవం. ఆకాశవాణిలో, రవింద్రభారతిలో, రాష్ట్రస్థాయి సదస్సు లలో పాల్గొన్నాను.

1957 అనుకుంటాను డా. పి.వి. నరసింహారావుగారి అధ్యక్షతన నిజామాబాదులో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్నాను. ఆంధ్ర దేశంలోని అన్ని జిల్లాలలో ప్రముఖ పట్టణాలు అన్నిటా జరిగిన కవి సదస్సులలో పాల్గొన్నాను. రవీంద్ర భారతిలో జరిగిన ఉగాది కవి సమ్మేళనాలలో నా శిష్యులు విజయాత్రేయ ఉన్నారు, మరోసారి శ్రీ శనగన నరసింహస్వామితో పాల్గొన్నాను. ఈ మధ్య 4-5-2001 కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో జరిగిన కవి సమ్మేళనము లో నన్నుప్రారంభకులుగా పెట్టారు. అందులో పాల్గొన్న కవులలో అధిక సంఖ్యలు యువకులే.

ఇతర రాష్ట్రాలలో జరిపిన తెలుగు కవి సమ్మేళనాలలో మైసూరు, బెంగుళూరు, చెన్నై, కలకత్తా మున్నగు సదస్సులలో పాల్గొన్నాను. శ్రీ బోయి భీమన్న, ఆచార్య సినారె, శ్రీ గోపి ప్రభృతులు ఆ కవుల గణం. ఆ పేరులన్నీ స్థలాభావంచేత వ్రాయడం లేదు.

# అనంతపురంలో నా జీవిత విశేషాలు

1943-45 వరకు చెన్నపురి విశ్వవిద్యాలయంలో నేను తిక్కనపై పరిశోధన చేశాను గాని థీసిస్ సమర్చించుటకు వీలు కుదర లేదు. అయితే అనంతపురంలో ఉన్నప్పుడు నాకు మైసూరు విశ్వ విద్యాలయం తెలుగు శాఖాధిపతి శ్రీ కె. సుబ్బరామప్పగారి పరిచయం ఏర్పడింది. కేవలం శ్రీ వారు నా మీద చూపిన దయవల్ల నా దగ్గర సంసిద్ధంగా ఉన్న దీసిస్ మైసూరు విశ్వవిద్యాలయంకు సమర్పించాను. నాకు పి.హెచ్.డి. పట్టం లభించింది

ఒకసారి అలనాటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారికి నాకు కలిపి ఒకే ముద్రిత పత్రంపై అనంతపురం పురపాలక సంఘంవారు స్వాగత పత్రం సమర్పించారు. సంజీవయ్యగారికి ఆగ్రహం వచ్చింది. ఒకే స్వాగత పత్రం అంటే ముఖ్య మంత్రిగారి ప్రాముఖ్యం గుర్తించక పోవటమే అవుతుంది. అయితే అందులో నా తప్పు లేదుగాని నా మీద ఆనాటి నుండి ఆయన సుముఖుడు కాలేదు.

అనంతపురంలో ఉన్నప్పుడు నా థీసీసు కోసం సంస్కృత మహాభారతంలోని ఏక లక్ష శ్లోకాలూ క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. వావిళ్ళవారు సంస్కృత లిపిలో వేసిన దాక్షిణాత్య ప్రతి సంస్కృత భారతం నాపరిశోధనకు ఎంతో ఉపకరించింది. నాకు అప్పుడు తోడ్పడిన మహానుభావుడు సంస్కృతోపన్యాసకుడు శ్రీ సూరంపూడి భాస్కరరావు ఆయన గొప్ప గాయకుడు. సరళ సుకుమార మనోహరములైన తెలుగు గేయాలు వ్రాశారు. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు మా గృహంలో ఆతిధ్యం స్వీకరిస్తూ - పరోక్షంలో భాస్కరరావుగారి ప్రతిభను గేయ రచనలకు ప్రస్తుతించారు. నాకు ఆశ్చర్యం వేసింది. గేయ రచనలో ఏలూరు వాస్తవ్యుడు శ్రీ కొనకళ్ళ వెంకట రత్నంగారిని శ్రీ కృష్ణ శాస్త్రిగారు ప్రశంసించారు. "మొక్క జొన్న తోటలో" పాట తనకు ఇష్టం అని శాస్త్రిగారు నాతో నొక్కి వక్కాణించారు. అనంతపురం నుండి నాకు చిత్తూరు బదిలీ అయింది. చిత్తూరులో నన్ను ప్రజలు మిక్కిలి ఆదరించారు. చిత్తూరు నుండి ప్రిన్సిపలుగా నాకు తాడేపల్లి గూడెం బదిలీ

అయింది. నా పదవిలో వి. వి. యల్. నరసింహారావుగారిని వేశారు. నేను+శిష్య పరివారంతో ఆయనకు రైలు స్టేషనులో స్వాగతం చెప్పాను. కొందరు కన్యకలు విద్యార్థులు, ఆయనకు స్వాగత హారతి ఇచ్చారు.

1966 నుండి 5 ఏండ్లు నేను తాడేపల్లి గూడెం ప్రభుత్వ కళాశాలకు ఆరంభ ప్రిన్సిపల్‌గా ఉన్నాను.

తాడేపల్లి గూడెంలో - పురపాలక సంఘాధ్యక్షుడు తదుపరి శాసన సభ్యుడు నాకు శిష్యపరమాణువై ఈలి ఆంజనేయులు నన్ను గురుభక్తితో చూశారు. అది ఒక దివ్య మధురాను భూతి.

తదుపరి విశాఖపట్టణం, తుదకు 1976లో కాకినాడ పీఠికాపురాధీశ్వర కళాశాల ప్రిన్సిపలుగా ఉద్యోగ విరమణ చేశాను.

కాకినాడలో ఉద్యోగ విరమణ సమయంలో నాకు చరిత్రాత్మకమైన వీడ్కోలు లభించింది.

విశాఖపట్నంలో శొంఠి శ్రీమన్నారాయణ రసాయన శాఖాధి నేత నాతో సహకరించారు. అనంతపురంలో నా జీవితంలో జరిగిన కథ

## "ఎవరు విజ్ఞుడు"

అనే శీర్షికతో శొంఠి వారు ఆంధ్రప్రభలో అద్భుతమైన కధానిక వ్రాశారు 1975లో. అది నా జీవితంలో జరిగిన కథ అని శొంఠి వారు ఉదాహరించారు.

ఉద్యోగవిరమణ చేసిన పిమ్మట నాకు రోజుకు ఇరవై నాలుగు గంటలు సరిపోయేవి కావు

అప్పుడు తీరికగా వ్రాసిన గ్రంథాలు,

1. కవితాప్రభాస - పద్య సంకలనం.

.... ఆంగ్ల మహాభారతం

.... ఆంగ్లంలో గాంధీయుగం

.... ఆంగ్లంలో అంతర్జాతీయ సూక్తులు.

తిరుపతి వెళ్లి తి.తి. దేవస్థానంలో గ్రంథ సంపాదకునిగా ఒకటిన్నర సంవత్సరాలు పనిచేసి ఆ పదవికి రాజీనామా చేసి సికింద్రాబాదు చేరుకున్నాను 1984లో. మరల తి.తి.దే. వారి కొలువులో బాలాజీ భవనంలో మూడేండ్లు పని చేశాను.

1987లో ముఖ్యమంత్రి రామారావుగారు నన్ను అధికార 'భాషాకమిషను అధ్యక్షునిగా నియమించారు. 1990లో ఆయన ఓటమి వరకు ఆ పదవిలో ఉన్నాను.

## ప్రగతి గీత

విశాఖపట్నంలో కాకినాడలో ఉన్నప్పుడు తీరిక సమయంలో సుమారు 700 పద్యాలు వ్రాశాను. ఆ పద్య సంకలనమే "ప్రగతిగీత". అందులో ఆట వెలదుల సంఖ్య అధికం.

జస్టిస్ చెన్నకేశవ రెడ్డిగారికి ప్రగతి గీతలోని పద్యాలు శతాధికం కంఠస్థం

**ప్రగతి గీతలోని పద్యాలు వల్లించి**
**పాద్యమిచ్చి పట్టుబట్ట కప్పి**
**నన్ను సత్కరించె చెన్నకేశవరెడ్డి**
**కాంస్యకలశభూష కాన్కచేసి.**

## వడ్లమన్నాడులో కనకాభిషేకం.

5-8-2001 తేదీనాడు సుప్రసిద్ధకవి. శ్రీ మాదాసు పిచ్చయ్యగారు వారి స్వగ్రామం కృష్ణాజిల్లా వడ్లమన్నాడులో నాకు కనకాభిషేకం చేశారు. సభకు కవిరాజు రాజకవి శ్రీమంతెన వేంకట సూర్యనారాయణ రాజుగారు అధ్యక్షత వహించారు. సుమారు ఇరువది మంది ఉద్ధండ పండితులు కవులు సభలో ప్రసంగించారు. కనకాభిషేక సన్మానంలో శ్రీ మాదాసు పిచ్చయ్యగారి సతీమణి పాల్గొన్నారు.

## మచిలీపట్న సత్కారం

మరునాడు నండూరి రామకృష్ణమాచార్యులకు మచిలీ పట్నంలో సాహితీ మిత్ర మండలి సన్మానం చేశారు. వివిధ సంస్థలు పాల్గొన్నారు. శ్రీ నాంచారయ్యగారు సన్మానం చేశారు. డాక్టరు ధన్వంతరి ఆచార్యగారు అధ్యక్షత వహించి సత్కారం చేశారు. సభా సూత్రధారి శ్రీ రావి రంగారావు కవిగారు, "శతావధాని శ్రీరాళ్లబండి కవితా ప్రసాదు ప్రభృతులు అభినందించారు.

శ్రీ మాదాసు పిచ్చయ్యకవిగారికి డాక్టర్ సి. జాకబ్ కవి గారికి (జ్యూజడ్జి+ శ్రీనండూరి వారి పద్యాలు ఆంగ్లంలోకి అనువదించిన కవి) సన్మానములు వైభవోపేతంగా జరిగినవి.

## చిరస్మరణీయ సన్నివేశం

శ్రీ పి. ఆర్. రామచంద్రరావుగారు సుప్రీంకోర్టు అడ్వకేటు లలిత కళోపాసకుడు. లబ్ధ ప్రతిష్టుడు 93నంవత్సరాల జ్ఞానవయోవృద్ధుడు. 26-2-2002 సాయంత్రం. డా|| నండూరి రామకృష్ణమాచార్యులు వారి ఇంటికి వచ్చి - వారు వ్రాసిన గ్రంథాలు - కేసట్టు 1116/- రూపాయల నగదుతో సత్కరించారు.

వారి కేసట్టు ఆంధ్ర కళా... వికాసంలో నండూరి వారు వ్రాసిన కవితలు చేర్చారు. నండూరి వారి కవిత్వమునకు లండను పారిసు నగరవాసులు మెచ్చి అభినందించినట్లు శ్రీ రావుగారు చెప్పారు. నండూరి రామకృష్ణమాచార్యుల వారు అన్నమాట .... జీవితమునకు. శ్రీ రామాచంద్రరావుగారు. చేసిన "సత్కారం" మకుటాయామానంగా భావించుచున్నాను."

శ్రీ రామచంద్ర రావు గారిని వెంట బెట్టుకొని నండూరివారి ఇంటికి తీసుకొని వచ్చినది జి. చంద్రశేఖర రెడ్డి కవిగారు.

విశ్వ విఖ్యాతిని ఆర్జించిన జ్ఞాన యోగి, శ్రీ రామచంద్ర రావు గారు వుంభావ నరస్వతి 'ప్రదర్శకుడు. నండూరి వారికి చేసిన సన్మానం ఆంధ్ర సారస్వత చరిత్రలో చిరస్మరణీయ సన్నివేశం

"పూర్వాంభోనిది" కవితను పాడినది సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు మల్లాదివారు. పాడారు క్యాసెట్‌లో.

**పూర్వాంభోనిధి కాళహస్తి నగరీ శ్రీ మన్మ హేంద్రాచలః**
**శ్రీ శైల ప్రముఖత్రిలింగ శిఖరీ ప్రాతర్మవోషస్వినీ!**
**కృష్ణా కంకణకింకిణీ ఝుణఝుణద్ గోదావరీ కాంచికా!**
**ద్రాక్షా పేశల వాఙ్మయీ విజయతాం త్రైలింగపృధ్వీస్థలీ!**

ఒక ముఖ్య సూచన -"దేశ భాషలందు తెలుగు లెస్స" – అని మురిసిపోవచ్చు. ఇంతవరకు "విశ్వసాహితీ బహుమతి" సంవత్సరాలుపై బడినా ఏ తెలుగుకావ్యానికీ లభించ లేదు. ఇది కువిమర్శ కాదు. గొప్ప కావ్యానికి నోబెల్ బహుమతి లభించక పోవచ్చు. కాని నోబెల్ బహుమతి లభించిన కావ్యం గొప్పది అని చెప్పక తప్పదు. ప్రతిసంవత్సరం ఏదో కావ్యానికి నోబెల్ బహుమతి లభించు చున్నది గదా. వివిధ భాషల కావ్యాలకూ లభించుచున్నది. ఇప్పటికి పెక్కుభాషలలో కావ్యాలకు నోబెల్ విశ్వ సాహిత్య పురస్కారం లభించింది. ఆయా కావ్యాల గూర్చి ఆయా కవుల గూర్చి ఇంతవరకూ ఆంగ్ల భాషలో కాని మరి యేభాషలోగాని సమగ్ర సమీక్షా గ్రంథం వెలువడలేదు. ఆంగ్లంలో పరిమిత సమీక్షలున్న గ్రంథం - 18 సంపుటాలు వెలువడింది. అదీ అసమగ్రమే.

తెలుగులో సంక్షిప్త సమీక్ష నోబెల్ బహుమతి సాహిత్యం పై వెలువడలలేదు. "విశ్వసాహిత్యంలో గల నోబెల్ బహుమతి గ్రంథాలపై" ఒక సమగ్రమైన లేదా సంక్షిప్తమైన సమీక్షలు కొన్ని సంపుటాలు వెలువడాలని నా సూచన. బహుశః నేను జీవించి యుండగా ప్రణాళిక పూర్తికాదేమో! ప్రారంభమైనా సరే చూచి సంతోషించాలని ఉంది.

# స్వగతం

స్వయం సంపూర్ణ సంధానం,
చమత్కార రసాత్మకం,
ముక్తకం పద్య మేకైకం,
సత్ ప్రబంధ శతాయతే.

గాడిద మోయ లేని పెను కబ్బపు కట్ట రచింప నాకు చే
యాడదు, భూమిపై యుగ యుగాంతరముల్, ప్రజ నాల్కలన్ _సదా,
ఆడెడి మంచి పద్య మొక టైనను చాలు - నిరక్షరాస్యులున్,
పొడుచు ఆడగా గగురు పాటును, చెందుత విన్న వారలున్.

అవదరింపు డయ్య - ఇవి “మినీ కవితలే”
చిన్న ఆట వెలది విన్నపములు;
సహృదయు డెవ డైన చదువ - కంఠస్థమౌ;
నెమరు వేయ దగిన అమృత గుళులు.

జగము, చూచినాడ - చాల కాలము మేర,
చదివినాడ - విశ్వ చరిత గూడ,
సానుభూతి - సర్వ సన్నివేశములపై,
గుండెలోన ఊరు చుండు నాకు.

ఆంధ్ర దేశ మందు - ఆశీస్సు లందించి,
ప్రతిభ యున్న వాని వదల దలతు,
కోడి పుంజు వోలె - గొంతెత్తి గుట్టపై,
క్రొత్త ప్రొద్దు పొడుపు కూర్చగలను.

మతము గీతము లేని - మనుజ మాత్రుడ నేను
అంతరంగ మందు ఆస్తికుడను ;
భరత దేశ మందు - పరమార్ధ మిపు డేది ?
బ్రతుకు నందు చూపు - మత సహనము.

చిన్ని మొక్క యెదుగ - చిగురు టాకులు వేసి,
కొమ్మ రెమ్మ తోడ గోచరింప,
మొగ్గ తొడిగి కొన్ని పూలు పిందెలు పుట్టు ;
అరయ కనుల పండు వౌను - నాకు.

నా మది ఒక దర్పణమే,
ప్రామాణిక వాస్తవికత - ప్రతిబింబించున్ ;
వ్యామోహ విరహితము - వి
శ్రామ తటస్థము - తదేక సాక్షిగ నిలుచున్.

శారదా మణితము - సాహిత్య సంగీతి
తెలియకుండగా ప్రతిధ్వనించు;
వ్యాఖ్య సలుప లేము - వాచ్యార్థముల కెందు;
చదల పక్షి వోలె శబ్ధ మెగురు.

నేనే విశ్వాసములును
లేని స్వతంత్ర్య సహృదయుడ - లీలా విలస
న్మానవ మాత్రుడ - బ్రదుకున
నా నాలోచనలు మెరయు నాలో సతమున్.

# SOLILOQUY OF THE AUTHOR

—Nanduri Rama Krishnamacharya

I am the author of several poetic compositions in TELUGU. One such composition is ”Mutyala Godugu" - "An Umbrella of Pearls" - a collection of autonomous verses. Every Pearl retains its individual identity - and may contribute to the composite grandeur and glory of the umbrella - a symbolic emblem of emotional and intellectual and imperial excellence.

Other poetic compositions - "TARA TORANAM” - a collection of twenty seven poems, “PRAGATI GEETA" - The song of progress, "KAVITA PRABHAASA” - (The PILLGRIM's PROGRESS of POETRY)- and "ALOCHANAM" - The floating "THOUGHTS" - all these are the out bursts of a visionary.

**I am a dreamer.**

I try to be an angel, beating my luminous wings in the void in the atmosphere, broadcasting my thoughts. Let me add - "Every great achievement has been a “born thought" and all men of action have been relations of unknown thinkers".

Dreaming - is the birth-right of poets who are the unacknowledged fore-runners of eminent leaders in all provinces of human endeavours.

Poets can dream, with their eyes wide open. Poets can recapitulate the silent slogans they have heard in their dreams and hallucinations. "Let Nations die, so that humanity may live” - "Graves of great men are the gathering places of nations" - "Man shall surpass patriotism and become a citizen of the world" - "We want the PARLIAMENT of Man and the federation of all Nations", "Nationalism has out- lived its utility" - "THINKERS of the world, unite, to make the globe, habitable for mankind," - "Parochial Patriotism produced two most terrible world-wars, in this century."

It seems that "Man has evolved out of the monkey". "Evolution should not come to a halt with man." "Man is something that shall be surpassed.” Evolution expects the "super

man.” But, recently the brutality between the Serbs and ethnic Albanians reminded us of the crime committed in the German Gas chambers. World history provides many more such ghastly examples of the brutality of Man. Is brutality an inherent element of Human Nature? Are wars inevitable? The Budha - Jesus Christ and Mahatma GANDHI, PREACHED universal love and human fraternity. Asoka, was against war-fare. "Human Nature" - can be changed and less effort is needed to change the so called "Human Nature” - than to discover the Atom, or the Hydrogen Bomb or the "Death Ray" History provides us with a great galaxy of Saints and seers, prophets and philosophers who have preached the gospels of peace and universal love. Certainly, "Man" is quite different from the "brute" and the ferocious animal.

Apart from the historical Asoka, Einstien in our time has said, "the soldier falls below my contempt. He received the great brains by mistake".

"Good iron is not used for coffin nails, and good men are not to be used as soldiers"-postulates a Chinese proverb.

Evolution takes man towards the advent of the "SUPER MAN". The modern seer, Aurovindo asks every man to contribute his mite towards the evolution of the "Super man” consciously. History and science are on the side of the theory of evolution of "Super Man".

The need of the hour is the advent of "The parliament of Man" and the establishment of "One World government". Progressive human spirit requires universal peace. What is PATRIOTISM? Patriotism is perhaps geographic idolatry - in disguise.

Poems in the books are crystals, epitomising the comprehensive compendium of thunder and lightning. Cyclonic hurricane, fire exploding volcano in one singular capsule. ‘This is the age of "mini poetry" -pure and simple.

Many countries in the world - today especially India suffer from literary self - polinisation. The future of poetry is cosmopolitan cross fertilisation.

Every verse in the books are Muktaka = Mutyam, crystalised wisdom, with brevity as its soul, symbolising the spirit of an epigram. In every verse, the macro - crosom is transformed into a micro crosom.

‘Once upon a time, there was the ‘west’ and there was the ‘East’ and the twain never met. Now the whole earth is a revolving Globe and the East and the West are illusory concepts. Modern science has obliterated distances and directions. There is no east or west when two great brains meet and all men are neighbours. Cosmopolitan composite and comprehensive poetry is a "Future Tense" and symbolises contemporary posterity.

Nationalism has already become an anachronism. The definition given by ancient India avers that "A gentleman is citizen of the world.”

‘The most remarkable event in modern history of the world is the meeting of the West and the East in the proverbially hospitable land of India. Ideas have embraced one another across round tables. Great ideas are ever invincible.

I preach Humanism. I hope the readers of these poems will become potential "citizens of the world."

I hope that the poems will provide the reader with intellectual symphony. Poetry shall confer on the youthful reader - **"integral maturity, sans senility."**

# బహిరంగ స్వగతం

కవిత - అనిన - దివ్య కైవల్యమే నాకు,
వేరు స్వర్గ మేది కోరుకొనను;
నేను నిలుచు చోట - నిలుచు కైవల్యమ్ము;
కవిత - నాదు హృదిని కలదు గాన. 1

చాల నాళ్ళ బ్రతుకు - సమకూర్చెగా నాకు,
పెక్కు అనుభవాలు - విలువ గలవి!
జగతి కిచ్చినాడ - చక్రవడ్డీ చేర్చి,
పద్య రూప మందు భద్రపరచి, 2

అనుభవాలు పెక్కు - ఆలోచనము లోన,
పద్య రూపములుగ - ప్రతిఫలించె;
మనుజ మానసాబ్ధి - మధియించి మధియించి,
రవి హృది పులకింప - వ్రాసినాను. 3

మనవి చేసినాడ - అనుభవాలోచనల్,
నరుల బ్రతుకు లోతు లరసి తరచి,
ముసలితనము రాక ముందె - పెద్దరికమ్ము
పద్యములను చదివి పడయ వచ్చు. 4

కావు - నిర్ణయములు - నావి ఆలోచనల్
కదిపి కుదుప గలవు మెదడు నెల్ల!
చేయవచ్చు కూర్పు చేర్పు మార్పులు కొన్ని
స్వానుభవము బట్టి సహృదయుండు. 5

అర్చన చేయలేను మనసారగ ఈశ్వరు విశ్వశిల్పి – ఏ
చర్చలు వేద శాస్త్రముల సారము గూర్చియు చేయలేను, నే
కూర్చితి తెల్గు నానుడుల క్రొత్త తలంపులు కొన్ని తీర్చి – నా
నేర్చిన భంగి నింగికిని నేలకు మధ్య జగద్ధితమ్ముగన్.

హృదయ మందు కలదు - బృందావనము నాకు;
వెల్లి విరియు పొన్న విరుల తావి;
అమర మానసమున - నెమలి పింఛము విచ్చి;
వినెద నేను తరచు - వేణు రవము.

తెలియ చెప్ప కాదు - తెలియ నట్టివి మీకు,
కొన్ని రచన లెట్లు కూర్చినాను;
జ్ఞాపకమ్ము చేయు నా పద్యముల్ మీకు -
మరువ రాని కొన్ని మంచి స్మృతులు.

గడియ వేయ నేల - ఎడద తలుపులు మూసి,
మతము జాతి భాష మమత లేదు;
వెలుగు వచ్చుగాక - వేయి దిక్కుల నుండి,
ఏను - జ్ఞాన యజ్ఞ ఋత్విజుండ.

చిరు రచనల కిది తరుణము
తిరిగెడు కాలము రయమున; తీరిక యేదీ??
నరు లెవరు పలు పుటలు - చదు
వరు కావున ముక్తక మొక పద్యము చాలున్.

పెట్టినాడ - వేడి వేడి చక్కిలిగింత,
చదువరుల మెదడులు - కదిపి కుదిపి,
అవని లోన - మనిషి కాలోచనము పెంచ,
వ్రాసినాను తెలుగు పద్య కవిత.

యతులు ప్రాస గతులు - యమకమ్ము గమకమ్ము
అల్లిక జగి బిగులు - వెల్లి విరియ,
జంత్ర బృంద రవము - సమకూర్చ ఛందస్సు,
దెసల మ్రోగు గాత - తెలుగు కవిత.

ధనము కాదు - కాదు ధైర్య శౌర్య స్మృతి
పదవి కాదు - మేటి మెదడు కాదు;
అంతరంగిక మగు అతిథి సత్కారమ్ము
గుండె పండి నట్టి గొప్ప గుర్తు.

అమిత భక్తి - కట్టి - అపరాధ సుంకమ్ము
శిష్యులైరి నాకు జీవితమున,
దిగ్గజాల వంటి – ధీశాలు లెందరో,
పృథివి కవలి వెలుగు వెదకుకొనుచు.

సాహితీ మహత్తు - సంఖ్యా గణన కాదు
వాసి గాని - పెద్ద రాశి గాదు;
పద్య మొకటి చాలు - ప్రజల నాల్కెల పైన
నిలిచి నాట్య మాడ గలిగి నపుడు.

అమరె – బ్రదుకు లోన - అనుకూలవతి - భార్య
తెలివి యున్న వారు కలరు సుతులు,
కొంత ధనము కూడ - కూడ బెట్టితి నేను,
ఖ్యాతి వచ్చె నాకు కవిగ - చాలు.

ప్రీతి హెచ్చు - నేటి పెసరట్లపై నాకు;
తెలుగు కవిత పైన - తేనె పైన;
నెమరు వేయ దగిన స్నేహ వర్తన పైన,
మౌన గుప్త పాత్ర దాన మందు.

మెచ్చు కొనెద - మేటి మేధావి వాల్తేరు
వేగు చుక్క – ఫ్రెంచి విప్లవమున;
ఏను మెత్తు నైనుస్టీను – ఇంగరు సోలును;
నాకు ప్రీతి నాటి గ్రీకు చరిత.

దేహము దారి తప్పె - నను దివ్యునిగా తలపోసి మేటి వ్యా
మోహము కూర్మి గౌరవము ముచ్చటలన్ కురిపించినట్టి నా
స్నేహితు లెల్ల స్వర్గ తు లు - జీవిత మిచ్చెను పూర్ణ తృప్తి, నే
ఐహికముల్ వ్యజించి కవితామృత దానమునన్ తరించెదన్.

తేనె టీగ - ఒకటి తిరిగె -పుట్టలు, చెట్లు
మరచిన తన పేరు - నరయ గోరి,
వ్రాలి - అడిగె పేద రాశి పెద్దమ్మనే,
అట్టి తేనె టీగ నైతి - నిపుడు.

నేను పదవి కోర - నేను సంపద కోర,
ఏను స్వర్గ సుఖము లేవి కోర,
బాప దలతు నేను - పరుల దుఃఖము కొంత,
చాలు - ధన్య మగును - జన్మ నాకు.

అరసినాడ – అనుభవామ్రేడితము లైన
సత్యములను కొన్ని - జగతి లోన;
సూత్ర ఫణితి - ధర్మ సూక్ష్మాలు వివరించి,
వ్రాసినాడ తెలుగు పద్య కవిత.

పృథివి లోన - నాకు ప్రేయసీ మణి - నిద్ర;
నిద్రకంటె ఎవరు నిపుణు రాలు?
కలదు మృత్యు దేవి - కైవల్య కల్యాణి
శాశ్వత సుఖ మిచ్చి సాక గలదు.

కలిగె - ఆత్మలోన - కవితామృత పిపాస
చిన్నతనము నందె - జీవితమున;
వసుధ – కానుపించు రసవిరాడ్రూపమై!
కనులు తెరువ మరియు కనులు మూయ.

ఎదుటి వాని కష్ట మిసుమంతయును గూడ
ఎరుగ నట్టి వాడు గురుడె కాడు;
విమల యోగి గాని - విజ్ఞాన ఖని గాని,
అంజలింప లేను అతని కెపుడు.

కాంచినాడ సృష్టి - కవితా సులోచన
ద్వయము తాల్చి – బ్రదుకు తరచినాడ,
హాలహలము తోడ - అమృతమ్ము జన్మించు ;
బ్రదుకు - వెలుగు నీడ పడుగు పేక.

ఆస్తికత్వ మనుభవామ్రేడితము నాకు!
నాకు లేవు ఎట్టి నమ్మకములు;
మతము కులము జాతి మమకారములు లేవు.
మానవత్వమునకె నా నమస్సు.

కవిత లల్లినాడ - గగనోన్నతములుగా,
కలదు – కడలి లోతు కవిత కాంత,
కడలి గగనములను – కలుపు వెన్నెల వోలె,
తరచు నా హృదయము తాండవించు.

నే ద్విజుడను కాను, నే సహస్రజుడనే!
అనుభవాల లోన - మనసు నందు;
నెమరు వేయదగును - నిజమైన జ్ఞానమ్ము ;
మెతక రాదు కతికి మ్రింగరాదు.

సత్కృతులను కోర సమకాలికుల నుండి,
యశము ధనము పైన - ఆశ లేదు.
వ్రాసినాను కొన్ని పద్యాలు - తెలుగులో,
చాలు - మెచ్చ భావి సహృదయుండు.

శాంతి సమర మందు - స్వాతంత్ర్య యజ్ఞాన
బుధులు మిత్ర వరులు బుగ్గి అయిరి;
పద్య - కవిత వ్రాయ - బ్రతికి యుంటిని నేను;
నివురు గప్పి నట్టి నిప్పు వోలె.

నిజము చెప్ప - నేను - నిత్య శంకితుడనే,
నాకు లేవు గట్టి నమ్మకములు
శంక- ప్రాతిపదిక - జ్ఞాన శోధన కెల్ల,
హేతువాది గౌరవింతు నేను.

లొసగులు లేకుండగ ఈ
వసుమతిపై దేహి యెట్లు వర్తిల గలుగున్?
లోసగులవి యెన్ని యున్నను
అసూయ లేనట్టి మనుజ నభినందింతున్.

వెన్న వన్నె చిన్న వెండి అంచుల పంచె
లలిత పీత వర్ణ లాచ్చి చాలు;
వ్రేలు గాక - పసుపు శాలువా భుజముపై,
ముదురు రంగు అనిన బెదురు నాకు.

కానుపించు వెతల - కలనైన దేవుండు,
ప్రశ్న లడుగ గలను బరి తెగించి,
త్యాగరాజు వంటి యోగీషు డగుపింప,
ప్రశ్న వేయకుండ - ప్రణతి సేతు.

సంస్కరణకు మధ్య - సంప్రదాయము మధ్య
సంఘ చరిత-పోరు జరుగు చుండు
సహన గుణము తప్ప - సామరస్యము తప్ప,
శాంతి నివ్వ లేవు జనుల కేవి.

ఈ ప్రపంచ మందు - ఏ భాషకును లేదు,
భావయిత్రి వ్యక్త పరచు శక్తి;
ఛంద మవసరమ్ము - ఛందస్సు సరిపోదు;
కూర్చవలె నటన్న - గొప్ప కవిత.

దాత నెంత పొగడ - తనివి తీరదు నాకు,
ధర్మవేత్త - దాత - త్యాగయోగి,
సహృదయుండు - దాత స్వారస్య విజ్ఞాత,
రసిక చక్రవర్తి - ప్రగతి శిల్పి.

కలలు కనెద నేను - కలవరించెద రేయి,
ఆ అసత్య లోక మందు – ఉందు;
కలలు నాకు తరచు కలిగించు చిరునవ్వు,
మిగులు మేటి కలయె - మేలు కొనిన

పుడమి లోన నాకు - పుణ్య పాపాలపై;
లేదు నమ్మకమ్ము లేదు లేదు,
మంచితనము మీద మానవత్వము మీద,
కలదు - నమ్మకమ్ము - కలదు నాకు.

మంచివాడ ననెడి మాట - చాలును నాకు,
మరణ మందు పిదప ధరణి మీద,
మేటి కవిగ గాని – మేధావిగా గాని,
పేరు చెంద నేను కోరుకొనను.

కోరుకొనను ధనము - కోరనే స్వర్గమ్ము
లేదు నాకు పదవి మీద కాంక్ష
యోగ్యులైన వారి కుపకార మొనరించి
గుప్త దాన మిచ్చు కోర్కె కలదు.

# డా || వింజమూరి లక్ష్మి

## నండూరి రామకృష్ణమాచార్య - ముఖాముఖి

## డాక్టరేటు పట్టానికి పరిశోధనకై నేను ఎన్నుకొన్న రచయిత జీవితకవి కాబట్టి "ముఖా ముఖి" జరపటం సముచితమని భావించి వారిని నేను వేసిన ప్రశ్నలు, వారిచ్చిన సమాధానాలు అక్షరబద్ధం చేసాను. 5-8-1994

*ప్ర: ఆచార్యులపాదులకు అభివాదము. మిక్కిలి విలువ గల విలువైన మీకాలాన్ని నా ప్రశ్నల పరంపరలతో హరిస్తున్నందులకు క్షమాపణ చెప్పుకుంటున్నాను. మీ ఆరోగ్యము బాగా వున్నది కదా!*

**సమా:** సంతోషం - స్వాగతం. నాఆరోగ్యం బాగానే వుంది. చక్కెరవ్యాధి రాలేదు. రక్తపోటు లేదు. ముసలితనం వచ్చిందంతే. నీవు శంకాసంకోచాలు లేకుండా ఎన్ని ప్రశ్నలయినా అడుగు. ముందుగా ఒకేమాట "ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా!" అన్నారు. ఆనాడు చేమకూర వేంకట కవి. సమకాలీనులు మెచ్చుకోలేదని కాళిదాసు మనస్తాపము చెంది "పురాణమిత్యేవ న సాధు సర్వం నచాపి కావ్యం నవమిత్య వద్యం" అన్నాడు భవభూతి. "నిరవధికం-విపులాచ పృథ్వీ" భవిష్యత్తులో నా కవిత్వము మెచ్చుకోవచ్చు. ఏ సహృదయుడో, అతని కోసమే నా రచన అని ఆశించాడు. ప్రాచీన గ్రీసుదేశములో సప్తనగరాలలో హెూమారకవి బిచ్చమెత్తుకొని బతికాడట. చచ్చిన పిమ్మట, అతని శవము కోసం ఆవేదు నగర రాజ్యాలు యుద్ధము చేసాయట. నేను బతికివుండగా నన్ను గురించి నారచనలపై సమీక్ష నీవు కొనసాగించటం ఎంతో సంతోషం.

*ప్ర: మీ జీవితంపై, సాహిత్య జీవితముపై ప్రచురించిన ప్రధాన ప్రభావాలను గూర్చి తెలుపగలరా?*

**సమా:** నేను పుట్టింది 1921 గాంధీయుగంలో, పెరిగింది గాంధీయుగంలో. మాఅమ్మ కళాప్రపూర్ణ ఆత్మకూరి గోవిందాచార్యులగారి చెల్లెలు. ఆయన ఐదుసార్లు చెఱశాలకు వెళ్ళినాడు. సత్యాగ్రహ పత్రిక సంపాదకుడు. శాసనసభ్యునిగా 1940 నుండి 1952 వరకు ఎన్నికైవున్నాడు. మా అమ్మ ముతక ఖద్దరు చీర ధరించేది. మానాన్నగారు అందగాడు. ఆంగ్ల భాషాభిమాని. ఇంగ్లాండునుండి దిగుమతైన అల్పా కోటు తొడిగి సన్నని నూలు పంచె కట్టేవారు. "రాజ్యం వీరభోజ్యం" అనేవారు. ఆయనకు గాంధీగారి అహింసావాదం గిట్టేదికాదు. పరస్పర విరుద్ధమైన ఈ

రాజకీయవేదాంతాల మధ్య పెరిగాను. ఐతే మా అమ్మ స్వర్గస్తురాలు కావటంచేత నేను మేనమామ పెంపకంలో పెరిగాను. విద్యార్థి దశ నుండి నేను పరిశుద్ధ ఖద్దరుదారుని. 1932లో చెఱశాలకు వెళ్ళాను. గాంధీగారి సేవాగ్రామ ఆశ్రమంలో కొంతకాలం వున్నాను.

ఇక సాహిత్య జీవితములో 1942లో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారితో ఏర్పడిన ప్రగాఢ పరిచయం అర్ధశతాబ్దిపైబడి కొనసాగింది. ఆయన ఆదర్శవాది. "దిగిరాను దిగిరాను దివినుండి భువికి" అనే కవుల కోవకు చెందినవాడు. 1945లో భీమవరం కళాశాలలో నేను శ్రీ పాలగుమ్మి పద్మరాజు సహోద్యోగులం. ఆయన, నేను కలిసి కొంతకాలం "మహాంధ్ర" అనే మాసపత్రిక నడిపాం. శ్రీ పాపరాజు వాస్తవికుడు. "లోక వృత్తాంత దర్శకము-రచన వాస్తవ జగత్తును ప్రతిబింబించాలి" అని ఆయన సిద్ధాంతము. పరస్పర విరుద్ధాలైన ఈ ఉభయ వేదాంతాల మధ్య నా సాహితీ జీవితము ఉయ్యాల ఊపుగా సాగింది. ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీవారు ప్రచురించిన "సమకాలీన సాహిత్యము" అనే ఆంగ్ల గ్రంథం నన్ను నియో-క్లాసిస్ట్‌గా నూతన సాహితీ సనాతనుడు అని అభివర్ణించింది.

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు నేను వ్రాసిన తారాతోరణానికి పీఠిక వ్రాస్తూ "నండూరి రామకృష్ణమాచార్య కవిత కొత్తపాతల మేలు కలయిక" అని ఉద్ఘాటించారు.

***ప్ర:*** *ఆధునిక సాహిత్యములో శ్రీవిశ్వనాథసత్యనారాయణ, శ్రీపింగళి లక్ష్మీకాంతంగారి మధ్య వశిష్ఠ విశ్వామిత్రులకు వలె పరస్పర స్పర్థ వుండే దంటారు. మీరుభయులకు శిష్యులు కదా! మీ మీద ఎవరి ప్రభావము పడింది?*

**సమా:** అలనాడు శ్రీరాముడు వశిష్ఠ విశ్వామిత్రులకు శిష్యుడయ్యాడు. ఈనాడు నేను మొదట బెజవాడ కళాశాలలో విశ్వనాథగారికి ప్రత్యక్ష శిష్యుడిని తదుపరి వాల్తేరులో ఆంధ్రవిశ్వకళాపరిషత్‌లో పింగళివారికి ప్రత్యక్ష శిష్యుడిని. ఉభయుల ప్రభావము నామీద బాగా పడింది. ఉభయులూ సాహితీ మహర్షులే. వీరిద్దరి ప్రభావమే గాక నామీద వ్యాకరణ విద్యాగురువు వర్యులైన సీతారామస్వామి, అబ్బూరి రామకృష్ణారావుగారు, మల్లంపల్లి సోమేశ్వరశర్మ గారి ప్రభావం పడింది. మేధావులలో మేరుశిఖర అనదగిన అబ్బూ రివారు నాదృష్టి తెలుగు భాష పొలిమేరలు దాటించి అంతర్జాతీయ సారస్వతాలపై ప్రచురింపచేసారు. శ్రీదువ్వూరి వెంకట రమణశాస్త్రిగారి వద్ద ఇంటికి వెళ్ళి అలంకార శాస్త్రమభ్యసించాను.

శ్రీపింగళివారు జంగమసాహిత్యచరిత్ర ప్రాచ్య ప్రతీచి. సాహిత్య మీమాంసకు ఆయన సజీవ సమన్వయ ప్రతీక.

**ప్ర:** *శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారితో మీకేవిధంగా పరచయ మేర్పడింది?*

**సమా:** నేను తెలుగు ఆనర్స్ చదివేటప్పుడు ఆయన ఆంధ్ర విశ్వకళాపరిషత్‌కు ఉపాధ్యక్షుడు. ఆయన ఆంగ్ల విద్యాధికుడిగా, సుగ్రహీతనామధేయుడు. ఆయన ఆంధ్రభాషాభిమాని. బి.ఏ ఆనర్స్‌లో విశ్వకళాపరిషత్ పరీక్షలో ఆంగ్లములో నాకు మొదటి మార్కు వచ్చి సర్ జార్జ్, స్టాన్లీ బహుమతి వచ్చింది. ఆంగ్లపరీక్ష - గణితము-ఫిజిక్స్-కెమిస్ట్రీ-చరిత్ర-ఆర్థికశాస్త్రం చదివే విద్యార్థులలో అందరికీ జరిగిన ఆంగ్ల పరీక్షలో తెలుగు విద్యార్థి ప్రప్రథముడిగా రావటం అదే మొదటిసారి, బహుశా తుదిసారికూడా. ఆవిధముగా కట్టమంచివారితో పరిచయమేర్పడటానికి సావకాశము లభించినది. తదుపరి నేను వ్రాసిన ప్రథమ కవితాసంకలనము తారాతోరణానికి ఆయన పీఠిక వ్రాసారు. నేను పలుసార్లు చనువుగా ఆయనను కలుసుకునేవాడిని. సాహిత్య విషయ ములు చర్చించేవాడిని.

**ప్ర:** *శ్రీ గురజాడ అప్పారావుగారు ప్రతిపాదించిన "కొత్తపాతల మేలి కలయిక" మీరచనలలో కట్టమంచివారు గుర్తించి మిమ్మల్ని మెచ్చు కోవడం మీకు గొప్ప ఉత్సాహ స్ఫూర్తినిచ్చిందా?*

**సమా:** తారాతోరణములో నాకు దీర్ఘసమాసాలపై మోజు వుండేది. "నీవిక నిల్చియుండెదవ నిత్యవసంత హసన్ముఖి చిరంజీవినివై తెలుంగు నుడి చెల్వము చెందెడి యెంతనొక" "ఉషస్తు షారశీభావి చిన్నువనవర్చుట కోమల రాగరేఖలన్" ఎన్నో ఉదాహరణలున్నాయి.

కట్టమంచి రామలింగారెడ్డి గారికి "జటిల సంస్కృత సమాసాలు" రుచించేవి కావు. ఆయన పలుసార్లు ప్రసంగధోరణిలో - కృష్ణాగోదావరి తీరవాసులు - నన్నయతో పాటు తెలుగు కవిత్వములో సంస్కృతము పులుముతారు. కవిత అనగ - తిక్కన మాటలలో చెప్పాలంటే "అలతి అలతి పదాలతో కాహళ శబ్దం సంధించినట్లు అమరవలె" అనేవాడు. శ్రీకట్టమంచి వారికి అభిమానకవి వేమన. ఇక్కడ ఒకమాట చెప్పాలి. మాపద్యరచనలో మనకే తెలియకుండా కొంతకాలం అయిన తరువాత గొప్ప మార్పు వచ్చినది. "తెలుగులో కందం వ్రాయనివాడు కవికాడు" అనే సామెత వుంది. వృత్తాలు కవి సత్తాకు నిదర్శనం. నాకింకా కందాలపై, వృత్తాలపై మోజు పోలేదు. కాని నేను ప్రగతిగీతలో, కవితాప్రభాస లలో ఆటవెలది పద్యాలు సుమారు వెయ్యి రాసాను. "బరువు తక్కువ-బలం ఎక్కువ గల తేటతెలుగు నుడికారాలతోనే ఆటవెలది పద్యము చెక్కాను. శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు బ్రతికివుంటే సంతోషించి వుండేవారు.

**ప్ర**: *పలువురు మీ శిష్యసంపదను ప్రస్తుతిస్తారు. మీకు చాలామంది ప్రత్యక్ష శిష్యులు, ఏకలవ్యశిష్యులు వుండటానికి కారణం?*

**సమా:** నేను ఉపాధ్యాయత్రిదశుడను. అంటే ముప్పదియేండ్లు తెలుగు పండితునిగా పనిచేసాను. ప్రిన్సిపాలుగా కొంతకాలం పనిచేసాను. శిష్యసంఖ్య నాకు ఎక్కువ. ఒక్కమాట - "నేను ప్రమిదను కావచ్చు - ఎన్నో కాగడాలను వెలిగించాను. ఇక గురువనే బరువు బిరుదు నాకు అదృష్టవశాన సంక్రమించింది.

**ప్ర:** *శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి, శ్రీ లక్ష్మణయతీంద్రులు, శ్రీశనగన నరసింహస్వామి, శ్రీకలుకోట్ల విజయాత్రేయ, ఉపశ్రీ శ్రీఆశావాది ప్రకాశం వీరు భిన్నధృవాలు. ఏవిధంగా మీ శిష్యులయ్యారు?*

**సమా:** ఉపశ్రీ సనాతన సంస్కృతి పరాయణుడు. యాదాటి కాశీపతి విరసం కార్యకర్త. ఉభయులూ నన్ను గురువుగా ఆరాధించినవారే. నాసమాధానము మెదడులోన మార్క్సు - హృదిలోన బుద్ధుడై - విప్లవంబు కరుణ పింగళించి పుట్టుగాక సుకవి – భువనైక పౌరుడై ప్రగతికొరకు - నూతన జగతికొరకు. ఇది నా వేదాంతం.

**ప్ర:** *మీరు పద్యాలు వ్రాసారు, నాటకాలు వ్రాసారు. సాహిత్యమీమాంస సలిపారు ప్రస్తుతం మీరు చేస్తున్న కృషి ఏమిటి?*

**సమా:** నన్ను ఈమధ్య "ఆంధ్రపద్య కవితా సదస్సు"కు అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. నాకు వచన కవిత్వంమీద ద్వేషం లేదు. కేవలం శిల్పసౌష్ఠవములో - తెలుగు పద్యం ప్రపంచవాఙ్మయంలో ఎన్నదగినది. "తెలుగుపద్యశిల్పం" సహస్ర సంవత్సరాల వారసత్వము" అనే గ్రంథం వ్రాస్తున్నాను.

**ప్ర:** *మీరు భవిష్యత్తులో ఏంచేయాలనుకుంటున్నారు?*

**సమా:** ఒక పెద్దనవల - ఆధునిక ప్రపంచ చరిత్రను, మానవసమస్యలను ప్రతిబింబించే అద్దాలమేడ వంటిది వ్రాయాలనుకుంటున్నాను.

**ఆచార్యులవారికి నా కృతజ్ఞతలు సమర్పించి సెలవు తీసుకున్నాను.**

***** డా || వింజమూరి లక్ష్మి *****

# సాహితీ విశ్లేషణములు

# "నండూరి రామకృష్ణమాచార్య స్మారక సాహిత్య పురస్కారం"

*****స్వీకరించిన సాహితీ మూర్తులు :**

2004 డా. ఆశావాది ప్రకాశరావు, ప్రముఖ కవి, అవధాని.
2005 శ్రీ శిష్ట్లా వెంకటరావు, పద్య విద్యా ప్రచారకులు.
2006 డా. రాపాక ఏకాంబరాచార్య, అవధాన విద్యా పరిశోధకులు.
2007 డా. మల్లెమాల, ప్రముఖ కవి, సినీ నిర్మాత.
2008 ఆచార్య వి.యల్.యస్. భీమశంకరం, కవి, భూభౌతిక శాస్త్రవేత్త.
2009 శ్రీ ముదివర్తి కొండమాచార్యులు, ప్రముఖ కవి.
2010 శ్రీ నల్లాన్ చక్రవర్తుల శేషాచార్యులు, ప్రముఖ కవి.
2011 డా. తిరుమల శ్రీనివాసాచార్య, ప్రముఖ కవి.
2012 శ్రీ దుగ్గిరాల రామారావు, ప్రముఖ కవి.
2013 డా. మేడసాని మోహన్, ప్రముఖ అవధాని.
2014 ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, ప్రముఖ కవి,
2015 డా. జె. బాపురెడ్డి, ప్రముఖ కవి, ఐ.ఏ.యస్. అధికారి.
2016 శ్రీమతి చక్రవర్తుల లక్ష్మీ నరరసమ్మ, ప్రముఖ కవయిత్రి.
2017 శ్రీ డి. రంగారావు, ప్రముఖ ఆంగ్ల రచయిత, అనువాదకులు.
2018 ఆచార్య ఎస్.వి. రామారావు, విమర్శకులు, డీన్ ఆఫ్ ఆర్ట్స్, OU.
2019 డా. వెల్చాల కొండలరావు గారు, తెలుగు అకాడమీ సంచాలకులు.
2020 డా. ముక్తేవి భారతి గారు, ప్రముఖ రచయిత్రి.
2021 శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి, ప్రముఖ నవలా రచయిత్రి.
2022 డా. మాడుగుల నాగఫణి శర్మ, బృహత్ ద్విసహస్రావధాని.
2023 డా. రసరాజు గారు, ప్రముఖ పద్య, గేయ కవి.
2024 శ్రీ వి.యస్.అర్. మూర్తి గారు, ఆధ్యాత్మిక వేత్త.
2025 డా. పులిగడ్డ విజయలక్ష్మీ గారు, ప్రముఖ పద్య కవయిత్రి.
2026 డా. కె.వి. రమణాచారి గారు, సాహితీవేత్త,ఐ.ఏ.ఎస్. అధికారి.

# ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
# నండూరి వారి వ్యక్తిత్వం-కవిత్వం

డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య శిష్యవాత్సల్యం మూర్తీభ వించి న గురువు. 'ప్రాతక్రొత్తల మేలి కలయికల కవి. రంగస్థలంమీద రక్తికట్టిన నాటకరచయిత. చరిత్రలోను, సాహిత్యం లోను సారగ్రహణం చేసిన పరిశోధకుడు, "రమ్యహాస లోలుడు". సంభాషణ చతురుడు. కార్యసాధకుడు. మనస్సు వున్న మనీషి, "నిండు మనంబు నవ్యనవనీత సమానము." కాని, "పల్కు దారుణా ఖండల శస్త్రతుల్యము" కాదు - "శిరీష కుసుమ పేశల" సదృశం.

ఇరవై నాల్గవ యేట పశ్చిమగోదావరిజిల్లా భీమవరం కళా శాల తెలుగుశాఖ తొలిఅధ్యక్షునిగా అధ్యాపకవృత్తిని ఆరంభించి, వివిధ ప్రభుత్వ కళాశాలల్లో ప్రిన్సిపాలై, ఏభైయెన్మిదవయేట పదవీ విరమణ చేసిన ధన్యజీవి. అరవై యెన్మిదవయేట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార భాషా సంఘానికి అధ్యక్షులై, తెలుగు భాష వెలు గొందడానికి, ఆ సంఘం అస్తిత్వాన్ని జేగీయమానం చేసిన 'ప్రజ్ఞా నిధి. డెబ్బైయైదవయేట ఆంధ్ర పద్యకవితా సదస్సు అధ్యక్షులై, తెలుగు పద్యం తేజరిల్లడానికి, ఆ సదస్సు మనుగడని దేదీప్య మానం చేస్తున్న దీక్షాకంకణధారి. వయోభారాన్ని మాత్రమే గాకుం డా, వ్యయభారాన్ని కూడా లెక్క చేయకుండా, పద్య పునరు ద్ధరణకి శేషజీవితాన్ని అంకితంచేసిన శేముషీ ధురంధరుడు. ఉదార స్వభావానికి ఒక ఉదాహరణం. నిష్కామకర్మాచరణకి ఒక నిదర్శనం.

**"కాంతి నిచ్చి మలగు కర్పూర హారతై**
**చదువుకొరకు ఎవని బ్రదుకు వెలుగు?**
**జీవితమ్ములోన శిష్యులే తనకంటె**
**గొప్పవారలగుట కోరునెవడు ?"**

- అని గీతా ప్రవచనం చేయడమే గాకుండా, అక్షరాలా "శిష్యులే తనకంటె గొప్పవారలగుట కోరు" కొంటున్న గురువు. శిష్యులు ఏనాటి కళాశాల విదార్థులో అయినా, ఈ నాటికీ ఏనాటికీ వారి

అభివృద్ధికి దోహదంచేసే దొడ్డగురువు డాక్టర్ నండూరి రామకృష్ణ మాచార్య. ఇది వారి వ్యక్తిత్వానికి కరదీపిక.

ఇక కవిత్వం - ప్రారంభదశలో పరిణతమైన "తారా తోరణము", పరిణత దశలో ప్రారంభమైన "ప్రగతిగీత" ప్రసిద్ధ ఖండకావ్యాలు. ఇరవై యేడు ఖండికల సంపుటికి "నక్షత్రమాల" అని దువ్వూరి రామిరెడ్డి నామకరణం. "తారాతోరణము" అని నండూరి రామకృష్ణమాచార్య నామకరణం. అది కేవలం పద్య కావ్యం. ఇది పద్యగేయోభయకావ్యం. అజ్ఞాత కౌంతేయం, శకుంతలా నిర్గమనం మొదలైన సంప్రదాయ కవితలు; సూక్తవసంతము, శీర్ణమేఖల మొదలైన నవ్యకవితలు; జీవితసూక్తము, ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః మొదలైన ప్రబోధకవితలు రాశీభూతమైన ప్రాత క్రొత్తల మేలికలయిక "తారాతోరణము".

శ్రీకృష్ణుని రాయబారం తర్వాత, కుంతీకర్ణుల ఏకాంతసమా వేశమే అజ్ఞాత కౌంతేయం. ఇతివృత్తం భారతార్థమైనా, ఇందులో కర్ణుని మాతృగవేషణ ఇతోధిక విశేషం.

**"మనమున భావనాపటిమ మాతృకృపా కమనీయ దివ్యమూ**
**ర్తిని దరిశింపగా కలవరించితి తీయకలల్ సృజించు తీ**
**రని నిరుపేద కోర్కెల; పురాతన సత్యమువోలె నన్ కద**
**ల్చెను భవదీయ వాక్కులు విచిత్ర విషాదము రేపి నా హృదిన్ .**

**కస్తూరినిడు రాధ కనుపాప నొకనాడు**
**కన్నతల్లియె నాకు కానుపించె**
**ఉయ్యాల జోకొని ఊగిననా దమ్మ**
**అతిలోక హస్తమే అరసినాడ**

**చిరుత ప్రాయములో నిదుర చెందిన నన్ను**
**కలలోన జనయిత్రి కౌగిలించె**
**అంగ సింహాసన మధివసింపగ నాకు**
**అజ్ఞాత మాతయే ఆజ్ఞనిచ్చె**

**రేలుపవలెల్ల అస్పష్టరీతి నక్క**
**డక్కడ ఇచట నచట నేనరయుచుంటి**
**అవ్యయ కృపాతరంగిణి అమ్మకొరకు;**

**కాని - ఆమె యీ నిర్భాగ్యుకంట పడదు.**

**ఘోరభారతయుద్ధాగ్ని కుండమందు**
**ప్రాణమర్పింపవలె రాజరాజుకొరకు**
**కన్నతల్లిని గాంచు భాగ్యమ్మునొంద**
**లేను కాబోలు నీ జన్మలోన నేను."**

ఇది తన్నుగూర్చి ఏవో కథలూ, ఏవేవో గాధలూ విన్న కర్ణుని మనోవేదన. కరుణా రస కంపం కలిగించే కవిత్వం.

అర్జునుని యెడల అసూయ కలగడానికి కర్ణుడు చెప్పిన కారణం ఒక నగ్నసత్యం. మనస్తత్త్వ మర్మం.

**"అర్జునుని పైన నా కసూయ యని ప్రజలు**
**పలుకుచుందురు నిజము కావచ్చు కొంత;**
**ప్రేమను కృతకముగ చంపివేయునెడల**
**ఈర్ష్యయౌచు తిరిగి జన్మమెత్తుచుండు"**

పుత్రప్రేమను కృతకంగా చంపివేసింది కన్నతల్లి కుంతి. అది కర్ణాకర్ణిగ విన్న కర్ణునికి ఈర్ష్య కలగడం సహజం.

కుంతి అడిగిన మీదట కర్ణుడు వరమివ్వడం మహాభారతంలోని విషయం. కుంతి అడుగకుండానే కర్ణుడు వరమివ్వడం అజ్ఞాత కౌంతేయంలోని విశేషం.

**"అర్జునుడు తప్ప పాండవులాహనమున**
**చేత చిక్కిన కూడ హింసింపబోను**
**అర్జునుడు తన్ను దానె కాపాడుకొనును**
**అడుగకుండ నీకిచ్చితినమ్మ వరము"**

అమ్మకోసం అంతగా అలమటించిన కర్ణుడు, అడుగకుండానే అమ్మకు వరమివ్వడం అత్యంత సముచితం. అంతేకాదు. ఎంత ఈర్ష్యాళువైనా, ఇంత వరప్రదాత కావడం కర్ణుని ఉదాత్తలక్షణం.

*కర్ణపాత్ర చిత్రణం కర్ణరసాయనమైన అజ్ఞాత కౌంతేయం ఉదాత్త రసాన్వితం.*

*శీర్ణమేఖల అంటే మణిమేఖల జ్ఞప్తికి రావడం సహజం. అది తమిళ కావ్యం.*

కావ్యనాయిక బౌద్ధభిక్షువు పేరు మణిమేఖల. అదే కావ్యం పేరు. ఇది తెలుగు కావ్యఖండిక. కావ్యనాయిక పేరు కాదు. శీర్ణమైన మేఖలే శీర్ణమేఖల. తెగిన మొలనూలు. భానుమతి, దుర్యోధనుడు, కర్ణుడు, భారతపాత్రలైనా? సంఘటన, సందర్భం, సన్నివేశం - సర్వం – కవ్యుపజ్ఞం. గాఢమైత్రిని ప్రతిపాదించే ఇతివృత్తం. అపార్థం చేసుకోవడానికి అవకాశం వున్న సంఘటన. అయినా అపార్థానికి తావులేని, ప్రగాఢమైత్రి ప్రకాశించిన సందర్భం. అవైయాసకం. ఖండిక ఎత్తుగడే కుతూహలం కలిగిస్తుంది.

**ఈ నడిరేయిలో ఇభపురేశ్వరు అంతః పురాన హర్మ్యసో**
**పాన పరంపరాగ్రముల పైకి యెకాయెకి నెక్కు నెవ్వడీ**
**మానిసి? రాణి భానుమతి మందిర రత్నకవాట కాంతిలో**
**అనసీమ వెల్లెడిని అంగధరేశుడు సూతసూనుడే!**

అర్ధరాత్రి అంతఃపుర ప్రవేశం! అది కూడా దుర్యోధనుడి భార్య భానుమతి అంతఃపురంలో కర్ణుని ప్రవేశం! ఎంత మిత్రుడైనా వింతగొలిపే విషయం. అంతఃపుర ద్వారపాలకులు అదమరిచి నిదురపోతున్నారా? కాదు.

**అనుగు సఖుని దుర్యోధను నరయు కొరకు**
**పవలు రేలనక అతడు వచ్చుచుండు**
**కంటికిని కూర్కులేకుండ కాచుచున్న**
**ద్వారపాలకులెవరాపనేరరతని.**

దుర్యోధనుడి అంతరంగంలో వున్న కర్ణుణ్ణి, భానుమతి అంతఃపుర ద్వారపాలకులు ఆపలేని మాట నిజము. అర్ధరాత్రి అయినా సరే! ఆ సమయంలో దుర్యోధనుడు అంతఃపురంలో లేడు! భానుమతి అందమైన తల్పం మీద చెలికత్తెతో చదరంగం ఆడుతున్నది. కర్ణుడు బంగరుగద్దెపై ఆసీనుడయ్యాడు. "ఎచ్చటికేగినాడు ధరణీశ్వరుడు?" అని అడిగాడు. "చెచ్చెర వత్తునంచు చనె శీఘ్రముగా నెటొ పాదచారియై; వచ్చుచునుందురంచు మది భావన చేసెద" నని సమాధాన మిచ్చింది భానుమతి.

"పోయెదనంచు" లేచాడు కర్ణుండు.

**"వచ్చెడు వేళయయ్యె ఈ రేయి భవత్**
**సఖుండు నిదురింపడు మీ గమనమ్ము**
**విన్నచో, పోయినదేమి ఆగుడు,**
**'ప్రభుండిదె వచ్చుచునుండు"** అన్నది భానుమతి.

కర్ణుడు ఆగిపోయాడు. భానుమతి చదరంగం ఆడటానికి ఉపక్రమించింది. ఆట చూస్తున్న కర్ణుడు చెలికత్తె స్థానం ఆక్రమించి ఎత్తులు కదప సాగాడు. భానుమతి, కర్ణుడు చదరంగం ఆడటం వింత.

**ఎంతటి మాట! హస్తినగరేశ్వరు పట్టపురాణి యట్టు లే**
**కాంతగృహమ్ములోన నిజకాంతుడు లేని నిశీధి నేక శ**
**యాంతర వర్తియె తమిని అన్యునితో చదరంగమాడు నా**
**వింతను తొంగిచూచె వినువీథిని తారలు పుల్కరించుచున్.**

ఆట "మంచి రసకంధాయం"లో పడింది. కర్ణుడు "త్రోసిరాజో, ఉయ్యాల త్రోసిరాజో" అని గ్రుచ్చి గ్రుచ్చి అడుగుతుండగా అరుదెంచాడు దుర్యోధనుడు! భానుమతి చూచింది. లేచింది. చూడని కర్ణుడు నిలవరించడానికి భానుమతి మేఖల పట్టుకొన్నాడు. ఆమె విదళించింది. మేఖల తెగిపోయింది. అప్పుడు కర్ణుని కంటపడ్డాడు దుర్యోధనుడు!

**కట్టెదుటను నున్న కౌరవనాథుని**
**ప్రాణమిత్రుని మోము నరయ లేక**
**హైమ కాంచిని వీడి అందందు పడిపోయి**
**చెదిరిన మణులేర చేయిరాక**

**స్తంభించి నిలిచిన సతి కురుపట్టమ**
**హిషి అవస్థ మదినూహింపలేక**
**ఏమియెరుగకయె ఇంతలు సలిపిన**
**తన్నుగూర్చి తన కర్థమ్ము గాక**

**కనక తల్పము జారిన కర్ణుహృదయ**
**మందు విద్యుల్లతారోచి అశనిపాత**
**మగ్ని పర్వతజృంభణ మబ్ధిఘోష**
**ధరణి కంపమ్ములేకమై తాండవింప**

ఇది కర్ణుడి అవస్థ. మరి దుర్యోధనుడి వ్యవస్థ-

**మందమనోజ్ఞహాస సుషమా మృదుభావ మరీచి వీచికల్**
**కందుదలందు వెల్లిగొన కౌరవనాథుడు ఆత్మదేవికిన్-**
**చిందిన మేఖలా మణుల చెచ్చెర నేరి యొసంగి " ఆగ్రహం**
**బందిరొ రాణివారు క్షమ కర్ణుడు నా ప్రియమిత్రు డిమ్మెయిన్,**

**ఎరిగి చేసిన తప్పుగా దెంతవారి**
**కైన క్రమ్మును చదరంగమందు మత్తు**
**ఎప్పటియటుల కర్ణుని మన్నింపు" మనుచు**
**ప్రార్థనలు సలపె ఛలోక్తి పరిఢవింప.**

అని కర్ణుణ్ణి తీసికొని మేడమీదకు వెళ్ళిపోయాడు. ఇది కర్ణదుర్యోధనుల "సుకుమార హృదయ పవిత్రమైత్రి." కర్ణ దుర్యోధనులు ఎలాంటి వారైనా వారి మైత్రి పవిత్రమైనదే. మైత్రి విషయంలో వారి హృదయాలు సుకుమారమైనవే.

అజ్ఞాత కౌంతేయంలోని కర్ణపాత్ర చిత్రణం ఉదాత్తమేగాని, శీర్ణమేఖలలోని దుర్యోధనపాత్ర చిత్రణం మహోదాత్తమైనది. అంతే కాదు, ఆద్యంతం నాటకీయపర్ధతి జీవనాడిగా సాగిన కావ్యఖండిక శీర్ణమేఖల. ఇది కూడ ఉదాత్త రసాన్వితమే, వ్యాసప్రోక్తం కాని, కవిత్రయసూక్తం కాని - శీర్ణమేఖల నవ్యకవిత్వం.

విజ్ఞానశాస్త్రం వికసిస్తున్నది. సౌకర్యాలు సమకూరుస్తున్నది. యవనికాభ్యంతరంలో విలయ తాండవం విజృంభిస్తున్నది. ఇది తత్త్వశా'స్త్రవేత్తల్నికలచివేస్తున్నది. అది ప్రతిఫలించింది "ఓం శాంతి శాంతి శ్యాంతి?".

**"ఆటము బాంబు' రెక్కల జలాంతరగాముల కాలకూటదుష్**
**కీటక వాయు జృంభణము క్రిందులు మీదులు లేక సంగరో**
**చ్చాటన సల్పుచున్ బ్రదుకు చావుల దుఃఖసుఖాల క్లిష్టశృం**
**గాటకమందు నిల్చిరి జగచ్చరితంబున నేటి మానవుల్**

ఇది 1950 నాటి స్థితి. ఇప్పటి స్థితి ఇంతే. అప్పుడే కవి ఆగ్రహోదగ్రు డయ్యాడు.

**ఓ నవశాస్త్ర దారుణ మహోగ్ర కఠోర వికార ఘోర వి**
**జ్ఞాన వికాసమూర్తి! విషచారిత రక్తరసప్లుత ప్రభా**

**లీన కటాక్ష మేల ప్రసరించెదవోయి? సహ్రశీర్ష్ణ పం**
**చానన విశ్వరూప విలయాంతర భీకర గర్జనార్భటిన్.**

ఇది ప్రసాదగుణ ప్రధానమైన ఖండకావ్యంలోని ఓజోగుణ భూయిష్ఠమైన రచన. ఇది రౌద్ర బీభత్స భయానక రసోచితం. ఎంత క్రోధం ప్రదర్శించినా, మరెంత జుగుప్స ప్రకటించినా, ఇంకెంత భయపెట్టినా, ఘోరవిజ్ఞాన వికాసమూర్తికి చీమ కుట్టినట్టు కాదు. సుకుమార సోల్లుంఠనమే విషకన్యాపరిష్వంగం. ఇది

"ఓం శాంతి శ్శాంతి శ్శాంతి?" లోని అపూర్వ విశేషం.

**"ఈ పెనుమంటి దిబ్బ వసియించి రొకానొకనాడు మానవుల్**
**పాపము! శేముషీవిభవ పారగులై ప్రకృతిన్ జయించి వి**
**శ్వాపరసృష్టి సల్పి ప్రళయ భయాంతక బుద్ధిని గుండెలేక ఆ**
**త్మోపహతిన్ వినాశనము నొందిరి యందరు జ్ఞానశూన్యులై"**

**అనుచు హతశేషమై యంత యవని మిగులు**
**ఏ పిపీలికలో రచియించుకొనును**
**కరుణగీతులను తమ వాఙ్మయ ములోన**
**నయ్యది యవశ్యభవితవ్యమేమొ మనకు!**

విజ్ఞానశాస్త్ర వికాసం ప్రపంచ సంగ్రామానికి పాల్పడితే, యావత్ర్పపంచం పెద్ద మట్టిదిబ్బ కావడం అపరిహార్యం. ఏ చీమలో మిగిలితే అవి తమ వాఙ్ణయంలో మానవుల జ్ఞానశూన్యులని విషాదగీతాలు విరచించుకోవడం అవశ్యభవితవ్యమే! నిజానికి చీమలు జ్ఞానంలేనివి. మానవులు జ్ఞానం కలవారు. అటువంటిది చీమలు జ్ఞానం కలవికావడం, మానవులు జ్ఞానశూన్యులు కావడం విజ్ఞాన శాస్త్ర విపరిణామ విపర్యయం. అంతేకాదు, ప్రపంచ సంగ్రామానికి ప్రాతిపదిక అనైక్యత. అనైక్యత లేనిది చీమలబాణు. చీమలనుండి మానవులు నేర్చుకోవలసింది ఐక్యత అని ధ్వన్యర్థం.

**"సకలధరణి శాసనపరిషత్తు తోడ**
**ప్రజలు వసుధైక సామ్రాజ్యపౌరులగుచు**
**భూమి యేకకుటుంబమై పొందునంది**
**విశ్వమానవ కల్యాణవేది యగును."**

అని శాంతి వచనం. వసుధైకకుటుంబం, విశ్వమానవ కల్యాణం నండూరి రామకృష్ణమాచార్య నాదబ్రహ్మోపాసన.

ఇరవైయేడు ఖండికల తారాతోరణంలోని అజ్ఞాత కౌంతేయం, శీర్ణమేఖల, ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః అనే మూడు ఖండికలూ ఆధునికాంధ్ర కవితావిహాయస వీధిలోని ధ్రువతారలు!

హాస్యప్రియత్వం, మానవతాదృక్పథం, ప్రగతి దృక్పథం త్రివేణీ సంగమమైన ఖండకావ్యం "ప్రగతిగీత". కేవలం పద్యకావ్యం. ఇదొక సప్తశతి. శృంగార రసప్రధానం కాదు. ధ్వని ప్రధానం కాకపోదు. అందుకే "అద్యతన సాహితీ సప్తశతి" అన్నారు.

ఇందులో మూడు భాగాలున్నాయి. 1. వెన్నల వడగళ్ళు. 2. ముత్యాల గొడుగు. 3. పన్నీటిజల్లు.

**"ఎందుకీ వ్రాతలు గీతలున్?"** అని ప్రశ్న వేసికొని, ఇచ్చిన సమాధానంలోని సారాంశం ఇది: **"... . వెలుగుబాటలు తీరిచిదిద్ది గుండెలో లోతులు పాతులున్ తరచి, లోకము పోకడ చూచి నిల్పుతన్ శ్రోతల మానసాల చిరుజ్యోతులు. ......"**

ప్రగతిగీతలోని ప్రత్యంశం వెలుగుబాటలు తీర్చిదిద్దేదే. గుండె లోతుపాతులు తరచి లోకంపోకడ చూపేదే. ఏ పాటి మానవత్వం వున్నా మానసవీథిలో చిరుజ్యోతులు నిలిపే మాట నిజమే. ఇందుకు వెన్నెల వడగళ్ళులోని "కోటిశ్వరుని కుక్క" ఒక ప్రముఖోదాహరణం.

ఒకసారి తీవ్రమైన చలిగాలికి ఒక్క బీహారులోనే వెయ్యి మందికి పైగా చనిపోయారు. కోటీశ్వరుని కుక్క మాత్రం చావలేదు. కారణం?

**కుక్కపిల్లకొరకు కుట్టించె ఒక కోటు,**
**పట్టువంటి ఉన్నిబట్ట పెట్టి**
**పసిడి గొలుసుతోడ పచ్చని మొలత్రాడు.**
**వేలకొలది ఖర్చుపెట్టి కట్టె**

**కుక్కపిల్లతోడ కోటీశ్వరుడు మేడ**
**వదలలేదు తెల్లవారువరకు**

**తెల్లవారి నంత దినపత్రికలు లేవు**
**చచ్చినట్టివారి సంఖ్య తెలుప**

ఉన్నికోటు కాదు, ముతకగుడ్డ లేనివారు; మేడకాదు, గుడిసె వదలవలసిన వారు చలిగాలికి చనిపోయారు!

**భరతఖండమందు నిరుపేద గుడిసెలో**
**మనుజజన్మ యెత్తి మసలుకంటె**
**కుక్కజన్మ మేలు కోటీశ్వరుని యింట**
**భరతదేశ మెపుడు బాగుపడునొ!!**

అని కవి ఆవేదన. అంతేకాదు. "మాతృక ఒక అమెరికను కవిత. అమెరికాలో బీదవారి దైన్యమును చిత్రించిన కవితా మాతృక వెలువడగానే, అచటి శాసనసభ్యుల హృదయములు కరిగి, పేదల శ్రేయస్సునకై క్రొత్తచట్టములు వెలువడినట్లు తెలియుచున్నది." అని కవి అధస్సూచిక. ఇచటి శాసన సభ్యుల హృదయములు కరగి పేదల శ్రేయస్సునకై క్రొత్తచట్టములు వెలువడినపుడు భారతదేశము బాగుపడునేమో!

వెన్నెల వడగళ్ళులోని "భోగిమంటలు" అనే ఖండిక ప్రగతి శీలానికి ఒక 'ప్రత్యేకోదాహరణం.

**"కాలదోషమ్ము పట్టిన గతచరిత్ర**
**ఎండిపోయిన పిడకల దండవోలె**
**కట్టగట్టి కన్నులు మూసి కాల్చవోయి**
**భోగిమంటలలో నీకు పుణ్యముండు.**

**స్వస్థాన వేషభాషా మమత్వముచేత**
**గుండె గప్పిన సాలెగూళ్ళనెల్ల,**
**స్వీయమతాభినివేశమ్ము మనసులో**
**పెంచిన పెనుముండ్ల కంచెలెల్ల,**

**జాత్యభిమాన పిశాచి పూనుటచేత**
**బుట్టకెత్తిన గంగ వెర్రులెల్ల!**
**విద్యామదము పదవీమదమ్ము ధనమ**
**దమ్ము వేసిన వెర్రి తలలనెల్ల**

**కారణాంతరముల కలగూరవోలె**
**ఒడలిపై మొలిచిన కుక్కగొడుగులెల్ల**
**భోగిమంటలలో వేల్చి కాగబెట్టి**
**వేడినీరు శిరస్స్నాన మాడుమయ్య!**

**కడుపు మాడి గుంటపడిన కంటిమంట**
**భోగిమంట గొలిపి ఆరిపోయినట్టి**
**గరళకంఠుని మూడవ కన్నునిపుడు**
**రగులు కొల్పుము దుష్టమారణముకొరకు!".**

"ముత్యాల గొడుగు" ముఖ్యంగా 'ముక్తకాల' సంపుటి. సుమారు మూడువందల పాతిక పద్యాలు. ముత్యాల సరులు పోహళించినట్టు అకారాద్యనుక్రమణికలో ఉన్నాయి. కొన్ని మచ్చుతునకలు:

**అగ్నిపరీక్ష**

**"అగ్నియందు కరగి అపరంజి వెలుగొందు**
**మట్టి - గట్టిపడును మాడిపోయి**
**దొడ్డవాడు వెలుగు దురదృష్టదశయందు.**
**అల్పుడైన యెడల అణగిపోవు"**

**కవి**

**"కవివరేణ్యుడనిన అవతారపురుషుండు**

**సాహితీచరిత్ర చదువునప్పుడు**
**కవియొకండు ప్రక్కగదిలోన నివసింప**
**ప్రహసనమ్ములోని పాత్ర అతడు !"**

**చిత్ర లేఖనము**

**"దున్నపోతు కొట్టె తోకతో గోడపై**
**బురదగుంటయందు దొరలి వచ్చి**
**నవ్యచిత్రలేఖనమ్ములో అల్లదే!**
**వచ్చెననిరి జనము స్వర్ణశకము!"**

## తెలుగు పద్యము

"అందచంద మొలుకు ఛందస్సు రుచిగల్గి
యతులు గలిగి ప్రాసయతులు గలిగి
తీపిలయలు గలిగి తెలుగులో పద్యాలు
హొయలు గలిగి యెదద లూపగలవు"

## పెద్దపదవి

"ఏనుగెక్కినపుడు ఎత్తుగా కన్పించు
పొట్టివాడు గూడ పుడమినుండి
తెలివిలేని జడుడు తేజస్విగా దోచు
పెద్దపదవియన్న గద్దెమీద"

## యంత్రనాగరకత

"యంత్ర నాగరకత యావజ్జగత్తులో
దొరతనమ్ము చేయదొడగె నేడు
మనిషి యంత్రమందు మరమేకుగా మారి
అస్వతంత్రుడగుచు అలమటించు!"

## శాంతి

"విసిరివేయలేవు వింజామరలు వేయి
గగనమందు గ్రమ్ము కారుమబ్బు
ప్రజల గుండెలందు రగులు సంక్షోభమ్ము
'త్రోసివేయలేవు శాసనాలు"

## హక్కులు

"హక్కులున్నవనుచు ఆరాటపడనేల?
బాధ్యతలను మరిచి పౌరజనులు
పరమనిష్ఠతోడ బాధ్యతల్ నెరవేర్చ
అడుగకుండ వచ్చు హక్కులెల్ల."

## క్షమ

"చదువు మీది మెట్లు సంస్కృతి - సహనముల్
చదువు క్రింది మెట్లు చాలగలవు
సంస్కృతికిని క్షమకు జనయిత్రి యొకతెయే
క్షమకు మీదిమెట్టు స్వర్గమొకటె."

"పన్నీటి జల్లు' కూడా ముక్తకాల సంపుటమే. ఇందులో 112 శీర్షికలున్నాయి. అవీ అకారాద్యనుక్రమణికలోనే. అంతేకాదు, ఈ 112 పద్యాలకి "రమ్యహాసలోల రామకృష్ణ" అని మకుటం వుంది. అన్నీ ఆటవెలదులే. వేమనపద్యాల సరణి, స్వరూపాన్నిబట్టి శతక ప్రాయం. అని చెప్పి సంప్రదాయ కవిత్వం కాదు. ఆధునిక విషయాల పైన మాత్రమే అధిక్షేపాత్మకమైన రచన. స్వభావాన్ని బట్టి నవ్యకవిత్వమే. పన్నీటిజల్లు పరిమళాలకి కొన్ని మచ్చుతునకలు:

**అభ్యర్థి**

**"ఓడి విశ్రమింపలేడు గెల్చెడిదాక**
**ఎన్నికలకు నిల్చి ఎవ్వడైన**
**నెగ్గి ఓడు వరకు తగ్గబోడెవడైన**
**రమ్యహాసలోల రామ రామకృష్ణ!**

**ఆత్మహత్య**

**"పండుకొనెను రైలుపట్టాల కడ్డమ్ము**
**ఆత్మహత్య కొరకు అతివ యొకతె**
**ఆమె యెర్ర కోక ఆపివేసెను రైలు ॥ రమ్య ॥**

**ఓట్లుకొనుట**

**"ఓట్లుకొనెడి వాడు ఉరకే యిచ్చునా?**
**దాచిపెట్టినట్టి ధనము తెచ్చి!**
**అమ్మివేయగలడు అతడు దేశమ్మునే ॥ రమ్య ॥**

**తత్త్వమసి**

**"శౌర్యసాహసములు సార్వభౌముల జేసె**
**పెంచె దైవసంఖ్య పిరికితనము**
**నిన్ను నీవు తెలియ నీవె దేవుడవయా! ॥ రమ్య ॥**

**పరిపాలన**

**"నాడు-కుక్క-తోకనాడించుచుండెబో**
**దొరలు ఏలుచుండ భరతభూమి**
**నేడు-తోక-కుక్కనాడించుటకు పూనె ॥ రమ్య ॥**

### భీష్మద్రోణులు

**"ఊరిలోన పెద్దలున్నార లెందరో**
**ద్రోణభీష్మ సములు దొడ్డవారు**
**ఒక వికర్ణుడున్న ఇక చాలు వెదకరా! ॥ రమ్య ॥**

### విరోధాభాస

**"తల్లి రత్నగర్భ, తనయుండు నిరుపేద**
**భాష్పధార గార్చు భరతమాత!**
**ఎంతవింతయైన దీ విరోధాభాస? ॥ రమ్య ॥**

ఇవి దయార్ద్రహృదయం, ఆధునికతామేధ కురిపించిన కన్నీటికణాల పన్నీటిజల్లులు. హాస్యరస భరితమైన కరుణరస గుళికలు. సమాజ రుగ్మతలకి కస్తూరి గుళికలు!

నండూరి రామకృష్ణమాచార్య **"తారాతోరణం"లో కవిమాత్రుడు!**
**"ప్రగతిగీతలో ప్రవక్తభూతుడు!!**

**** ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి*

# డా ॥ ధారా రామనాధశాస్త్రి

ఒకమహానీషి కవీంద్రుడు ద్రష్ట విశ్వవిశాలదృక్పథంతో లోకాన్నిమత్స్యవిహంగ వీక్షణచేసి నిజంగా ఆ అవతారంలాగా కవితా వేదాన్ని సహృదయుల కందించాడు. అనిపించింది మీ కవితలో నాదం ఉంది. ధర్మావాదం ఉంచి హృదయసంవాదం ఉంది - ఇలా ఎంతచెప్పినా తరగని మంచిదనం గల పుస్తకాలు వీరు వ్రాస్తూ ఉండాలి అని పరమేశ్వరుని 'ప్రార్థిస్తూ అయిదు, పది చేస్తూ.

*****డా ॥ ధారా రామనాధశాస్త్రి**

# వల్లూరు శ్రీరామచంద్రమూర్తి అచ్చమైన ఆచార్యరూపమ్

శ్రీ విశ్వనాథవారు తమ గురువును గురించి "శిష్య వాత్సల్యమ్ము చెలువు దీరిన మూర్తి” అంటారు.

మమత, వాత్సల్యం, అనురాగం, ఆదరణ, ఆరక్ష, మానవ త, జాతీయత, కవిత, ఆలోచన, ఆంధ్రాంగ్ల సంస్కృత భాషా త్రివేణిపై అలవోక విహారం, ఆచరణాత్మక ఆదర్శవాదం, స్పష్టత, సూటిదనం, త్యాగం, అధివాస్తవికత, అకర్తృత్వం వంటి పదహారు కళలతో శోభిల్లిన దేశికస్వామి నండూరి రామకృష్ణమాచార్య, తమ శిష్యుల గురించి,

“చదివి చదివి బడయు జ్ఞానమ్ము శిష్యుండు

గురువు తోడుచుక్క పెరుగునందు” అంటారు.

ఇంతటి పాలితశిష్యవత్సలుడు నా పదిహేడవయేట జీవన మార్గంలో తారసిల్లి, వారి తుది శ్వాసవరకు ఒకే రీతి ప్రేమను పంచటం, గురుశిష్య సంబంధంలో ఒక దివ్య ప్రబంధం! యౌవనారంభ వేళలో ఇటువంటి గురుసాన్నిధ్యం లభించటం ఎవరికైనా పురాకృత పుణ్య విశేషమే!

"నీ మార్కుల లిస్టు చూశాను. నీకు పల్లకి పంపి మా కళాశాలలో చేర్చుకుంటాను." అన్న తొలి మంగళాశాసనంతో ఏర్పడిన బంధం బలపడి బలపడి నా వ్యక్తిత్వ వికాసంలో గాఢంగా తోడ్పడింది.

“నేను ప్రిన్సిపాల్‌గా ఉండగా ఏ ఒక్క పేద విద్యార్థి పేరునూ ఫీజు కట్టలేని కారణంగా నోటీసు బోర్డులో పెట్టవద్దు. లిస్టు నాకు పంపండి. అందరి ఫీజు నేను కడతాను" అని, దానిని పాటించిన పితృ హృదయం నండూరివారిది.

"ఆత్మాభిమానం పోగొట్టుకోవడం ఆత్మహత్యకంటే హీనమైనది. కష్టాన్ని ఎదుర్కోవాలి. విజేతగా వెలగాలి." అని ప్రబోధించిన స్ఫూర్తిప్రదాత శ్రీ రామకృష్ణమాచార్యులవారు.

ఎన్నో వందల సందర్భాలలో కొన్నింటిని నెమరు వేసుకుంటే...

ఏలూరులో ముముక్షువు ప్రెస్‌కు నన్ను వెంటపెట్టుకుని తీసుకు వెళ్ళినప్పుడు, ముత్తీవి లక్ష్మణదాసుగారు "ఎవరీ అబ్బాయి?" అని ప్రశ్నించినప్పుడు,

"నేను గురువుగా విశ్వామిత్రుణ్ణి, ఈతడు నా శిష్యుడు, శ్రీరామచంద్రమూర్తి, తేజస్వి." అని వారిచ్చిన సమాధానం ఎంతో లోతైనది. నేను అందుకోవలసిన స్థాయిని సూచించింది.

ఆ లక్ష్మణదాసుగారే తదనంతర కాలంలో లక్ష్మణ యతీంద్రులుగా లోకప్రసిద్ధులు.

“నాయనా! 'ప్రగతి గీత' వ్రాసాను. గ్రంథావిష్కరణ చేయాలి. నీవు సూత్రధారివై అంతటినీ నడిపించాలి.” అని దేశికులు ఆదేశించినప్పుడు నా వయస్సు ఇంకా రెండుపదుల చేరువలో లేదు. తమ తరువాత తరం పట్ల, యువత పట్ల వారికున్న నమ్మకం అటువంటిది.

అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నన్ను వెంటబెట్టుకొని నాటి ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు దగ్గరకు తీసుకువెళ్ళినప్పుడు శ్రీ రామారావు, 'ఎవరు వీరు?' అని ప్రశ్నించినప్పుడు, క్షణం ఆలస్యం లేకుండా 'నా మానసపుత్రుడు' అని అన్నప్పుడు, శ్రీ రామారావు వేగంగా, తీక్షణంగా వేసిన ప్రశ్న,

"ఆచార్యులవారూ! పుత్రవంతులమైన మనబోటి వారికి మానసపుత్రుల అవసరమున్నదా? ఇది కేవలం ఆదర్శభావమే కదా!” అన్నప్పుడు

"ఔరసుడి కంటే అధ్యాత్మపుత్రుడే శ్రేష్ఠుడు. మానస పుత్రుడు మన మనోభూమికపై పరచేది వెలుగు! తనయుడు చల్లేది మాపెరిగిన వెన్నెల. అంతే." అన్నది శ్రీ నండూరి వారి సమాధానం.

జవాబు వింటున్న శ్రీ రామారావు ముఖమండలంపై వెల్లివిరిసిన తృప్తి, వెలుగై వెన్నెలై పారటం ఒక తియ్యని జ్ఞాపకం.

ఆపై ఎన్నో సందర్భాలలో ఆచార్యులవారు నన్ను శ్రీ రామారావు వద్దకు వెంబడి పెట్టుకుని తీసుకువెళ్ళటం, అప్పుడు వారిమధ్య జరిగిన సంభాషణలు విజ్ఞాన ప్రదాయకాలు.

ప్రౌఢ కవితా వ్యాసంగం నుండి నండూరి వారు ముదిమి వాకిట్లో అడుగు పెడుతున్న వేళకు ఆటవెలదులలో తమ ఆలోచనలను వ్యవహార భాషలో రచించారు. ఇది జాగ్రత్పరిణామం. సంక్లిష్టత నుండి సరళతకు, ఆపై స్పష్టతకు పెద్ద పీట వేసి ఉదారులైనారు.

విశ్వనాథవారిని దర్శించగలిగినా, సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలను పిన్న వయస్సులోనే నిర్వహించగలిగినా, ఎందరో ప్రముఖులను కలవగలిగినా, తెలుగుభాషపట్ల గట్లెరగని అభిమానం తీవ్రతరమైనా, మందలింపులెరగని మమతను అనుభవించగలిగినా అది శ్రీ రామకృష్ణమాచార్య స్వామి ఆశీః ఫలితమే!

సమస్త సాహిత్య ప్రక్రియలలో అనేక గ్రంథాలు శ్రీ నండూరి వారి నుండి వెలువడి మేధావులను, హేతువాదులను, చరిత్రకారులను పండితులను అమితంగా ప్రభావితం చేసినయ్.

కరుణశ్రీ కవితా సంకలనాలకు నండూరివారు దిద్దిన తిలకం నిత్యనూతనం!

వారు ఆంగ్లంలో వ్రాసిన మహాభారతం చదివి, స్వామి రంగనాథానంద స్వచ్ఛ ప్రణతులు సమర్పించారు.

ఆ విధంగానే వారు వ్రాసిన 'గాంధియన్ ఎరా' గ్రంథాన్ని నాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కృష్ణకాంత్, రాజ్భవన్లో ఆవిష్క రించటానికి అంగీకరించారు. అందరం రాజభవన్కు చేరు కున్నాం. ఆవిష్కరణకు ఏర్పాట్లు దాదాపు పూర్తి అయినాయి. ఇంతలో గవర్నర్ రానే వచ్చారు. వెంటనే ఆచార్యులవారు గవర్నర్ను సమీపించి "గాంధీజీ రాజభవనాలకు వ్యతిరేకం. ఈ గ్రంథం గాంధీగారి గురించి. రాజభవన్లోకంటే ఈ ప్రాంగణంలో ఉన్న చెట్ల కింద గ్రంథాన్ని ఆవిష్కరిద్దాం. అదే సముచితం” అన్నారు.

ముగ్ధులైన గవర్నర్ "మీవంటి వారే మహాత్మునికి నిజమైన వారసులు. పదండి, ఆరుబయటే ఆవిష్కరిద్దాం” అన్నారు.

అదీ! నండూరి వారి అమలిన అంతరంగం.

చివరగా! నన్ను చూడాలనిపించి వారు మా ఇంటికి వచ్చారు. తలుపు తీయగానే కళ్ళెదుట భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి నిలువెత్తు చిత్రపటం కనబడింది. "నువ్వూ ఈ మాయలో పడ్డావా? నేను ఊహించలేదు." అన్నారు.

నేను మౌనం వహించాను.

ఆ తర్వాత కొద్ది రోజులకే 'కవితా నీరాజనం' అనే సంకల నంలో ఆచార్యులవారి పద్యాలు 'నవ నీరాజనం' నా కంట బడినయ్.

అనుకోకుండా ఆ సాయంత్రం వారి ఇంట ఆచార్య స్వామిని దర్శించి ఈ పద్యాల విషయం ప్రస్తావించాను, ఇంతకీ ఆ పద్యం,

**"అవతరించె నేడు ఆంధ్రదేశమునందు**
**జగతినుద్ధరింప సత్యసాయి**
**ఆతడుపన్యసింప యావత్ ప్రపంచాన**
**దేవభాష య్యె్య తెలుగు నేడు."...**

అదీ వారి భాషాభిమానం!

**అరయ సత్యసాయి వరదేవుడైనచో**
**ఆతని మానవతకు అంజలింతు**

**అరయ సత్యసాయి నరమాత్రుడైనచో**
**ఆతని దివ్యగరిమకు అంజలింతు...**

ఇదీ శ్రీ సత్యసాయిని దైవమని అంగీకరించిన వైనం.

ఆచార్యస్వామి సహజమందహాసం పెదవులపై మోసులెత్తుతుండగా "విన్నవాడు విమర్శిస్తాడు. కన్నవాడు వివరిస్తాడు. "ఈ మధ్య బాబావారిని చూశాను. జీవితంలో ఏమి పోగొట్టుకున్నానో అర్థమైంది. నువ్వు చిన్న వయస్సులో వారికి దగ్గరైనావు. నీదే అదృష్టం." అన్నప్పుడు ఆయన జ్ఞానైక స్థితి, పూర్ణత్వం, అనుభవమైంది. మనసును, మాటను, చేతను, ఒక్కటిగా ఆచరించిన సమన్వయ స్ఫూర్తి శ్రీ నండూరివారు.

లోకం దృష్టికి అందని అపురూప సందర్భాలు ఎంద రెందరి పరమో!

ఎన్నెన్నో!

అటువంటి గురువుల జీవితమే యువతకు ఆదర్శం.

***** వి.యస్.ఆర్.మూర్తి *****

# కరుణశ్రీ - శ్రీ జంద్యాల పాపయ్యశాస్త్రి

జెండా - ఊగి - త్రివర్ణ దీధితులు వర్షింపంగా మోటారు నై
నండూరన్వయ దుగ్ధ వార్నిధి విదుండై కృష్ణమాచార్యవ
ర్యుండేతెంచి త్రిలింగ పద్మవన హర్షోత్కర్ష సంభావనా
చండాంశుండధికార దక్షుడయి భాషా సంసద ధ్యక్షుడై

***** కరుణశ్రీ - శ్రీ జంద్యాల పాపయ్యశాస్త్రి *****

# డా.వెనిగళ్ళ రాంబాబు

**(సినీగీత రచయిత)**

# ఆచార్య దేవో భవ !

సనాతన సంప్రదాయం .. శాస్త్ర విజ్ఞానం
ఆర్షవాఙ్మయ ప్రాశస్త్యం .. ఆంగ్లభాషా ప్రావీణ్యం
ప్రబంధ పద్యప్రౌఢిమ .. వేమన్న ఆటవెలది మధురిమ
స్వాతంత్రోద్యమ పోరాటం .. స్వేచ్ఛా భారత పురోగమనం
..ఇలా విభిన్న ధ్రువాలు కలగలిసిన ధ్రువనక్షత్రం
ఆజన్మాంతం సస్యహరితంగా శోభించిన సహృదయ సుక్షేత్రం ..
**శ్రీమాన్ నండూరి రామకృష్ణమాచార్య !**

త్యాగాలకు నిలయమైన వంశంలో బాల్యమంతా అరణ్యపర్వం ..
ఆపై సభా పర్వాన్నే శాసించిన ఉద్యోగపర్వం ..
కలగలిసిన విరాట్ సాహితీ స్వరూపం ..
ఉషస్సు యశస్సు సంలీనమై స్వయంప్రకాశకమైన అఖండ దీపం ..
**శ్రీమాన్ నండూరి రామకృష్ణమాచార్య !**

ఆయన శిష్యులలో శాస్త్రవేత్తలున్నారు. సహస్రావధాను లున్నారు. పారిశ్రామికవేత్తలున్నారు. ప్రవచనకర్తలున్నారు. సినీ కవు లున్నారు. శిఖరాగ్రస్థాయి అధికారులున్నారు. వారిని గొప్ప శిష్యుల గురువు అంటారని తరచూ చమత్కరించుకుంటారు.

నండూరి వారు నాకు కళాశాలలో, విశ్వ విద్యాలయాలలో గురువులు కాదు. కాని తమ వాక్కుతో, వ్యక్తిత్వంతో, సారస్వతంతో, సౌజన్యంతో నన్ను ఆపాదమస్తకం ప్రభావితం చేసిన ఆచార్యదేవులు. ఓ పుష్కర కాలం పాటు వారి ప్రియశిష్యుడినై వారి మానస సరోవరంలో అనుదినం అభ్యంగన స్నానమాచరించిన అదృష్టవంతుడిని నేను.

ఉస్సూరు మంటున్న మనసును ఉత్తుంగ తరంగంలా ఉరకలెత్తించే స్ఫూర్తిదాయకమైన పద్యాలు వారెన్నోరాశారు. వారి కవితా ప్రభాస, ఆలోచనము, ప్రగతిగీత.. ఇత్యాది గ్రంథాలు నాకు గీతామక రందాలే !

వారు అధ్యక్షులుగా ఉన్న "ఆంధ్ర పద్యకవితా సదస్సు" లో నన్ను భాగస్వాములను చేశారు. పద్య రచనా వైశిష్ట్యంపై చర్చించేవారు. వారికి పద్యమంటేనే మక్కువ. లబ్ధప్రతిష్ఠులైన వచన కవుల రచనలకు వారు పద్యరూపమిచ్చేవారు. నాతోనూ కొన్ని సినిమా పాటలను పద్యాల్లోకి మార్పించి ముచ్చట పడేవారు.

ఒకసారి సాధన సాహితీ సమితి ఆధ్వర్యంలో నర సింహాచార్యుల వారు నాతో సద్యః పద్య విన్యాసం అనే పేరుతో ఆశు కవితా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆచార్య తిరుమల గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డా.సి.నారాయణ రెడ్డి గారు, నండూరి వారు అతిధులుగా విచ్చేసారు.

కర్ణుని మరణ వార్త విన్న కుంతి పడే ఆవేదనను ఆటవెలదిలో వివరించమని సమస్య ఇచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**కన్నతండ్రి ఎదుట కన్నుమూసిన కన్న !**
**గుండె జారె కవచకుండలములు !**
**నేలతల్లి ఒడిని నిదురించినను గాని**
**బిడ్డపోయి సూర్యబింబమునకు !**

అని నేను చెప్పిన పద్యానికి వారు పులకించి కౌగలించుకున్నారు. ఆశుకవిత్వం ఆరంభమే గాని అంతిమం కాకూడదని ఒక మంచి పద్యకావ్యానికి శ్రీకారం చుట్టమని ఆశీర్వదించారు.

ఆ రోజుల్లో పణీంద్ర గారు, రాధశ్రీ గారు నేను తరచూ సాహితీ సదస్సుల్లో పాల్గొనేవాళ్ళం. వాటిలో చాలా వాటికి రామకృష్ణ మాచార్యులే అతిధులుగానో, అధ్యక్షులుగానో ఉండేవారు. మేము ముగ్గురం వారి కృపా కటాక్ష వీక్షణాలకు నోచుకున్న ప్రియ శిష్యులమే. ఒక సారి నేను మేము మీ శిష్యత్రయం అంటే .. అంతేకాదు మీరు సారస్వత వేదికలపై తళుక్కు మనే కవిత్రయం అన్నారు.

అప్పట్లో నేను తరచూ ఆచార్యుల వారి ఇంటికి వెళుతూ ఉండే వాణ్ణి. వారి దగ్గరకు వచ్చే సాహితీ మూర్తులకు నన్నూ పరిచయం చేస్తూ ఉండేవారు. ఎప్పుడన్నా ఎక్కువ కాలం రాకపోతే రమ్మని కార్డు రాసేవారు. అంతటి ఆప్యాయత వారిది.

ఒకసారి నేను వెళ్ళినపుడు మా మధ్య సంస్కృత పంచ కావ్యాల గురించి చర్చ జరిగింది. సమయం గడిచిపోతోంది. వారి శ్రీమతి సుభద్రమ్మ గారు భోజనాలకు పిలిచారు. ఆచార్యులవారు నేను భోంచేస్తున్నాం. ఆ రోజు వడ్డించిన గుమ్మడికాయ వడియాలు చూడగానే నాకు మదిలో వీణలు మ్రోగి నట్లయింది. అరచేతి పరిమాణంలో మృదువుగా, మనోహరంగా, బూడిద గుమ్మడి ముక్కలతో గుల్లబారి కరకరలాడుతూ ఉన్నాయి.

"నేను చూసిన గుమ్మడికాయ వడియాలు కంద పద్యాల్లా పరిమిత పరిమాణంలో ఉండేవి. ఇవి సీస పద్యాల్లా సువిశాలంగా ఉన్నా"యన్నాను.

ఇంతలో ఆచార్యులవారు రెండు వడియాలు ఒకదానిని మరొకటి అంటుకుని ఉంటే దాన్ని తీసి నా పళ్ళెంలో వేస్తూ.. "అయితే ..ఇదిగో సీసమాలిక ! ఆస్వాదించు" అన్నారు.

వారి పదప్రయోగానికి నవ్వుకున్నాను.

ఆ తర్వాత నేను "సాంబారు సుగంధ పరిమళాలతో రుచికరంగా ఉందండీ..

**చారు చారు సమాయుక్తం**
**హింగజీరసమన్వితం**

శ్లోకం గుర్తుకు వస్తుంది " అన్నాను.

వెంటనే ఆచార్యుల వారు పద్యంలో యతి భంగం అయినట్లు చూశారు.

"ఇది సాంబారు కాదు రాంబాబు. పప్పుచారు. సాంబారంటే తమిళ పాశురం. పప్పుచారు తెలుగు పద్యం." అన్నారు.

"తేడా ఏమిటండి " అని అడిగితే వారు వివరించారు.

"నేను గౌతమీ తీరానికి చెందిన వాడినైనా పిహెచ్డి అరవ దేశంలో చేశాను కదా అందుకే ఆ వ్యత్యాసం తెలిసింది" అన్నారు.

"అయితే మీరు ఆ విధంగా కూడా ఉభయ కవి మిత్రులన్నమాట " అన్నాను.

"పంచ కావ్యలైతే పట్టుకుంటావు గాని వంటలు ఇంకా వంట పట్టలేదులే .."అన్నారు.

మరో వడియం తిని ఓ పద్యం చెప్పాను.

**అమరవాఙ్మయమున ఆ పంచకావ్యాలు**
**తమరికేమొ అద్భుతములె గాని**
**అమ్మ చేసినట్టి గుమ్మడి వడియాలు**
**పప్పుచారు కన్న గొప్ప కాదు !**

పద్యం విన్న వెంటనే వారికి నవ్వుతో పాటు పొలమారింది.

వెంటనే సుభద్రమ్మ గారు మంచినీళ్ల గ్లాసుతో వచ్చారు.

"వేదాలకన్నా నీ వడియాలు గొప్పవటే.. రాంబాబు అంటున్నాడు" అన్నారు.

ఆవిడ నావైపు తిరిగి ,

"కావచ్చు బాబూ.. ఎందుకంటే ఆ వడియాలు మీ గురువు గారి శాలువా మీదే పెట్టాను మరి" అన్నారు.

నాకు మతి పోయింది. ఎంత సద్యః స్ఫూర్తి.

ఎంతైనా అంతటి సాహితీ మూర్తి అర్ధాంగి కదా ! ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతారంటారు. మరి అరవై ఏళ్ల దాంపత్యంలో ఆమాత్రం సాహితీ సౌరభం సహధర్మచారిణి హృదయాన్ని ఆవరించదా !

ఆచార్యులవారి 80 సంవత్సరాల అశీతి జన్మదిన మహోత్సవ కార్యక్రమంలో నాకు అతిధులను వేదిక మీదకు పద్యాలలో ఆహ్వానించే బాధ్యతను అప్పగించారు.

వారు తమ శిష్య పరంపరను ఒకరిని మరొకరికి పరిచయం చేస్తూ ఆ అనుబంధాలు నిరంతరాయంగా కొనసాగేలా చూసేవారు.

"నీతో మాట్లాడేటప్పుడు ఎన్నిసార్లు నా గురించి ప్రస్తావన చేస్తారో.. నాతో మాట్లాడేటప్పుడు నీ గురించి కూడా అన్ని సార్లు ప్రస్తావిస్తారు ఆచార్యుల వారు రాంబాబు" అన్నారు నాగఫణి శర్మగారు నాతో ఒకసారి.

ఆచార్యుల వారు విరచించిన ఆలోచనము అనే బృహద్గ్రంధంలో

**వెనిగళ్ళ రామ బాబు స**
**భ నాశువుగ పద్యములను పల్కడి వేళన్**
**మనముల సహృదయులకు నం**
**దనవనిషణ్ముఖమయూరనాట్యముతోచున్ !**

అంటూ నాకు అక్షరాక్షతలనందించారు.

అపార శిష్యవాత్సల్యంతో నా వివాహానికి పంచరత్నాలు రాశారు.

**వరుడు రామబాబు పురుషోత్తముడె కదా**
**మేరుశిఖరి మేటి మేథ యందు !**
**ఇందిరా వధూటి సౌందర్య విద్యాబ్ధి**
**మంచి జంట కుదిరె ఎంచి చూడ !!**

అంటూ వారి అమృత హస్తాలతో దీవించారు.

ఆచార్యుల వారికి నేను శిష్యుడినయితే వారి మనవడు నాకు శిష్యుడు. విద్యారణ్య స్వామి గారి అబ్బాయి, గురువుగారి పేరు పెట్టిన రామ కృష్ణ ప్రసాద్ కు నేను కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్ ని. అలా ఆ బంధం కొన సాగింది.

నేను కారు కొన్నప్పుడు మొదటిసారిగా అందులో ఆచార్యులవారు కూర్చోవాలని వారి ఇంటికి తీసుకు వెళ్లాను. వారు నా కోసం వచ్చి కారులో కూర్చున్నారు. మీ పాదస్పర్శతో మా ఇల్లు పునీతం కావాలని మా ఇంటికి తీసుకు వచ్చాను. ఆపై ఎక్కడికన్నా వెళ్దామన్నాను.పెన్షన్ ఆఫీస్ లో ఒక పని పెండింగ్ లో పడింది. అక్కడకు వెళ్దామన్నారు.

డ్రైవర్ కు అడ్రస్ చెప్పారు. అక్కడికి వెళ్ళాం. ఆ ఆఫీసరుది భీమ వరం. నండూరి వారి గురించి తెలిసినవారే.

"అయ్యో మాష్టారూ మీరొచ్చారా .. నేను చూస్తానన్నాగా.." అన్నారా యన.

"అదేం లేదయ్యా.. నా శిష్యుడు కారు కొన్నాడు. ఏదో ముచ్చటపడి బయటకు వెళ్దామంటే ఇటు వచ్చాం. నీకు గుర్తు చేద్దామని.. అంతే ! నీ మీద నాకు పరిపూర్ణవిశ్వాసం ఉంది. మీ ఆఫీసును శంకిస్తే సాక్షాత్తూ ఆ శంకరుని శంకించినట్టే.." అంటూ ఉపశమనంగా మాట్లాడారు. ఆ యుగం

లో శ్రీకృష్ణుడు రాయబారంలో ఎలా మాట్లాడాడో చూడలేదు కానీ, స్థిత ప్రజ్ఞత సమయజ్ఞత కలిగిన కార్యసాధకునికి కావలసిన సంభాషణా చాతుర్యం, మాటలతో నొప్పించని మనస్తత్వం వారి వద్ద పరిశీలించే అవకాశం లభించింది.

ఆ తరువాత నేను మరి కొన్ని పర్యాయాలు ఆ ఆఫీసుకు వెళ్లడం, ఫోన్ చేయడం ద్వారా వారు సంభాషించిన ధోరణిని కొనసాగించడంతో ఆ పని పూర్తయింది. ఆ విధంగా భర్తృహరి సుభాషితాల్లోని " ఆరంభించరు నీచ మానవులు .." అన్న థియరీకి ఆచార్యుల వారు పరోక్షంగా నాకు ప్రాక్టికల్స్ నేర్పించారు.

మేము ఆఫీసుకు వెళ్లినప్పుడు చాలామంది ఆచార్యుల వారిని ప్రత్యేకంగా చూశారు. కారణం.. వారు ఆ సమయంలో వచ్చిన "భారతీయుడు" సినిమాలో అచ్చం పెద్ద కమలహాసన్ లా ఉండేవారు.

ఆచార్యుల వారిది అనుక్షణం కృతజ్ఞతలు వ్యక్తీకరించే గొప్ప సంస్కార హృదయం. నా బ్రదుకు మలిసంజ కెంజాయలో కూడా శిష్య ప్రముఖులు నా యోగ్యతను మించి మన్ననలు కురిపిస్తున్నారు.. ఆచార్య ఫణీంద్ర కవి, ఆశుకవితావధాని,ఆధునిక శతఘంటకవి శ్రీ వెనిగళ్ల రాంబాబు అంటూ మమ్మల్ని ప్రస్తావించారు. మా తమ్మునికి కూడా ఆచార్యుల వారంటే వల్లమాలిన అభిమానం. వారి గ్రంథ ప్రచురణలో ఉడతాభక్తిగా ఆర్థికంగా సహకరించినందుకు ఆ విషయాన్నీ ప్రస్తావించారు. రాంబాబు సోదరుడు మేధావులలో మేరు శిఖరి శ్రీ ప్రసాద్ నేను తరచూ నెమరు వేసుకునే మాన్యుడు. తప్పనిసరిగా పేర్కొనవలసిన వదాన్యుడు..అని ఆలోచనము అవతారిక లో ప్రస్తావించిన ఆ మహనీయుని హిమనీనద స్పర్శకు కనులు చెమరుస్తాయి.

నా సినిమా పాటలు విడుదలైనప్పుడు కొన్నిసార్లు ఆ క్యాసెట్లు తెచ్చి వారికి వినిపించాను. వారు వింటూ పరవశంతో తల ఊపుతూ ఉంటే, నాకు పరమపదసోపానంలో నిచ్చెనలు ఎక్కినట్లుండేది.

"నిన్నే ప్రేమిస్తా" చిత్రంలో **"ఒక దేవత వెలసింది నా కోసమే "** (చిత్ర గారు పాడిన) పాట చరణంలో ఒకచోట ...

**"ఆ తారాతోరణమే మల్లెల హారం**
**చేరాలి మురిపాల సాగర తీరం.."** .. అని రాశాను.

హృదయంలో రామ చంద్రుని నిలుపుకున్న హనుమంతునిలా.. ఆచార్యుల వారి "తారాతోరణం" పదాన్ని నా పాటలో పదిలపర్చు కున్నాను.

మా పాప సంహిత ఎల్కేజీ లో ఉన్నప్పుడు వినూత్న పద ప్రయోగా లు చేస్తూ ఉండేది. మనీలు.. చిల్లర్స్ అంటూ.. ఆంధ్రం, ఆంగ్లం కల గలిసిన అదోక రకం మణి ప్రవాళ శైలిలో మాటలు సృష్టించేది.

పాపను ఒకసారి వారి వద్దకు తీసుకువెళ్లాను. నేను పాదాభి వందనం చేసి పాపతోనూ చేయించాలని చూశాను. వాళ్ళ అమ్మను చూసి పాప అప్పటికే తనంతట తానుగా పాదాభివందనం చేసేసింది. ఆచార్యుల వారు ' శతాయుష్మాన్ భవ ' అంటూ ఒడిలో కూర్చోబెట్టుకున్నారు. పాప భాషా సంలీనం గురించి వారికి చెప్పాను. ఇంగ్లీషులో బహువచనానికి ' ఎస్' అక్షరాన్ని తెలుగులో 'లు' అక్షరాన్ని ఉపయోగిస్తాం. కాని మా పాప ఆ భాషా సంప్రదాయాన్ని ఈ భాషకు, ఈ భాషా సంప్రదాయాన్ని ఆ భాషకు ఆపాదిస్తుంది.. అన్న వెనువెంటనే వారు "ప్రాక్ పశ్చిమ సమన్వయం అంటే ఇదే !" అన్నారు చిరునవ్వుతో.

"విబుధజనులవల్ల విన్నంత కన్నంత..తెలియ వచ్చినంత తేటపరుస్తుంది పోతన్న లాగా ఈ చిన్నారి" అన్నారు.

పాప నుదురు పట్టుకుని "యువర్ ఫాదరీజ్ ఎ పీహెచ్డీ డాక్టర్. బట్ యు మస్ట్ బి ఎ రియల్ మెడికల్ డాక్టర్ " అన్నారు సీరియస్ గానే.

వారి వాక్కు ఫలించింది.పాప ఈ సంవత్సరం ఎంబీబీఎస్ పూర్తి చేసి ఎండి (సైకియాట్రీ) లో చేరింది.

నండూరి వారు కుమారునిగా, సోదరునిగా, భర్తగా, తండ్రిగా, తాతగా జీవనదశ లన్నిటా నీరాజనాలందుకున్నారు. లెక్చరర్గా, ప్రిన్సిపల్ గా వారు అందించిన సేవలు, సాధించిన గౌరవ ప్రపత్తులు అనితర సాధ్యం. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా ఆనాడు రాష్ట్ర ప్రభుత్వానికే దిశా నిర్దేశం చేశారు. ఎందరికో కుటుంబ సమస్యలను పరిష్కరించి ఆత్మ బంధువులయ్యారు. తిరుపతి దేవస్థానం ప్రచురించిన ఎన్నో కావ్యాలకు పరిష్కర్తగా అకుంఠిత దీక్షతో శ్రమించి శారదాంబ ఋణం తీర్చు కున్నారు. ఎందరికో ఉపాధి కల్పించారు. వేదవిద్యార్థులను అర్చకులుగా అమెరికా పంపించి వారికి గౌరవప్రదమైన జీవన గమనాన్ని ఉప దేశించారు.

ఆచార్యుల వారు ..

**కదలి పోవునట్టి కాల స్రవంతిలో**
**పుట్టి గిట్టు చుండు బుడగలెన్నొ !**

అంటారు. కానీ.. ఆ కాల స్రవంతిలో బుడగలే కాదు.. చాలా అరుదుగా ఆచార్యుల వారి వంటి శతదళ శోభిత సువర్ణకమలాలు ఆవిర్భవిస్తాయి.

తమ పరిమళంతో.. ప్రకాశంతో.. కొన్ని తరాల చరిత్రను , సంస్కృతిని ప్రభావితం చేస్తాయి.

నండూరి రామకృష్ణమాచార్యుల వారిలో అన్నమాచార్యుల వారి చైతన్య విస్ఫోటనం ఉంది. రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం సంస్కరణ భావజాలాన్ని కొనసాగించిన సారస్వత నేపథ్యం ఉంది.

మరణ మంగళా శాసనం రాసిన స్థితప్రజ్ఞులు వారు.

"భార్య మగ్గరాదు పసుపు కుంకుమ వీడి"

అంటూ వికట కర్మకాండలు వద్దన్న ప్రగతిశీల ప్రవక్తలు వారు.

**అంతము చెందు ఈ భువి సమస్తము- సృష్టియె దిగ్దిగంత వి**
**శ్రాంతమశాశ్వతమ్ము రవిచంద్రుల తోడ-మనుష్య చావు ఓ**
**వింత ఉదంతమా? వికట వేదనలెందుకు ? సర్వతాప ని**
**ష్క్రాంత మవశ్య మంగళము- చావొక స్వస్తి వరప్రసాదమే !**

అన్న ఆ అక్షర దార్శనికుని, అభ్యుదయ వైతాళికుని శత జయంతి సందర్భంగా వారిని " సామ్యవాదమహర్షి" అని సంబోధిస్తూ నివాళి సమర్పించాను.

## సామ్యవాద మహర్షి !

**నండూరి రామకృష్ణులు**
**పండిత ప్రాచార్యవరులు ! పద్యకవీంద్రుల్ !**
**నిండెను యశస్సు తారా**
**మండలమే ! నోటి వాక్కు మంగళకరమే !!**

**అమరులౌ స్వాతంత్ర్య సమరయోధుల వంశ**
**సంజాతమా ! మిమ్ము సన్నుతింతు !**
**సంస్కృతాంధ్రవధాన శక్తిపీఠము మీరు !**
**ఆచార్య ధీవరా ! అంజలింతు !**
**అద్వితీయమ్ము మీ ఆంగ్ల వైదుష్యమ్ము !**
**సంస్కార రసధునీ ! సన్నుతింతు !**
**భాష్యకార్లను మించు శిష్య సంతతి మీది !**
**అధ్యాపకోత్తమా ! అంజలింతు !**

**స్వర్ణ సౌజన్య శిఖరమా ! సన్నుతింతు !**
**సౌమ్య సామ్యవాదమహర్షి ! సన్నుతింతు !**
**ఆత్మ యోగీ ! విరాగి ! మీకంజలింతు !**
**అరుణకిరణాల చరణాలకంజలింతు !!**

**మార్చవచ్చును ఊర్లు!మార్చవచ్చును కార్లు!**
**మార్చరాదన్నారు మాన్య సతిని !**
**ఆడంబరమె కాని ఆశుకవిత్వమ్ము**
**సరసు కాదన్నారు స్నానమాడ !**
**మరణమైనను గాని ధరణిని మంగళా**
**శాసనమన్నారు సాహసించి !**
**జ్ఞాన దీప్తిని పంచు మానవత్వము చాలు**
**మరచిపొమ్మన్నారు మతము నైన !**

**వేద వాఙ్మయమ్ము వేమన్న వాదమ్ము**
**కొంత హేతువాద చింతనమ్ము**
**హాస్యచతురతలనవశ్యమ్ము సంధించు**
**వ్యాస ! శతజయంతి వందనమ్ము !!**

* * *

ఈనాటికీ ఆ మహనీయునికి అక్షరాభిషేకాలు జరిపిస్తూ.. నిరంతర సారస్వత యజ్ఞక్రతువులు నిర్వహిస్తున్న వారి వంశీకులు ధన్యులు!

**దారి చూపలేవు ధరణిలో దీపాలు**
**ధర్మదీప్తి ఒకటి దారి చూపు !**

ఇది ఆచార్యుల వారి సంకల్పం..

**ప్రమిద ఎడద లోన ప్రజ్వరిల్లగ చేసి**
**వెనుక చూపు వీడి వెడలవలెను !**

ఇది ఆచార్యుల వారి సందేశం !

ఆనాడు..వారి ప్రతి కదలిక మాకు అనుసరణీయం !

ఈనాడు.. ప్రాతస్మరణీయం !!

**ఆచార్య దేవో భవ !**

# డా॥ డి.ఎ.వి.ఆర్.కే. ప్రసాద్ (నమస్కృతి)

కదులుతున్న కవిత్వంలా నడుస్తున్న నవత్వంలా
మాటాడుతున్న మానవత్వంలా రచనల్లో జీవిస్తూ
జీవితాన్ని రచిస్తూ అలరారే ఆచార్యుని
ఆలోచనా కృతి వెలువడే ఈ సంతోష తరుణంలో

ఈ రసమయ సమయంలో అభిమానపు పూపొదలో దాగి దాగి మహానంద మకరందం తాగితాగి మత్తిల్లిన కవన భ్రమర ఝుంకార మిది కృతిలా ఆకృతి దాల్చిన వినయ నమస్కృతి ఇది జగతి జనుల సుగతి కొరకు "ప్రగతిగీత" రచియించి " వెన్నెల వడగళ్ళ" తోటి "పన్నీటి జల్లు" కురిపించి సంప్రదాయ సరస్వతికి "తారాతోరణ " మమర్చి పలు విధాల నవపథాల పయనించే ప్రాచార్యుల కవనానికి నమస్కృతి !

అభిమానం ఆత్మీయత రంగరించి ఆదరించిఆశీస్సుల నందించే రామకృష్ణమాచార్యుల హృదయానికి నమస్కృతి !

"తారాతోరణ" మాదిగా తెలుగు పద్యానల్పశిల్పంబు లెం
తో రంజిల్లెడు పద్య గద్య కృతు లెన్నో గూర్చి శీర్షంబుపై
తోరంబౌ కవితా కిరీట మణి కాంతుల్ మీరగా - వాఙ్మయ
క్షీరాబ్ధిన్ హృది నింపుకొంటివి రసర్షీ ! జన్మ ధన్యంబుగాన్!

***** డి.ఎ.వి.ఆర్.కే. ప్రసాద్ *****

# పురాణపండ వైజయంతి

## (ఉషశ్రీ గారి మూడో కుమార్తె)

### ఉషశ్రీ కోసమే తెలుగు బి. ఏ. ప్రారంభించిన గురువర్యులు !

నండూరి రామకృష్ణమాచారి గారి దగ్గర నాన్న (ఉషశ్రీ) చదువుకున్నారు. ఆయనకు శిష్య వాత్సల్యం ఎక్కువని గురువు గారి గురించి తరచుగా చెబుతుండేవారు. నాన్న చదువుకునే రోజుల నుంచే సాహిత్యం మీద అభిలాష మెండుగా ఉండటంతో, పరీక్షలు కూడా సరిగ్గా రాసేవారు కాదు. ఏళ్లు గడిచిపోతున్నా ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయట్లేదు.

ఒకసారి మా మామ్మ (నాన్న వాళ్ల అమ్మ) పురాణపండ కాశీ అన్నపూర్ణమ్మ... గురువుగారితో – 'ఈ సంవత్సరమైనా మా అబ్బాయి పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యేలా మీరు దండించండి' అని చెప్పారట. అప్పట్లో నాన్న గురువుగారి ఇంట్లోనే ఉండేవారు. అన్నపూర్ణమ్మ గారి ఆవేదనను నాన్నకు చేరేలా చేయాలనుకున్నారు. నాన్న.. గురుపత్ని సుభద్రమ్మగారిని తల్లిలా భావించేవారు. ఆవిడ చేతి భోజనం చేసేవారు. ఆవిడ మాటకు ఎదురు చెప్పేవారు కాదట. సుభద్రమ్మగారి ద్వారా ఈ విషయం నాన్నకు తెలియచేయాలని నిశ్చయించుకున్నారట.

ఒకరోజు సుభద్రమ్మగారు నాన్నకు అన్నం వడ్డిస్తూ, 'దీక్షితులూ (నాన్నని వారంతా దీక్షితులు అనే పిలిచేవారు) ఈ సంవత్సరం నువ్వు పరీక్ష రాసి, ఉత్తీర్ణుడివి కావాలి. లేకపోతే నా మీద ఒట్టు' అనేశారట. అంతే ఆవిడ మాటను రామ బాణంలా, సుగ్రీవాజ్ఞలా స్వీకరించి, ఆ సంవత్సరం పరీక్ష రాసి గట్టెక్కేశారట. ఈ విషయం గురువుగారే స్వయంగా చెప్పారు.

ఉషశ్రీ కోసమే – నాన్నకి తెలుగు సాహిత్యం మీద ఉండే మక్కువ చూసి, నాన్న కోసమే భీమవరం కళాశాలలో తెలుగు బి. ఏ ప్రవేశపెట్టానని, నేను పి. హెచ్.డి సందర్భంలో కలిసినప్పుడు గురువు గారు నాతో ఆనందంగా అన్నారు. గురువుగారు అలా తెలుగు బి. ఏ. పెట్టడం నాన్నకి చాలా సంతోషం కలిగింది.

అప్పట్లోనే తెలుగు సాహితీ లోకంలో దిగ్గజాలుగా ఉన్న కవిసమ్రాట్ వంటి వారిని కాలేజీకి పిలిచి, ఉపన్యాసాలు ఏర్పాటుచేశారని కూడా గురువు గారు చెప్పారు.

గురువుగారి మీద ఉండే అభిమానం కారణంగా అప్పట్లోనే నాన్న తన స్నేహితులందరినీ కూడగట్టుకుని, 'తారా తోరణం', 'శీర్ణమేఘుల' పుస్తకాలు ప్రచురించారని కూడా గురువు గారు చెప్పారు. అలాగే వారి అమ్మాయి పెళ్లి సందర్భంలో.. భోజనాల సమయంలో నడుముకి కండువా బిగించి, వడ్డన చేశారని కూడా చెప్పారు.

ఒకసారి గురువుగారు ఒక సభకు వస్తుంటే, అక్కడి ప్రేక్షకులంతా, 'ఉషశ్రీ గారి గురువు గారు, ఉషశ్రీ గారి గురువుగారు' అని అంటుంటే తాను పరవశించిపోయానని కూడా గురువుగారు స్వయంగా చెప్పారు.

ఇంతటి వాత్సల్యం గల గురువులు చాలా అరుదుగా ఉంటారని నాన్న ఎప్పుడూ చెబు తుండేవారు.

నాన్న షష్టి పూర్తి సమయంలో నాన్న... గురువుగారిని ఆహ్వానించి ఆయనను సన్మానించుకుని మురిసిపోయారు. ఆయన సమక్షంలో తన షష్టిపూర్తి జరగడం నాన్నకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

1997లో గురువుగారిని నేను ప్రత్యక్షంగా కలిసిన ఆనందం ఈ రోజుకీ మరువలేను.నాన్న గురించి ఆయన పదే పదే.. 'మీ నాన్నకు అస్సలు కుదురు లేదు. సరిగ్గా ఒక్క సెకను కూడా ఒక చోట కూర్చోడు. పెళ్లి పీటల మీద నుంచి కూడా అర గంటకోసారి లేచేశాడు' అని మురిసిపోతూ చెప్పడం నాకు ఇప్పటికీ తడి ఆరని జ్ఞాపకమే !

# డా || వింజమూరి లక్ష్మి

## (నండూరి రామకృష్ణమాచార్య: సాహిత్యానుశీలనము -వ్యక్తిత్వం)

## అష్టావధానిగ ఆచార్యులవారు:

ఆంధ్ర వాఙ్మయమున అవధానము ఒక విశిష్ట ప్రక్రియ. అవధానము అను పదము 'అవ' అను ఉపసర్గతో కూడిన 'ధా' ధాతువు నుండి ఉత్పన్నమైనది. దానికి ఏకాగ్రత లేక తత్పరత అని భావము, అనగా చిత్తము బహువిషయములందు సంచరించుచున్ననూ, వానిలో లీనము కాకుండ యథాతథముగ స్మృతిపథములో నిల్పుకొనుట యనునది అవధాన ప్రధాన లక్షణముగ తేలుచున్నది. అవధానము కలవారు అవధాని.

అవధానము కవియొక్క అపూర్వమైన ధారణాశక్తికి, నిరర్గళధారకు ప్రతిబింబములు. ఆశుకవితాకౌశలమునకు ప్రబలమైన తార్కాణ ములు. గ్రంథ రచనా శిల్పమునకును, అవధానకవితకును ఎంత యో భేదముగలదు. గ్రంథ రచనకావించు కవి ప్రశాంతముగ కూర్చుండి రచింపవచ్చును. కాని అవధాని అత్యల్పకాలమున అనల్పమైన భావనా శక్తిని, ధారాశుద్ధిని ప్రకటింపవలసియుండును. అవధానము నందు పలు భేదములు కలవు. అష్టావధానము, శతావధానము, నేత్రావధానము మొదలగునవి.

అష్టావధానమనగా విభిన్నమగు ఎనిమిది అంశముల యందు ఒకేసమయమున మనసును కేంద్రీకరించి యుంచుట. ఈ ఎనిమిది అంశముల విషయమున పలు భేదములు గలవు. అవధానము రమణీయముగా జరుపుట కావ్యకమగు సాధన సామగ్రిని ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు ఇలా వివరించిరి.

**'అసమానంబగు పాండితీ గరిమ, సద్యఃస్ఫూర్తి, హాస్యోక్తి వి**
**న్యసనం బాశుకవిత్వ దక్షత, పురాణోక్తి ప్రబోధ క్రియో**
**ల్లసనం, బద్భుత ధారణా మహిమ, అత్యావశ్యకంబుల్ సుధీ**
**రసికుల్ మెచ్చవధానకార్యము సభారమ్యంబుగ జేయగన్'**

అవధానమునకు సాధారణముగా మూడు నాలుగు గంటల కాలము పట్టును.

పింగళి లక్ష్మీకాంతముగారి కనుంగు శిష్యులైన ఆచార్యులవారు విద్యాభ్యాస మైన పిదప తొలిరోజులలో కొన్ని అవధానములను నిర్వహించి నారు. చక్కని సమయస్ఫూర్తితో, పరిహాస రసికతతో, కవితా ప్రాగల్భ్య ముతో, వీరి అవధానములు సాగెడివట. సంఖ్య తక్కువైనను, నిర్వహించిన అవధానములు విశేష ఖ్యాతినందినవి. కాని, గురువు కోరిక పై ఆచార్యులవారు నిర్వహించిన అవధాన విశేషముల నరయుదము.

ఆచార్యులవారి మేనమామ శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులగారును అష్టావధాని. అయన పెంపకం, పండిత గోష్ఠుల ప్రభావము, చిన్ననాటినుండి వీరిపై ప్రసరించింది. ఏలూరి పురవాస్తవ్యులైన బ్రహ్మశ్రీ గరికపాటి మల్లావధానిగారు వీరికి గురువులు. వారిని-

**'సల్లలిత మనస్వీ - మల్లావధాని ఆ**
**దేశభక్తుడైన దేశికుండు**
**అమృత హృదుడు - నేర్పె అష్టావధానమ్ము**
**ఆగురుత్మునకు – అంజలింతు.**

అని స్మరించిరి. అష్టావధానమును గురించి -

**'ఆంధ్ర భాషనున్న దష్టావధానమ్ము**
**వేరుచోట లేదు వెదకి చూడ**
**తెలుగు తళుకు బెళుకు - స్థిరతటిల్లత వలె**
**విశ్వమెల్ల వెల్లి విరియజేయ'**

అని ప్రశంసించిరి. కాని అష్టావధానిగానే జీవితమును గడపరాద నుచు -

**'అవని పుట్టవచ్చు - అష్టావధానియై**
**చావరాదు అట్లే జగతియందు**
**కావ్యసృష్టి జేసి - కవి చిరంజీవియై**
**బ్రదుకదగును-వెలుగుబాటవేసి.**

అష్టావధానిగ నుండవచ్చు కాని కవిత్వమును వ్రాయవలెనని తెల్పినారు.

1938లో మొదటిసారిగ ఏలూరు హిందూయువజన సమాజ మందిరములో అష్టావ ధానము చేసినారు. ఆ సభకు అప్పటి అమాత్యులు వి.వి.గిరిగారు ప్రారంభకులు.

**'ఇటు గోదావరి కృష్ణవేణి అటు హేలాపురి వైభవో**
**త్కట సంగీతము లాలపించు కవితా కర్పూర నీరాజనం**
**బిట చాళుక్యసంభ్రాంతరాళములయందె వెల్గె తొల్దొల్తది**
**క్తటమున్ కమ్మని తేటతెల్గు(నుడివాకన్ నిండి పొంగా రగన్'.**

అని ఆశుకవితను చెప్పినారట'

1945లో భీమవరంలో శ్రీ అర్క సోమయాజులుగారి అధ్యక్షతన అవధానము చేసారు. అప్పుడు అడవి బాపిరాజుగారు పృచ్ఛకులలో నొకరట. వేరొకసారి పింగళి లక్ష్మీ కాంతము గారు అధ్యక్షులుగ నుండగ అప్పటి కలెక్టరుగారు రామకృష్ణమరాజుగారి ఆధ్వర్యమున అష్టావధానము చేసినారు. కలెక్టరుగారి కిరువురు తమ్ముల. వారు ఆచార్యులవారి ప్రతిభను పరీక్షించుచు దత్తపదిగ 'మార్పు - మార్పు -మార్పు-మార్పు' అని ఇచ్చినారు. ఆచార్యుల వారు దానిని వెంటనే ఇలా -

**ఏది శాశ్వతము? ఏది ప్రాచీనమ్ము**
**సృష్టిలో స్వభావ సిద్ధమేది?**
**నిత్యసత్యమేది? నిత్యనూతనమేది?**
**మార్పు - మార్పు - మార్పు -మార్పు మార్పు.**

పూరించారు. వారడిగినది నాలుగు మార్పులైతే, ఐదు మార్పులలో జవాబిచ్చిరి. ఏడుపును గురించి కవిత చెప్పమని అడిగితే -

**జననిగర్భాన నుండి పుట్టినక్షణంబె**
**కెవ్వుకెవ్వుల ఏడ్చితి నవ్వకుండ**
**ఏడ్పుచేలకో తెలిసిన దిపుడు నాకు**
**దినదినమ్మును గల, చెడు తెరలు చూడ**

అని ఆశువుగ, చెప్పట్లు మారుమ్రోగినవట, తరువాత అధ్యక్షులపై, అన్నదమ్ములపై ఆటవెలది ఛందమున చెప్పమని వారడిగినారు.

**'ఆకాశమ్ముతోడ అనుజుండు ధూమమ్ము**
**భూమితోడ పొలుపు బాడిదయును**
**అగ్నిహోత్రునకును అన్నదమ్ముల మటంచు**
**విశ్వదాభిరామ వినురవేమ'**

అని చమత్కారముగ చెప్పగనే సభ్యుల ఆనందమున కవధి లేదు.

ఇంకొకసారి అవధానము చేయుచున్నప్పుడు ఆచార్యులవారిని పృచ్ఛకులు మీరు మర్చిపోలేని ప్రాచీన సంఘటనను శృంగార రసములో చెప్పమని అడిగిరి. అంత ఆచార్యుల వారు -

**'పాటలుపాడ నన్ను పసిబాలు నూయాలలోన నూచుచున్**
**ఆటలు నేర్చు దాదిని రహస్యముగ పాదరింటిలోనికిన్**
**పైట చెరంగు పట్టి పెరవాడెవడో తరలించు దృశ్యమున్**
**మాటలు వచ్చినంతనే మాతకు చెప్పదలంచినాడనే'**

అని కల్పనతో శృంగార రసమున చెప్పిరి. ఈ తడవ కరుణరసమున తెలుపుడు వారడు గగనే -

**'స్ఫోటకపు బాధచే వడలు సోలి పరుంటిని ప్రక్కలో**
**మాటికి మాటికిని మరల మంచముపై కెగబ్రాకు తెలునన్**
**కాటులు వేయకుండ తన వ్రేళులతో విదిలించి ఎన్నియో**
**కాటులు తిన్న తల్లి కృప కారణజన్ముడనై తరించెదన్'**

అని తన మాతృదేవి తనకై చేసిన త్యాగమును, యదార్థ దృశ్యమును కవితగ నాలపించిరి. ఈ రెండును సమకాలికము లనుట కిందలి టకార్‌ప్రాస తోడ్పడుచున్నది.

ఆచార్యుల వారొనర్చిన అవధానములలో రెండు ముఖ్యమైన సమస్యా పూరణ లివి -

**'గోడకు గోడకున్ నడుమ గూర్చిన దూలము మధ్యనుండి, వ్రే**
**లాడెడి దేవళాన ఒక అద్దము ఊయల మంచమందు, ఆ**

**వాడగలట్టి గృహపంక్తులు తోచెడి బింబితమ్ముౖలై**
**మేడలు మిద్దెలున్ తరచు మేదినిపైబడు గాలి వీపునన్'**

**'పెండ్లి పందిరిన్ వెలసె వేడుక బొమ్మలు వింతగ కనుల్**
**పండువుచేయ లేచెను విలాసము మీర వరుండు దీర్ఘ బా**
**హండు హటాహటిన్ శుభముహూర్తపు సందడి సంభ్రమమ్ముౖల్**
**తొండముతోడి సింహము వధూమణి పైబడె తాళిగట్టిగన్'**

ఆచార్యుల వారెన్నో అవధానముల కధ్యక్షులుగను యుండిరి. నరాల రామిరెడ్డి, మేడసాని మోహన్, కవితా ప్రసాదు, మొదలైనవారి అష్టావధానములకధ్యక్షులుగ నుండిరి. శ్రీ మాడుగుల నాగఫణిశర్మగారు అనంతపురము నందు చేసిన దశగుణిత అష్టావధానమున కధ్యక్షత వహించారు.

ఈ విధముగ చేసిన అవధానముల సంఖ్య తక్కువైననూ ఆచార్యులవారి సమయస్ఫూర్తి, పాండిత్యము వెల్లడగుచున్నది. క్రమముగ అవధానములు తగ్గించి, కవిగ రాణించుచు, తన అనుయాయులకిట్టు సందేశమిచ్చినారు.

**'కావ్య సృష్టి చేసి కవి చిరంజీవియై**
**బ్రదుకదగును వెలుగు బాటలోనే'**

## ఆంగ్ల పండితులు:

ఆచార్యులవారి ప్రాథమిక విద్య కోరుకొండలో జరిగింది. మరంగంటి వెంకటాచార్యుల వారు వీరికి ఆంగ్లభాషల ప్రప్రథములగవచ్చుట, సర్ జార్జి స్టేన్లీ 'బంగారు పతకము నందు కొనుట జరిగినవని జీవిత చిత్రణమున చెప్పుకొంటిమి. ఒక తెలుగు విద్యార్థికి పతకము లభించుట ఆశ్చర్యకరమైన విషయము అందుకే కృతజ్ఞతతో ఆచార్యుల వారు-

**'వెలుగుబాట వేసి - వేంకటాచార్యుండు**
**కోరుకొండ వాసి - గొప్పగురుడు**
**ఆంగ్ల భాష నేర్పి - ఐదం యుగీనమౌ**
**తాళపు చెవినాకు - దానమిచ్చె'**

అని గురువును స్మరించిరి. అంతేగాక అబ్బూరి రామకృష్ణారావుగారి ప్రభావముతో, ప్రోత్సాహముతో పాశ్చాత్య గ్రంథాలు చదువుట ప్రారంభించారు. స్వయం ప్రతిభ, గురువుల ప్రోత్సాహము వీరి ఆంగ్ల పాండిత్యమునకు పునాదియైనది.

1942లో గుంటూరులో ఆంధ్రా క్రిష్టియన్ కళాశాలలో అధ్యాపక పదవి లభించుట, అచటి ప్రిన్సిపాల్ ఆంగ్లేయుడైన 'సైప్స్' వీరిని గౌరవించుట ఆంగ్ల పాండిత్య ప్రభావమే. భీమవరములో వీరికి పేరు ప్రఖ్యాతులు వ్యాపించుటకు, అనంతరకాలమున ప్రమోషన్ వచ్చుటకును ఆంగ్ల పాండిత్యమే కారణమైనదన వచ్చును.

కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు, వీరి ఆంగ్ల పాండిత్యమును ప్రశంసించుచు చెప్పిన వాక్యములు గమనించదగ్గవి. 'ఆంధ్ర సాహిత్యము ఇతర భారతీయ సాహిత్యములలో గౌరవము నొందుటకు ఆచార్యులవారి వంటి కవులు కావలెనను' విశ్వాసమును కూడ నుంచిరి.

అనంతపురములో తెలుగు శాఖాధిపతిగ నున్నపుడు విద్యార్థులకు ఇంగ్లీష్ కూడ చెప్పేవారట. అనంతపురమునందే ఇంజనీరింగ్ కాలేజిలో శ్రీ పోలా ప్రగడ సత్యనారాయణ గారు ఇంగ్లీష్ లెక్చరర్ గ నుండిరి. వారు 'ఇంగ్లీష్ లిటరసీ క్యాంప్' నిర్వహించుచు, ప్రారంభోత్సవమును ఆచార్యులవారితో చేయించారు. ఎందరో ఇంగ్లీష్ లెక్చరర్లు, ప్రొఫెసర్లు ఉండగ తెలుగు లెక్చరర్ అయిన ఆచార్యులవారి వాహ్వానించుట మేమిటని అక్షేపించసాగారు. సభ ప్రారంభమైనది. ఆచార్యులవారు ఉపన్యసించు చుండిరి, అంతకు ముందు ఆక్షేపించినవారంతా ఆచార్యులవారి ఆంగ్ల ఉపన్యాస మున కానందించి, ప్రశంసించసాగారు. వీరి ఆంగ్ల పాండిత్యమట్టిది. బి.ఎ.జనరల్ క్లాసులో అనువాదం చేయించునపుడు విద్యార్థులచే ఎంతో ఉత్సాహముగ చేయించేడివారు. అంతేగాక అందు సామర్థ్య ము కలవారిగ రూపొందించెడివారు.

ఒకానొకపుడు మిత్రులతో చర్చలు జరుగునపుడు అనేక విషయాలు చర్చించు కొనెడి వారు. "Life is pendulam between a tear and a Smile" - అను వాక్యమును అను వదించుట కందరు రకరకములుగ

చెప్పగా ఆచార్యులవారు 'జీవితము కన్నీటి బిందువులకు, పన్నీటి చిందులకు మధ్య ఉయ్యాల ఊపు' అని అనువదించినారు. అటు ఇంగ్లీష్ ఇటు తెలుగు జాతీయములు తెలిసిన వ్యక్తి యుగుటవల్లనే ఇంత చక్కని వాక్యమేర్పడిందన వచ్చును. బహుముఖ ప్రజ్ఞావంతులైన ఆచార్యుల వారాంగ్లమున గ్రంథములు రచించిరి. అవి. 1. గెంజిగాధ, 2. మహాభారతము, 3. గాంధీ చరిత్ర, 4. ఆంగ్లసూక్తుల సంకలన గ్రంథము (Wisdom of the World).

## వసుధైక కుటుంబి:

**'జన్మ చేత జనులు సౌశీల్యవంతులే**
**పాడుచేయు చుండు-పరిసరములు**
**అంతరాత్మభోధ-ఆలకించుట మేలు**
**సమత స్వేచ్ఛ-మనుజ జన్మహక్కు'**

అన్న ఆచార్యులవారి వాక్యములు స్మరించుట అవసరము. ఆంగ్ల పండితులు రూసో చెప్పిన వాక్యములకనుసరణమిది. మానవులందరు సమానమన్న సత్యము నెందరో ఎన్నో విధములుగ కవిత లల్లిరి. కాని సర్వసమాన సహజమైన స్పందన, దాని కనుగుణమైన వస్తువు నెన్నుకొనుట యందు కవి ఆత్మ గోచరించును.

**'కులమతములు గీచుకొన్న గీతల చొచ్చి పంజరాన కట్టువడను నేను**
**నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తిరుగు లేదు విశ్వనరుడ నేను'**

అని ధైర్యముగ చాటిచెప్పినారు జాషువా. ఎందరో తమ కవిత్వమును జాతి కంకితము గావించిరి. ఆచార్యులవారును అట్టి అంకిత భావముతోనే రచించిరని కొందరు ప్రముఖుల అభిప్రాయము వెలిబుచ్చిరి. వీరి ప్రియశిష్యులు శ్రీ శనగన నరసింహస్వామి ఇలా అంటారు.

**'హృదయ మమృత సముద్రము**
**వదనము కవితా లతాంగికి నర్తనశాల**
**సదనమతిథి కోటికి నాటి ఋష్యాశ్రమము**
**విశాల వసుధా కుటుంబి - నీసాటి నీవే'**

యని ప్రశంసించిరి. కీర్తిశేషులు శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు-

> **'ఎవ్వాని కలములో నివ్వటిల్లెను విశ్వభారతీ మంజు మంజీరరవము'** అని ఆచార్యులవారి విశ్వమానవ సౌభాతృత్వమును నుగ్గడించిరి.

శ్రీ వంగల పార్థసారథి -

> **'విశ్వ సంస్కృతి జ్యోతిగ - సర్వదా వెలుగు చుండును మానవతా పతాకమే'** అని ఆచార్యులవారి మానవతను ప్రశంసించిరి.

ఆచార్యులవారి కవిత్వమున విశ్వమానవత ఎట్లు ప్రసరించినది. అరయుదము.

బాల్యమున మేనమామల పెంపకము, అధ్యాపకుల ప్రోత్సాహము, ఆంగ్ల పాండిత్యము వీరి వసుధైక తత్త్వమునకు గీటురాళ్ళయి నిలచినవి.

తారాతోరణమున 'ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతి:' అను శీర్షికలో నవ్య నాగరికత ఎంత వెఱ్రి తలలు వేయుచున్నదో వివరించి, అవేదన నొందినారు. మానవజాతి నశించి పోవు రోజులు వచ్చినవి. దానికి కారణము శాస్త్ర విజ్ఞానము, ఆటంబాంబులతో, పరస్పర విద్వేషము లతో జాతి నశింపబోవు తరుణమున కవులందరు సమాయత్తులై విశ్వజనీన గేయము లల్లవలెనని కవులనుద్దేశించుచు-

> **'సకల ధరణి శాసన పరిపత్తు తోడ**
> **ప్రజలు వసుధైక సామ్రాజ్య పౌరులగుచు**
> **భూమి యేక కుటుంబమై పొందునంది**
> **విశ్వమానవ కల్యాణవేది యగును.**

అని ఆశించినారు. ప్రప్రథమరచన తారాతోరణమందలి కవితలో విశ్వనాశ పరిణామ మును గూర్చి వారుపడిన ఆవేదన వెల్లడగుచున్నది.

'విన్నపము' శీర్షికలో తా నీ  కవిత రచించుట కీర్తిప్రతిష్టలకు, ధన సంపాదన కొరకు కాక-

**'మానవతా పతాకమౌ హేతువుకోసమే జగతి యెల్లలనెల్ల**
**విశాల దృష్టి నిర్భితిగ – విశ్వతోముఖ గవేన్మేషణ సల్పు ప్రమాణ**
**బుద్ధి సంకేతముగా' ...................** /*ప్రగతి గీత*/

తానీ  రచన కావించుచుంటినని ఎలగెత్తి చాటినారు.

'నరకములో  నవోదయము' శీర్షికలో సమసమాజ స్థాపన కావాలన్న ది కవి ఆశయముగ ద్యోతకమగుచున్నది. ఇందు కవి తరచు 'విశ్వవిప్లవ విజ్ఞాన వీరసమితి' సామ్యవాదము నకు జయము' అను పదముల నుపయోగించినారు.

'స్వర్గారోహణమందు' కవి ఇట్టు కోరుకొనినారు.

**'సమత - స్వేచ్ఛ - విశ్వసౌభ్రాత్ర భావమ్ము**
**లెల్లలెల్ల మరచి యేకమగుత**
**వచ్చుగాక వేగ వసుధైక రాజ్యమ్ము**
**విశ్వశాంతి వెల్లి విరియజేసి' –** *ప్రగతిగీత*

ప్రపంచ చరిత్రలో 1988 ఆగష్టు ఆరో తేదికి విశ్వశాంతి సంస్మరణ దినముగ పరిగణించారు. మొదట 1919లో హిరోషిమాపై తరువాత నాగసాకిపై రెండవ బాంబు పడింది. నిమిషాలలో ప్రకృతి అంతయు అగ్నిదగ్ధమై బూడిద బుగ్గిగా మారిపోయింది. ఇదే తుది ప్రపంచ సంగ్రామమని చెప్పిన 25 ఏండ్లు తిరక్కుండానే అంతకంటె భయంకర మైన ద్వితీయ ప్రపంచ సంగ్రామం 1944లో వచ్చింది. మరోసారి వస్తే, అది తృతీయ సంగ్రామము కాదు. ఆదిమ మానవ సంగ్రామమవుతుంది. కాలపురుషుని గుండె గడియారము చెడిపోతుంది. ఇదేనా మానవాళికి ఆవశ్యభవితవ్యము? అని ప్రశ్నించి ఆవేదన నొందారు ఆచార్యులవారు. ఆనాడు ప్రహ్లాదుడు తండ్రితో ఇంద్రియానీకము చిత్తమును చీల్చిన నీకు భూతకోటిలో విరోధిలేడని పల్కెను. కాని నేటి స్థితిని చూచెనా ఇట్లనును.

**'నాడు రాయి విసిరె - నేడు రాకట్టు రా**

**మనిషి హృదయమేమి - మారినట్లు**
**చచ్చుగాక పిచ్చి జాతీయ భేదముల్**
**వసుధమీద మనిషి బ్రదుకుకొరకు'**

అని చెప్పాలి. ప్రహ్లాదుడు, బుద్ధుడు, గాంధీలు నడచిన నేలపై నివసించే భారతీయుడే, భూమిపై మానవునిగ మనలేక పోతున్నారని ఏకాంత శాంతి తపస్సు చేయు వేదాంతులు వాపోవుచున్నారు. ఈ అణుయుగములో మానవులంతా ఏకమై, జాతి విభేదాలు విస్మరించి ఎల్లలు మరచి -

**'సకల మానవ శాసన పరిషత్తు ఏర్పడాలి**
**వసుధైక ప్రభుత్వమవతరించాలి'**

అని ఆశిస్తున్నారు కవి. ఇంకా -

**'సకల జనులు వసుధ శాంతి సౌఖ్యాలతో**
**ఓలలాడ గోరుచుందు నేను**
**చెరపివేయు మన్ని సరిహద్దు గీతలు**
**పుడమిలోన మనిషి యెడదలోన**
**అసలు పెద్దమనిషి - వసుధైక పౌరుండు**
**మంచితనము విశ్వమతమే సుమ్ము'** - *ప్రగతి గీత.*

అని చాటి చెప్పిరి. కావున విశాలవసుధైక రాజ్యమును కోరుకొన్న అభ్యుదయ కవి ఆచార్యులవారనుటలో విప్రతిపత్తి లేదు.

## వ్యక్తి చిత్రణము:

మహాకవి, మహాపండితులైన ఆచార్యులవారు వ్యక్తిగ నెట్టివారో, స్వభావ మెట్టిదో మొన్నగు అంశములు తెలిసికొనుటకు సాహిత్య పాఠకులుత్సాహము చూపుదురు. వ్యక్తిగ వీరి గురించి తెలిసికొనుటకు నాలుగు రకములైన సామగ్రి లభించుచున్నది.

1. శిష్యప్రశిష్యులు అందించిన సమాచారము.
2. కావ్యములందు వ్యక్తా వ్యక్తముగ కన్పించు కవి ఆశయములు.
3. సమకాలీనులు కవిపై రచించిన కవితలు.

4. ప్రత్యక్షముగ నేను పొందిన అనుభవములు.

మొదటగ నా అనుభవమును చెప్పదలచితిని. నేను ఉద్యోగమున చేరిన తొలి రోజులలో ఆచార్యులవారు రచించిన విక్రమోర్వశీయము రెండవ సంవత్సరం బి.ఏ. చదువు విద్యార్థులకు పాఠ్య గ్రంథముగ నుండేది. అది చెప్పునపుడే ఆచార్యుల వారి సాహిత్యము చదవవలెనను కోరిక కల్గి, అయన సాహిత్యమును ఒకొటొకటిగ చదవ నారంభించితిని / ఆ ప్రేరణవల్లనే పి.హెచ్.డి. పట్టము కొరకు వస్తువుగ తీసికొనుట, ఈ గ్రంథరచనకు దారి తీయుట జరిగినవి/ మొదట ఆచార్యులవారిని కలిసినపుడు వారు ఎంతో ఆదరమున పలుకరించి, నన్ను ప్రోత్సాహించినారు. ఆ సందర్భమునే వారి మహోన్నత వ్యక్తిత్వము, ఆతిథ్యము నన్ను విస్మయపరచినది. ఎల్లపుడు శిష్యులతో, సాహితీబంధువులతో, విశాలమైన వీరి భవనము నిరంతరము కళకళలాడుచున్నది. సంపన్నులందరు దానగుణము కల్గియుండరు. కొందరు కీర్తి ప్రతిష్టలనాశించి దానము చేయుదురు. మరి కొందరు గుప్తముగ తోచిన వానిని దానమొనరింతురు. ఇతరుల కష్టములను చూచి సహాయ మొనర్చెడి మనసు ఆచార్యులవారిది. ప్రతిఫలాపేక్ష లేకుండ వీరు చేసిన గుప్తదానములు లెక్కపెట్టలేనివి -

**'దాతవ్యమిత యుద్ధానం దీయతే నుపకారిణీ**
**దేశకాలేచ పాత్రేచ తద్ధానం సాత్వీకం స్మృతమ్'**

అని గీతలో చెప్పినట్లుగ, ముందు పేర్కొనదగినది గుప్తదాతలు. ఇది వారి శిష్యుల రచనల వలన, సమకాలిక కవుల కవితల వలన తెలియును.

**'సుప్త గుప్త దాన వ్రతప్రాప్తి'**

అని కరుణశ్రీచే స్తుతింపబడిరి. ఇట్టి సున్నిత మనస్తత్వము కల్గిన వీరిలో స్థిత ప్రజ్ఞత కూడ కాంతుము. ఎన్నో కష్టనష్టములెదురు నిల్చి అధికార నిర్వహణలో, తన జీవితము నొక క్రీడా విశేషముగ నడపిన స్థితప్రజ్ఞులు వీరు. ఆచార్యుల వారన్నమాటలు గమనించ దగ్గవి.

'నేను పసివాడ్ని. నాది పసిహృదయము. నన్ను ఎంతటివాడైనా మోసము చేయవచ్చు. నేను తెలివితక్కువవాడ్నికాదు. ఎపుడైనా జాగరూకతతో వ్యవహరించవలసి వచ్చి, గడుసుదనంతో దేనినైనా నిర్వహించవలసి వస్తే, నాకు జ్ఞాననేత్రము ఉదయిస్తుంది. అపుడు నాలోక జ్ఞతకి తిరుగుండదు. నేనెంతటి క్లిష్టమైన విధినైన అతి సులభంగ నిర్వర్తించగలను'.

ఇది వారి ఆత్మావలోకనమే. 'ఈ ప్రపంచములో అతితెలివైన వాడెవడంటే మంచి వాడే. మంచివాడిని మించినవాడీ ప్రపంచం లో లేడు' అని కూడ అంటారు. ఇక ఎవరికైనా అపకారం చేసినపుడు ఆలోచించు, ఉపకారం చేసినపుడు కళ్ళుమూసికొని చేయి' అన్న సందేశము వీరిది.

నిశితమైన మేధ - నిండైన హృదయము, వాక్చాతుర్యము, పరిహాస రసికత మేళవించిన మహామనిషి ఆచార్యులవారు.

పింగళి లక్ష్మీకాంతము గారు, విశ్వనాథ సత్యనారాయణ గారు వంటి కవితా గురువులు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారువంటి ప్రముఖులవలన అభ్యసించిన విద్యని, జీవితములో కాంతివంతము కావించినారు. ఎంత గహనమైన విషయములైన ఆకర్ష ణీయముగ, మనసునాకట్టు కొనేలా మాట్లాడగల నేర్పరి. ఎదుటివారెటువంటి వారైనా వారి సామర్థ్యమును గుర్తించి ప్రోత్సాహించే సహృదయులు, పరిపాలనాదక్షులు ఇలా చెప్పుకుంటూపోతే, ఎన్నో ఎన్నో విశేషాలు వారిలో కలవు. గంటలు గంటలు అనర్గళంగ మాట్లాడుతూ, శ్రోతల్ని ముగ్ధుల్ని చేస్తారు. వీరు ఒకసారి ఉపన్యాసవేదికపై నున్నప్పుడు వీరి రచించిన ప్రగతి గీతలోని పద్యములను ఆనర్గళంగ ఒక అంధుడు పాడగలిగి నాడంటే, వీరి ప్రభావమతనిపైయెంత కలదో తెలియుచున్నది.

శిష్యులనిన ఆచార్యులవారి కపారమైన అనురాగము. ఎందరో వారిశిష్యులు నేడు ప్రముఖ కవులు. అందుకే అయన అమూల్య హస్తంతో ఆంధ్రసరస్వతికి అమూల్యాలంకారాలుగ అందించిన సాహితీరత్నాలే శ్రీ సన్నిధిరాజు, శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి, శ్రీ శనగన నరసింహస్వామి, శ్రీతంగిరాల సుబ్బారావు, శ్రీఉషశ్రీ' అని ప్రశంసిం

పబడినారు. అయినను ఆచార్యులవారెంతో వినయమున నేనొక ప్రమిదను. కొన్ని కాగడాలను వెలిగించిన సంతృప్తి నాకున్నది' అని అంటారు.

ఆధునిక భావములతో, విశ్వజనీన భావములతో నిండిన కవిత్వము వీరిది. భావకవిత్వమును, అభ్యుదయ కవిత్వమును సమాన పాళ్ళలో రంగరించి రచించిన కవితలు వీరివి. కవిబ్రహ్మ తిక్కన, భారతములో కర్ణపాత్ర వీరికిష్టమైనవారు. కర్ణుడు దానగుణశీలి. ఆచార్యులవారిలో ఈ దానగుణమున్నది. ప్రతిఒక్కరు ప్రశంసిస్తూ ఎన్నో కవితలు రచించారు. ముఖ్యంగా పాపయ్యశాస్త్రిగారు.

వీరిన్నో పీఠికలు రచించినారు. ఆచార్యులవారు వ్రాస్తే చాలునని ఆనందించు వారెందరో, వీరి పీఠికలు సహృదయ విమర్శకు సోపానములు.

వీరికి జరిగిన సన్మానములు లెక్కలేనన్ని, వీరి కంకితమిస్తూ, ఎందరో కావ్యాలు రచించారు. పత్రికాచయితలు కూడ, 'పన్నీటిజల్లు' అను పేర ఆంధ్రప్రభలో ప్రతి దినము వీరి వ్యాసములు వచ్చెడివి. భారతి, ఆంధ్రపత్రికలలో వీరి వ్యాసములెన్నో ప్రచురితములు. ఇవన్ని ఒక ఎత్తుయితే, వారి అంతరంగిక జీవితమొక ఎత్తు.

## వేదాంతి:

ఆంతరంగిక తత్త్వము నర్థము చేసికొనుటము కష్టము. జీవితమున ఇన్ని విధములుగ రాణించిన వీరు నిత్యవేదాంతియనిన నమ్మ శక్యముగాని నిజము. అన్నీ అనుభవించిన తరువాత ముదిమిపై బడినపుడు ఈ వేదాంత మలవడుట సర్వ సాధారణము. కాని జీవితము ననుభవించుచునే ఆవేదాంత ధోరణినలవరచు కొనుట కొందరికి మాత్రమే సాధ్యము. ఆ కొందరిలో ఆచార్యుల వారొకరనవచ్చును.

ప్రగతి గీతలో జ్ఞానదీప్తి శీర్షికలో -

**మేలిసుఖములెల్ల మీసాల తేనెలే**
**పదవి పూతపసిడి పంజరమ్ము**

**ధనము పెంచుకొన్న పెనుత్రాచుపామౌను**
**జ్ఞాన దీప్తికి భువి సాటిలేదు'**

అని తెల్పినారు. పరమ పదసోపానము అంటే మేడ మెట్లుకాదు. దానికి మెట్లు 1/ జ్ఞాన యోగము, 2/ కర్మయోగము, 3/ భక్తియోగము అని అంటారు వీరు.

వేదాంతమనిన శుష్కవేదాంతముగాదు. అందుకే ఆచార్యుల వారిలా అంటారు.

**వెలయు విశ్వమందు వేదాంత విద్యయై**
**మెదడు మేడపైకి మెట్లుగట్టి'**
**లేదు కష్టపడనివాడె జగత్తులో**
**వాన తడియనట్టి వాడు లేడు**
**వెలయుగొడుగులట్లు వివిధ వేదాంతముల్**
**నప్పవొకటి - ఇంటి కప్పులట్లు'**

అని వేదాంతములు వివిధములని చమత్కరించిరి. ఇక నిజమైన వేదాంతి ఎవరన్న ప్రశ్నకు -

**'దాపురించినపుడు దైన్యమ్ము - దుఃఖమ్ము**
**ప్రక్కవాని కెరుక పరుచకుండ**
**కష్టమను భవించగల వాడె వేదాంతి**
**ధర్మమూర్తియైన - ధైర్యశాలి'**

అని సమాధానమిచ్చిరి. వీరు రచించిన 'విన్నపములు' పూర్తిగ వేదాంతపరమైనవే. తన్నుతాను భగవంతునికి అర్పణ చేసు కుంటూ రచించబడినవి.

## షష్టిపూర్తి:

ఆచార్యులవారి పిల్లలు వీరికి షష్టిపూర్తి చేయాలని సంకల్పించినపుడు వారి శిష్యులు శ్రీ ఆశావాది ప్రకాశరావుగారు తానే ఆ బాధ్యతను వహించి 16-8-1988లో అనంతపురములో రాయల కళాగోష్ఠి ఆధ్వర్యాన వైభవముగ జరిపించినారు. ఆరు గంటలపాటు నిరాటంక ముగ ఆసభ జరిగినది. ఎందరో శ్రోతలు విచ్చేసారు. ఈ

సందర్భమున శ్రీ ఆశావాది ప్రకాశరావుగారు, డా॥ నండూరి సాహిత్యదర్శన సదస్సును ఏర్పాటు చేయగ, దానికి డా॥ సి.వి. సుబ్బన్న శతావధాని అధ్యక్షత వహించారు. శ్రీ పి.పి. వేంకటాచలం గారు నండూరి వారి జీవితవిశేషములను వివరించుచు, రామకృష్ణ పరమ హంస వేదాంత తత్త్వము, తెనాలి రామకృష్ణుని కవిత్వశైలి, ఆచార్యుల వారిలో మూర్తీభవించిన వని, ప్రగతి భావాలతో కూడుకున్న వీరి ప్రగతిగీత వేమన ఆటవెలదులను తలపించు చున్నదని, వారి శీర్ణమేఖల కమనీయ దృశ్యకావ్యమంటూ సామ్య వాదం సాంఘిక శ్రేయస్సు వీరి రచనల్లో చోటు చేసికొన్న వన్నారు. నండూరివారి కవితా రీతుల్ని గురించి శ్రీమతి కొలకు లూరి స్వరూప రాణి వ్యాసము రచించారు. దానిని చదివిన శ్రీమతి ప్రమీల, నండూరివారి కవితాప్రభాస, తారాతోరణము మొదలు ప్రగతిగీత వరకు ప్రతి గ్రంథం ప్రతి పద్యం రసవద్ గుళికలై చెప్పదలిచిన సందేశమును నిక్కచ్చిగా చెప్పడమనే లక్షణములతో కూడు కున్నవని అన్నారు.

వీరి నాటకాల గురించి శ్రీ షేక్‌దరియా హస్సేన్, వీరి విక్రమోర్వశీయముపై శ్రీ కలచవీడు శ్రీనివాసాచార్యులు మొ॥నవారు ప్రసంగించారు. సాహిత్య సమీక్షానంతరం నండూరివారికి జరిగిన సన్మానము అనంతపురం సాహిత్య చరిత్రలో అపూర్వముగా పేర్కొనదగినది. మహిళారచయితల సమాఖ్యపక్షమున శ్రీమతి దరిశి వ్రజమ్మ, రాయల కళాగోష్ఠి ఆధ్వర్యాన డా॥ కేతుబుచ్చిరెడ్డి, ఆశావాది సాహితీ కుటుంబము పక్షాన శ్రీ ఎ. ఫక్కీరప్ప, తరుణ సాహితీ సమితి పక్షాన శ్రీ పోలా ప్రగడ సత్య నారాయణమూర్తి నూత్నవస్త్రాలతో సత్కరించారు. వ్యక్తిగతంగా శ్రీ మిట్టపల్లి రామి రెడ్డి, శ్రీ నల్లాన్ చక్రవర్తుల శేషాచార్యులు, నూటపదార్లు సమర్పించారు. కలుగోట్ల విజయాత్రేయ గురుదక్షిణగా పండితశాలువా బహుకరించారు.

అనంతపురం కళాశాల పూర్వాంధ్ర విద్యార్థి సంఘము తరపున శ్రీరంగ సముద్రం రామ కృష్ణ శర్మ, చిత్తూరు కళాశాలపూర్వాంధ్ర విద్యార్థి సంఘం తరపున శ్రీ కొత్తకోట చంద్ర శేఖర్, గుత్తి అనంత సాహితీ తరపున శ్రీ బత్తుల వెంకటరామిరెడ్డి, ప్రకాశభారతి తరపున శ్రీ మేటికుర్తి పుల్లయ్య, హైద్రాబాద్ తొలి తెలుగుసాహితీ సమితి

తరపున శ్రీ దమ్ముతానయ్య, ప్రొద్దుటూరు; యువసాహితీ సమితి తరపున శ్రీ ఎన్.ఐ. దస్తగిరి, భాగ్యనగర సాహిత్య వేదిక తరపున శ్రీ యన్. యం. సహాయాచరి, డా॥ నండూరివారిని పుష్పమాలలచే సన్మా నించారు. గద్యపద్యాత్మక సన్మాన పత్రాలు సమర్పించారు. తనకు జరిగిన సన్మానము నకు బదులిస్తూ, డా॥ నండూరి ఇక్కడి రసజ్ఞుల హృదయాలు క్షామాతీతమైన సాహితీ ప్రియత్వముతో నిండియున్నవని ప్రశంసించారు.

ఈసన్మాన కార్యక్రమానంతరం వినోద కార్యక్రమాలలో వీరి తెలుగుగడ్డ నాటకం ప్రభాకర్ జీ ఎలిమెంటరీ విద్యార్థులు, ప్రదర్శించారు. నండూరివారి ఛత్రపతి శివాజీలోని 'భారతీ తీర్థ' ఏకపాత్రాభినయం- శ్రీ సి. పాండురంగమూర్తి గారిచే ప్రదర్శింప బడింది. ఈ సందర్భముగా విద్యార్థులకు వ్యాసరచన, పద్య పఠనము పోటీలు జరిపారు. గెలు పొందిన వారికి బహుమతులిచ్చారు.

* * * * * * * * * * *

# వంగల పార్థసారధి

గీతకు ధీటుగా ప్రగతి గీతను వ్రాసి - జగద్ధితమ్ముగా
నీతికి నీతి నేర్చిన మనీషివి - కట్టితి వీవు సాహితీ
సేతువు క్రొత్త పాతలను చేర్చి, భవల్ కృషి విశ్వ సంస్కృతి
జ్యోతిగ - సర్వదా - వెలుగు చుండును మానవతా పతాకమై.

***** వంగల పార్థసారధి *****

# ఆశావాది ప్రకాశరావు

ఎండిన బ్రదుకుల జీవము
పిండంగల భాస్కరుండు విజ్ఞాన సుధా
భాండము నెలమిం దలతున్
నండూరి రామకృష్ణుని నవనీత మతిన్

***** ఆశావాది ప్రకాశరావు *****

# ఇందిర రాజగోపాల్

## (నండూరి వారు సాహితీ వనం లో కల్పవృక్షం)

నండూరి రామకృష్ణమాచార్యులు సుప్రసిద్ధ కవి (1921-2004). తెలుగు సాహితీ వనం లో కల్పవృక్షం లాంటి వారు కవితాసంపుటాలు, నాటికలు, లక్షణగ్రంథాలు, విమర్శ, అనువాదాలు మున్నగు ప్రక్రియలలో ఎన్నో రచనలు చేశారు.

వీరి జన్మస్థలం పశ్చిమ గోదావరి జిల్లాలోని గోపవరం. విజయవాడలోని ఎస్.ఆర్.ఆర్ కళాశాలలో బి.ఎ చదివారు. నండూరి రామకృష్ణమాచార్యులు వారి గురువు విశ్వనాథ సత్యనారాయణ గారు. భీమవరం, అనంతపురం, చిత్తూరు కళాశాలల్లో తెలుగు శాఖాధిపతిగా చేశారు. తదనంతరం మైసూర్ విశ్వవిద్యా లయం నుండి పిహెచ్.డి పూర్తిచేశారు. గురువుగా, ప్రిన్సిపాల్‌గా, విద్యాసంస్థల నిర్వాహకుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘ అధ్యక్షులుగాను, తరువాత ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర పద్య కవితా సంస్థకు కూడా అధ్యక్షులుగా ఉండి పద్య కవితా పునరుజ్జీవనానికి ఎంతోకృషి చేశారు.

నండూరి కృష్ణమాచార్యుల కాలంలో తెలుగు సాహిత్యం సంధికాలం లో ఉంది. ఆ కాలంలో సంప్రదాయ కావ్యరచనల నుంచి భావ కవితలు, గేయ రచనల వైపు తెలుగు సాహిత్యం క్రమంగా మారుతోంది. దీర్ఘ ప్రబంధాల స్థానంలో ఖండ కావ్యాలు, లఘుకావ్యాలు ప్రాచుర్యం పొందాయి. సామాజిక భావాలు, వ్యక్తిగత అనుభూతులు, విమర్శలూ, సంస్కరణ ప్రేరణలూ, సాహిత్యంలోకి ప్రవేశించాయి. అందరి కవులలోను కందుకూరి వీరేశలింగం పంతులుగారి సంస్కరణ ఉద్యమ ప్రభావం స్పష్టంగా కనిపించింది. సాహిత్యం కేవలం అలంకార ప్రధానం కాకుండా సమాజాన్ని మేల్కొలిపే సాధనంగా మారింది.

కృష్ణమాచార్యులు తెలుగులోనూ, ఆంగ్లంలోనూ అనేక గ్రంథాలు రచించారు. కొన్ని చారిత్రాత్మకమైనవి (గాంధీ, శివాజీ, కృష్ణదేవరాయలు, దక్షిణ భారత చరిత్ర, ఇత్యాదులు). మరికొన్ని తత్త్వ సంబంధమైనవి (ధర్మచక్రం, బుద్ధుడు, జీసస్, మహా భారతం, జపాను దేశపు గెంజి కథలు, ఇత్యాదులు). ఇవేకాక అనేక తెలుగు పద్యములను రెండు సంపుటములుగా (తారా తోరణం, ఆలోచనం) ప్రచురించారు. ఈ

పద్యాలను గమనిస్తే మనకు మూడు విధానాలు (శైలి) గోచరిస్తాయి. వటిని క్లుప్తంగా పరిశీలిద్దాం.

**1.ఖండ కావ్యాలు:** అంటే ఒక నిగూఢమైన ఘట్టాన్ని తీసికొని, ఆ ఘట్టంలో ఒక పాత్ర మనసులో జరిగే సంక్షోభాన్ని ఊహించి పద్య రూపంలో దాన్ని వివరించటం. నండూరి వారి రచనలలో, భీష్మ-కర్ణ చిట్టచివరి కలయిక (అంపశయ్య), యుద్ధం ముందు కుంతి-కర్ణ సంవాదం (అజ్ఞాత కౌంతేయము), మహామంత్రి తిమ్మరుసు అవసాన దశలోని ఆలోచనలు (తిమ్మరుసు స్వగతం), శకుంతల తలపులు (శకుంతలా నిర్గమనము), కర్ణ-భానుమతుల అయుక్త సంఘటన (శీర్ణ మేఖల), మున్నగునవి. వీటిని తత్సమ పదభూయిష్టమైన గ్రాంధిక భాషలో, యతి ప్రాసలు, అలంకారాలతో వృత్తపద్యాలలో చిత్రీకరించారు.

ఉదాహరణకు, శీర్ణమేఖలలో ఘట్టం ఇది: కర్ణుడు తన మిత్రుడైన దుర్యోధనుని చూడటానికి వచ్చి, అతడు ఇంటిలో లేడని తెలియడంతో కొంచెంసేపు వేచియున్న సమయంలో, దుర్యోధనుని భార్య, భానుమతి, తన చెలికత్తెలతో చదరంగం ఆడుతుండటం గమనించి, కుతూహలంగా అంతఃపురంలోకి వచ్చి ఆటను చూస్తుంటాడు. ఆటలో నిమగ్నమై, క్రమంగా చెలికత్తె స్థానం తను ఆక్రమించి ఆట కట్టించేస్థితికి వచ్చి చివరి ఎత్తు వెయ్యబోయే సమయంలో దుర్యోధనుడు ప్రవేశించటం జరుగుతుంది. అదిరిపాటుతో లేచి భానుమతి భర్త వైపుకు పోబోవగా, ఆట ఓడిపోవటం ఇష్టం లేక పారిపోతేందనే అపోహతో, కర్ణుడు ఆమె నడుముకు కట్టుకునియున్న ముత్యాల వస్త్రాన్ని పట్టుకు లాగుతాడు. ఆ మేఖల విడిలి ముత్యాలు నేలపైబడుతాయి. ఈ అసభ్య దృశ్యాన్ని చూచి ముగ్గురూ నిశ్చేష్టులౌతారు. కానీ దుర్యోధనుడు తన మిత్రుడిని మన్నించి ఈ విధంగా సమర్ధిస్తాడు. క్షమా గుణం అత్యుత్తమమైనదని నండూరి వారి అభిప్రాయం (ఈ భావాన్ని మానవత్వాన్ని గురించిన ఇతర పద్యాలలో కూడా వివరిస్తారు).

**మందమనోజ్ఞహాససుషమామృదుభావమరీచివీచికల్**
**కందుదలందు వెల్లిగిన కౌరవనాథుడు ఆత్మదేవికిన్-**
**చిందిన మేఖలామణుల చెచ్చెర నేరి యొసంగి "ఆగ్రహం**
**బందిరో రాణివారు క్షమ కర్ణుడు నా ప్రియమిత్రు డిమ్మెయిన్**

**ఎరిగి చేసిన తప్పుగా దెంత వారి**
**కైన క్రమ్మను చదరంగమందు మత్తు**
**ఎప్పటియటుల కర్షు మన్నింపు” మనుచు**
**ప్రార్థనలు సలిపె ఛలోక్తి పరిఢవింప.**

అలాగే తిమ్మరుసు పద్యంలో అతని బాధను వివరిస్తారు. తిమ్మరుసు కృష్ణదేవరాయలును బాల్యం నుంచి పెంచి పెద్ద చేసి, రాజ్యపాలనా భారమంతా తానే వహించి, పైకి తీసికొనివచ్చాక, చివరి దశలో ఏదో అపోహలవల్ల కృష్ణ రాయలు తిమ్మరుసు కళ్లు తీయించివేస్తాడు. అప్పుడు కుమిలిపోయిన తిమ్మరుసు ఈ విధంగా ఆక్రోశించుతాడు. అయినప్పటికీ, తాను చేసిన తప్పుపనులను తలచుకుంటూ, ఎవరికైనా కర్మ పరిపక్వం కావలసిందే అని వాపోతాడు. ఇది నండూరి వారి ధృఢ నమ్మకం.

**ఏను బ్రోచినాడ కృష్ణరాయల నాడు**
**కీడు చేసె నతడు నేడు నాకు**
**బ్రతుకు లోని వింత వైరుధ్య విక్రాంతి**
**అనుభవైకవేద్య మయ్యె నిపుడ**

**న్యాయము చూడలేదెపుడు వ్యక్తికి తీర్పునుచెప్పితిన్ ప్రజా**
**శ్రేయము కోరి, భోగ కుల వృత్తికి క్రొత్తగ పన్ను వేసి, ఆ**
**దాయము పెంచి బొక్కసము దండిగ నింపితి, నీతి వీడి, నా**
**ధ్యేయము రాజ లాభమె మదిన్, మరి పాపము కాటు వేయదే?**

**బ్రతికెద కొంత కాలమిక ప్రాణము తోడ సజీవ పాఠమై !**
**చదువుడు నన్ను జేరి జన సంతత లెల్లరు కంటి నీరు కా**
**ర్చతగడు, ఎవ్వరైనను పరాత్పరు శక్తిని మార్చ లేరుగా!!**
**పదవి గతించినంత ప్రతిభా ప్రభ తత్ క్షణ మంతరించెడున్**

అలాగే భీష్ముడు అంపశయ్య మీద ఉండగా, కర్ణుడు వచ్చి నమస్కరించి క్షమా భిక్ష అడుగు తాడు. అప్పుడు భీష్ముడు తన తప్పును తెలియబరచి ఈ విధంగా అంటాడు: **“మహారథీ! కర్ణా! నీకు నేను క్షమాపణ చెప్పుకోవలసి ఉంది; అర్థ రథుడవంచు అన్నాను నిను గూర్చి, బొంకు పలికినాడ శంక వీడి”.** ఈ విధంగా అన్ని ఘట్టాలలోనూ పాత్రల హృదయాలలో నిగూఢమైన సద్భావాలను కవి పైకి తీసుకు వస్తారు.

**2.నాటకాలు:** ఇవి నృత్య నాటకాలు: ధర్మచక్రం, శివాజీ, జ్యోత్స్నాభిసారిక, గోదావరి, అభినవ కురుక్షేత్రం, శ్రమమ ఏవ జయతే, ఇత్యాదులు. వీటిలో ముఖ్య లక్షణం 'పాత క్రొత్తల కలయిక'. సనాతన స్మృతులలోని కథలను తీసికొని, అందులోకి ఆధునిక భావాలను చేర్చి కథను మలచటం. ఉదాహరణకు, 'శ్రమ ఏవ జయతే' నాటికలోని కథ మహాభారతంలోని ఉదంకుడి కథ. సంగ్రామానంతరం శ్రీకృష్ణుడు ద్వారకకు పోయే మార్గంలో, ఆతని బాల్య మిత్రుడైన ఉదంకుని ఆశ్రమంలో ఆగుతాడు. అప్పటివరకు జరిగిన విషయాలు తెలియని ఉదంకుడు నీవు హస్తినాపురంలో వారినందరనూ చక్కబరచి వచ్చావా అని ప్రశ్నిస్తాడు. యుద్ధం జరిగిందనీ, ఇంతటి ఉపద్రవాన్ని ఆపకుండా ఎలా జరగనిచ్చావని ఆగ్రహించి, ఉదంకుడు కృష్ణుణ్ణి శపించబోతాడు. కృష్ణుడు అతడిని శాంతపరచి విశ్వరూపం చూపిస్తాడు. భవిష్యత్తులో వచ్చే క్షామంలో నీకు నీరు లభిస్తుందని వరమిస్తాడు. తదుపరి క్షామం వచ్చినప్పుడు కృష్ణుడు ఒక చండాలుని రూపంలో వచ్చి నీరు ఇస్తాడు. అది భరించలేక ఉదంకుడు తర్జన భర్జన పడి, చివరకు జ్ఞానోదయమై, కుల,మత, జాతి విభేదాలు అవివేకమని గ్రహిస్తాడు. శ్రమ చేయటమే ఉత్తమ ధర్మము అని బోధిస్తూ కథ ముగుస్తుంది. ఊరికే వేదాలు పఠిస్తూ జ్ఞానులమని భేషజంతో వర్తించడం గొప్ప కాదు, శ్రమ ఒర్చి, పరులకు సాయపడే ఆ చండాలుని జీవనమే గొప్పదని సూచిస్తారు. నండూరి వారి దృక్పథంలో ఇది చాలా ముఖ్యాంశం. జాతి, మత, విభేదాలను ఖండిస్తూ, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ప్రోత్సహిస్తూ అనేక పద్యాలు వ్రాశారు.

**3. పద్య సంపుటి:** ఇవి నేటి సాంఘిక వ్యవస్థను పరిశీలించి, నండూరి వారు తమ స్వచ్ఛంద భావాలను చిన్న చిన్న పద్యాలుగా వ్రాసి, సమకూర్చిన సంపుటములు. ఒక్కొక్క అంశంపై నాలుగైదు పద్యాలు, చాలా వరకు ఆటవెలదులు, వ్రాశారు. వీటిని చూస్తే వేమన పద్యాల శైలి జ్ఞాపకం వస్తుంది. ఇవి ఆధునిక జీవనంలోని అనేక అంశాలు: కవిత్వం, మేధస్సు, హేతువాదం, కమ్యూనిజం, స్వామ్యవాదం, విప్లవ కవిత్వాలూ, నిరసనలూ, విమర్శనాజ్ఞానం, కులాలు, మతాలు, గురువులూ, ఆధునిక విజ్ఞానం, పర్యవసానాలు, మానవత్వం,.. ఇత్యాది సమస్యలపైన ఆయన అభిప్రాయాలు వ్రాశారు. వీటిల్లో కొన్ని ఉదాహరణలు చూద్దాం.

ప్రారంభంలో తాను వెలిబుచ్చే ఆలోచనలు ప్రజానీకానికి శ్రేయస్సు గూర్చాలని ఆశించారు. పోతన భాగవతారంభంలో 'పలికెడిది భాగవతమట...' అన్నట్లుగా ఈ పద్యం వ్రాశారు.

**పలికెడి దాలోచనమట!**
**పలుకు బడులు సకల పుష్ప పరిమళ లహరీ**
**జలపాత శీకరములట!!**
**తలపులు వసుదైక యోగ తరళము లగుతన్**

కవిత్వం కేవలం ఆహ్లాదానికే కాదని, ఒక నిగూఢమైన సందేశాన్ని వెలిబుచ్చడానికి కవిత్వం వ్రాయబడుతుందని, అది ఏదో ఇష్టమొచ్చినట్లు వ్రాయకుండా, ఛందో బద్ధ నియమాలతో వ్రాస్తే ఎంతో పటుత్వం కలిగి యుంటుందనీ వారి అభిప్రాయం. అందుచేత, కవి వ్రాసేముందు తీవ్రమైన అంతరంగిక సంచలనాన్ని పొందాలని, కవి చెప్పేది ఉత్త 'మెదడు' నుంచి కాదు 'గుండె' నుంచి రావాలి అంటారు.

**కావు రచనమనిన, కలము కాగితములే**
**కవికి తూగు ఊపు లవసరములు**
**అవసరమ్ము సమయ మాలోచనమ్ముకై**
**వ్రాత కంత సేపొ పట్ట బోదు**

**మెదడులోన పెట్ట మేలి చక్కిలిగింత**
**గొప్ప కవిత యంచు చెప్ప రాదు**
**గుండె లోపల సుడి గుండముల్ చేకూర్చి**
**పాడ వలెను కవిత ఏరు వోలె**

**ఉండవచ్చు పొదుగు నిండ గోవుకు పాలు**
**పిండువాడొ కండు ఉండవలయు**
**చాటి చెప్పగలుగు సహృదయుండే లేక**
**కవిత యెట్టు ప్రజల కడకు జేరు**

చదువులు, పదవులు, వాక్పటిమలకన్నా, మనిషికి మంచితనం, మాన వత్వం ముఖ్యమని అనేక విధాలుగా వివరించారు. సమతా దృష్టి, సాటి మానవుల పట్ల సానుభూతి, అతి ముఖ్యములని ప్రబోధిస్తారు. ఆధునిక యువతలోని ఆడంబరత్వం, చాకచక్యంగా మాటలు చెప్పటం కాదు, మనసు ముఖ్యం, చేతలు ముఖ్యం అంటారు

**గొప్ప దనము తెలుపు కొలబద్ధ యేదయా?**
**పదవి కాదు, మేటి చదువు కాదు**

**విద్య సలుపు విశ్వజిద్యాగమా? కాదు**
**పొంచి మంచి స్వీకరించు మనసు**

**విలువ గట్టరాదు తెలివితేటలబట్టి**
**చదువు బట్టి, పెద్ద పదవి బట్టి**
**మంచి మనసు ఉన్న మనిషి యైనను చాలు**
**సృష్టి శిల్ప దివ్య శిఖర మతడు**

**మేటి మెదడు కంటె, మేడ మిద్దెల కంటె**
**వాహనాల కంటె, పదవి కంటె**
**చతుర మధుర వాక్య చాకచక్యము కంటె**
**మంచి మనసు మేలు మనిషి యందు**

మంచితనం మానవత్వం అంటే ఏమిటి అనేది ఈ విధంగా విశదీకరిస్తారు.

**మంచి గుండె చాలు మనుజ మాత్రుల లోన**
**మేటి మెదడు కంటె మిగుల మేలు**
**ఉన్న చాలు కొంత ఉపకార శీలమ్ము**
**పొంద వచ్చు కొంత మంది మేలు**

**మంచి గుండె చాలు మనుజ మాత్రుల లోన**
**మేటి మెదడు కంటె మిగుల మేలు**
**ఉన్న చాలు కొంత ఉపకార శీలమ్ము**
**పొంద వచ్చు కొంత మంది మేలు**

**ఎన్నో విద్యలు మెదడు**
**విన్నాణములు పెరిగె నవ విజ్ఞానముచే**
**సున్నాయై పోవును యా**
**వన్నెర సంఘము హృదయము వర్ధిల్లకున్నన్.**

మతమన్నా, మతం పేరిట చేకూరే గుడ్డి నమ్మకాలూ, విధులూ, నిషేధాలూ అంటే నండూరి వారికి అసహ్యం. మనిషి, మంచి మార్గాన పోతూ, తన ఆత్మ వివేకం ద్వారా తన ప్రవర్తనను మలుచుకోవాలని వారి ఆదేశం.

**మతములెల్ల కుటిల మంత్రమ్ములే!**
**బూటకములు కపట నాటకములు.**
**కోటి విద్యలెల్ల కూటి కక్కుర్తులే**
**మాటలాడు మనిషి వేట కుక్క**

**అన్ని సూత్రములకు అపవాదములు నుండు**
**గొంతు చించుకొనుట కూడని పని**
**విలువ నివ్వరాదు విధి నిషేధములకే**
**సంచరింపవలెను సమయ మెంచి**

**మానవతయె మిన్న మతములన్నిటి కన్న**
**మనిషికవసరమ్ము మంచి చర్య**
**మత మటన్న కావు మంత్రముల్ ప్రార్థనల్ !**
**పరుల మేలు కోరు పనుల మతము**

సంఘ సంస్కరణలూ, మార్పులూ, ఆధునిక శాస్త్ర విజ్ఞానం పై నండూరి వారి అభిప్రాయం రెండు విధాలుగా ఉంటుంది. మార్పు సహజం, సంఘంలో మార్పులు రావాలి - లేకపోతే పాత నిబంధనలన్నీ సంకెళ్లుగా మారుతాయని వాదిస్తారు.

**చూడ దిన దినమ్ము సూర్యుండు నవ్వుడే**
**నిన్న కొలత వేరు, నేడు వేరు**
**క్షణము క్షణము మారు జగతి సర్వము గూడ**
**మార్పు నడ్డ నేల మానవుండు?**

**సంఘమందు మొదట సంప్రదాయములెల్ల**
**ప్రజల మేలు కొరకె ప్రభవ మందు**
**కాని, కీడు చేయు, కాల దోషము పట్టి**
**వదల వలయు అట్టి వాని వేగ**

**మారి పోవుచున్న మనుజ సంఘము నందు**
**శ్రోత్రియత్వమునకు వేటు లేదు**
**మాయదారి సంప్రదాయ శృంఖలములే**
**నరుని జీవితము చెరను జేయు**

కానీ ఈ నవ్య నాగరికతను మెచ్చుకుంటూనే, అది అశాంతిని కలిగిస్తోందని, మనిషి "హృదయ" ' స్పందన లేకుండా కేవలం "మెదడు" వల్లనే జరుగుతోందనీ, అది దారుణ పరిణామాలకు దారి తీస్తుందనీ హెచ్చరించారు.

**శాస్త్ర విజ్ఞాన మహనీయ శక్తి చేత**
**సమయ సీమల. పంచభూతములనెల్ల**
**కైవసమ్ము గావించుకో గలిగినట్టి**
**నవ్యనాగరికత కభివందనములు !**

**కాని -ఇదేమి వింత ! గతకాలము కంటెను లోకమందు వి**
**జ్ఞానము హెచ్చురీతిగనె సౌఖ్యము శాంతియు తగ్గుచుండె ఈ**
**మానవజాతి యెల్ల తుదమాసిడి రోజలు వచ్చె, నవ్య శా**
**స్త్రానల దగ్ధమై ధరణియంతయు బూడిదయై లయించునా ?**

**నవ్య నాగరికత ద్రవ్య పారమ్యమ్ము**
**పాడు జేసి నేడు ప్రజల నెల్ల**
**మెదడు కంటె మేలు హృదయమ్ము జగతిలో**
**మంచితనము మించు మతము లేదు**

**శుభము పెంచె సకల సుఖ వస్తు సంపదల్.**
**జగతి యందు నవ్య నాగరికత**
**పేద లకట వికట వినియోగమున చిక్కి**
**ధనిక వర్గములకు దాసులైరి**

**మనిషి యంత్రమందు మరమేకుగా మారె**
**వ్యక్తి కెట్టి స్వేచ్ఛ శక్తి లేదు.**
**నవ్య నాగరికతకు నరుడు బానిసయయ్యె**
**పెరిగె దొరతనమ్ము పెత్తనమ్ము**

'జీవిత సూక్తులు' అనేశీర్షికలో జీవితాన్ని వ్యవహార దృష్టిలో ఎలా చూచుకోవాలో పద్య రూపంలో కుదించి వ్రాశారు. పూర్వం, 1838 లో, ఆంగ్ల కవి, Henry Wadsworth Longfellow , "Psalm of Life" అనే పేరిట ఒక పద్యం వ్రాశారు. బహుశః దానిని పద్యరూపంలో తెనుగించినట్లుగా

తోచుచున్నది. మన జీవితంలో కనిపించే ఆశలు, భయాలు చాలాసార్లు నిజమైనవిగా అనిపిస్తాయి. అద్వైత తత్త్వాన్ని రంగరించి అవి, రజ్జు సర్ప భ్రాంతులు అంటూ సుస్థిరమైన ఆత్మ తత్త్వాన్ని తెలిసికోమని ప్రోత్సహిస్తారు. ఈ పద్యానువాదం కూడా ఎంతో రమ్యంగా చేశారు.

| **Excerpts from "Psalm Of Life" by Henry Wadsworth Longfellow (1838)** | **Excerpts from "జీవిత సూక్తులు" by నండూరి రామకృష్ణమాచార్యులు** |
|---|---|
| Tell me not, in mournful numbers,<br>Life is but an empty dream!<br>For the soul is dead that slumbers,<br>And things are not what they seem. | ఆశలెండమావులటంచు అనినయెడల<br>భయములున్ రజ్జు సర్ప విభ్రాంతి గావె!<br>మిథ్యగాదోయి జీవితోన్మేషమెల్ల<br>పురుషకారమే ఏకైక పరమ పథము |
| Life is real! Life is earnest!<br>And the grave is not its goal;<br>Dust thou art, to dust returnest,<br>Was not spoken of the soul. | బ్రతుకొక మాయదారి కలవంటి దటంచు తలంపకోయి కం<br>దుదలను గ్రమ్ముచున్న తడితో; తుది లక్ష్యము వల్లకాడు; మే<br>నిది ఒక మట్టి బొమ్మ; కడ కియ్యది మట్టినె చేరునంచు గ<br>ద్గదికముతో వచింప సరి కాదది ఆత్మకు అన్వయించునా? |
| In the world's broad field of battle,<br>In the bivouac of Life,<br>Be not like dumb, driven cattle!<br>Be a hero in the strife! | కావున శోకదైన్యములు గ్రమ్మగ నీయకు, నేటికంటె ఈ<br>జీవనయాత్ర రేపటికి జేరుము ముందుకు, సంకుల వ్యధా<br>జీవిత రమ్య యుద్ధమును చేయుము వీరుడవై జిగీషతో<br>పోవకు గొర్రెపోతువలె, బుర్రను వంచి గతానుగామివై |
| Trust no Future, howe'er pleasant!<br>Let the dead Past bury its dead!<br>Act,— act in the living Present!<br>Heart within, and God o'erhead! | ముందు రాబోవు శుభ దినములనుగూర్చి<br>తియ్యని పగటి కలలు చిత్రించుకొనకు<br>జరిగి పోయిన నాటి సంస్మరణలేల?<br>తాల్పు మిప్పుడే నేటి కర్తవ్య దీక్ష! |
| Lives of great men all remind us<br>We can make our lives sublime,<br>And, departing, leave behind us<br>Footprints on the sands of time; | ఉత్తమ పూరుషావళి మహోజ్జ్వల జీవచరిత్ర లెల్ల లో<br>కోత్తర కార్య నిర్వహణ కూర్జిత శక్తి నొసంగుచున్ మహో<br>దాత్తమొనర్చు జీవిత విధానము చూపును; వచ్చువారి కా<br>వృత్తులు చెప్ప భూమి కనుపింపగనిమ్ము భవత్ పదాంకముల్ |
| Footprints, that perhaps another,<br>Sailing o'er life's solemn main,<br>A forlorn and shipwrecked brother,<br>Seeing, shall take heart again. | ఈ మహానంత కాలవాహినిని తేలు<br>భగ్న నౌకుడు సోదర పథికుడెవడొ<br>అడుగు జాడల నొక్క నాడరసి నపుడు<br>పగిలిన హృదిని దిద్దుకోవచ్చు తిరిగి |

'ఉగాది సుహృదాభినందనం" అనే శీర్షికలో తన గృహానికి "కవితాప్రభాస" అని పేరు పెట్టుకుని, 'కావ్య శిల్పమయ శబ్ద తపో ముఖశాలా' అని, 'రసరాజధాని' యని అతిథి దేవులకు, సహృదయులకే గాక, శత్రువులకు కూడా స్వాగతం అని, తన ఇంటిని గురించి, తన మనో భావములను గురించి ఏవిధంగా తెలియజేశారో చూడండి.

**స్వాగతమ్ము నీ కతిథి దేవ స్వాగతమ్ము**
**సహృదయ సుహృద్వరులకు స్వాగతము**
**నిజము సాప్తపదీనమ్ము స్నేహనిరతి**
**ప్రణయ విజితులగుదురు శాత్రవులైన !!**

**ఇది కవితా ప్రభాస వసుధైక కుటుంబి కవీంద్రు సాహితీ**
**సదనము కావ్య శిల్పమయ శబ్ద తపోముఖ శాఖ ఆర్ద్ర సౌ**
**హృదయ సుకుమార భావుకుల కెల్లరకున్ రస రాజధాని తె**
**ల్గుదనపు సోయగమ్ములు వెలుంగుత ఇక జగద్ధితమ్మునకున్!!**

నండూరి వారి సమైక్య దృక్పథం అతి నిగూఢమైనది. కులము, మతములు మున్నగు జాతి భేదాలు సమూలంగా నిర్మూలించాలని, ధనము, జ్ఞానము మనిషి మనసును బట్టియేకానీ, జాతి వల్ల కాదని ఇలా వ్రాశారు. **"జన్మ బట్టి ధనము, సంక్రమింపగ రాదు, అంత రింపవలయు ఆస్తి హక్కు; చదువు చెప్పబడుత సహజ ప్రకృతి బట్టి, పదవి వచ్చు గాక చదువు బట్టి".** అంతేకాక, ఈ ధ్యేయాలను తన ఉపాధ్యాయ వృత్తిలో అమలు చేశారు. విద్యార్థులు, ఏ కులం వారైనా, తగు శ్రద్ధ గల వారికి పద్యా విధానాలను బోధించి ప్రోత్సహించారు. ఆసావాది ప్రకాశ రావు అనే దళిత విద్యార్థిలో ఉన్న సమర్థతను గుర్తించి, బోధించి ఎంతో కృషి చేసి ఆతని ఉన్నతికి దోహద పరచారు. చివరకు, ఆతడు దేశంలో ప్రథమ దళిత అవధానిగా వెలువడి, పద్మశ్రీ బహుమతిని పొంది, "ఆశావాది ప్రకాశ రావు" అనే పేరిట ప్రశస్తి పొందారు. ప్రకాశరావు, నండూరిని గురించి ఈ విధంగా వ్రాశారు: **"ఎండిన బ్రదుకుల జీవము, పిండంగల భాస్కరుండు విజ్ఞాన సుధా భాండము నెలమిన్ దలతున్ నండూరి రామకృష్ణుని నవనత మతిన్".**

1955 లో కేంద్ర సాహిత్య అకాడమీ వారు నండూరి వారిని 'నవ్య సాంప్రదాయ కవుల' లో ఒకరుగా ప్రకటించారు. వారు జీవితాంతం పద్య సేవలో మునిగి, "నడిచే పద్యం నండూరి" అని ప్రసిద్ధికెక్కారు. శాస్త్రీయ సంప్రదాయాన్ని యథాతథంగా నిలుపు కుంటూనే, అందులో ఆధునిక

ఆలోచనలను నింపిన కవులు వీరు. నండూరి వారు పద్య ప్రక్రియలో ఛందస్సు ఉండటం వల్ల ఆలోచనలు మరింత స్పష్టంగా, క్రమబద్ధంగా వస్తాయనే నమ్మకంతో తన రచనలు, సందేశాలు ఎక్కువభాగం, పద్య రూపంలోనే రచించారు. ఆధునిక భావాలను ఆటవెలదులలో అందరికీ అర్థమయ్యేలా రంగరించి, నండూరి వారు. సమాజంలో మార్పు రావాలంటే భావోద్వేగముతో వచ్చే నినాదాలతోను, అలజడులతోను కాదు. మానవత్వ విలువల గురించి అందరికీ అవగాహన ఉంటే సమాజంలో మార్పు తప్పకుండా వస్తుంది అని నమ్మే వ్యక్తి. దైవం ఈ సృష్టిని ఒక అద్భుతమైన కవిగా రూపొందించారని ఆయన సృష్టి ముందు ఒక కవిగా తన సృజన చాలా అల్పమని ఈ క్రింది పద్యం లో వ్యక్త పరుస్తారు.

**తల్లి కావ్యగీతుల నెన్నొ అల్లినట్టి**
**మేటి కవినంచు ఉప్పొంగి మించినాను,**
**నేడిక కవిని గానన నిజము వెలియ**
**కవితగా నేను కరిగి పో గలిగినాను.**

నేనేదో పెద్ద కావ్యములను వ్రాశానని ఉప్పొంగి పోయే వాడిని. నీసృష్టి ముందు నేనెంత అన్న సత్యాన్ని అర్థం చేసుకుని “కవిత” గా కరగిపోయాను అని ఎంతో వినయంగా ఆయన భావములను తెలియజేశారు. నేటి సాంఘిక వ్యవస్థను చక్కగా పరిశీలించి ఆయన భావనలను ఏవిధంగా వ్యక్తపరచారోచూడండి. వీరి కవితలు మానవ హృదయాలను తాకే జీవన సత్యాలు

# డాక్టరు గరికపాటి వరసింహారావు

శీర్ష మేఖలా కావ్య సృష్టి కర్త
తెలుగు నధికార భాషగా తీర్చు నేత;
వేల శిష్యుల హృదయాల వెలుగు మాత;
రామకృష్ణుడు ధీరన రాజ్య దాత.

*** డాక్టరు గరికపాటి వరసింహారావు.***

# డా॥ వెలిచాల కొండలరావు

## (నండూరివారు సుకవి, సుమనస్వి)

నండూరివారు వారి సంస్కారాన్ని, దేశభక్తిని గాంధీగారి శిష్యులైన, సత్యాగ్రహిగా అరుసార్లు జైలుకు వెళ్లిన వారి మేనమామ ఆత్మకూరు గోవిందాచార్యులగారి నుండి పుణికి పుచ్చుకున్నారు. నండూరి వారు స్వయానా గాంధీగారి ఆశ్రమంలో కొన్నాళ్ళున్నారు. ఆ రోజుల్లో గాంధీగారు ఒకసారి మద్రాసుకు వస్తూ నండూరి వారికి 'My dear Acharya I want to see you. I am coming to Madras on such and such date' అని స్వదస్తూరీలో ఉత్తరం రాశారు. మద్రాసులో బ్రహ్మాండమైన సభ జరిగింది. గాంధీగారే నండూరివారితో 'Acharya! I have come to your place, won't you extend welcome to me?' అని అన్నారట. నండూరివారు వారి ఆహ్వాన పద్యాలలోని ఒక పద్యంలో

**'పరమ గంభీరమంచు నీ వాక్యములకు**
**భాష్యకారులు గ్రంథాలు వ్రాసినారు కాని**
**ముగ్ధమోహనము నీ మౌనమునకు**
**భాష్య మొనరింపగలిగిన వారు లేరు'** అని రాశారట.

పద్యంలోని గాంధీగారి మౌనాన్ని వ్యాఖ్యానించ కుండానే వ్యాఖ్యానించినట్లుంది. అది గ్రహించిన గాంధీగారు ఎంతో సంతోషించి సమయోచితంగా 'The young poet just stands self condemned. He has just now commented on my (uncommentable) silence' అని నవ్వుతూ అన్నారట. పట్టాభి సీతారామయ్యగారిలాంటి పెద్దలు నండూరి వారికి వారే మొదట నమస్కారం చేసేవారట వీరు చేయకముందే. అంతపాటి వారికి కూడా అంత గౌరవం నండూరి వారంటే. సి.ఆర్.రెడ్డి గారిలాంటి గొప్ప విమర్శకుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఆనాటి ఉపాధ్యక్షులు నండూరి వారి 'తారాతోరణం' పుస్తకానికి పీఠిక

వ్రాశారంటే నండూరి వారి రచనా ప్రతిభ ఎంత గొప్పదో మనం ఊహించుకోవచ్చు.

నండూరివారు గొప్ప సాహిత్యవేత్తే కాదు - గొప్ప సాహసి కూడా. కాకపోతే అంతపాటి ఆంధ్రా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడైన సి.ఆర్.రెడ్డిగారు తెలుగు వారోత్సవాల సందర్భంగా నండూరి వారితో "ఏమయ్యా! అందరి రాజుల ద్వారాలు పెట్టారు కాని రెడ్డి రాజుల ద్వారం పెట్టలేదు, మరచిపోయారా?" యని అడిగితే "మరచిపోలేదండి, గతించిన ప్రభుత్వాల ద్వారాలు పెట్టాం, మీ రెడ్డి రాజులది ఇంకా సాగుతూనే ఉంది కదా? అందుకని" అన్నారట సాహసంగా.

నండూరి రామకృష్ణాచార్యగారు తెనాలి రామకృష్ణలాంటి హాస్య వ్యంగ్య ప్రియత్వానికి చెందినవారు. హాస్యాన్ని, వ్యంగ్యాన్ని లలిత లలితంగా సున్నితంగా, సుతారంగానే కాదు, సూటిగా, ఘాటుగా కూడా వ్యక్తీకరించేవారు. చూడండి ఆంధ్రుల ఆరంభశూరత్వం గురించి ఏమంటారో...

**"మింటి చుక్కలలర మిరుమిట్లతో వెలిగి**
**చివర తుస్సుమనును చిచ్చుబుద్ది**
**ఆంధ్రులెల్లనట్టి యారంభ శూరులే**
**రమ్యహాసలోల రామకృష్ణ"**

అలాగే ఒక సాహిత్యవేత్తకు సరసకవితకన్నా, సంగీత కళకన్నా, వ్యంగ్యం కన్నా, లలిత హాస్యానికన్నా, సద్విమర్శకుని కన్నా పెద్దశిక్ష మరొకటి లేదని.

**"సరసకవితయన్న సంగీతకళయన్న**
**వ్యంగ్యమన్నలలిత హాస్యమన్న**
**అవని విభుధులున్న ఆదియు వానికి శిక్ష**
**వేరు శిక్ష యింక వేయనేల"** యను పద్యంలో అంటారు.

వారు అధికారభాషా సంఘం అధ్యక్షులుగా ఉన్నపుడు ఒక ఐ.ఏ.ఎస్. ఉన్నతాధికారులున్న సభలో చాలా ఘాటుగా మాట్లాడారట. ఎవరో వారితో అంత ఘాటుగా మాట్లాడారేమిటని అంటే "నేను గనుక రాష్ట్రపతిని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గవర్నర్నయితే ఇలా మాట్లాడేవానిని కాను కాని ఈ పాత్రను వహించాను కదా" అంటూ

**"ఇష్టమయిన పాత్ర ఇహనాటకమునందు**
**ఎవరు వేయగలరు ఎన్నడయిన**
**కుదురుకొన్న ఎదల కుక్కపాత్రను వేయ**
**మొరగవలయు మరియు కరవవలయు"** నను ఒక పద్యం చదివారట.

వినయం, సరసంతో పాటు విస్మయం కలిగించే ధైర్యం, నిర్మోహమాటమూ ఉండేది నండూరి వారికి, "వైష్ణవ జన్మ ఎత్తినాను కాని నిలువుబొట్టు పెట్టుకుంటేనే స్వర్గానికి వెళతాను, అడ్డబొట్టు పెట్టుకుంటే నరకానికి వెళతానని అనుకోలేదు", అలాగే ఖద్దరు కట్టిన వాళ్లంతా స్వర్గానికి కట్టనివారంతా నరకానికి, త్రాగనివారంతా స్వర్గానికి త్రాగేవారంతా నరకానికి వెళతారని కూడా అనుకోలేదంటూ ఒక పద్యంలో

**ఆడదానికంటే అధికారమునకంటె**
**ఎదకు అంటనట్టి చదువుకంటే**
**మద్యపానమందుమత్తేమి కలదయా**
**రమ్యహాసలోల రామకృష్ణ"** అన్నారు.

నండూరివారు దైవవాదే కాని మతవాది కారు.

**"దేవుడిప్పుడెచట జీవించిలేడయా**
**చాలనాళ్ళ క్రితమే చచ్చిపోయె**
**ఆలయాలు కట్టిరస్థికలను చేర్చి**
**బుద్ధిహీనులయిన పూర్వ జనులు"**

అని అంటారు ఒక పద్యంలో.

అలా నండూరివారు మనకు ఒక గొప్ప హ్యూమరిస్టుగా, సామ్యవాదిగా, లౌకికవాదిగా, ప్రజాస్వామ్యవాదిగా, మానవతావాదిగా ధ్వనిస్తారు వారి మాటల్లో, చేతల్లో, రచనల్లో. వారు ఎంత సనాతనంగా అగపడేవారో అంత అధునాతనంగా ఆలోచించేవారు. చూడండి ఈ పద్యంలో ఏమంటారో

**'ఏది శాశ్వతమ్ము ఏది ప్రాచీనమ్ము**
**సృష్టిలో స్వభావసిద్ధమేది**
**నిత్యసత్యమేది నిత్యనూతనమేది**
**మార్పు మార్పు మార్పు, మార్పు మార్పు"**

టి.ఎస్.ఇలియట్ కూడా సమయం గురించి ఇలాగే అంటాడు.

"Time present and time past are perhaps present in time future and time future contained in time past. If all time is eternally present. All time is unredeemable అని అంటారు; 'Burnt Norton' యను కవితలో బహుశా 'స్వేచ్ఛ' గురించి ఠాగూర్ గారు, 'సమయం' గురించి, టి.ఎస్. ఇలియట్ గారు, 'మార్పు' గురించి కృష్ణమాచార్యగారు చెప్పినట్లు మరెవ్వరూ చెప్పియుండరు. అంత క్లుప్తంగా, అంత లోతుగా, అంత సరళంగా, అంత నిశితంగా, అభివ్యక్తిలో అధునాతనంటే అదే మరికి స్వేచ్ఛంటే యధేచ్ఛకాదు విచ్చలవిడీకాదు, కాలం ఆగదు ఆగిపోదు, మార్పు ఆగదు ఆగిపోదు అనే ధ్వని ప్రతిధ్వని గల కవితలివి. అలా చెప్పగలగడమే వక్త కావడం, ప్రవక్త కావడం, రవిలాంటి కవి కావడం.

ఒకసారి నేను కళ గురించి ఇంగ్లీషులో వ్రాసి దాని ప్రతిని నండూరివారికి పంపించాను ఏమంటారో ఏమో మహా పండితుడు కదా యని కాస్త భయపడుతూనే.

Dear Sri Kondal Rao Garu, I have read and reread the essay - "Art and Culture" written by you in English. Please accept my hearty congratulations. Your style is sublime. Sentences are superb with

scientillating syllables. It is poetic prose. It reads like a literary Upanishad written in English. I suggest that you may translate this essay into TELUGU and publish it" అని జవాబు వ్రాశారు.

సహృదయంతో. నాకది ఎంతో ప్రోత్సాహాన్ని కలిగించింది. వారు చిరస్మరణీయులు.

*** డా॥ వెలివాల కొండలరావు ***

# డాక్టర్. గంగవరప్పగారి చెన్నయ్య (శ్రీ గురు సంకీర్తనము)

డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులుగారు సాహితీ జగత్తులో ధ్రువతార. బహుముఖమైన వీరి గొప్పదనము నావంటి వారి యూహకు అందని విషయము. వీరి మహోదారమైన జీవిత ము నావంటి యంతేవాసులకు ఎందరికో అమృతవర్షమైనది.

కళాశాలలో విద్యాభ్యాసకాలమున పితృనిర్విశేషులై వీరు నాకు గావించిన మహోపకారమును వర్ణించు పరిజ్ఞానమును ప్రసాదించి, నా కవితాంకురమునకు మారాకు తొడిగించిరి. వీరి వాత్సల్యమే నన్ను సాహిత్య పట్టభద్రుని చేసి, ప్రశాంతజీవితమున ప్రవేశ పెట్టినది.

*** డాక్టర్. గంగవరప్పగారి చెన్నయ్య

శ్రీగురుం కవితాన్న శ్రీ దాయకమ్ రామకృష్ణకమ్
ఆచార్య పురుషం వందే నమ శ్శిరసా ముదా ॥

*** శ్రీ మాడుగుల నాగఫణి శర్మ ***

# కోయిల్ కందాడై తిరుమలాచార్య

## (సుప్రసిద్ధ కవివతంసులు)

*శ్రీమతే రామానుజాయనమః* *అస్మద్గురుభ్యోనమః*

శ్రీమాన్ నండూరి రామకృష్ణమాచార్యుల వారు సుప్రసిద్ధులైన కవివతంసులు. సుమారు 5 దశాబ్దములకు పైన సాహిత్య కృషీవలులై దేశ కాలావధులనధిగమించి పుంఖాను పుంఖములుగ కావ్యవస్తువులను నెత్తావితో సృష్టించిన ఘనత ఈ దశాబ్దంలో వారికే దక్కింది.అందుకే శ్రీమాన్ కృష్ణమాచార్య వర్యుల ప్రతిభను నా శక్తి కొలది కవితగా రూపొందించాను.

**నండూరి వంశమును బహుకీర్తి నొందింప**
**కవితా పిపాసివై వెలసినావు**
**పద్యరచనమన్నయిటు లుండవలెనంచు**
**పాఠకుల హృదిని తెరచినావు.**

**తేటగీతి మరియు ఆటవెలదియన యిటు**
**లుండవలెనంచు రచించి జూపినావు**
**సరస సరళ తెనుగునానుడుల తోడ పాఠకుల**
**విజ్ఞాన సరళిని బెంచినావు,**

**భళిర! కృష్ణ మాచార్యవర్య మీగరిమ**
**ప్రాజ్ఞతల్ కీర్తింప నేనెంతవాడ మీకు**
**నాకును "హస్తి-మశకముల సామ్యమ్ము నిజము**
**స్వర్గదామమ్ము జేరిన సుసంపన్న గురువరేణ్య।**

పద్య కవితను జీర్ణించుకొని పద్య రచన చేయుట చాల కష్టము. అట్టి పద్యరచనలైన, తేటగీతి, ఆటవెలదులు పుంఖాను పుంఖాములుగా ఆచార్య వర్యుల కలం నుండి జాలువారినవని వారు రచించిన కావ్యములే తెలుపుతాయి.

శ్రీమాన్ కృష్ణమాచార్యుల వారు శిష్య కోటికి కవిత్వపు సొబగులు పరికించి గుర్తించి ఆనందించగల మేధావికాసాన్ని కలుగ జేశారని శ్రీభమిడిపాటి కుక్కుటేశ్వర రావుగారు వక్కాణించిరి. ఈ విషయాన్ని నేనీ విధంగా వర్ణించాను

**ఆదిశేషుడు భాసించు సహస్రఫణామణులతోడ**
**కృష్ణమాచార్యవర్యులు భాసించి రసంఖ్యాక పద్యమణులతోడ**
**ఇర్వురకుగల ప్రకాశశక్తి అపారమయ్యె యీ,**
**తేట-కవిరాజు వెలసె సారస్వత సృష్టికర్తయయ్యె!**

శ్రీమాన్ ఆచార్యుల వారు తమ శిష్యకోటిని మేటికవులుగా సృష్టించవలెనని వారి దృఢ సంకల్పాన్ని నిరూపించుకున్నారు వారి ఆలోచనము "అన్నగ్రంధంలో - విన్నపము అనే శీర్షికన ఈ విధంగా వర్ణించారు

**సహన-సామరస్య-సహకారతత్వముల్**
**ప్రేమజగతిలోన పెరుగునట్లు**
**గుండెదున్ని-వెలుగుపండించుతలపుతో**
**పద్యములను కొన్నివ్రాసినాను.**

ఆచార్యుల వారి మనోభావము ఫలించిందని నేటి ఈ వేదిక, సభకు వేంచేసిన ఆచార్యవర్యుల శిష్యకోటియే తార్కాణము. అందుకు సామ్యముగా వారిని గూర్చి నేను వ్రాసిన కవితను విన్నవిస్తాను

**రామకృష్ణ మాచార్యుల వారొక తత్వవేత్త!**
**పద్యసృష్టికి వీరొక మహామహనీయమూర్తిః**
**ఆలోచనా సరళిని వెలయింపజేసిన గ్రంధమ్మ**
“ఆలోచనమ్మ” సు-లోచనుల ఆలోచనమ్మల కిదిపట్టుగొమ్మ।

హాస్య చతురతకు - అలంకార ప్రయోగాలకు – చురక లంటించటానికీ, వచో సౌలభ్యానికీ “ఆట వెలదులు” ప్రసిద్ధములంటారు. పూర్వపు ఆట వెలదులు (భోగస్త్రీలు) రసిక హృదయుల నానందింపజేస్తే, ఆచార్యుల వారి “ఆట వెలదులు” సారస్వతాభిమానులను రంజింప జేశాయనుట అతిశయోక్తిగాదు. ఈ విషయాన్ని శ్రీమాన్ కృష్ణ మాచార్యుల వారు హాస్య చతురతతో వర్ణించిన తీరును చూద్దాం! (వారి బహరంగ స్వగతము)

**ఏనుతరచు మార్చినాను, ఉద్యోగముల్,**
**ఊళ్ళు-ఇళ్ళు-కార్లు-కళ్ళజోళ్ళు,**
**మార్చినాడనన్ని మాశ్రీమతిని తప్ప**
**మధుర కవిత మీది - మమత తప్ప**

శ్రీమాన్ రామకృష్ణ మాచార్యుల వారి పద్దెములు నీతికి - జ్ఞాన బోధకు నిదర్శనాలు - అట్టివారి ప్రతిభను కవితా రూపంలో ఈ విధంగా వర్ణించాను.

**రసహృదయుల బ్రతుకుల కొకజీవగర్రయై**
**సహస్ర కోటి భాస్కరద్యుతుల ప్రకాశుడై**
**సరస, లలిత పద్య సృష్టి కర్తయై పేరు వడసిన**
**అపర బ్రహ్మ సారస్వతా ఫలముల నందించిన పుణ్యమూర్తి**

అల్పాక్షరాలతో అనల్పార్థ ప్రకటన చేయుటకు ఛందస్సు ఉపయోగపడుతుంది. ఇట్టి ఛందో బద్ధమైన పద్యాలు వ్రాయటంలో ఆచార్యుల వారి ఆలోచనాశక్తి, పద్య నిర్మాణములు చిరస్మరణీయములు. నేటి సమాజంలో స్త్రీ, పురుషుల అన్యోన్యతాలేమి మరికొద్ది మంది - అంగ మార్పిడి విధానాన్ని అవలంబించగా అట్టివారిని శ్రీమాన్ కృష్ణమాచార్యుల వారు ఎంత సహజంగా పద్యాన్ని వ్రాశారో చూడండి! బ్రతుకు శీర్షికలో. (పే :66,ప:23)

**మారవచ్చునెవడో మగవాడు మహిళగా,**
**సంచరింపవచ్చు సంఘమందు**
**జరుగువచ్చు - గొప్ప శస్త్రవైద్యము గూడ**
**బిడ్డలామె కుద్భవించగలరె!**

అందుచేతనే శ్రీమాన్ ఆచార్యులవారి పాండిత్య గరిమను వారి రచనాపాట వాన్ని నాకు తోచిన విధంగా, కవితగా రూపొందించాను.

**ఛందోబద్ధ రచనకు తామొక గీటురాయి,**
**వారి ఆటవెలదుల విన్యాస, సమాసమ్ము లనర్గళమ్ము**
**కంద, తేటగీతుల సరళి తమ కరతలామలకమ్ము**
**అపరవేమనయన్న మీరెగా! కవి శ్రేష్ఠ ఆచార్యవర్య!**

ఆశావాది ప్రకాశరావుగారు - "రచయితకు కర్పూర నీరాజనం-" అనే శీర్షికన ఎండిన బ్రతుకులు జీవము పిండంగల భాస్కరుండు ..... అని ఆచార్యవర్యుల ప్రతిభా పాటనాన్ని వర్ణించారు. దానికి కారణం - ఆచార్యవర్యుల మనోవాంఛయెట్టిదో ఇంతకు ముందే వివరించాను. "గుండె దున్ని వెలుగు పండించు తలపుతో".

ఈ పద్యానికి ఆచార్యవర్యుల మనోభావానికి ప్రతీకగా నేను వ్రాసిన కవితను వినిపిస్తాను.

**రచనాకృషీ వలులై మొడు వారిన హృదయాలు**
**దున్ని సుజ్ఞాన విత్తనంబులు విత్తి, పాఠకుల మనములు**
**శుద్ధి జేయగ బూనిన కవిరాజ తేజో విరాజ, మీ**
**పద్దెంపు సృష్టి, మీకీర్తి, అజరామరమ్ము సుమ్మి!**

"ఆలోచనము" అనే సంపుటిలో శ్రీమాన్ కృష్ణమాచార్యుల వారి ప్రియమిత్రులు కరుణశ్రీ గారు, ఆచార్య శ్రీహరిగారు "నండూరి వారు గొప్ప శిష్యులకు గురువు గారు" అన్నారట. "గురువుగారు" అన్న పదధ్వనికి ఆచార్యవర్యుల సాహితీ గరిమ ఎట్టిదో వారి

పద్యాన్ని - ప్రశంసించిన వారికి సాహిత్య పరంగా, మర్మగర్భితంగా ఎట్లాసమాధాన పరిచారో వినండి.

**"కాగికాగి పాలు - గడ్డ మీడగకట్టు**
**పిదప మారిపోయి - పెరుగు అగును।**
**చదివి చదివి పడయు – జ్ఞానమ్ము శిష్యుండు**
**గురువు, తోడుచుక్క – పెరుగునందు.**

ఆచార్యవర్యులు ప్రసిద్ధ కవులేగాక - ముందు చూపుగల మనీషి. నేటి సమాజంలో కొందరు యువతీయువకులు ఏదో ఒక నెపంతో విధ్వంసక చర్యలు చేయుచుండుట మనమెరిగినదే. అట్టివారు తమ మూర్ఖత్వాన్ని వదిలి - సమయ-సాహస-శౌర్య పరిధులను తెలిసికొన్నచో వారికి జయము కల్గునని వ్రాసిన పద్యపు హితబోధ ఈ విధంగావుంది

**వేల్పులెల్లవెరచి - వెనుకంజు వేయుచో**
**ముందుకురకవచ్చు మూర్ఖులెపుడు**
**సమయసీమనెరిగి - సాహసమ్మునుజూప**
**శౌర్యమనగ బరగు - జయముగల్గు**

ఈ పద్యాన్ని చదివాక నాకు శ్రీపరవస్తు చిన్నయసూరివారి నుడి జ్ఞాపకం వచ్చింది. "పార్థివుండవివేకుండయ్యేనేని లెంకలు కొంకుమాని" ఎద్దీనెననిను, దూడను కొట్టమున కట్టివేయుడు' అన్నాట్ట - ఈ పద్యం నేటి అధికార పటుత్వం ఎట్లావుందో తెలుస్తోంది. ఇక్కడ రాజ్యాధికారాన్ని వేల్పులతో పోల్చవచ్చునని నా అభిప్రాయము.

ఇంకా, ఇంకింకా ఆచార్యుల వారి పాండితీ గరిమను వర్ణించినా, తృప్తికలుగదు. ఇట్టి ఆచార్యవర్యుల కుటుంబ సభ్యులకు ఆశ్రియఃపతి ఆయురారోగ్యములు చేకూర్చాలని మనసా వాచా ఆసించు ఒక శ్రేయస్కామి.

***** కోయిల్ కందాడై తిరుమలాచార్య *****

# ఆచార్య ఫణీంద్ర "గురు పూజా మహోత్సవం"

ఆంధ్ర పద్య కవితా సదస్సు రాష్ట్ర స్థాయి అధ్యక్షుల డా॥ నండూరి రామ కృష్ణమా చార్యులు గారు రచించిన బృహత్కావ్యం - " ఆలోచనము" గ్రంథావిష్కరణ సభ శ్రీవారి శిష్యాగ్ర గణ్యులు బృహత్ ద్విసహస్రావధాని డా॥ మాడుగుల నాగ ఫణి శర్మ గారి అధ్యక్షతన, రామ కృష్ణమాచార్యుల వారికి వారి శిష్యులు చేసిన గురుపూజా మహోత్సవ సభగా భాసిల్లినది . ఆనాడు 31-12-98 గురు పూర్ణిమ కూడ కావడం విశేషం. హైదరాబాదు లోని సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లే త్యాగరాయ గాన సభలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్ఞానపీఠ పురస్కృత మహాకవి డా॥ సి. నారాయణ రెడ్డిగారు గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఎన్నో అధునాతనాంశాలను ఆట వెలదులలో అత్యంత రమణీయంగా ప్రస్తావించిన ఆచార్యుల వారు అభినంద నీయులని ప్రశంసించారు. "శీర్ణ మేఖల" రామకృష్ణమాచార్యులుగా సుపరిచితులైన కవి కలంనుండి కల ఈ కావ్యం వెలువడిందంటే ఆశ్చర్యంగా ఉందన్నారు.

**ఉండు - నిజము - దాగి - ఒంటి స్తంభము మేడ !**
**చేర ఏది కాని - దారి లేదు !**
**ఎగిరి వ్రాల - మెదడు హాదిని రెక్కలు చేసి ;**
**కాలి అడుగు జాడ కాన రాదు.**

వంటి పద్యాలను ఉదాహరిస్తూ ఆచార్యుల వారు వచన కవితలో కూడ సాధించలేని ఆధునికతను, పద్యంలో సాధించారని కీర్తించారు.

సభాధ్యక్షులు డా॥ మాడుగుల నాగఫణి శర్మగారు మాట్లాడుతూ ఆచార్యుల వారు ఏనాడో లబ్ధప్రతిష్ఠులని, వారికి ఈ సభా కార్యక్రమం వలన క్రొత్తగా 'ఒకగూడేదేమి లేదని, అయితే తమ గురుదేవులను సత్కరించు కోవడానికి తమతో బాటు శిష్య లందరికి ఇది ఒక సువర్ణావకాశంగా భావిస్తున్నా మన్నారు. డా॥ నాగఫణి

శర్మగారు ఆచార్యుల వారిని, వారి సతీమణి శ్రీమతి సుబద్రగారిని స్వర్ణ కంకణంతో, పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ సభలో విశిష్ట అతిథిగా వాణిజ్య ప్రముఖులు శ్రీ గంజి రాజ మౌళి గుప్త గారు పాల్గొన్నారు.

కావ్య పరిచయం చేసిన సుప్రసిద్ధ కవి డా ఆచార్య తిరుమల గారు " "ఆలోచనము " పేర వెలసిన ఈ కావ్యంలో ప్రతి పద్యం ఎంతో ఆలోచింప జేసేదిగా లోకోక్తి ప్రాయంగా ఉందని అన్నారు.

**ఏను తరచు మార్చి నాను - ఉద్యోగముల్,**
**ఊళ్లు, ఇళ్ళు , కార్లు, కళ్ల జోళ్ళు**
**మార్చి నాడ నన్ని - మా శ్రీమతిని తప్ప,**
**మధుర కవిత మీది మమత - తప్ప!**

**"లేడు దేవు దనెడు వాడెచ్చటను లేడు-"**
**అనుచు నొక్కి పలికె - నాస్తికుండు!**
**"లేడు ధరణి మీద - లేడుగా కంసాలి"**
**పసిడి ఉంగరమ్ము బదులు పలికె –**

వంటి పదాల లోని వోస్య వ్యంగ్య చమత్కృతిని వివరించి సభను అలరించారు.

**"చాల నాళ్ళ బ్రదుకు సమకూర్చెగా నాకు;**

**పెక్కు అనుభవాలు - విలువ గలవి !**
**జగతి కిచ్చినాడ - చక్ర వడ్డీ చేర్చి**
**పద్య రూప మందు - భద్ర పరచి"**

అని ఆచార్యుల వారు చెప్పినది అక్షర సత్యమని, అలోచనము' కావ్యం ఒక పరిపూర్ణ జీవితానుభవ సార మని కొనియాడారు.

సభలో ఆచార్యుల వారి శిష్యు లెందరో రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసి, ఆచార్యుల వారిని వస్త్రాలతో పుష్ప మాలలతో సత్మరించడమే కాక - పంచ రత్నాలలో, పద్య

పుష్పాలతో అక్షరాంజలి ఘటించారు. డా! వి.యల్. ఎస్. భీమశంరం గారు డా మంతెన సూర్యనారాయణరాజు గారు ఢా॥ రఘు రామ రెడ్డిగారు, శ్రీఏకాంబరాచార్యగారు, డా॥॥ తేజేశ్వరరావు గారు, డా॥ రాధశ్రీ గారు తదితర ప్రముఖులంతా ఈ శిష్యగణంలో ఉన్నారు. ఈ సభకు శ్రీ వెనిగెళ్ళ రాంబాబు గారుఆశు కవితా స్వాగతం పలికారు. సభాకార్యక్రమానికి ముందు ప్రముఖ గాయకుడు. శ్రీ అమలాపురం కన్నారావు గారు 'ఆలోచనము' గ్రంథం లోని కొన్ని పద్యములను పాటలను అత్యంత కమనీయంగా గానం చేసి అలరించారు.

ఆచార్యుల వారు “ఆలోచనము” గ్రంథంలో వేమన పరిధి దాటి, ఎన్నో అధునాతనాంశాలను స్పృశించి, అత్యంత రమణీయ పద్య రచన కావించారు. “ఆట వెలదొ” కి అందాన్ని బెన్నక్యాన్ని సమకూర్చినది వేమన తరువాత ఆచార్యుల వారే అని చెప్పక తప్పదు. రాబోవు శతాబ్దిలో ఆచార్యుల వారి పద్యాలు నిత్యజీవితంలో అడుగడుగునా ఉదాహరించుకొనే ప్రయోజనాత్మక వద్య విహంగాలుగా రెక్కలు, విచ్చి ఎగురుతాయని నా నిశ్చితాభిప్రాయం. ఈ సభకు ఆచార్యుల వారి ప్రియ శిష్యుడనైన నేను సమావేశకర్తగా వ్యవహరించే భాగ్యం కలుగడం నా పూర్వ జన్మ నుకృత ఫలంగా భావిస్తాను.

# "శతావధాని డాక్టర్ సి.వి. సుబ్బన్న"

“ వెన్న యెట్టు లుండు?” - నన్న - మా రామకృ
ష్ణమ సుధీ హృదబ్ధ మట్టు లుండు;
“జున్న దెట్టు లుండు” నన్న ? మా రామకృ
ష్ణమ సుధీవచోర్థ మట్టు లుండు.

*** **శతావధాని డాక్టర్ సి.వి. సుబ్బన్న** ***

# డాక్టర్ రాధశ్రీ

## నా జీవితాన్ని మలుపు త్రిప్పిన గురుదేవుడు నండూరి

అది 1981 వ సంవత్సరం. నాకు ఎం. కాం., ఫైనల్ క్లాసులు అయిపోవస్తున్న రోజులు. నాకు కొంచెం సాహితీ స్పృహ ఉండడంతో ప్రిన్సిపాల్ గారికి దగ్గరి వాడిని అయ్యాను. ప్రీవియస్ లో వచ్చిన మార్కుల్లో కూడా నాదే హయ్యస్ట్ కావడంతో జగదీశ్వర రావు గారికి అభిమాన పాత్రుణ్ణి అయ్యాను .కాలేజీ డే జరపాలని కాలేజీ యాజమాన్యం నిర్ణయించింది. ప్రిన్సిపాల్ శ్రీ పోలవరపు జగదీశ్వర రావు గారు ఛీఫ్ గెస్టును నిర్ణయించారు. ఏర్పాట్లు అన్నీ చకచకా జరుగుతున్నాయి. అనుకున్న రోజు రానే వచ్చింది. ఛీఫ్ గెస్టుకు స్వాగతం చెప్పే బాధ్యత నాకు అప్పగించారు. ఛీఫ్ గెస్ట్ చాలా గొప్ప వారని ఆయనకు "స్వాగతం సత్కారాల్లో ఏలోటూ రాకూడదని అందుకే నిన్ను పంపుతున్నాను" అని జగదీశ్వరరావు గారు నాకు స్వయంగా చెప్పారు. నేను సరే అని రైల్వే స్టేషన్ కు వెళ్ళాను. పూల దండలు కూడా తీసుకుని వెళ్ళాను. చాలా గొప్ప వారు వస్తున్నారు అంటే గొప్ప సూటూబూటులో హంగామాతో ఆర్భాటంగా మందీ మార్భలంతో వస్తారని ఆశించాను. కానీ నా అంచనాలను తలకిందులు చేస్తూ సామాన్యులలో సామాన్యునిగా ఉన్న ఒక వ్యక్తి రైలు నుండి దిగిన వారిలో ఉన్నారు. నేను అంతగా పట్టించుకోలేదు. స్టేషన్ నుండి అందరూ ఎవరి దోవన వారు వెళ్లిన తర్వాత ఆయన ఒక్కరే మిగిలారు. ఆయన నాదగ్గరకు వచ్చి "బాబూ జగదీశ్వర రావు గారి కాలేజీ ఇక్కడికి ఎంతదూరం ఉంటుంది "అన్నారు. నాకు విషయం తెలిసింది. "అయ్యా మీరు నండూరి రామ కృష్ణమాచార్యుల వారు కదూ...మీకోసమే ఎదురు చూస్తున్నాను "అంటూ వంగి ఆయన పాదాలకు నమస్కారం చేశాను. నాకు తెలియకుండానే ఆయన సింప్లిసిటీ ఆయన ముఖ వర్చస్సు చూసి అలా చేయాలని అని పించింది. ఆయన వారిస్తూ నన్ను దగ్గరికి తీసుకున్నారు. ఆయన స్పర్శలో నాకు పితృ వాత్సల్యం కనిపించింది. ఏముహూర్తాన ఆ పరిచయం జరిగిందో గానీ నా జీవితాన్నే మార్చివేసింది.

స్టేషన్ నుండీ కాలేజీ గెస్ట్ హౌస్ కు వారిని తీసుకెళ్లి వారిని దింపి " రెస్ట్ తీసుకోండి మాస్టారూ" అన్నాను. " రెస్టేముందోయ్ ఏమి కష్టపడ్డానని... ఉండు...స్నానం చేసి వస్తా మాట్లాడు కుందాం, ఈలోగా నా పుస్తకం ఒకటి యిస్తాను ఊరకే తిరగేస్తూ ఉండు" అంటూ స్నానానికి వెళ్ళారు. ఆ పుస్తకం పేరు తారాతోరణం. యధాలాపంగా పుటలు తిరగవేస్తూ ఉండగా ఒకచోట నా చూపు ఆగిపోయింది. అదే శీర్ణమేఖల ఖండిక....

1942 లో ఆయన వ్రాసినదా శీర్ణమేఖల. నేను భారతములో చదివ లేదు. శశిరేఖ కథ లాగే భారతంలో లేని కథన్నమాట. వారు స్నానం చేసి వచ్చిన తర్వాత అదే విషయం ఆయనతో అన్నాను. " అవునోయ్ అది నా స్వకపోల కల్పితం " అన్నారు వెంటనే వారికి పాదనమస్కారం చేశాను. "బొగ్గు పాల కడుగ పోవునా మలినంబు అని వేమన అన్నాడు. మనం అందరం విన్నాం. కానీ మీరు దుర్యోధనుని అపకీర్తి అనే బొగ్గును మీ కవిత్వం అనే పాలతో కడిగే ప్రయత్నం చేశారు మాష్టారూ" అన్నాను. "నా హృదయాన్ని సరిగ్గా పట్టుకున్నావోయ్" అన్నారు. తర్వాత వారు తిక్కన భారతాన్ని ఇంగ్లీషులోకి ఎలా అనువాదం చేశారో వివరించారు.... నండూరి రామకృష్ణమాచార్యుల వారితో నా మొట్టమొదటి కలయిక నా మనసులో అలా నిలిచిపోయింది.

కాలమహా ప్రవాహంలో 1982 వ సంవత్సరం వచ్చింది. నేను దుగ్గిరాల లో కామర్స్ లెక్చరర్ గా ఉద్యోగం సంపాదించాను. వెంటనే తిరుపతి వెళ్ళాలనుకున్నాను. దైవికంగా గురువు గారు తిరుపతి దేవస్థానం లో ఒక ప్రాజెక్ట్ లో ఉండడం నన్ను పిలవడం జరిగింది. గురువాజ్ఞ నే దైవాజ్ఞ గా భావించి తిరుపతి వెళ్ళాను. ఆయన నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించి తన శిష్యుడైన మాడుగుల నాగఫణి శర్మ ను పరిచయం కూడా చేశారు. ఆయన సిఫార్సు లెటర్ మీద నాకు స్వామి దర్శనం కూడా సులభంగా లభించింది.

గురువు గారి ఆశీస్సులతో నాకు 1983 లో కెనరా బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్ లో పోస్టింగ్ ఇచ్చారు. దైవికంగా గురువు గారు కూడా నాకు దిశానిర్దేశం చేయడానికా అన్నట్టు హైదరాబాద్ లోని టీ టీ డీ భవన్ ఇన్ ఛార్జ్ గావచ్చారు. నా

అదృష్టమే అదృష్టం గా పొంగి పోయాను. తి తి దేవస్థానం తరపున గురువుగారు నాతో ఎన్నో ధార్మిక ప్రసంగాలు చేయించారు. దేవనాథ సూరి వెంకట రామన్ లాంటి వారితో కలిసి గురువు గారి ఆధ్వర్యంలో "త్యాగరాజు" నాటిక కూడా వేశాము. 9-9-1983 న నేను రవీంద్ర భారతిలో మొదటి సారి ప్రదర్శించిన "ఆర్య చాణక్య" ఏకపాత్రాభి నయాన్ని చూచి గురువుగారు నన్ను ఆశీర్వదించారు. 1984లో నాకు విపరీతమైన పన్ను పోటు వస్తే గురువుగారే తనకు సికిందరాబాద్లో తెలిసిన రెసిడెంట్ డాక్టర్ రిఫరెన్స్ యిచ్చి ట్రీట్మెంట్ యిప్పించారు. ఎన్ని సార్లు గురువు గారి ఇంట్లో భోజనం చేశానో లెక్కే లేదు. అమ్మ గారు..... సుభద్రమ్మ గారు.... ఎంతో ఆప్యాయంగా కొసరి కొసరి మరీ వడ్డించే వారు. అలా సాహిత్య సాంస్కృతిక వాతావరణంలో కాలం గడుస్తూ ఉంటే గురువుగారి ఆశీస్సు లతో నాకు 1985లో సిండికేట్ బ్యాంక్ లో ఆఫీసర్గా ఉద్యోగం వచ్చింది. మహా రాష్ట్రలోని ఒక పల్లెటూరి బ్రాంచ్ లో పోస్టింగ్ యిచ్చారు. చిన్న ఉద్యోగం అయినా హాయిగా హైదరాబాద్ లో సాగిపోతున్న జీవితాన్ని వదిలి ఎక్కడో మహారాష్ట్ర మారుమూల ప్రాంతానికి వెళ్లిపోవడం నాకు బాధ కలిగించింది. అయినా గురువు గారే పట్టుబట్టి... పెద్ద ఉద్యోగం వస్తే వదులు కోకూడదు అని మందలించి మరీ పంపించారు.

అప్పటికి ఇంకా నాకు పెళ్లి కాలేదు. పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. నేను ఎక్కడో మహారాష్ట్ర మారుమూల పల్లెలో ఉన్నందు వలన ఆ బాధ్యత అంతా గురువు గారే తీసుకున్నారు. సిండికేట్ బ్యాంక్ లోనే ఆఫీసర్ గా పని చేసే కరణం అమృత లక్ష్మి తో పెళ్లి నిశ్చయం చేశారు. వాళ్ళ నాన్న కరణం రాజశేఖర రావు గారిని ఆయన సంప్రదించి అబ్బాయి బాధ్యత అంతా నాది. అబ్బాయి దూర ప్రాంతంలో ఉన్నాడు అతని గుణగణాలకు నాది హామీ అని చెప్పి ఈ సంబంధం ఖాయం చేశారు. 1987 లో జరిగిన పెళ్లి కి ఆయనే పెద్ద. అలా ఆయన నా జీవితాన్ని నిలబెట్టారు. 1991 లో నాకు కవల పిల్లలు పుట్టారు. నామకరణంలో పేర్లను గురించి నా అభిప్రాయం తెలుసుకున్నారు. మహాకవి సి నా రె గారు నా పిల్లలకు కావ్యభావన, కవితాచేతన అని సూచించారని తెలిపాను. అదే పేర్లను గురువు గారు బంగారు ఉంగరంతో బియ్యం లో వ్రాసి

ఖాయపరిచారు. ఈరోజు నా పిల్లలు విదేశాలలో గౌరవ ప్రదమైన ఉద్యోగాలు చేసుకుంటున్నారంటే దానికి గురువు గారి ఆశీస్సులే కారణమని విశ్వసిస్తున్నాను.

నన్ను డాక్టరేట్ చేయమని ప్రోత్సహించింది కూడా గురువు గారే. 1994 లో నేను ఆగ్రాలో పనిచేస్తున్నప్పుడు ఆగ్రా ఆంధ్రా అసోసియేషన్ లో గురువు గారి ఉపన్యాసం ఏర్పాటు చేయించాను. ఆయన ఉపన్యాసం విని అక్కడి ఆంధ్రులు ఎంతో సంతోషించారు. మరలా హైదరాబాద్ వచ్చిన తర్వాత ఎన్నో కార్యక్రమాలు కలిసి చేశాము. అందులో చరిత్ర పరిశోధకులు శ్రీ బీ యన్ శాస్త్రి గారి ఇంట్లో కాళిదాసు మీద జరిగిన సమావేశంలో గురువు గారి ఉపన్యాసం ఎంతోమందిని అలరించింది.నేను దోమకొండ బ్రాంచి మేనేజర్ గా ఉన్న సమయంలో కూడా గురువు గారిని దోమకొండకు ఆహ్వానించి సత్కరించాను. వారి"ఆలోచనం"లోకూడా వారి మీద నాకు గల అభిమానాన్ని అక్షర రూపంలో ప్రకటించుకున్నాను. రాంబాబు, ఫణీంద్ర వంటి సహ రచయితలతో కలిసి నప్పుడల్లా గురువుగారిని గురించి తలచు కుంటుంటాను. ఇలా.... ఎన్నో... ఎన్నెన్నో... జ్ఞాపకాలు....

నా జీవితంలో గౌరవ ప్రదమైన స్థానం గురువు గారిదే ... ఈ జీవితం వారు పెట్టిన భిక్షే.... నమ్రతతో నమస్కరిస్తూ......

*****డాక్టర్ రాధశ్రీ *****

* * * * * * * *

అక్షరాక్షరముల అమృతము పండించి
ఆక్షయములుగ నిడి అక్షరముల -
"గురువు" అన్నమాటకొక గుర్తుగా నిల్చి
"రామకృష్ణ సుకవి" రమ్యుడయ్యె.

***** మాడుగుల నాగఫణి శర్మ *****

# కవితా నీరాజనములు

# ఆచార్య ఫణీంద్ర

# గురు దక్షిణ

శ్రీ నండూరి కులైక భూషణుడు- నిశ్శేషాంధ్ర సాహిత్య సు
జ్ఞానానంద మయుండు - స్వచ్ఛ మగు బంగారంపు పద్యంబులన్
నానా రీతుల కావ్య భూషలుగ తా నందించి ఆంధ్రాంబకున్,
ఈ నాడందెను రాష్ట్ర పద్య ఘన సంస్థేశుండుగా మన్ననల్.

"రామ కృష్ణమాచార్య" సన్నామధేయు
డెపుడో, ఏబదేడుల నుండి వకధాటి,
పద్య కవితలన్ సృజియించి పండిపోయె !
మహిని పద్యమ్మున కతండు మారు పేరు.

కువలయమున నున్న కుటిల నీతిని ఎత్తి ;
కుండ బ్రద్ద లట్లు కొట్టి చూపి,
అభ్యుదయ పథమ్ము "నాలోచనము" పేర,
వెలయ జేసినట్టి "విప్లవ కవి" !

అతుల కవీశ్వరుండు - కవితాంబకు ముద్దుల పట్టి - పండిత
స్తుత ఘన సాహితీ కుసుమ శోభన వాటిక యందు మేటి క
ల్ప తరువు - మాధురీ రసమపారము నిండిన పద్య శిల్పముల్
శతములు చెక్కుచున్, పలుకు శాసనమౌ "గురు దేవు" మొక్కెదన్

*** ఆచార్య ఫణీంద్ర ***

ఆట వెలది పద్య మా చార్యు కవితలో
లాస్య మాడు హొయలు లయలు చిలికి
శ్రుతుల స్మృతులు ధర్మ సూక్ష్మ వేదాంతముల్
తరచి వెలుగు వెల్లి విరియ జేయు.

*** ఆచార్య ఫణీంద్ర ***

# డా. మేడసాని మోహన్

**పంచ సహస్రావధాని** **ఆచార్య దేవో భవ**

వాత్సల్య సంశుద్ధి, పాండిత్య వరసిద్ధి,
ప్రతిభాప్రపూర్ణ సంభరిత బుద్ధి,
సంస్కృతాంధ్రాంగ్ల భాషా సాహితీ పరి
శోధనా భోధనాస్తోక ధిషణ,
సత్కావ్య మర్మజ్ఞ సంవిత్ప్రభావిత
విద్యార్థి లోక వాగ్విశద ఫణితి,
హాస్య చమత్కార హర్షబంధుర ముఖాం
భోజ ప్రసన్న విస్ఫూర్తి కలన

లే మహాత్ముని సరస సాహిత్య గుణము;
లతడు నండూరి వంశ దుగ్ధాబ్ధి విధుడు!
రామకృష్ణమాచార్య హేరాళ యశుడు -
మద్గురు స్వామి జీవన మార్గ సరళి!

"తిరుమల తిరుపతి పండిత
పరిష"న్మధ్యమున మధుర భావో
ద్వేగ స్ఫురితోపన్యాసమ్ముల
విరాజిలగ జేసినట్టి విబుధునకు నతుల్!

"శీర్ణమేఖ" లాది కృతిత్వ సిద్ధు లెంచి
సరస "జంధ్యాల పాపయ్య శాస్త్రి" వంటి
సత్కవీశ్వరులే ప్రశంసలను కురియ
ఇంక మాబోటి వారెంత? ఎంచి చూడ!

ఏ యూర్ధ్వ లోకములలో
శ్రీ యుత నండూరి రామకృష్ణ గురుని ది
వ్యాయత మూర్తి యలరునో - త
దాయత్త జగత్తున కిదె అస్మత్ ప్రణతుల్!

~ # ~

# బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ

మహాకవి – మానవతావాది, బహుభాషా భిజ్ఞుడు – సంఘసంస్కర్త; బహు శిష్య పోషకుడు :: **ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య గారికి**

## అక్షర పద్యాంజలి

ఉ॥ జీవితమెల్ల పద్యముల సింధువు పొంగగ పార్వణేందువై
ఆవృత శిష్యకోటి లసదభ్యుదయంబె తరేక లక్ష్యమై
పావన వృత్తజీవనుండు భాగ్యవిశిష్టుండు భోగి-యోగి-నా
నా వర సద్గురు ప్రవర నందురి రాముడు కృష్ణుడెంతయున్

ఉ॥ అమ్మను చెప్పగా వలయునాతని కన్నను ముందుగా "శుభ
ద్రమ్ము"ను - ప్రేమతోడ సతతమ్ముగ నన్నము వెట్టు - అన్నపూ
ర్ణమ్మను - మందహాస రుచిర ప్రకరమ్ము రుచిప్రసాద రు
చ్యమ్ముగు భోజనమ్మిడెడు అమ్మకు వేల నమస్కృతుల్ సదా!

సీ॥ ఎవ్వాని హృదయమ్ము హిత శిష్యకోటికి
సాందీపనీ క్షేత్ర సత్త్వభూమి
ఎవ్వాని గృహలక్ష్మి విప్రోద్ధనం జూడ
కాశ్యన్న పూర్ణమ్మ పసిడి గరిటె
ఎవ్వాని వాగ్వల్లి ఇహపర విద్యకు
అద్వైతమాది భాష్యత్రయమ్ము
ఎవ్వాని పుణ్యంబు హిమశైల శిఖరాగ్ర
మందు పుష్పించు విహారలతిక

తే॥గీ॥ అతడు నండూరి భవ్య వంశాంబుధి శశి
రామకృష్ణమాచార్య విద్యామహర్షి
దివ్య కైవల్య దీప్తికి దీప్తినొసగు
నతని పాదాబ్జ యుగళికి నంజలింతు

ఉ॥ అన్నముబెట్టి జ్ఞాన పరమామృత మందున ధారవోసి శ్రీ
మ, న్నవ కావ్య సిద్ధ సుషమారస మార్గము జోధవేసి, సం

పన్న గుణాభిరాములుగ పల్లవర్ శిష్యుల తీర్చిదిద్ద వి
ద్వన్నుత రామకృష్ణ కవితా గురుమూర్తికి అంజలించెదన్.

# నమస్కృతపత్రమ్

శివ శీర్షంబున నొక్క బిల్వదళమై చెన్నొందు చందాన మా
ధవు పాదాల పవిత్రమౌ-తులసియై. కన్పించు అస్మత్. కృతం
'బవు -మా సత్కృతి సత్కృతి ప్రచురమై ఆనంద సంభావనా
'ప్రవణంబయ్యేను రామకృష్ణ కవిచంద్రా ! అందుకో ప్రేమతో.

స్వర మాధుర్య రసాల కోకిలము దీవ్యద్భావనాకాశ చం
ద్ర రసాలోకము పద్య పద్మ సరసీ తంత్ర స్వతంత్రమ్ము సాం
ద్ర రుచిన్ మా కృతి జీవనమ్మును సుభాద్రా భద్ర హస్త దయా
నిరతాన్న ప్రద మయ్యె-శిష్య తతికిన్ నిత్యాశిష శ్రేయమై.

"అట వెలదు" లందు అమృతమ్ము నొలికించి,
తేట గీతు లందు తీపి పెంచి;
తెలుగు నేల విరిసె తేనెల పూ దోట,
రామ కృష్ణమార్య ! రమ్య సుకవి.

గురు ప్రసిద్ధ గురుపూర్ణిమా తిథౌ.
గురోశ్చ పూర్ణ ప్రతిభా ప్రకాశినః
సమర్ప్యతే సత్ కృతి దివ్య మాలా!
గళేహి రారాజతు శిష్య దత్తా ॥

***** మాడుగుల నాగఫణి శర్మ *****

# శ్రీ శనగన నరసింహ స్వామి

# గురు దక్షిణ

ఘన నండూర్యన్వయ ఖని
మణి, వేంకట రామ కృష్ణమాచార్యు యశో
ధని, తారాతోరణ కృతి
వినిబంధన చణుని గొల్తు - విద్యా గురువున్.

ఎవ్వాని నామంబు హృది తళుక్క మని నంత
కందోయి మోద వాఃకణము లురలు;
ఎవ్వాని విగ్రహం బెదుట నిల్చిన యంత్ర,
నిలువెల్ల నీపమై పులకరించు;

ఎవ్వాని చిరు నవ్వు వీక్షించు నంతనే
చింతా పయోదాళి చెదిరి పోవు !
ఎవ్వాని వాగ్రసం బెసగి గ్రోలిన యంత,
విమలామృతంబును వెగటు గొలుపు -

అమ్మ విధాన మమ్ము మధురాదర వైఖరి జూచు మా సుభ
'ద్రమ్మను సంతతాతిథి సమర్పన కాళిక అన్నపూర్ణనే
పొమ్మన జాలు సాధ్విని - ప్రభూతపు భక్తి -నమస్కరింతు- డెం
దమ్మున దేశికాంగనను నండురి వంశ వధూజనోత్తమన్.

పాయక మీ పదాబ్జముల పాంసువులన్ తల దాల్చు కొందు నే
హాయిగ తొల్లి భీమవర మందు పఠించిన నాలుగేండ్లు - నా
కాయము నాటుకొన్న పులకంబులు మాటికి సాటి లేని పా
థేయము లౌచు - నా బ్రదుకు దీర్చెడి నేడును దేశికాగ్రణి. !

నటులో పాటకులో కవిత్వపటులో నాట్యజ్ఞులో సాహితీ
వటులౌ శిష్యులొ విందులై బహుకళాపారమ్య లీలా సము
త్కటగోష్ఠీగతి వెళ్లబుత్తు రెపుడున్ కాలమ్ము నీయింట నీ
వెట నుందో యట శారదా చరణ మంజీరైక శింజా గతుల్.

సవినయ మూర్తులై కవులు ఛాత్రులు వెంబడి నేగుదేరగా
నివుజులు గప్పు నిప్పన - తృణీకృత బ్రహ్మపురందరుండవై;
నవ నవ మైన తీవిని చనం గని - పౌరులు పెద్దనాది స
త్కవులు తలంప్రలన్ నిలువగా పులకించుట నే నెరుంగుదున్

సాగుచున్నదె నిత్యసాహితీసత్రమ్ము
కమ్మగా ప్రత్యవాయమ్ము లేక ?
వచ్చు చున్నారె మీ వసధాంగణమునకు
దిన దినమ్మును కళాతిథులు నేడు ?

చెలగన్ బూరము పింగళీంద్రుడగు లక్ష్మీకాంత మాచార్యుచే
తెలుగుం బీఠిక పూర్వ గర్వ సుయశోదీప్తచ్ఛటల్ - మీద - నీ
వలనన్_మీరె ప్రతిక్షణైక రచనా వ్యాసంగి ! నిక్కమ్ము లీ
పలుకుల్ సాక్షులు వేనవేలు గల రే ప్రాంతమ్ములో జూచినన్:

మౌళిపై కేలుదోయిని గీలుకొలిపి,
తలతు నండూరి వంశసుధాపయోధి
పార్వణేందుని దేశికపాదు రామ
కృష్ణమాచార్యు నిస్తుల కీర్తిధుర్యు.

*** శ్రీ శనగన నరసింహ స్వామి ***

# నాగబైరవ కోటేశ్వరరావు

నండూరి వారి గుండెను
నిండుగ మల్లియల తావి నిల్పెంగాదే!
పండితు డాతడు - తెలుగుల
జెండా కవనమ్ము నందు జేజే లివియే 1

*** నాగబైరవ కోటేశ్వరరావు

# “యార్లగడ్డ సుబ్బారావు”

నందూరి వంశ్య ! కవి కుల
మండన ! శ్రీరామకృష్ణమాచార్యా ! నీ
నిండగు హృదయాంబభోనిది,
మెండుగు సౌజన్య సుధకు మేర కదయ్యా !

కులముల మాట కేమి ? కల కూజిత గానము లాలపించు కో
యిలల కనేక జాతుల మహీరుహ సంతతి యాశ్రయంబుగా
నిలచిన మాత్రనే, కలుగ నేర్చునె ? తత్కల కంఠ మాధురీ
విలసన మందొకించుక విభేదము మాన్య విపశ్చిదగ్రణీ 1

కవికుల మందుం బుట్టితిమి, గాదిలి బిడ్డల మాం'్రవాణికిన్,
జివగల పద్య విద్య గల శిల్ప మహత్త్యపు సోయగంబులన్
తవిలిన డెందముల్ మనవి; ద్రైతము తోయట యెట్లు? త్వాద్బళ
'ప్రవిమల చిత్తులన్ స్వపర భావ మొకించుక చేరనేర్చునే?
ఆచార్యోత్తమ ! తావకీన కవితావ్యాసంగ యోగంబునన్

ప్రాచీనాద్యతనాంధ్ర కావ్య రచనా 'ప్రాగల్భ్య మోమాంసలో,
వ్యాచిఖ్యాసిత పద్య శిల్చ సరణిన్ పద్యంబులే నిల్చు; సం
కోచంబందం వ్యక్తులున్ కులములున్ గోత్రాలు విద్వన్మణీ.
గురుదేవుల్ కడు శిష్యవత్సలుని హృత్కోశంబునన్ నిల్చి యా,

వరదాచార్యుని పాదపద్మయుగమున్ భక్తిన్ సమర్చింతు; నా
గురుదేవుం గనుంగొంటి మి యెడందలోం గూటస్థ చిద్రూపుడై
పరమాత్మాకృతి నున్న ! వాండదె మహాభాగా! నమస్కారముల్.
పుత్రిని గూర్చి తండ్రియును, బుద్ధిమద గ్రణి శీలవంతుండా

ఛాత్రునిం గూర్చి సద్గురువు సంతతమున్ శ్రమియించుచుంట -యీ
ధాత్రిని గానవచ్చుం గవితా రసలుబ్బు లదృష్టపూర్వులే
మిత్ర వరేణ్యు లీ గతి శ్రమించుట- మత్కృత పూర్వపుణ్య వై
చిత్రి యటంచు నెంచెద వశీకృత సత్కవితా సుధానిధీ 1

ఏ సంబంధము లేని యిర్వురకు నిట్టీనిర్ణిబంధాంచితం
బౌ సౌహార్ద్రముం గూర్చి, యొండొరులపై నాత్మీయతాభావ వి
శ్వాసంబున్ నెల కొల్పినట్టి జననిన్ వాగ్దేవి నామ్నాయ చూ
డాసంచారిణి గొల్తు నా హృదయ పీఠమ్మందుం జిద్రూపిణిన్

నీ "కవితా ప్రభాస" కృతి నేంటి సమాజపు ధర్మశాస్త్ర మా
లోక మనాకులంబుగ విలోక మొనర్చుచు సంచరించినన్,
నాకము లోకువౌ భువికి? నవ్యసమాజపు దివ్య దీధితుల్
'ప్రాడు సమస్త విశ్వమున భారత సంస్కృతి మూల కందముల్.

# యార్లగడ్డ సుబ్బా రావు సువర్ణాభిషేకము

ఎవ్వాని జిహ్వాగ్ర మేకాంతవేదిక
నలిన సంభవు రాణి నాట్యమునకు
ఎవ్వాని శిష్యాళు లీవిశాల ధరిత్రి
దిగ్వి దిక్కులకు కీర్తి ధ్వజాలు

ఎవ్వాని యర్ధాంగి యెడ త్రెంపు లేకుండ
అతిథ్య మొసగెడి అన్నపూర్ణ
ఎవ్వాని సహపంక్తి నేవేళ భుజియింత్రు
పంచము లాదిగా పంచజనులు

అతడు మానవతామూర్తి అతుల కీర్తి
ప్రథిత నండూరి వంశాకారమున వెలసె
రామ కృష్ణమాచార్యాఖ్య రత్న మొకటి
ఆంధ్ర వాణీమ తల్లి పుణ్యంపుపంట

తన కవిత్వమహత్త జనతాహితో దాత్త
దిగ్దర్శకంబగు దీపకళకి
తన పాండితీ ప్రౌఢీ ఘన సంస్కృతాంధ్రాంగ్ల
వాఙ్మయాంబుధికి కవ్వంపు కొండ

తన వాగ్విలాస వసన రసజ్ఞ ప్రజా
వ్యూహమానస పశ్యతోహరంబు
తన గుణ గ్రహణ పద్ధతి కుల మత వర్గ
పక్ష పాతమునకు వజ్రధార

తన సుహృత్తత్త్వ మహిమ చందనపుచర్చ
హితుల కతిథులకును సమాగతులకెల్ల
తాను వృద్ధుండు తత్కవితా వధూ టి
నిత్య నూతన యౌవనాన్విత శుభాంగి
నీటు గోటుల మురిపించు ఆట వెలది.

ఓ కవితా తపోనిధి ! మహోత్తమ నూత్న సమాజ సృష్టికై
నీ కవితా సరస్వతి కనీనికలన్ వెలయించు దీప్తి కా
రాకులడుల్చి సాంద్రగహనాంతర సీమల విచ్చు క్రొత్త పూ
రేకుల తావులుర్వి ప్రసరింప పునీతము చేయు గావుతన్

పొలుపుగ రాజధాని నడిబొడ్డున పద్య పతాక నీటుగా
నిలిపిన సాహసాంకుడవు నీవొకరుండ వటన్న సత్య మీ
తెలుగు మహాధరిత్రి నలుదిక్కులు నింగియు నేల గాలియున్
పలుకును రామ కృష్ణ కవి భాస్కర ! తావక కార్యదక్షతన్

ఇంకొక ముప్పదేండ్ల వఱకీకవితా రమణీ మణిన్ నిరా
తంకముగాగ నేలదగు దార్ఢ్యముతో, మధురాంధ్ర పద్యని
శ్శంక విహార దిగ్విజయ సారథిపై రథివై  సువర్ణ పీ
ఠాంకము చేర్చవయ్య ! మన ఆంధ్ర సరస్వతి తేజరిల్లగన్.

సంస్కృతాంధ్రాంగ్లాది సాహితీ పాథోధి
నడుగంట గన్న మంథాచలంబు ;
ఆంధ్ర పద్య కవిత్వ హైయంగవీనంబు
త్రచ్చి విబుధుల కందిచ్చు దాత ;
కవితా రసోద్భవ భూమి కవి చంద్ర

బాంధవుండగు కళా పక్షపాతి ;
సామాజిక స్పృహ ధామంబుగా కైత
సంతరించెడి కవి చక్రవర్తి ;

సాహితీ సేవకుండు - నిష్కామ యోగి;
శారదా దేవి గుడికి పూజారి యతడు;
ప్రధిత నండూరి వంశ జైవాతృకుండు
రామ కృష్ణమాచార్యుండు ప్రాజ్ఞ మౌళి

*** యార్లగడ్డ సుబ్బారావు ***

# శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు

## లయ

ప్రతిభా వ్యుత్పత్తులలో
ప్రతిభ గరీయసి కవిత్వ విలసనలో
ప్రతిభకు మున్నగు ప్రజ్ఞా
స్థితి వ్యక్త మ్మగుత కావ్య దివ్యాకృతియె.

ఇది కవితా ప్రభాస పరమేశ్వర దివ్య కళావిభాస, శారద పద కింకిణీ క్వణన రమ్యవిలాస కళింద నందినీ;మృదుల తరంగ హాస భజియింప గరండు రసజ్ఞ భావుకుల్: మెదడు ఎడంద విందు మిరుమిట్లు పసందులు పండు వెన్నెలల్.

విశ్వయాత్ర బడలి వేసారు పథికుడా!
కలత దేరి సాగ దలతువేని
రమ్య హాసలోలు రామకృష్ణుని కైత,
తేర ద్రావి దప్పి తీర్చు కొనుడు.

*** శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు ***

# మేడసాని మోహన

# సరసమతి

తన చూపు లోని స్నిగ్ధత శిష్యహృత్ కంజ
వాత్సల్య సూర్య బింబమ్ము గాగ,
తన పల్కులోని మార్దవము వాఙ్మయ గంగ
జనియించు నీహార మనగ్య
తన దరహాస ముద్ర - కవిత్వ గగన రా
కాచంద్ర సాంద్ర విశ్రాంతి గాగ,
తన కీర్తి - శరదంబర నితాంత కుంద ము
క్తాహార విదిత సంక్రాంతి గాగ;

అలరు విద్యార్థి కల్పకంబగు మహర్షి
భూరి కరుణాస్పదుండు నండూరి బుధుడు
సంస్కృతాంధ్రాంగ్ల నందనాంచద్విహార
సరసమతి రామ కృష్ణమాచార్య సుకవి

*** డాక్టరు మేడసాని మోహన్ ***

# డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు

పాలిత శిష్య వత్సలుడు - పద్య కవిత్వ కళారహస్యముల్
హేలన నాచికొన్న సుకవీంద్రుడు, దేశిక సార్వభౌముడై
యేలెను తెల్లు నేల. విరియించెను శిష్య సుమాళి - శారదా
శ్రీలు విదిర్చె గంట మవలీల. న.రా. కృ. మహత్వ దక్షతన్.

*** డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు ***

# "కవి" కలుగోట్ల విజయాత్రేయ
# కవి తాంజలి

శ్రీవారి సుమనోజ్ఞ " శీర్ణ మేఖల" రస
    రాజ్ఞ ముత్యాల వజ్రాల డాపు;
ఆచార్య దేవుల అజ్ఞాత కౌంతేయ
    మభిజాత సాహితీ విభవ శోభ;
దేశిక స్వాముల తిక్కన భారతా
    లోకన ప్రతిభా పతాక జిలుగు;
నండూరు. పండిన పాండితీ చండిమ
    ధర్మ చక్ర ప్రభా ధవళ రోచి
చల్లనౌ వారి నట్టిల్లు సరస మధుర
చారు సాహిత్య శారద చంద్రశాల;
భావుకాగ్రణులకు నెద పూవు దోట
అతిథి అభ్యాగతాళికి - నన్నపూర్ణ.

కళల కల్యాణి నృత్య రంగస్థలమ్ము;
రస విలాస వాహ్యాళి కారామ భూమి;
లలిత కవితా వధూటి వెన్నెలల బయలు,
రామ కృష్ణ మాచార్య కల్యాణ గృహము.
పద్య కవితా ప్రపంచ శుభ్రాంశు మూర్తి,
గద్య కవితా విపంచీ సుగంధ వీచి,
గేయ కవితా వసంత జేగీయ మాన
మాధవీ నికుంజ వితర్ది మా గురుండు 3.

జిలుగు తెలుంగు పల్కుబడి చిక్క దనమ్ములు పిక్కటిల్ల మం
జుల మధుర ప్రసన్న రస చుంబిత సంస్కృత దివ్య వాణి మం
గళ మహతీ నినాదములు కమ్మదనమ్ములు (గుమ, గిరిం ను
జ్జ్వాలముగ కైత లల్ల గల స్వామి కివే విజయాభివందనల్ 4.
    సరళ గంభీర ధీర మందర మరంద

భావ సౌగంధ సంపద పరిమళించు
వారి కంఠస్వరాల విహారము లవి;
తెలుగు భారతి తళుకు అందియల రొదలు. 5.

ప్రగతి గీతా ప్రశస్తి నిర్వక్ర నిరుప
మాన కవితా ప్రసక్తి అమంద మధుర
మధురస ప్రపత్తికి నొక విధు వనమ్ము,
రామ కృష్ణమాచార్య కళా పథమ్ము. 6.

ఇది ఒక సాహితీ విజయ హేల వికాసము రామకృష్ణ ధీ
సదన సుధా ్రవంతిక రసమ్ములు చిమ్మిన కావ్య వేళ సం
పదల పాదల్ ఘుమం ఘుమలు పర్వులు దీసి రవీంద్ర భారతీ
మృదుల పధాల భావ సుమరేఖలు వీచె కళా సమిరముల్ 7.

గీర్వాణ భారతీ క్రీడా వికంపిత
చరణ మంజీర రుంరుణల క్రాంతి
ఆంధ్ర సరస్వతీ యపరంజి గాజుల
కంకణమ్ముల ఘలంఘలల క్రాంతి
కవితా కళావతి కాంచన మణి కాంచి
గరుడ పచ్చల మెర మెరల క్రాంతి
రస మహారాజ్ఞి నవరత్న హాటక
మకుట రేఖల చకచ్చకల క్రాంతి
కవి బృహస్పతి నండూరి రవల కలము;
మధురసమ్ములు చిమ్మిన మంజు క్రాంతి;
మల్లె తావులు కమ్మిన మాన్య క్రాంతి;
విభవ సంక్రాంతి హేలా నవీన శోభ. 8.

సుర గంగ తరగల పరుగుల యురవడి
బురడించు కళల పెంపుల కుదింపు;
నందన మందార చందన కురువింద
లలితార్ద్ర పరిమళమ్ముల మదింపు;
మధుమంత మాకంద మందర మకరంద
మాధురీ రురుల కమ్మని నటింపు;

మందానిలానంద మత్త గందేభాల
గమన గంభీర భంగిమల ఘటింపు;
కలసి, హాయిగా రసములు చిలుకరించి;
మించు కవితా వధూటి క్రామ్మించు హొయలు;
పూజ్య నండూరి కావ్య సామ్రాజ్య హేల
రామ కృష్ణమాచార్య కల్హార మాల. 9.

రామచంద్ర ఉవాచ శ్రీరామగీత,
కృష్ణ వాసుదేవ ఉవాచ గీత కలసి,
కళలు కవితలు నైతిక విలువలె నగు
రామకృష్ణమాచార్యుల ప్రగతి గీత. 10.

కవి మహాఋషి సాహిత్య కనక నగము,
గురుడు నండూరు హరిణధరుడు,
రామ కృష్ణమాచార్య కళా విరాజ
చరణ రాజీవ యుగళి కంజలి ఘటింతు. 11

***** "కవి" కలుగొట్ల విజయాత్రేయ *****

## "చిల్లర కృష్ణమూర్తి"

## అభినందన పద్య మందారమాల

నండూరి వంశ వర్ధన !
పండిత కవి పుండరీక భాస్కర ! ధిషణా భారతి
మండన ! శుభముల నిడుచును
ఖండేందుధరుండు మిమ్ము కరుణను బ్రోచున్.

సాహిత్య సమరాంగణమ్మున
గాంగేయుడై నిల్చి ఘనత గాంచి,
సుర భారతికి తెల్లు సిరి మువ్వ గజ్జెలు
గట్టుచు నాట్యంబు గఆపి గఆప్కి

పద్య కవితకు నాటి ప్రాభమ్మును గూర్ప
కవితా సదస్సుల కడగి నడపి,

కావ్య కావ్యములకును కమ్మ కస్తురి వంటి
పీఠికా తిలకముల్ ప్రీతి దిద్ధి,

సుకవి పండితవర నగస్తోమముననను.
"సంచరించెడి" 'మేరు' ప్రశస్తి గాంచి,
గొప్ప దాతృత్వగుణమున కొమరు మోరు
కృష్ణమాచార్య మా ! గిడిగిళ్ళు మోకు,

*** చిల్లర కృష్ణమూర్తి ***

# డాక్టర్ అక్కిరాజు సుందర రామ కృష్ణ

సర్వాంధ్ర మందున సచ్ఛిష్య గణమును
కూర్చిన ఘనుడైన గురు వితండు!
ప్రాచీన సాహితీ పాధోధి నలవోక
పుక్కిటం బట్టిన ప్రోడ యితడు;

'ద్లోష్టు లందున సరస సంభాషణా
చతురుడై వెలుగొందు సరసు డితడు;
వర యశస్కుండని కరము సన్నుతి గన్న
ఆచార్యు డైనట్టి యనఘు డితడు

ఎవని శిష్య వాత్సల్యంబు ఎలుగు జగతి,
ఎవని సాహిత్య కౌశల మెటుగు జగతి,
ఎవని వాక్యచమత్కృతి ఎలుగు జగతి,
అట్టి నండూరి సుకవీంద్ర నభినుతింతు

నిండు మనంబు వాడు గణనీయుడు తెల్లున పద్దెవిద్దెలో
పండినవాడు, శారదకు బాంధవుడై అనిశంబు అర్చనల్
మెండుగ సల్పువాడు మెఆమెచ్చుల మాటల కెప్ట దూరుడై
యుండెడువాడు ఈతడని యున్నతి గాంచెను ఆంధ్ర మందునన్,

*** డాక్టర్ అక్కిరాజు సుందర రామ కృష్ణ ***

# ఆచార్య శ్రీ వి.యల్.యస్. భీమశంకరం గురుదక్షిణ

నండూరి రామకృష్ణులు
నిండారిన పద్య కవిత నీరాజనముల్
పండించె ఆంధ్ర భాషా
పాండిత్య ప్రతిభ అనన్య పారీణతతో.

విద్వత్ పూర్ణ ముఖారవింద రమతో వీక్షింప సాహిత్య సం
సద్విజ్ఞానము దృష్టి మాత్రమున ఆపాదించు విద్యార్థులన్
సద్వి ప్రోత్తమ ! ఎన్నగా తరమె నీ సంసిద్ధి నండూరి సం
విద్వంశోద్భవ ! రామ కృష్ణ సుకవీ ! విజ్ఞాన విభ్రాట్ఛ్రుతీ !

ఎవ్వాని ప్రతిపత్తి వీక్షింప గల్గును
సాహిత్య జిజ్ఞాస స్వాంతమందు !
ఎవ్వాని సూక్తుల నెన్నగా విన్నను
వాగర్థ సంగమ వ్యాప్తి కలుగు 1
ఎవ్వాని కవనమ్ము నేపార చదివిన
ఆనంద డోలికా హర్ష మొదవు
ఎవ్వాని భాష్యమ్ము - నివ్వటిల్లగ జేయు
తెలుగుల వేయేండ్ల జిలుగు వెలుగు !

అతడు నండూరి వంశమహాశయుండు,
రామకృష్ణమాచార్యుండు - రసవిరాట్టు!
'ప్రథితు డాలోచనామృత గ్రంథకర్త
పద్య కవితోద్యమోద్ధారకుండు.

*** ఆచార్య శ్రీ వి. యల్.యస్. భీమశంకరం ***

# ఆచార్య శ్రీ వత్స

## ఓ రససిద్ధ స్వరూపా !

శ్రీ వాణీ కృప సత్కృతి
భావమ్మునఁ బ్రోదిచేసి భవ్యమనస్వీ !
శ్రీ విశ్రుత ఘనకీర్తీ !
దేవా ! భక్త్యంజ లిద్ధి తెచ్చితి కొమ్మా !

పుంభారతీ స్వరూపా !
అంబోధిని మించిన కరుణార్ద్రాంచితమా !
గంభీరోన్నత లలితా !
లంభిత హృది రామకృష్ణ ! లక్ష్యముఁ జేతున్!

తత నవాంధ్ర సాహిత్య పితామహుండు
తనరు పద్యకవిత్వ వైతాళికుండు;
నవయుగ రససిద్ధుండు - మానవహితుండు;
లలిత పదధుని - నండూరి రామ కృష్ణ

పరిమళోజ్వల దివ్య పారిజాతమువోలె
లలిత కోమలమైన తలపుప్రోధ !
నవరసానందమై నవనీత పద్యాల
కవితా ప్రియత్వంబు కల్గురేడ !

అవలీలగా కూర్చి ఆలోచనమ్ముతో
ఋషుల తత్త్వమ్ముల నెఱుగువాడ !
ఆంధ్ర పద్య కవితా యాగమ్మున విమల
ధర్మ రక్షణ దీక్ష తనరువాడ !

నవరు హృదిని కల్గు - నండూరి వంశాబ్ధి
చంద్ర ! మర్మవిదుడ ! జననమొంది
కెరలు వొడిచినారు - కెలసంబు సల్పుచు
కవన పటిమ తోడ - కాంచినారు !

తాతా ! నీ కవనమ్ముతో మధుర సంధానమ్ము కావించి నా
వే ! తాదాత్మ్యత నొందితిన్ విమల సంవిజ్ఞానమున్ బొందుచున్
పూతల్ పూసిరి పద్యగంధమున సంబోధింప లోకాన సం
భూతశ్రేణికి జీవన ప్రదములై పొల్పారు చుండెం గదా !

వ్రాసితి కైతజాలములు వైభవమైనది మీదు కూర్మి నా
యాశలు వృద్ధి చేయు మిక అంజలి పట్టితి పద్యశిల్ప సం
దేశము తెల్పినారు భవతేజము వెల్లె ధరాతలంబునన్
భాసుర మొప్ప గైకొనుము భాగ్యవిధాత ! నమస్కృతాంజలిన్.

*** ఆచార్య శ్రీవత్స ***

# ప్రసాదరాయ కులపతి

## మనుష్య గంధర్వుడు

ఎన్నినాళ్లు బ్రదికె నెన్నేండ్లు బ్రదికెను
వయసు లెక్క పెద్ద ప్రశ్న కాదు.
కవిగ నాతడెన్ని క్షణములు జీవించె
అది గణింపుడదియే అసలు లెక్క

రామకృష్ణమార్యు రమ్య జీవిత
కార్య మందునట్టి క్షణము లలరు నెన్నో
కదలు నతడు సతము కవిత ఊపిరిగాగ
గుండె గుడిని దేవి కొలవుదీర

కమ్మసంపెగలును కప్రంపుతావులు
చిమ్ము పద్యములను చేసెనతడు
చిత్రకారుడయ్యె శిల్పియునయ్యెను
పద్యకవిత కొత్త బ్రహ్మయయ్యె

*** ప్రసాదరాయ కులపతి ***

# ఓగేటి పశుపతి

## నచ్చిన కవి

అధరము కదలిన జాలును
మధు మత్తమ నీదు నాల్క మంజుల కవితా
సుధ లొల్కు తదాస్వాదన;
మది అది మజపించి వైచు సొంతమ్ము మదిన్.

తేట గీతి తోడ దీటుగా ్రతి గల్పి,
ఆడ గలదు నీదు ఆట వెలది;
రస మయమ్ము నీదు రమణీయ వృత్తమ్ము;
కృతివి నీవు రామ కృష్ణ సుకవి.

హృదిని మదిని గూడ నీ వొక్క గా టమనే
కట్టి వైచినావు - గవిని పులిని;
ఈ యుగమ్ము నందు నిదియును సాధ్యమా !
అరసి చూడ కవి మహర్షి వీవు.

కల్ల కసటు లేని పిల్లలుగా జేసి
తెలుంగు పద్యములను చెలం చెలంగి,
ఆడు కొందు నీవు జోడుగా వారితో:
లేదు ముదిమి నీకు లేదు లేదు.

నండూరి కవీంద్రా ! నీ
భాండాగారమునం గలవు పద్యాల్ వజ్రాల్,
దండిగను వాని నెల్లను.
దండుకొనన్ మాకు మనసు తహతహ లాడున్.

నచ్చి కృతుల నిచ్చినా మీవు నేనును
ఒక సుహృద్వరునకే యొప్పిదముగ;
నచ్చ కుండు టెట్టు ? నాకు నీవును నీకు
నేను నింక రామ కృష్ణ మార్య !

*** ఓగేటి పశుపతి ***

# కవిరత్న పూసల రజని గంగాధరం

# కవితా వైభవం

సీ ॥ "ఆంధ్రభారతము" నీవాంధ్రమందున వ్రాసి
"ప్రగతిగీత' రచించి ప్రజలకిచ్చి
“ప్రాచీన దక్షిణ భారత చరితము"
"శీర్ణమేఖలు" కావ్య సృష్టి చేసి
"ధర్మచక్రము మరి " దశరూపకమ్ముల్లు"
నేర్పుతో రచియించి నేతులద్ది
"శ్రీకృష్ణరాయలు” “శ్రీ శివాజి" కథల
దృశ్య కావ్యములుగ తీర్చి దిద్ది

తే . గీ ॥ అమర జీవులనెడి  చక్కనైన కావ్య
రచన గావించి కరుణార్ద్ర రసము నింపి
అమరుడవునయి సాహితీ యభ్రమందు
వెలుగు చున్నావు తారగా జిలుగు లెగయ

ఆ . వె ॥ సరళమైన భాష సంగీతముల ఘోష
పదపదంబునందు పరిఢవిల్ల
తిమ్మనార్యుపైన దొడ్డిన కవనమ్ము
తెచ్చియిచ్చెకీర్తి మచ్చుతునక

ఉ ॥ చక్కని సాహితీ పటిమ చక్కని సంస్కృత భాషణమ్ములన్
పెక్కుడు జక్కజేర్చి పదమేక్పడు జేసెడి నేర్పులన్ని నీ
వెక్కడ నేర్చినావు? పలుకిచ్చిన వాణియె మెచ్చి వచ్చెనా!
చక్కెర పాలు ద్రావణపు సారము వంటి కవిత్వసంపదల్.

కన్నతండ్రికి కృతినిచ్చి వన్నెదెచ్చి
వంశ కీర్తిని నిల్పిన వంశశ్రేష్ఠం !
ఆర్య! ఆచార్య! యనుమాట కర్థు డీవే
రామకృష్ణమాచార్య! శ్రీరామ భక్త!

నందూరి వంగడంబున
పండిత కవి శ్రేష్ఠుడగుచు ప్రాజ్ఞులు మెచ్చన్
పండించు కొంటివయ్యా
దండిగ నీకీర్తి సిరిని ధరణితలమున్

*** పూసల రజని గంగాధరం ***

Cell : 9290680605; Email ID. rajanigangadhar1234@gmail.com.

# "జ్వాలాముఖి"

ఆత్మీయులు అన్నగారికి నమస్కారం, మీ సుహృల్లేఖ 'కవితా ప్రభాస" లు నాకు మంగళా శాసనంతో అందాయి – మీ ఆత్మీయతను పొందినందుకు ధన్యుడను -

"కవితా ప్రభాసము కరుణావిహారము
విచక్షణాజ్ఞానము విశ్వ దృష్టి
చైతన్య మార్గము చరితార్ధ మానము,
సమకాలీన రచన సహజ సృజన
సంప్రదాయమునందు సంస్కార బుద్ధి
వాక్కు లోన అనుభవార్ద స్పర్శ
నందూరి పద్యము గుండె నైవేద్యము
ప్రాసంగికత పొందె ప్రగతి చింత"

- మీరిచ్చిన 'ఆదర్శకవి' నిర్వచనం మీ అభ్యుదయ చింతనకు నిదర్శనం

- జే జే లు-

అపూర్వమైన కవితాధార - ఆటవెలదికి చైతన్య దీప్తి - అద్భుతమైన కొసమెరుపులు - కలగలసిన కావ్య సంస్కారం అన్నీ చాల గొప్పగా వున్నాయి.

*** **జ్వాలాముఖి** ***

# శ్రీ చింతప్పడు కవి  చీపురు పల్లి

మంచు సోన కన్న - మంచి ముత్యము కన్న !
రెల్లు కన్న - అంచ రెక్క కన్న 1
మబ్బు కన్న - తెలుపు - మనసు మా నండూరి
వారి కే నొనర్తు వందనములు.

జున్ను గడ్డ కన్న - జుంటి తేనియ కన్న !
ద్రాక్ష కన్న - చెరకు రసము కన్న
చెప్ప లేని తీపి - శ్రీరామ కృష్ణమా
చార్యు కృతు లమృత రసాయనములు.

***** శ్రీ చింతప్పడు కవి - చీపురు పల్లి**

***

# షేక్ మహబూబ్ బాషా కవి (గరు స్తవము)

తన కంచంబున భోజనం బొసగె వాత్సల్యంబు, ఆదర్శ వ
ర్తనయుం దోపగ నాకు - నే నతిథినై రాగా, అదే కంచ మం
దున మర్నాడు భుజించె తాను " గురు" వెంతో చెల్మితో - నాదు ప్ర
కృన కూర్చుండి విశాల విశ్వ మయ సంస్కారంబు కాంతిల్లగన్.

***** షేక్ మహబూబ్ బాషా కవి *****

చదువులు రాని ఆ పరమ జానపదాళిని దిద్ధి తీర్చ జా
లుదు లెవ రేని - కొంత మదిలో కనికారము కల్గియున్నచో,
చదివియు నల్పులౌ కృతకసజ్జన కోటిని సంస్కరింపగా
కదలిచె నిన్ను ఈ తెలుగు గడ్డకు కావ్య కళా విపంచికన్ !

***** షేక్ మహబూబ్ బాషా కవి *****

# వేముగంటి నరసింహా చార్యులు
# ప్రశంసా ప్రసూనాంజలి

శ్రీ నండూర్య స్వయ చం
ద్రా ! నిష్ఠిత రామకృష్ణమాచార్య కవీం
ద్రా ! నిత్యకవన రచనా
ధీన మనీషాచతుర! సుధీనుత చరితా !

మేలగు బోధనమున శి
ష్యాళిని కడు తీర్చిదిద్ది ఖ్యాతి గని కళా
శాలాధ్యాపక పదవిని
లీలగ సాగించితివి ఫలిత సత్కార్యా !

పాండిత్యమ్మును, సత్కవిత్వరచనా ప్రాగల్భ్యమున్, సుస్థిరా
ఖండ ప్రజ్ఞము కల్గు తావక యశః కర్పూర సౌరభ్యముల్
నిండెన్ నాలుగు దిక్కు లందునన్ లసన్నిష్ఠా గరిష్ఠాత్మకా !
నండూర్యన్వయ రామకృష్ణ కవి చంద్రా ! కోవిద గ్రామణీ !

కడగి ఆంధ్రపద్యకవితా సదస్సు కా
ధ్యక్షమును వహించి దీక్షత మెయి
నిర్వహించుచున్న నిను రామకృష్ణమా
చార్య ! కవిజనమ్ము సన్నుతించు

నీ యా లోచన లోచనమ్ము సువిధా
నీ్వతమ్ము, సామాజిక
శ్రేయోదాయ కారణమ్మగుచు
వాసిన్గాంచె, పీయూష పా
థేయమ్మై, వరలున్ జనాళికి నుపా
దేయమ్మగున్ పద్యవి
ద్యాయుక్తిస్థిత ! రామకృష్ణ సుకవీంద్రా ! నీకు దీర్ఘాయువౌ !

***** వేముగంటి నరసింహా చార్యులు *****

# ఆత్మకూరి గాంధి

## నాన్న గారు

ప్రజలు మెచ్చు దివ్య భవ్య తారా తోర
ణమును వ్రాసె నెపుడో  నాన్న గారు
జ్ఞానమిచ్చు విశ్వ సాహిత్య విను వీధి
వెల్గు రచన ఎల్లవేళ లందు.

శీర్ణ మేఖల కవితా  విశేష తార
శైలి సుమనోజ్ఞ శిల్ప సౌష్ఠవ సుదీప్తి
సరళి అద్భుత  నాటకీయ రసధుని ఉ
దాత్త పద్య సువర్ణ చిత్రంపు ప్రతిమ.

మేనమామ కోరె, మెండైన భక్తితో
దత్తతిచ్చె నన్ను తండ్రిగారు
నాడు మార్చబడిన నండూరి గాంధియే
ఆత్మకూరి గాంధి అయ్యె తుదకు.

చాల నాళ్ళు సప్త సంతాన మగు మమ్ము
పెంచె నాన్నగారు ప్రేమ తోడ
బ్రదుకు కొరకు నాకు బహు కష్టముల కోర్చి
నేర్పి రాంగ్లభాష  ఓర్పుతోడ.

ఆంగ్ల వాఙ్మయమున అరుదైన గ్రంధమ్ము
'గాంధి యుగము' నాన్నగారు వ్రాసె
శక్తి యున్న వారి సత్య మహింసలు
చాల గొప్ప వంచు చాటి  చెప్పె.

తెలుగుసీమలోన దేశిక స్వామిగా
తరతరాల చరిత మురిసి పోవు
క్రొత్తదనము నిచ్చి గొప్పగా వెలుగొంది
పదవి విలువ పెంచె ప్రజ్ఞ తోడ.

భరతదేశమందు పరిపూర్ణ మేధావి
ధర్మసూక్ష్మ మెరుగు కర్మయోగి
సహృదయ సుమనీషి సాహితీ దివ్యర్షి
వ్రాసె ఆంగ్లమందు భారతమును.

జగతి నిరుపమాన చతురవ చోనిధి
సాటిలేని వక్త సభలయందు
చిన్న పద్యమందు చిందించు చిరునవ్వు
గ్రంధరచన తండ్రిగారి ప్రతిభ.

పద్య పాదములను పలుమారు నాకిచ్చె
అబ్బె శైలి ప్రూఫు లపుడు దిద్ద
క్రాంతదర్శి నన్ను కవికుమారుని జేసె
ఆటవెలది పద్య మల్లగలను.

భౌతికముగ లేరు బ్రదుకెంతొ వెచ్చించె
కాళిదాసు సుకవి కాల మరయ
చరిత పులకరించు సత్యంబు పెకలించె
నాడు కృతిని వ్రాసె నాన్న గారు.

సత్కరింప బడిరి సన్మాన సభలందు
మంచి వారి చేత  మరల మరల
సరస హృదులు కూర్చె సాహిత్య పీఠమ్ము
సాగుచుండు  నిటులె చాల సరిగ

కావ్య రచన వలన కనక వర్షము చాల
కురిసె తండ్రిగారు కోరకుండ
పూజ చేసె ప్రజలు పూలు శాలువలతో
పుస్తకాలు చదివి పులకరించి.

పదవి నిచ్చె నాటి పాలక వర్గమ్ము
తెలుగు తల్లి ఎడద పులక రించె
అందజేసి సేవ అధికార భాషకు
వన్నె తెచ్చినారు నాన్నగారు.

మంచి చదువు కొరకు మైసూరు పంపించె
నాన్నగారి మనసు నాకు తెలుసు
నాలుగేండ్లు రీజినల్ కళాశాలలో
చదువుసాగె సరిగ బ్రదుకు మారె.

క్రాంతదర్శి నాకు గణితమ్ము నేర్పించె
తెలుగు వెలుగు కొంత తెలియ జేసె
బ్రదికె ఎనుబదేండ్ల పైబడి మాయమై
పోయె నాన్నగారు పుడమి పైన.

నిష్క్రమించినారు నీ రాజనాలతో
ప్రగతిగీత పద్య రచన చేసి
కరగిపోయి నారు కవితా ప్రభాస గా
ధన్యజీవియైన తండ్రిగారు.

*****ఆత్మకూరి గాంధి*****

# ఆత్మకూరి గాంధి

## మాతృ మూర్తి

తల్లి మమత వలన తనయుండు జీవించు
    విశ్వ సృష్టి లోని వెలితి మరచి
భాష కందనట్టి బావ మాధుర్యంబు
    అమ్మ అనెడి శబ్దమందు కలదు.
చదువలేదు బడుల సంస్కారమధికమ్ము
    మాతృమూర్తి మతము మంచితనము
కరగిపోవు చుండు కరుణా స్రవంతిగా
    ధర్మ పథము తెలుపు తల్లిగారు.

చివరి వరకు కూడ చీకాకు పడలేదు
పరుషవాక్య మెపుడు పలుక లేదు
సాటిలేని సుగుణశాంత స్వరూపమ్ము
తల్లిగారి సొత్తు ధరణి మీద.

మంచి చెడులు నేర్పు మాతృ మూర్తి 'సుభద్ర'
అనుచు పెద్దవారలపుడు పొగడె
నాటి లేఖలందు నేటి కవితలందు
'అన్నపూర్ణ' మమ్ము కన్న తల్లి.

వచ్చె ఎను బదేండ్లు ప్రాణములను వీడె
కరుణరస హృదయము కన్ను మూసె
జగతిమెచ్చె అమ్మ శాంత స్వభావమ్ము
ధన్యజీవి అయ్యె తల్లి గారు.

***ఆత్మకూరి గాంధి***

# డా. నండూరి విద్యారణ్య స్వామి తనయుని పద్య నివాళి

కృతముఖునిగ రామకృష్ణ మాచార్యులు
విద్య నారితేరి విబుధుడయ్యె!
వేగ, సంస్కృతాంధ్ర
విద్యాధిపతి యౌచు భీమవరము నందు పేరుగాంచె!

చతురుడై "నండూరి" సమకాల కవులందు
కొత్త , పాతల మేలి కూర్పు చేసె!
కవి దిగ్గజములైన "కాటూరి", "పింగళి",
"వేదుల" , "జంధ్యాల", "విశ్వనాథ",
"దేవులపల్లి"యు, "దిగుమర్తి" "కొనకళ్ళ"
ప్రభృతుల రాకచే ప్రతిదినమ్ము
నతిథులెందరొ గూడి యతని నివాసమ్ము
"కవితాప్రభాస"గా కరము వెలిగె!
"పాలగుమ్మి", "అడవి బాపిరాజు"లు నింక,
"అర్క సోమయాజి" యచట గూడి,
కార్య సాధకులయి కవన గోష్ఠుల నెన్నొ
చేసిరి కవితా ప్రభాస లోన!

పూని సోదరునిగ "పోలాప్రగడ" నాడు
కార్యకర్తగ సహకార మిడగ -
పండితుండు "పురాణపండ దీక్షితు" డంత
శిష్యవరుడునౌచు సేవ చేయ -
లాక్షణికుడు, కవి "లక్ష్మణ దేశికుల్"
కూడియు "శనగన", "కొర్లపాటి" ...
అలరి సాహిత్య సహవ్రతు లెందరో
శిష్యులైరి, పిదప శిష్టులైరి!
పలు పురస్కృతులను బహుమానముల నొంది,
సత్కవీశ్వరునిగ సంచరించి,

ఆంధ్ర దేశ మెల్ల నాదరింపబడియె
"రామకృష్ణ" నామ రమ్య సుకవి!

ప్రముఖ "పీ.ఆర్. కళాశాల - ప్రాంశుపాల"
పదవి కెంతయొ వన్నె కొనితెచ్చె పటిమ జూపి!
పిదప .. ఉస్మానియా విశ్వ వేది నందు
తెలుగు గౌరవాచార్యగా వెలుగు లీనె!

కృషితో నెదిగె రామ కృష్ణ మాచార్యులు
"నండూరి" వంశ రత్నంబు నగుచు!
గొప్ప గురువులకు గొప్ప శిష్యుండునై,
గొప్ప శిష్యులకు తా గురువు నౌచు,
పద్య రచనలకు పట్టంబు గట్టుచు,
సమకాల కవులచే సత్కృతి గొనె!
అధికార భాషకు నధ్యక్షునిగ నాడు,
తెలుగు నమలు జేసె తృప్తి మీర!
సత్క విత్వ రాజ్య చక్రవర్తిగ తాను
వంద్యుడగుచు చేరె పరమ పదము
పనవుచు, పితృ దేవు పథమున్ పనిగొనుచు
అంజలింతు మేము హార్దికముగ.

*****డా. నండూరి విద్యారణ్య స్వామి*****

# ఒబ్రపాద్

ఆట వెలది వ్రాయు ఆచార్య వర్యుండు
తేలిక నుడు లేరి తెలుగులోన;
భాషలందు - అంత బరువైన భావాలు
ఎత్తు నిడివి లోతు లెచట గలవు ??
కవివి - ఋషివి - ఒక త్రికాలవేదివి నేడు;
కాంచినావు - మెదడు కనులు విప్పి;
చాటినావు - నిత్య సత్య సూక్తము నీవు
రసవిరాట్ స్వరూప -రామకృష్ణ

***** ఒబ్రపాద్ *****

# నండూరి రామకృష్ణమాచార్య వారి

# శతజయంతి నివాళి

# నండూరి రామకృష్ణమాచార్య శతజయంత్యుత్సవము

మహాకవి నండూరి రామకృష్ణమాచార్యులు గారి 'శత జయంతి మహోత్సవా'న్ని (2021లో 'కోవిడ్' ఆటంకం కారణంగా) 2022 జూలై నెల హైదరాబాదు నాంపల్లిలో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రెండురోజుల పాటు వైభవంగా నిర్వహించుకొన్నాం. నాటి కార్యక్రమములు:-



05-07-2022 మంగళవారం

ప్రారంభ సభ

సా॥ 5-30 గంటలకు

ముఖ్య అతిథి : డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్. (రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు : ఆచార్య ఎస్.వి. రామారావు
పూర్వ డీన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

గౌరవ అతిథులు : శ్రీ నారుమంచి వేంకట అనంత కృష్ణ
ప్రముఖ కవి
శ్రీ సాధన నరసింహాచార్య
అధ్యక్షులు, సాధన సాహితీ స్రవంతి

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య వ్యక్తిత్వ విశ్లేషణ

ముక్తక పద్యాలు : శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ
ఖండ కావ్యాలు : డా॥ ఆచార్య ఫణీంద్ర
వ్యక్తిత్వం : శ్రీ వి.ఎస్.ఆర్. మూర్తి
విమర్శ లక్షణ గ్రంథాలు : డా॥ వెల్దండ నిత్యానందరావు
నవలలు : శ్రీ ఉదయబాబు
నాటకాలు : డా॥ నూనె వెంకటయ్య
చారిత్రాత్మక గ్రంథాలు : శ్రీ డి. ధనంజయ
ఆంగ్ల గ్రంథాలు : శ్రీ ఆత్మకూరు గాంధీ



06-07-2022 బుధవారం

కవి సమ్మేళనం

సా॥ 5-30 గంటలకు

అధ్యక్షులు : డా॥ జి.యం. రామశర్మ, ప్రముఖ కవి, శతావధాని

పాల్గొను కవులు :
డా॥ వెనిగళ్ళ రాంబాబు
శ్రీ యం. దత్తాత్రేయ శర్మ
శ్రీ చిమ్మపూడి శ్రీరామమూర్తి
డా॥ యు. కుసుమ కుమారి
శ్రీ చింతా రామకృష్ణారావు
డా॥ రాధశ్రీ
శ్రీ వి.వి. సత్యప్రసాద్
శ్రీ శంభుని కుమార్
డా॥ ఆచార్య వేణు
శ్రీ ముద్దు రాజయ్య
శ్రీ కౌండిన్య తిలక్
శ్రీమతి గొడవర్తి సంధ్య
మరియు డా॥ ఆచార్య ఫణీంద్ర

నండూరి రామకృష్ణమాచార్య శతజయంతి పురస్కార ప్రదానం
పురస్కార స్వీకర్త :
మహాకవి 'బ్రహ్మశ్రీ' డా॥ మాడుగుల నాగఫణి శర్మ, బృహత్ ద్విసహస్రావధాని

మరియు

స్వర్గీయ 'పద్మశ్రీ' డా॥ ఆశావాది ప్రకాశరావు రచించిన "ప్రాతఃస్మరణీయ గురుత్రయం" గ్రంథావిష్కరణ

ముఖ్య అతిథి, పురస్కార ప్రదాత : 'పద్మభూషణ్' డా॥ కె.ఐ. వరప్రసాదరెడ్డి, శాంతా బయోటెక్నిక్స్
సభాధ్యక్షులు : ఆచార్య డా॥ ఎల్లూరి శివారెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్
గౌరవ అతిథి : ఆచార్య టి. గౌరీశంకర్, పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథి : డా॥ ముక్తేవి భారతి, ప్రముఖ రచయిత్రి
గ్రంథ సమీక్షకులు : డా॥ ఆశావాది సుధామ వంశీ

కె. సాగరరావు
అధ్యక్షులు, నండూరి సాహిత్య పీఠం

నండూరివారి కుటుంబ సభ్యులు

వేమరాజు విజయ కుమార్
అధ్యక్షులు, నవ్య సాహితీ సమితి

# పద్య నివాళి

*****01.డా. ఆచార్య ఫణీంద్ర*****

**"నీకు శిష్యుడన్న ఒకే పతాక చాలు ... "**

ఎవ్వాని భావాల కివ్వేళయే గాక
భావియున్ తల వంచి ప్రణతు లిడును -
ఎవ్వాని కావ్యాల నిముడగా వస్తువై
ధరణిలో అణువణ్వు తపన పడును -
ఎవ్వాని మాటయే ఇలలోన చాటువై
నరుల నాల్కల పైన నాట్య మాడు -
ఎవ్వాని కీర్తి మహీ మండలమ్ముపై
దశ దిశాంతమ్ములన్ దాటి సాగు -

అట్టి నండూరి వంశార్ణ వైక సోమ!
రామకృష్ణమాచార్య సన్నామధేయ!
నీకు శిష్యుడన్న ఒకే పతాక చాలు -
ఎత్తి నడయాడి లోకాల నేలుకొనగ!

కువలయమున నున్న కుటిల నీతిని ఎత్తి,
కుండ బ్రద్దలట్లు కొట్టి చూపి,
అభ్యుదయ పథమ్ము 'నాలోచనము' పేర
వెలయ జేసితి 'వధి వేమ'నగుచు!

ఎలమి డెబ్బదేండ్లకు పైన ఏకధాటి
పద్య రత్నముల్ సృజియించి ప్రణుతి కెక్కి
నట్టి 'నండూరి రామ కృష్ణా'ఖ్య సుకవి!
మహిని పద్యమ్మునకు నీవు మారు పేరు!

అతుల కవీశ్వరా! సుకవితాంబకు ముద్దుల పట్టి! పండిత
స్తుత ఘన సాహితీ కుసుమ శోభన వాటిక యందు మేటి క
ల్ప తరువున్నై, సుధా రస మపారము చిప్పిలు పద్య సత్ఫలాల్
శతము లొసంగితో! పలుకు శాసనమౌ గురుదేవ! మ్రొక్కెదన్!

గంగకు నర్ఘ్యం బిడుటకు
గంగా తోయము నొకింత గైకొనినట్లున్ -
ప్రింగగ నీ బోధ మతిని,
పొంగారిన కవితల నిను పూజింతు నిదే! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~01

**\*\*\*02.డాక్టర్ రాధశ్రీ\*\*\***

**"కంద 'నక్షత్రమాల'లో కవికుల తిలకుడు"**

నండూరి రామ కృష్ణుడు
నిండగు గోదావరివలె నిర్ఝర శైలిన్
పండిన తన యనుభవమును
'పండు'గ నందించినాడు పద్య హృదయుడై !!

ఆతల్లి వెంగమాంబకు
ఆతండ్రికి శోభనాద్రి ఆచార్యునకున్
జాతకుడై జన్మించెను
జాతికి చేతనము నొసగు సత్కవివరుడై !!

ఆగరపవరమునందున
ప్రాగాకాశమున బాలభానుని పగిదిన్
నాగాభరణుని దయతో
వాగీశ్వరి ప్రియసుతునిగ ప్రభవము నొందెన్ !!

ఆకోరుకొండ యందున
ప్రాకటముగ జదువబూనె ప్రాథమికముగన్
చేకూర్చుకొనగ జ్ఞానము
దూకెను హైస్కూలు లోన దోషాకరుడై !!

ఆ విజయవాడ నందున
ధీవిభుడగు విశ్వనాథ దీవెన గొనుచున్
పావనమగు పద్యమునకు
జీవిత మంకితము జేసె చిన్మయగుణుడై !!

స్నాతకుడై,పిమ్మట-చే
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

యూతల నందించ స్నాతకోత్తరుడగుచున్
జోతలగొని ఏ.యూ.కే
చేతము గలిగించినాడు స్విన్నాత్మ్ముండై !!

మేదురమగు శోధనకై
వేదిగ మైసూరు విశ్వ విద్యాలయమున్
వేదికగా నిల్పుచు-ప్రతి
పాదించెను విషయచయము పరిశోధనకున్ !!

ఆంధ్రోపన్యాసకునిగ
నాంధ్రా ప్రాంతమ్ములందు నాచార్యుండై
ఆంధ్రముతో బాటుగ-కా
వ్యాంధ్రమ్మును నూరిపోసె నాంధ్రావనికిన్ !!

చీరాల,యనంతపురము
పేరెన్నిక గన్నయట్టి భీమవరంబున్
తీరగు టీ పీ గూడెము
నేరుగ గురుబోధ వినెను నిశ్శబ్దముగన్ !!

చిత్తూరునకు,విశాఖకు
చిత్తము లలరించు రీతి చేతన నిడ-పూ
గుత్తులతో నా నగరము
లత్తరులుగ చిలకరించె నాప్యాయతలన్ !!

అనయమ్మన్నవితరణను
తన విధిగా నెంచి మిగుల తాదాత్మ్యముతో
నొనరించిన గురుపత్నిని
ప్రణతులనిడి కొలిచెదను సుభద్రాదేవిన్ !!

తిక్కన్న భారతమ్మును
మిక్కిలిగా గౌరవించి మించిన ధృతిలో
తిక్కన్న సోమయాజికి
ప్రక్కన నిలుచుండ గలిగె పండిత నుతుడై !!

శారద కృపతో కవితకు

తారాతోరణ మమర్చి తనదగు శైలిన్
ధీరునిగ ప్రగతిగీతను
తీరుగ వెలయించిన గురు దేవుని గొలుతున్ !!

క్రొత్తగ యాలోచనమును
మెత్తగ వెలయించి శీర్ష మేఖల వోలెన్
చిత్తరువుగ చిత్రించుచు
మత్తును గలిగించినట్టి మాన్యుని దలతున్ !!

వ్యాసుడు చెప్పని గాధను
భాసురముగ నూహసేసి పాఠకతతికై
మోసులు వారెడి కవితగ
వ్రాసిన సుకవీశ్వరునకు వందన మిడెదన్ !!

భారతకధ నాంధ్లములో
తీరిచి దిద్దిన ఘనునిగ ధీమాన్యునిగా
తీరగు భావములు నుడివి
కీరితి గొన్నట్టి రామకృష్ణుని దలతున్ !!

భీమవరములో నింటికి
ప్రేమగ కవితాప్రభాస పేరిడిన ఘనున్
సామాన్యుని నాలుకపై
తేమగ కవితను నిలిపిన ధీమతి నెంతున్ !!

నిత్యము గొనియాడుచు-నౌ
చిత్యముతో గొలుచు నమరజీవుల కొరకై
ముత్యాల గొడుగు పట్టిన
స్తుత్యుని గొనియాడుచుంటి శోభిత మూర్తిన్ !!

అల గోదావరి తటిలో
కలలో జ్యోత్స్నాభిసారికలతో సతమున్
పలురీతులుగా చర్చలు
సలిపిన భావుకుని ధర్మచక్రము నెంతున్ !!

కారణ జన్మండు మహా

వీరశివాజీ చరితను ప్రియమగు రీతిన్
ధీరోదాత్తముగ నుడివి
కీరితితో వెలుగు రామకృష్ణుని దలతున్ !!

తిరుమల వాసుని దయతో
పరిపరి విధముల కృతులను పరిరక్షింపన్
తిరుపతి ప్రచురణ లందున
కరసేవ నొనర్చినట్టి కవివరు నెంతున్ !!

వర'పుష్పవిలాపము'తో
కరుణను జిలికించినట్టి కవితిలకుండౌ
కరుణశ్రీ మిత్రుండై
వరలిన విఖ్యాత కవికి వందన మిడెదన్ !!

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~02

**\*\*\*03.డా. వెనిగళ్ళ రాంబాబు\*\*\*** **"సామ్యవాద మహర్షి !"**

నండూరి రామకృష్ణులు
పండిత ప్రాచార్యవరులు ! పద్య కవీంద్రుల్ !
నిండెను యశస్సు తారా
మండలమే ! నోటి వాక్కు మంగళకరమే !!

అమరులౌ స్వాతంత్ర్య సమర యోధుల వంశ
సంజాతమా ! మిమ్ము సన్నుతింతు !
సంస్కృతాంధ్ర వధాన శక్తి పీఠము మీరు !
ఆచార్య ధీవరా ! అంజలింతు !
అద్వితీయమ్ము మీ ఆంగ్ల వైదుష్యమ్ము !
సంస్కార రసధునీ ! సన్నుతింతు !
భాష్యకార్లను మించు శిష్య సంతతి మీది !
అధ్యాపకోత్తమా ! అంజలింతు !
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

స్వర్ణ సౌజన్య శిఖరమా ! సన్నుతింతు !
సౌమ్య సామ్యవాద మహర్షి ! సన్నుతింతు !
ఆత్మ యోగీ ! విరాగి ! మీకంజలింతు !
అరుణకిరణాల చరణాలకంజలింతు !!

మార్చవచ్చును ఊర్లు ! మార్చవచ్చును కార్లు !
మార్చరాదన్నారు మాన్య సతిని !
ఆడంబరమె కాని ఆశు కవిత్వమ్ము
సరసు కాదన్నారు స్నానమాడ !
మరణమైనను గాని ధరణిని మంగళా
శాసనమన్నారు సాహసించి !
జ్ఞాన దీప్తిని పంచు మానవత్వము చాలు
మరచిపొమ్మన్నారు మతము నైన !

వేద వాఙ్మయమ్ము, వేమన్న వాదమ్ము,
కొంత హేతువాద చింతనమ్ము
హాస్య చతురత లనవశ్యమ్ము సంధించు
వ్యాస ! శతజయంతి వందనమ్ము !! #

ఇరువురు రాష్ట్రపతులచే
సరియన్నది లేని రీతి సత్కారములన్
కరివరదుని కృపచే-స్వీ
కరణమ్మొనరించినట్టి కర్మఠు నెంతున్ !!

అధికారాంధ్ర మహాసభ
కధిపతియై నిలచి ప్రజల కతిమధురంబౌ
సుధధిగ పద్య సరస్సు(సదస్సు)ను
ప్రథితము గావించె ననుచు ప్రస్తుతి జేతున్ !!

పాయని నవ భావముగా
"చేయంగా వలయు గురువు శిష్యుని బూజన్
ధీయుతముగ"నని నుడివిన
శ్రేయోగుణనిధిని గొలుతు స్వీన్న మనస్కున్ !!

అర్వాచీన కవిత్వపు
నిర్వచనమ్మగుచు నిలచి నేర్పు దలిర్పన్
పర్వతనేని ఉపేంద్రకు
సర్వము బోధించినట్టి స్వామిని గొలుతున్ !!

ప్రగతిని గోరెడి వానిని
తగదీర ఫణీంద్రకవిని తన శిష్యునిగా
జగతి కొసంగిన విబుధుని
అగణిత భావుకుని గొలిచి యంజలు లిడెదన్ !! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~03

**\*\*\* 04.మరుమాముల దత్తాత్రేయ శర్మ\*\*\***

**"నడిచే పద్యము నందూరి"**

సూర్యుడవై శుభంకర సుశోభల కావ్యపు కాంతులీను వా
గ్గుర్యుడవై రసోచిత మధూదయ వాఙ్మయ రాశివోసి సౌం
దర్యము గూర్చి భారతికి ; తన్మయమొందిన రామకృష్ణమా
చార్య! త్వదీయ పద్యములు చాలును మ్రోగగ తెల్గు గుండియల్ !

మంచి మనస్సు; మాధ్వీక సమంబు వచస్సు; సితాంబుజాత ర
మ్యాంచితమౌ యశస్సు; దరహాస విభాసితమౌ మహస్సు; శో
ధించిన మీ వయస్సు ; కవితేందిర మెచ్చ కవిత్వ శీధు వం
దించిన మీ తపస్సునకు హృజ్జనితాదర భక్తి మ్రొక్కెదన్ !

ఎవ్వాని పద్యమ్ము రవ్వలై రాజిల్లి
  ఆంధ్ర వాఙ్మయ శోభలవని నిలిపె !
ఎవ్వాని సౌహృద మెంతేని రాణించి
  పాండితీలోక ప్రభాసమయ్యె !
ఎవ్వాని రస కృతుల్ ఏపార చదివిన
  కచ్ఛపీ కింకిణీ కళల నీనె !
ఎవ్వాని సరసోక్తి పువ్వులై విరబూసి
  ఆలోచనా లోచనమ్ములయ్యె!
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

అతడు నండూరి రామకృష్ణాఖ్య సుకవి !
ఆత డాచార్య వర్యుడై జోత లంది,
సుకవి బృంద బృందారక శోభ నలరె !
పద్యమన్నను ప్రాణమై బ్రతుకు నిచ్చె !

మీ కవితామృత ధారల
లోకము సుశ్లోక మయ్యె ! లోపలి వ్యధలున్
తోకలు ముడిచెన్; కనుకనె
నాకము మిము పిలిచెనేమొ నండూరి కవీ !

వడివడిగ సుడులు సుడులుగ
గడబిడ గలిగించు ఆంధ్ర కంటక తతికిన్
వడిగ కుఠారమ వైతివె
నడిచెడు పద్యమ్ము వగుచు నండూరి కవీ! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~04

**\*\*\*05."కవిమిత్ర" వి.వి. సత్యప్రసాద్\*\*\***

**"తెలుగు వారి అభిమానకవి"**

కం: నండూరి కృష్ణ మార్యులు
మెండైన కవిత్వమందు మెరసిన ఘనులై,
కొండంత కీర్తి వడసి, య
ఖండముగా తెలుగు వారి ఘనతను నిలిపెన్!

సీ; 'ఆలోచనము"నందు ఆటవెలది వ్రాసి,
సుకుమారశైలిని చూపెనతడు
ప్రౌఢమౌ పద్యాలు గాఢమై నిలచె, "తా
రాతోరణము"నందు రమ్య కవిత,
బిందుసారుని నాటి ప్రేమ గాథను తెచ్చె
"ధర్మచక్రం"బునం దతిశయించె,
ఉత్తమోత్తమమైన "జ్యోత్స్నాభిసారిక"
స్వచ్ఛమౌ ప్రణయ తత్త్వమ్ము తెలిపె!
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

తే.గీ: నృత్య నాటిక "గోదావరి" ని రచించె!
సత్యమగు మాట"శ్రమయేవ జయతె" వ్రాసె!
రేడియో నాటిక లవేవి లెక్క లేదు!
ప్రతి పదంబున రసవైభవంబు నిలిపె!!

సీ:: ఆంగ్లంబునందు "మహాభారతము" వ్రాసి
పశ్చిమంబున మన ప్రతిభ చాటె!
'గాంధీ తరమ్ము"ను క్రమ రీతిని ఆంగ్ల
మందురచించి ఆనందపరచె!
"ఛత్రపతి శివాజి" చరితను నాటక
మ్ముగ వ్రాసె!అనువాద ములను పొందె!
'"ప్రగతి గీత"నువ్రాసె!రామకృష్ణుని పేర
ఆటవెలదులెన్నొ తేటపరచె!

తే.గీ; అతని ఆలోచనము లందు హాస్య మలరు!
అతని ఆలోచనము నందు వ్యంగ్యమలరు!
అతని ఆలోచనము నందు అమృత వాక్కు
లన్ని సత్యసూక్తములుగ నలరు చుండు!! #

సీ: కవయిత్రు లెవరైన కనిపించి నంతనె
అపర సరస్వతులనుచు తలచు,
పద్య కవులు వచ్చి పద్యముల్ వినిపింప
తలయూచి తగు సూచనలను తెలుపు,
సామాజికాంశముల్ సరసంబుగా, హాస్య
ధోరణి తో చమత్కారములను
వ్యంగాస్త్రముల తోడ నాహ్లాద పరచుచు
పరవశింపగ జేయు పాఠకులను,

తే.గీ:: సర్వ జన సమ్మతంబగు సరస కవిత,
మాతృభాషాభిమానంబు, మహితమైన
దేశభక్తిని చాటు సందేశములను,
నీతి సూక్తంబులను జెప్పి ఖ్యాతి గాంచె ! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~05
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

*****06. ముద్దు రాజయ్య***** **స్మృత్యంజలి**

తే. తెలుగు సాహిత్య వారిధిం జిలికి చిలికి
యందునంగల యమృత ఫలాళి నెల్ల
తెలుగు ప్రజలకు పంచిన ధీవరేణ్య!
కీర్తిచంద్రికా భ్రాజితమూర్తి!నతులు!
రామకృష్ణమాచార్య! విలసిత సుగుణ!

తే. తెలుగు పద్యమ్ము స్థిరముగా నిలువ నాంధ్ర
పద్యకవితా సదస్సు స్థాపనముచేసి
జీవితాంతము కృషియెంతొ చేసినట్టి
కవివరేణ్య!యంజలులు విఖ్యాతశీల!

తే. ఛాత్రులం గాంచుచున్ ప్రేమ పుత్రులట్లు
గృహము నందున నుంచి వరిష్ఠ విద్య
నేర్పి మీయంత వారిగా నిలుప ధరణి
జతనముం జేసితిరి, వారు ప్రతిన బూని
మీ మహత్త్వంబు చాటగా భూమి నెపుడు.

శా. మెండౌ ప్రేమసుధల్ చెలంగ మది పేర్మిం దాల్చకం గర్వమున్,
నిండౌ ధీపటిమమ్ముతో మదిని శాంతిం దాంతి భాసిల్ల ను
ద్దండ ప్రౌఢిమ భాషపై దనర విద్యావంతులు న్మెచ్చెడిన్
నండూర్యన్వయవార్ధిచంద్ర!గుణసాంద్రా! దేశికా! అంజలుల్! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~06

**\*\*\*07.శ్రీ చింతా రామకృష్ణారావు\*\*\*** **"సుకవికి శ్రద్ధాంజలి"**

శా. శ్రీ నండూరి వరాన్వయున్, బుధనుతున్, శ్రీరామకృష్ణాఖ్యునిన్,
జ్ఞానోద్భాస కవిత్వసాగరుని, లోకజ్ఞాన సంపన్నునిన్,
ప్రాణంబై సుజనాళి చిత్తములలో వర్ధిల్లు దివ్యాత్ము నే
నీనాడీ సభలోన గొల్చుట వరంబే నాకు చింతింపగన్.
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

మ. నడిచే పద్యమటంచు కీర్తిగని రీ నండూరి సద్వంశజుల్,
వడిగా పద్యము వ్రాయుటన్, మహితమౌ ప్రఖ్యాత భావప్రభన్
నడుపన్ పద్యములందు నేర్పరిల యీ జ్ఞానప్రభారాశి, సం
దడిచేయన్ మదులన్ రచించె కవితల్ నవ్యాంధ్రసూర్యుండనన్.

సీ. రచియించినారు తారాతోరణమ్ము నా -
లోచనమ్మును కవులు నుతియింప,
ప్రగతి గీతరచించి ప్రఖ్యాతి గనినారు,
ధర రచించిరి కవితాప్రభాస.
ముత్యాల గొడుగును ముచ్చటగావ్రాసె,
కచ్ఛపీకింకిణీకంబు వ్రాసె,
జ్యోత్స్నాభిసారికన్ ద్యోతకంబుగ వ్రాసె,
ధర్మచక్రము వ్రాసె ధాత్రి మెచ్చ,

తే.గీ. ఘనత నొప్ప కావ్యాలోకనను, శివాజి,.
వ్రాసె గోదావరిని,.గాంధి వాసికెక్క,
వర కవిత్రయ పద్యశిల్పంబువ్రాసె,
రమ్యమౌ మహాభారత్ వరలగ వ్రాసె.

శా. ధారాపాత సుధాస్రవంతి కవితల్, తత్వంబుతో నొప్పుచున్
చేరన్ సజ్జనపాళికెల్ల, ఘన రాశీభూత దివ్యార్థముల్
పారున్ మానస వీధులందు, కవనోద్భాసంబు వర్ణింపగా
లేరెవ్వారలు, రామకృష్ణ కవితన్ క్లేశంబె కన్పించదే.

తే.గీ. శతజయంతీ మహోత్సవ సమయమందు
రామకృష్ణమాచార్యు సుధామునకును
శ్రద్ధతోనంజలించెద చక్కగాను,
వందనంబు చేసెద నందరికిని. #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~07
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

*****08.కుంతి (కౌండిన్య తిలక్)***** **" పద్య నీరాజనం!"**

కం. నిండైన సాధు శీలా!
పండిత శ్రేష్ఠా!సుమధుర పద్య సు కవితా
భండన భీమా!మద్గురు
నండూరి కవీశ్వర! శత నతులను గొనుమా!

తే.గీ. సరస రస మధుర కవితా సంపుటములు;
ధాటి యగు భావ గుంఫిత నాటకములు;
లక్షణ, విమర్శ గ్రంథముల్ రచన జేసి,
మింటి యెత్తున ఖ్యాతిని గొంటి వీవు!

ఆ.వె. కవన గగనమందు కమల బాంధవు డీవు!
భాషణమున ఆది శేషు డీవు!
మమత, నవత, సమత మానవతల కల
బోత యైన నిత్య పూజ్యు డీవు!

తే.గీ. సంస్కృతాంధ్ర భాషలలోన స్రష్ట వీవు!
దీక్ష నాంగ్ల రచన నారి తేరి తీవు!
రాష్ట్ర, ఉప రాష్ట్రపతుల కరకమలముల
చేత సత్కారముల నొంది చెలగి తీవు!

సీ. "జంధ్యాల పాపయ్య", "జాషువా"తో
"నవ్య సంప్రదాయ కవి"గ స్థాన మొంది -
ఘన కవీంద్రుల కావ్య గ్రంథాల కుత్తమ
పీఠకల్ గూర్చెడి మేటి వగుచు -
శిష్య ప్రశిష్యుల చేదోడుగ నిలిచి
ఉత్తేజ పరిచెడు యొజ్జ వగుచు -
అధికార భాషకు నధ్యక్షుడ వగుచు -
"ఆంధ్ర పద్యకవిత" కాప్తు డగుచు -

ఆ.వె. కమ్మనైన తెలుగు కావ్య గగనమందు
వెండి వెలుగు గూర్చు విధుడ వగుచు -
నిత్య సత్య కీర్తిని నిలుపు కొంటివి!
కేలు మోడ్తు మయ్య!కృష్ణ మార్య! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~08
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

*****10.గొడవర్తి సంధ్య***      "నండూరి వారికి అక్షర నివాళి"**

ఉ.      పుణ్యము సేసెనేమొ మును, పొల్తుక "వెంగమ" భవ్య కీర్తితో
గణ్యత గాంచు పుత్రునిగ కన్నది! తండ్రిగ "శోభనాద్రి"యున్
మాన్యత నొందె! "తత్ఫలితమా!" యన నీవయి కావ్యకర్త గాన్ -
ధన్యత పొందె నాంధ్ర కవితాఢ్యుల వ్రాతము "రామకృష్ణయా"!

చం.     కవి వృషభా! నమస్సులివె - కావ్య విపంచిక తానె వచ్చి, క
ర్మ వరము లీయగాన్ - ఘన మరాళ విహారిణి కీవు పద్యమి
చ్చు వరము నొందినాడవు! సుశోభిత శిష్య ప్రశిష్య బృందమే
అవిరళమౌచు వ్యాప్తి గొనె నాంధ్ర కవిత్వ ప్రపంచమందునన్!

చం.     తలుపుల మీద పద్యముల - ధామమునన్ లిఖియింప జేసి, నీ
తలపుల లోన నిల్పుచు సుధారస పూర్ణములైన కావ్యముల్ -
అల "కవితాప్రభాస" యను నా గృహ సీమకు  స్వాగతం బటన్
పిలిచితొ వాక్సతీమణిని ప్రేమము, భక్తియు మీర మ్రొక్కుచున్!

చం.     తమ మది యెంతొ మెత్తన! కృత ప్రతి పద్యము నంత కంటెయున్!
తమ ప్రియ శిష్యులన్న నెడదం గల ప్రేమము మెత్త మెత్తనౌ!
తమ గురువైన సత్కవి, సదాశయ పూర్ణుడు - "విశ్వనాథ" పై
విమల సుభక్తి జూపితివి వెండియు మెత్తనయౌ విధేయతన్! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~10

**\*\*09.కుసుమ కుమారి\*\*\*           "జయంతి నివాళి!"**

సీ.      తెలుగు భాషా సేవ తీరుగా నొనరించి,
శారదోపాసన సలిపినారు!
విశ్వనాథార్యుల వినయంపు శిష్యులై,
సాహితీ సేద్యము జరిపినారు!
'రస రాజధానిలో' రాత్రి పగలనక,
కావ్యగోష్ఠుల జన్మ గడపి నారు!
పదవులు బిరుదులు పర్వెత్తి మిమ్ముల,
కౌగలించె కనగ కనుల పంట!
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

తే: పుత్ర ప్రేమల శిష్యుల ప్రోత్సహించి,
వారసత్వ సంపదలను వసుధ కిడిరి!
వందన శతము నండూరి వంశజునకు!
రామ కృష్ణమాచార్య వరా! నమోస్తు! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~09

**\*\*\*11.శంభుని కుమార్\*\*\* "నండూరి రామకృష్ణ"**

తే.గీ. సంస్కృతాంధ్రమాంగ్లాలలో సారమంత
తెలిసి కైతల నద్దిన తీరు గాంచి,
చదువులమ్మయే పులకించె సత్కవీంద్ర!
రామ కృష్ణమాచార్య ! నీరాజనమ్ము!

కం. అనితర సాధ్యమయిన మీ
ఘనమౌ సాహిత్య రాశి ఘనతను చాటెన్!
కన నందు "శీర్ణమేఖల
మను నాచంద్రార్కము నిల మాన్యత గనుచున్!

సీ. పద్య కవిత్వ కల్ప తరువుగా నిల్చి
పద్య పరిమళముల్ పంచితీవు!
క్రొత్త పుంతలు ద్రొక్కు గొప్ప సుకృతులతో
ప్రాజ్ఞుల మెప్పొంది వరలి తీవు!
దీనజనావళి తీరని వ్యధలకు
కన్నీరు గార్చిన కవిత వీవు!
సాహితీ స్రష్టల సరసన వెలిగిన
తెలుగు తల్లి నుదుట తిలక మీవు!

తే.గీ. ఉత్తముడ, వోర్పరివి, మంచి ఒజ్జ వీవు!
బ్రాహ్మి మానస పుత్ర! శ్రీ స్వర్గ ధామ!
సాహితీ జగ న్నాయక! శాశ్వత యశ!
ప్రణతి గొనుమిదే "నండూరి రామకృష్ణ"! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~11

# శ్రద్ధాంజలి

# వార్తా పత్రికలలో



8 హైదరాబాద్

పద్యానికి వన్నె తెచ్చిన రామక్రిష్ణుడు మరి లేరు

(ప్రభాతవార్త-హైదరాబాద్)

పద్య సాహిత్యంలో కురువృద్ధుడు, అంధ్రపద్యకవితాసదస్సు రాష్ట్ర అధ్యక్షుడు, సాహితీసవ్యసాచి, పద్యకవితా విరించి, బహుకావ్యకర్త నండూరి రామ క్రిష్ణమాచార్యులు ఆదివారం ఉదయం 10.40 నిమిషాలకు సికింద్రాబాద్‌లోని స్వగృహంలో మృతి చెందారు. నియోక్లాసికల్ పొయెట్రీకి ఆద్యులైన ఆ

# పద్యానికి వన్నె తెచ్చిన రామక్రిష్ణుడు మరి లేరు

వార్త సోమవారం 7, జులై 2003

(ప్రభాతవార్త – హైదరాబాద్) పద్య సాహిత్యంలో కురువృద్ధుడు, అంధ్ర పద్యకవితాసదస్సు రాష్ట్ర అధ్యక్షుడు, సాహితీసవ్యసాచి, పద్యకవితా విరించి, బహుకావ్యకర్త నండూరి రామ క్రిష్ణమాచార్యులు ఆదివారం ఉదయం 10.40 నిమిషాలకు సికింద్రాబాద్ లోని స్వగృహంలో మృతి చెందారు. నియోక్లాసికల్ పొయెట్రీకి ఆద్యులైన గుర్రం జాషువా, కరుణశ్రీల తర్వాత సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న వ్యక్తి: 1921లో పశ్చిమగోదావరి జిల్లాలోని ఆగ్రహా రగోపవరం గ్రామంలో జన్మించిన ఆయన పలుకాలేజీల్లో తెలుగు శాఖాధిపతిగా కూడా పనిచేశారు. 1976లో పదవీవిరమణ పొందాక ఆయన దృష్టి మొత్తం పద్య కవితా రచనపై మళ్ళించారు. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యుజిసిలో జాతీయ తెలుగు విభాగానికి ఆచార్యులుగా, టిటిడి ధర్మప్రచార పరిషత్తు' ప్రత్యేక అధికారిగా పనిచేశారు. 87-90 సంవత్సరాల కాలంలో అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, కేంద్ర ఫిలింసెన్సార్ బోర్డు సభ్యులుగా తన సేవలను అందించారు. ఆయన రచించిన శీర్ణమేఖల ఖండకావ్యం చాలా ప్రఖ్యాతి పొందింది. తారాతోరణము పాతకొత్తల మేలుకలయిక, కవితా ప్రభాస, ప్రగతిగీత, ఆలోచనము, ముత్యాల గొడుగు, కవితా సంహిత తదితర రచనలు నండూరివారి ప్రతిభకు నిదర్శనాలు. నండూరి అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం 5గంటలకు సికింద్రాబాద్ బన్సీలాల్పేట్ స్మశాన వాటికలో పలువురు సాహిత్య అభిమానులు, కవులు, రచయితలు, బంధువుల సమక్షంలో జరిగింది.


ఆంధ్రప్రభ

సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కు
రాజ్యాంగం అభయమిచ్చేవరకూ విశ్రమించం

మంగళవారం 8 జూలై 2003

గద్య పద్య చాతురీ సవ్యసాచి!

అతని చూపుల్లో స్నిగ్ధత ఉంది; అతని దరహాస ముద్రలో చిరమైత్రీ స్పర్శ ఉంది; అతని పలకరిం

# గద్య పద్య చాతురీ సవ్యసాచి!

అతని చూపుల్లో స్నిగ్ధత ఉంది; అతని దరహాస ముద్రలో చిరమైత్రీ స్పర్శ ఉంది; అతని పలకరింపులో అడుగడుగునా వాత్సల్యం ఉంది; అతను నోరుమెదిపితే తేటగీతం, చేయి కదిపితే ఆటవెలది! ప్రాచీన, అర్వాచీన కవితా, సాహితీ సంప్రదాయాలను కరతలామలకం చేసుకున్నవాడు. అతనే - ఆదివారం నాడు భౌతికంగా మనకు దూరమైన పండితుడు, గద్య పద్య చాతురీ సవ్యసాచి, శతాధిక కావ్యకర్త, ఆంధ్ర పద్యకవితా సదస్సు అధ్యక్షుడూ, అధికార భాషా సంఘ పూర్వాధ్యక్షుడూ ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు! ఆప్తులందరికీ రామకృష్ణుడైన కృష్ణమాచార్య హృదయవైశాల్య మున్న మనీషి. "హృదయమున్న మేలు చదువుకన్న" అని ఆచార్యుడే అన్నపుడు అది ఆలోచనా మృతమే! స్నేహశీలి, మృదుభాషి, జ్ఞాని, విజ్ఞాని అయిన రామకృష్ణుడు మాతృభూమి, మాతృభాష రెండు ప్రాణాలుగా ఎదిగివచ్చిన వాడు. తన కళాశాల, విశ్వవిద్యాలయ అధ్యాపక, ఆచార్యత్వంలో తెలుగు భాషను ఆయన నేర్పిన తీరు తెన్నుల మూలంగా వందల సంఖ్యలో విద్యార్థులు మాతృభాషపై మక్కువ పెంచుకున్నారంటే ఆచార్యుడి బోధనా పద్ధతుల్ని అర్థం చేసుకోవచ్చు. “దేశ భాష లందు తెలుగు లెస్స" అన్న మకుటంతో (ఆంధ్రభారతి పబ్లికేషన్స్) వెలువడిన, మణిప్రవాళ మనదగిన తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాల సంక్షిప్త విజ్ఞాన సర్వస్వానికి కృష్ణమాచార్య ఒక “కరదీపిక" సమకూర్చారు. మాతృభాష, మాతృభూమి నిండుప్రాణులుగా భావించిన రామకృష్ణుడు “ధర్మరక్షణ ప్రేమతత్వాల నెరిగించు / పోతనాది సుకవి పుంగవులను / కన్న తెల్గుతెల్లికి నమస్కార శతం" అర్పించినవాడు. ఒకవిధంగా శ్రీనాథుడు

సంస్కృతారణ్యంలో సాధికార విహారయాత్రలు చేసి "జగతి తల్లి (సంస్కృతం) కంటె / సౌభాగ్య సంపద మెచ్చు ఆడబిడ్డ మేలుగాదె” అని కొంటెతనం ప్రదర్శించి ఉండవచ్చు గానీ, మన కృష్ణమాచార్య ప్రధానంగా మాతృభాషను నిజంగానే “దేశ భాషలందు లెస్స"గా జీవితాంతం వాచా కర్మణా భావించినవాడు. అంతమాత్రాన రామకృష్ణుడికి సంస్కృతమంటే ద్వేషమని చెప్పలేము. త్రిలింగదేశమైన (శ్రీశైలం, కాళేశ్వరం, భీమేశ్వరం) తెలు గుదేశానికి రామకృష్ణుడు ఇలా శుభాశీస్సులు (“విజయోస్తు") పలికాడు:

**పూర్వాంభోనిధి కాళహస్తి నగరీ శ్రీమన్మ హేంద్రాచల**
**శ్రీశైల ప్రముఖ త్రిలింగ శిఖర ప్రాతర్నవోషస్వినీ**
**కృష్ణా కంకణకింకిణీ ఝణంఝణాద్ గోదావరీ కాంచికా**
**ద్రాక్షా పేశల వాఙ్మయీ విజయతాం త్రైలింగ పృథ్వీస్థలీ"**

ఇలా ఒకవైపున కోస్తాంధ్ర నుంచి విశ్వనాథ "కృష్ణాతరంగిణీ నిర్నిద్రగానముతోడ" తెలుగు శిల్పం చేసుకున్న తొలి పూజల్ని తలచుకుంటున్న సమయంలో, ఇటు తెలంగాణం నుంచి దాశరథి జ్యోత్స్నోజ్జ్వల ప్రభలలోన/ పోతకవి నుండి పొంగిపొరలిన కావ్యవారాశికి తామెలా వారసుల మ యిందీ చాటుకున్నాడు. ఇక అటు రాయలసీమ నుంచి పుట్టపర్తి వారు "తుంగభద్రా సముత్తుంగ వీచీ దివ్య/ గంభీర ఘుమఘుమలో కలల్లో వెతుక్కుంటూ తనలోతానే గర్విస్తున్న దినాలవి. ఆ శుభ ముహూర్తంలోనే రామకృష్ణమాచార్య కూడా తెలుగు పద్యకవితకు తనదైన బాణీలో కుచ్చిళ్ళు సవరిస్తూ లక్షణాన్ని ఇలా చెప్పాడు: "తెలుగు పద్య శిల్ప కవితా విలసనములు/ తెలుగు పద్య శిల్ప మహత్కలరవములు/ తెలుగు పద్య శిల్ప కళావతీమతములు/ తెలుగు పద్యశిల్ప నవతా ప్రదీపశిఖలు/ చదల యందు సూర్యచంద్రులుండెడి దాక ఉర్వి మీద కొండలుండు వరకు/ జగతి వరలు దాక, శబ్దార్థ సంక్రాంతి/ బ్రతికి యుండు తెలుగు పద్యకవిత".

అప్పటి నుంచీ రామకృష్ణుడు పద్యకవితా వ్యవసాయాన్ని ఆటవెలదిలో సాగించినా, వృత్తాలలో కొన సాగించినా అభ్యుదయ మార్గంలోనే “నవతా ప్రదీప్త శిఖలు" సరికొత్త నడకలో" శబ్దార్థ సంక్రాం తులూ" చూపాడంటే అతిశయోక్తికాదు! శ్రీనాథుడు కార్యంపూడి పట్టణాన్ని పలనాటి వారికి "కాశి"గా పరిగణించినట్టే (“ గంగాధర మడుగే మణికర్ణికగా చెలంగు నీ కారెమపూడి పట్టణము కాశిగదా పలనాటి వారికిన్") రామకృష్ణమాచార్య కరవు కాటకాల మధ్య జీవిస్తూ వచ్చిన రాయలసీ మలోని రసజ్ఞలోకానికి నివాళులర్పించిన పద్ధతి అత్యంత హృదయంగమంగా ఉంది:

-"కామములెన్ని వచ్చిన రసజ్ఞత ఇంచుక చావలేదు/ జ్ఞానామృత వృష్టికిన్ కొరతనందని రాయలసీమలోపలన్!" అందులో మానవత్వంతో కూడిన ఆర్ద్రత ఉంది, ప్రజల పట్ల సానుభూతి ఉంది, సహానుభూతి ఉంది! అంతేగాదు, మానవుల్ని గుడుల పేరిట, గోపురాల పేరిట కులమతాల పేరిట చీల్చే దుష్టులున్న సమాజంలో మంచితనాన్నీ మమతాను రాగాలను పంచే వ్యక్తి ఎవరైనా అతడు విధిగా నాస్తికుడే కానక్కరలేదు, సర్వజనుల సంక్షేమాన్ని ఆశించే ఆధ్యాత్మిక చింత నాప రులు ఆస్తికులైనా మానవసేవనే మాధవసేవగా భావించినంత కాలం ప్రేమించదగినవారే. ఈ కోవకు చెందినవాడు రామకృష్ణుడు. ఆ విషయాన్ని ఆయన తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం - అందుకున్న "ఆలోచనం" గ్రంథంలో చాల స్పష్టంగా పేర్కొన్నాడు:

**"నేను నాస్తికుడనుగాను జీవితంలో**
**మంచితనము మీద మమతగలదు**
**మతము మీద గాక –మానవత్వముపైన**
**కలదు గొప్పనమ్మకమ్ము నాకు"**

అన్నాడు! కొత్తపాతల కూడలి రామకృష్ణమాచార్యుల మేధస్సు. ఆ మేథామథనంలోనే ఆయన "హేతువాద సహిత సేతువై జీవించి" కూడా సాహితీ తపస్సు చివరిదాక చేస్తూవచ్చినవాడు! చివ రికి బౌద్ధాన్ని కూడా ఆయన అందరిలా దర్శించకుండా విలక్షణమైన ధోరణిలో "ప్రాక్టికల్ వేదాంత" స్పర్శతో చమత్కారంగా ఇలా పేర్కొన్నాడు: "బౌద్ధమంతరించే భారతదేశమునందు / బోధచేసి -సకలభూత దయను / బ్రహ్మచర్య నిష్ఠ - ప్రజకు సాధ్యముగాదు/ అవధులుండవలెను త్యాగ మునకు" అని! శ్రమను గౌరవించని సమాజాన్ని, వ్యక్తులను రామకృష్ణుడు యీసడించుకున్నాడు. "రమ్యహాసలోల రామకృష్ణ" అన్న మకుటంతో కొన్ని జీవితానుభవాలను ఆటవెలదుల్లోనే సూక్తి ముక్తావళిగా పాఠకులకు అందించాడు. రామకృష్ణుడి హాస్యచాతురికి ఒక ఉదాహరణ:

**"అప్పుచేసి అతడు గొప్పగా వెలుగొందే '**
**రాజువోలె చివరిరోజు వరకు**
**అసలు చెడినదెవరు? అప్పులిచ్చిన వారె?**
**రమ్యహాసలోల రామకృష్ణ!"**

కాగా హేతువాద దృష్టితో ఆయన ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న అసలు ప్రమాదమేదో కూడా ఇలా ఊహించగలిగాడు:

**"దేనివలన దెబ్బ తిను ప్రజాస్వామ్యమ్ము**

**స్వార్థకత పనుల వలనగాదు**
**కనులముందు జరుగుక్రౌర్యమ్ము తిలకించి**
**ఊరుకొనెడి మంచివారివలన."**

రామకృష్ణుడి "కవిత్రయం" గ్రంథానికి తెలుగుభాషా సమితి పురస్కారం లభించడంతో పాటు ఆయన రచనలో ప్రసిద్ధి పొందిన ఖండకావ్యం" శీర్ణమేఖల" కాగా పదిమందికీ తెలిసిన వాటిలో కొన్ని "ప్రగతిగీత" "ముత్యాల గొడుగు" రచనలు. రామకృష్ణుడు సమాజ ప్రగతి కోసం, దోపిడీలేని సాంఘిక వ్యవస్థకోసం తపనపడి సుకవికి లక్ష్యాన్ని, లక్షణాన్ని నిర్వచించి, "శ్రమ ఏవ జయతే" అంటూ నినదిస్తూ ఇలా సందేశమిచ్చాడు: "మెదడులోన మార్క్సు –హృదిలోనబుద్ధుడై/ విప్లవమ్ముకరణ వింగడించి/ పుట్టుగాక సుకవి - భువనైక పౌరుడై/ ప్రగతికొరకు -నూత్నజగతికొరకు". స్వామి వివేకానంద జనన మరణాలకు అభేదం చెప్పి, బతు కున్నంతకాలం దిలాసాగా, కులా సాగా బతికి తోటి మానవుడికి మంచిచేసి పొమ్మన్నాడు, మంచివైపు మనస్సులు మలచమన్నాడు. బతికుండగానే ధైర్యంగా ఎవరూ "మరణ మంగళాశాసనం" రచించుకోలేరు. కాని రామ కృష్ణమాచార్య ఆదివారం కాలధర్మం చెందడానికి ముందే "ఆలోచనం"లో ఆ "శాసనం" రచించుకున్నాడు. బతికుండగా తన నమ్మకం మానవత్వం పైనే గాని మతంపైన కాదని చాటుకున్న రామకృ ష్ణుడు మరణం సమీపిస్తున్నప్పుడు తనకు కావలసింది "మధురగానమే" గాని మందులు కావని చెప్పాడు! తను చనిపోయిన తర్వాత ఎవరూ కళ్లనీళ్ళు పెట్టు కోరాదని చెబుతూ తనకు "ఏడ్పు అంటే ఏవగింపు" అని చాటించి శాసించాడు! మైలపట్టొద్దు, మంత్రతంత్రాలు వద్దు, శ్రాద్ధకర్మలు వద్దన్నాడు, తద్దినాలు పెట్టవద్దన్నాడు. అంతకన్నా బాలబాలికలకు తీరు బడిగా బహుమానాలు తీర్చుకోమన్నాడు, పూర్వజన్మనేగాదు, పునర్జన్మనీ ప్రశ్నించాడు! భార్య పసుపు కుంకుమలు భర్తతో వచ్చినవికావని చెప్పాడు; పసుపుకుంకుమ తొలగించే పదవనాటి తంతుకు 'తందానా' పలకొద్ద న్నాడు, భర్త చావు బాధ భార్యను వోదార్చడంతో సరిపోతుందనీ, "వికట కర్మకాండ వద్దు వద్ద" న్నాడు. చావంటే "స్వస్తివరప్రసాదం" మాత్రమే అన్నాడు! తిరుపతి దేవస్థానం వారి "హిందూధర్మ ప్రచార పరిషత్" అధికారిగా పనిచేసినప్పటికీ రామకృష్ణుడు హేతువాద దృక్పథాన్ని విడనాడని నాస్తికుడు. సర్వమానవ సౌభ్రాత్రం, కర్మయోగం రామకృష్ణమాచార్యుల వేదనాకలశాలు!



నందూరి మృతిపట్ల పలువురి సంతాపం

నారాయణగూడ, జూలై 6 (ప్రభాతవార్త)

పద్యకవితా పితామహుడు డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్య మరణంపట్ల రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.ప్రముఖ విద్యుత్కవులు, విమర్శక శిరో మణి అకాల మృతి తెలుగు సాహిత్యానికి తీరని నిక్షతిగా పేర్కొన్నారు.పెక్కు కళాశాల్లో అధ్యాపకు నిగా, పాచీన సంస్కృతాంధ్ర కావ్య లక్షణ విశ్లేషకునిగా ఆయన ఎనలేని కృషిచేశారని, తెలుగుతో పాటుగా ఇంగ్లీషు భాషలో కూడా ఉద్గ్రంథాలు రచించిన కృష్ణమాచార్యులు చివరి రోజులలో తేటగీతు

# నండూరి మృతి పట్ల పలువురి సంతాపం

**నారాయణగూడ, జూలై 6 (ప్రభాతవార్త)**

పద్యకవితా పితామహుడు డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య మరణంపట్ల రాజ్యసభ సభ్యుడు. డాక్టర్ సి. నారాయణరెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ప్రముఖ విదృత్కవులు, విమర్శక శిరోమణి అకాల మృతి తెలుగు సాహిత్యానికి తీరని నిక్షతిగా పేర్కొన్నారు. పెక్కు కళాశాల్లో అధ్యాపకునిగా, పాచీన సంస్కృతాంధ్ర కావ్య లక్షణ విశ్లేషకునిగా ఆయన ఎనలేని కృషిచేశారని, తెలుగుతో పాటుగా ఇంగ్లీషు భాషలో కూడా ఉద్ధంథాలు రచించిన కృష్ణమాచార్యులు చివరి రోజులలో తేటగీతుల వైపు, ఆటవెలదుల వైపు మళ్లి తెలుగు వికాసానికి తోడ్పడ్డారన్నారు. తిక్కనను పుక్కిట పెట్టుకున్న రామకృష్ణమాచార్యులు వేమనదారిలో వెళ్లడం గణనీయ లక్షణంగా పేర్కొన్నారు. ఆయన అకాల మరణానికి ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు జి.వి.సుబ్రహ్మణ్యం, మంత్రి చెన్నారెడ్డి, మానవ వనరుల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు పి. వి.ఆర్.కె.ప్రసాద్, మాడుగుల నాగఫణిశర్మ, టి.వి. నారాయణ, ఏకాంబరాచార్యులు, భీమశంకరం, దుగ్గిరాల రామారావు, సాధన నరసింహారావు, ఆచార్య ఫణీంద్ర, సిహెచ్. రామారావు తదితరులు నండూరి రామకృష్ణమాచార్య మృతిపట్ల తమ సంతాపం ప్రకటించారు.

# 'నండూరి' మృతి సారస్వత లోకానికి తీరని లోటు

ఆంధ్రజ్యోతి మంగళవారం 8 , జులై 2003

విశాఖపట్నం, జూలై 7(ఆన్లైన్ -కల్చ రల్): సంస్కృతాంధ్ర సాహిత్య ప్రక్రియలో ప్రతీ కోణాన్ని సృశించి, సుదీర్ఘ సాహితీ సేవ చేసిన బహుగ్రంధ కర్త నండూరి కృష్ణమాచా ర్యులు మృతి సారస్వత లోకానికి తీరని లోటని ఆచార్య కొర్లపాటి శ్రీరామ్మూర్తి, ఎ.యు.తెలుగు ప్రొఫెసర్ కోలవెన్ను మలయవాసిని ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆంధ్ర భాషా సంఘం, ఆంధ్ర పద్య కవితా సదస్సు అధ్యక్షులుగా సాహితీ సేవ చేసిన నండూరి కృష్ణమాచా ర్యులు భౌతికంగా లేకపోయినా తారాతోరణం, ప్రగతిగీత వంటి కావ్యాలు, ఛత్రపతి శివాజీ, ధర్మచక్రం వంటి నాటకాలు, కవిత్రయం, పద్య శిల్పం వంటి ఎన్నో విమర్శనాత్మక గ్రంథాలు ఆయనను సాహితీ లోకాన సజీవంగా నిలబెడ తాయని విశాఖ సాహితి గౌరవాధ్యక్షులు కళాప్ర పూర్ణ గణపతిరాజు అచ్యుతరామరాజు, తను సంతాపంలో తెలిపారు.'


సోమవారం జులై 7, 2003

నండూరు రామకృష్ణమాచార్య కన్నుమూత

హైదరాబాద్, జులై 6 (న్యూస్‌టుడే): ప్రముఖ తెలుగు భాషాపండితుడు, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు నండూరు రామకృష్ణమాచార్య ఆదివారం కన్నుమూశారు. ఆయన వయస్సు 82 సంవత్సరాలు. నండూరుకు ఆరుగురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పక్షవాతం లక్షణాలు కనిపించడంతో శనివారం ఆయనను ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆదివారం తుది శ్వాసవిడిచారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్‌లోని ఆయన స్వగృహానికి చేరుకొని ఘనంగా నివాళులర్పించారు.

# నండూరు రామకృష్ణమాచార్య కన్నుమూత

ఈనాడు జులై 7 , 2003

హైదరాబాద్, జులై 6 (న్యూస్టుడే): ప్రముఖ తెలుగు భాషాపండితుడు, అధికార భాషాసంఘం మాజీ అధ్యక్షుడు నండూరు రామకృష్ణమాచార్య ఆదివారం కన్నుమూశారు. ఆయన వయస్సు 82 సంవత్సరాలు. నండూరుకు ఆరుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పక్షవాతం లక్షణాలు కని పించడంతో శనివారం ఆయనను ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆదివారం తుది శ్వాసవిడిచారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సికింద్రాబాద్లోని ప్యారడైజ్ లోని ఆయన స్వగృహానికి చేరుకొని ఘనంగా నివాళులర్పించారు. 1975కి ముందు ప్రభుత్వ కాలేజీలతో పాటు వివిధ పేరొందిన విద్యా సంస్థల్లో అధ్యాపక వృత్తిని నిర్వర్తించిన రామ కృష్ణమాచార్య బహుగ్రంధకర్త. సంస్కృ తాంధ్ర భాషల్లో ఆయనకు గల ప్రావీణ్యానికి సర్వత్రా ప్రశంసలను అందుకున్నారు. 1978 తరువాత ఉస్మానియా, ఆంధ్ర విశ్వవిద్యాల యాలకు యూజీసీ అనుబంధ ఆచార్యునిగా సేవలు అందించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ధర్మ ప్రచార పరిషత్తు ప్రత్యేకాధికారిగా వ్యవహరించారు.

1987-1990 మధ్య కాలంలో తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా ఆయన వ్యవహరించారు. కవిత్రయం పరిశోధనా గ్రంథం ఆయనకు 1955వ సంవత్సరంలోనే సాహిత్య అకాడమీ అవార్డును సాధించి పెట్టింది. ఆంగ్లంలో మహాభారత గ్రంధాన్ని రచించిన అరుదైన ఖ్యాతిని కూడా ఆయన సాధించారు. ప్రాచీన భారత చరిత్ర, సాహిత్యం, తిక్కన, కవితాత్రయం అనే రచనలు ఆయన ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి.
ముఖ్యమంత్రి సంతాపం

రామకృష్ణమాచార్య మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. తెలుగు భాషా సాహిత్య వికాసానికి, రాష్ట్రంలో విద్యాభివృద్ధికి నండూరి ఎనలేని కృషి చేశారని సంతాప సందేశంలో పేర్కొ న్నారు. సంప్రదాయిక, అధునిక సాహిత్యాలకు చైతన్య వారధిగా వ్యవహరిస్తూ సాహితీ రంగంలో యువజనులకు స్ఫూర్తినిచ్చారని కొని యాడారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.



సాహితీవేత్త 'నండూరి' కన్నుమూత

ప్రాచీన దక్షిణ భారత చరిత్ర, ప్రాచీన భారత విశ్వవి ద్యాలయాలు, ఆంధ్ర సంస్కృతి వికాసం గ్రంథాలను రచించారు. సాహిత్య రంగంలో ఆయన అందించిన సేవలకు గాను 1955లోనే కవిత్రయం పరిశోధన గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును బహూకరించింది. అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఆ అవార్డును స్వీకరించారు. భీమ వరం డిఎస్ఆర్ కళాశాల, అనంతపురంలోని ప్రభుత్వ కళాశాల, కాకినాడలోని పిఆర్ కళాశాలల్లో ప్రిన్సిపా

1987నుంచి1990 వరకు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలంలో రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షునిగా వ్యవహరించి తెలుగు భాషాభివృద్ధికి కృషి సాగించారు. 1990 నుంచి 1992 వరకు కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యునిగా కొనసాగారు. ఉషశ్రీ, గార్లపాటి శ్రీరామ మూర్తి, ప్రొలాప్రగడ సత్యనారాయణమూర్తి, ఆశా వాది ప్రకాష్, మాడుగుల నాగఫణిశర్మ, సాగర్‌రావు, డాక్టర్ రఘురాంరెడ్డి, ఆచార్య ఫణీంద్ర తదితరులు నండూరి శిష్యగణం. నండూరి సమాజంలోని మూఢా చారాల పట్ల తొలినాళ్ల నుంచే అక్షరయుద్ధం సాగిస్తూ వచ్చారు. చివరకు తాను భౌతిక కాయాన్ని వీడినా

# సాహితీవేత్త 'నండూరి' కన్నుమూత

ఆంధ్రజ్యోతి 07 జులై 2003

ప్రాచీన దక్షిణ భారత చరిత్ర, ప్రాచీన భారత విశ్వవిద్యాలయాలు, ఆంధ్ర సంస్కృతి వికాసం గ్రంథాలను రచించారు. సాహిత్య రంగంలో ఆయన అందించిన సేవలకు గాను 1955లోనే కవిత్రయం పరిశోధన గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును బహూకరించింది. అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఆ అవార్డును స్వీకరించారు. భీమ వరం డిఎన్ఆర్ కళాశాల, అనంతపురంలోని ప్రభుత్వ కళాశాల, కాకినాడలోని పిఆర్ కళాశాలల్లో ప్రిన్సిప్ల్ గా పనిచేశారు. 1977-78లో ఆంధ్ర, ఉస్మానియా యూనివర్సిటీల్లో యు.జి.సి. తెలుగు విభాగంలో జాతీయ ఆచార్యునిగా కొనసాగారు. తిరుమల తిరు పతి దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మప్రచార పరిషత్కు ప్రత్యేక అధికారిగా, సంపాదకునిగా పనిచేశారు. 1987 నుంచి 1990 వరకు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలంలో రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షునిగా వ్యవహరించి తెలుగు భాషాభివృద్ధికి కృషి సాగించారు. 1990 నుంచి 1992 వరకు కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యునిగా కొనసాగారు. ఉషశ్రీ, కొర్లపాటి శ్రీరామ మూర్తి, ప్రొలాప్రగడ సత్యనారాయణమూర్తి, ఆశావాది ప్రకాశ రావు, మాడుగుల నాగఫణిశర్మ, సాగర్ రావు, డాక్టర్ రఘురాంరెడ్డి, ఆచార్య ఫణీంద్ర తదితరులు నండూరి శిష్యగణం. నండూరి సమాజంలోని మూఢా చారాల పట్ల తొలినాళ్ల నుంచే అక్షరయుద్ధం సాగిస్తూ వచ్చారు. చివరకు తాను భౌతిక కాయాన్ని వీడినా కంటతడిపెట్టరాదంటూ తన కుటుంబాన్ని ఆదేశిస్తూ 'మరణ మంగళ శాసనం' అనే కవిత రాసుకున్నారు. శ్రాద్ధకర్మలు జరుపరాదని కూడా ఆయన ఈ కవిత కుటుంబీకులను కోరారు. హరిజనోద్ధరణకూ నండూరి సాగించిన కృషి ఆదర్శనీయమైనదే.



మిగతా 2వ పేజీలో

నండూరి రామకృష్ణమాచార్య

సాహితీవేత్త 'నండూరి' కన్నుమూత

హైదరాబాద్, జూలై 6 (ఆన్‌లైన్): ఆధునిక భావజాలంతో ఆటవెలదుల్లో లోక రీతులను ఎండగడుతూ అభినవ వేమనగా పేరుపొందిన డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య(82) ఆదివారం అనా

# సాహితీ వేత్త 'నండూరి' కన్నుమూత

ఆంధ్ర జ్యోతి 07 జులై 2003

హైదరాబాద్, జూలై 6 (ఆన్లైన్): ఆధునిక భావజాలంతో ఆటవెలదుల్లో లోక రీతులను ఎండగడుతూ అభినవ వేమనగా పేరుపొందిన డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య (82) ఆదివారం అనారోగ్యంతో కన్ను మూశారు. బహు భాషా గ్రంథకర్త, సాహితీ వేత్తగానే కాక రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షునిగా సేవ లందించిన నండూరి భౌతికంగా దూరమయ్యారనే వార్త ఆయన శిష్య బృందాన్నే కాదు యావత్తు సాహితీ లోకాన్ని నివ్వెర పరిచింది. చివరి క్షణం వరకూ నండూరి సాహిత్య సేవలోనే గడిపారు. సాదాసీదా జీవితాన్ని గడిపిన నండూరి మరణానికి ముందు రోజు వరకూ సాహిత్య సేవలోనే గడిపారు. శనివారం అకస్మాత్తుగా పక్ష పాతం రావడంతో అపోలో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. ఆయనకు ఆరుగురు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. కుమా రులంతా కూడా విద్యావేత్తలే కావడం గమనార్హం. గుర్రం జాషువా, కరుణశ్రీ వంటి మహాకవులకు ఆప్త మిత్రుడు నండూరి. పశ్చిమ గోదావరి జిల్లా అగ్రహారం గోపవరంలో 1921లో జన్మించిన డాక్టర్ నండూరి రామ కృష్ణమాచార్య ప్రగతి, తారా తోరణం, ఆలోచనం, మానస సరసి, దశ రూపకములు, ఛత్రపతి శివాజి, ధర్మ చక్రం వంటి నాటికలను రచించారు. ఆంగ్లంలో మహా భారతాన్ని గాంధీయన్ ఈరా **(మిగతా 2వ పేజీలో)**

(1వ పేజీ తరువాయి)

రహస్యాలను వశీకరించుకున్నారు. బహు భాషా కోవిదులైన వీరు మహాభారతాన్ని ఆంగ్లంలో రచించారు. దీనిని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచు రించి ప్రచారంలోకి తెచ్చింది. చిన్నతనంలోనే తిక్కనను పుక్కిట పట్టిన వైదుష్యనిధిగా పేరుగాంచిన నండూరి లలిత మధురశైలిలో, సాంద్ర భావ గుంభిత రీతిలో పద్యరచన చేసే నవ్యకవుల్లో జాషువా, కరుణ శ్రీలను మించిన జోదుగా నిలిచారు. ఆంధ్రమహాభా రతం నేపథ్యంగా అనేక గ్రంథాలు రాశారు. కావ్యరచ నలో ఆయన సృజనశక్తి ఎంత తలస్పర్శిగా భాసిం చిందో, విమర్శనాపటిమలో, విశ్లేషణా గరిమలో అంత పరిణతమతితో సముద్ధమించింది. గాంధేయ వాదిగా, సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ, ఆధు నికతను ఆహ్వానిస్తూ నిరంతర చైతన్యశీలిగా, అభ్యు దయభావాలప్రోదిగా ఆయన సుప్రసిద్ధులు.

## జీవిత విశేషాలు

1921 ఏప్రిల్ 29వ తేదీన నండూరి పశ్చిమగోదావరి జిల్లా అగ్రహారగోపవరంలో జన్మించారు. 1944-55 వరకూ భీమవరం డి. ఎన్. ఆర్. కాలేజీలో, 1955 నుండి 1964 వరకూ అనంతపురం ప్రభుత్వ కాలేజీలోనూ అధ్యాపక వృత్తిని నిర్వహించారు. 1966 నుండి 71 వరకూ తాడేపల్లిగూడెంలోని గోయంకా ప్రభుత్వ కాలేజీ, 1972 నుండి 75 వరకూ విశాఖపట్టణం వి.ఎన్ కృష్ణా కాలేజీ, 1975 నుండి 76 వరకూ పి.ఆర్ డిగ్రీ కాలేజీకి ప్రిన్సిపాల్గా వ్యవహరించారు. 1976 నుండి 78 వరకూ ఆంధ్రాయూనివ ర్శిటీ, ఉస్మానియా వర్శిటీలకు యు.జి.సి నేషనల్ ప్రొఫెసర్గా వ్యవహరించారు. 1982 నుండి 87 వరకూ టి.టి.డి ఎడిటర్ గానూ, ధర్మప్రచారక పరిషత్ స్పెషల్ ఆఫీసర్గా పనిచేశారు. 1987 నుండి 90 వరకూ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా వ్యవ హరించారు. 1991 నుండి 92 వరకూ సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబెర్గా వ్యవహరించారు.

## నండూరి గ్రంథాలు:

20వ శతాబ్దిలో వెలువడిన అత్యుత్తమ ఖండకా వ్యాలలో శిఖరాయ మానమైన కవిత 'శీర్ణమేఖల' నండూరి వారి రచనే.

1948లో ఆధునిక భావనాభ్యు "దయ సౌరభంతో రాసిన ఖండకావ్యాలు 'తారాతోరణం'గా తొలిముద్రణ పొందాయి. ధర్మ చక్రం-నాటకం కృష్ణాపత్రికలో అనేక వారాల పాటు ప్రచురితం అయింది. శ్రీ కృష్ణదేవరాయులు నాటకం మనసీమ పత్రికలో ప్రచురితం అయింది.

ఛత్రపతి శివాజీ రంగస్థల నాటకం లెక్కలేనన్ని సార్లు ప్రదర్శిత మైంది. కావ్యలోకము గ్రంథాన్ని తెలుగుఅకాడమి ముద్రించింది. ధవరూపకాలు, ప్రాచీన దక్షిణ భారత చరిత్ర, నృత్య నాటికలు (గోదావరి – జ్యోత్స్నాభిసారిక), వాసవికన్యక - శ్రమఏవజయతే నాటికలు, ప్రగతి గీత, కవితాప్రభాస, ఆలోచనము, మానసరసి, ముత్యాల గొడుగు, కవితాసంహిత, కవిత్రయము (తెలుగుభాషా సాహితి బహుమతి గ్రంధం), తెలుగు పద్యశిల్పం తదితర గ్రంథాలతో పాటు వేలాది వ్యాసాలు రాశారు. ఆచార్య ఫణీంద్ర కార్యదర్శిగా, ప్రముఖకవి మంతెన వేంకట సూర్యనారాయణ రాజు అధ్యక్షుడిగా చాలాకాలంగా డాక్టర్ నండూరి రామకృ ష్ణమాచార్య సాహిత్యపీఠం పనిచేస్తోంది.

## ప్రముఖుల సంతాపం

డాక్టర్ ఎం.సి.హెచ్.ఆర్.డి. డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఎ.పి.పి.ఎన్.సి మాజీ సభ్యుడు. డాక్టర్ టి.వి.నారాయణ, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు మాడుగుల నాగఫణిశర్మ, తెలుగువర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్ గోపి, హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ పి.వి.రమణాచారి, ప్రొఫెసర్ వైకుంఠం, పి.వి.రమణ శర్మ, ఏకాంబరాచారి, డాక్టర్ రఘురామిరెడ్డి, ఆచార్య ఫణీంద్ర, ప్రొఫెసర్ భీమశంకరం తదితరలు నండూరి భౌతికకాయంపై పుష్పగు చ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

## సి.ఎం సంతాపం

అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు, సుప్ర సిద్ధి సాహితీవేత్త డాక్టర్ నండూరి రామకృష్ణమా చార్య మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు భాషా, సాహిత్యాల వికాసానికి, రాష్ట్రంలో విద్యా వికాసానికి నండూరి చేసిన సేవలు ఎనలేనివని ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యంగా ఆధునిక సాంప్రదాయక, ఆధునికి సాహిత్యాలకు ఒక చైతన్య వారధిగా వ్యవ హరిస్తూ, సాహితీ రంగంలో అనేక మంది యువజనులకు స్ఫూర్తినిచ్చారని ఆయన పేర్కొన్నారు. నండూరి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన సానుభూతిని తెలిపారు


సాహితి

ఆంధ్రభూమి సోమవారం 7 జూలై 2003

మరణానికి మంగళా శాసనం చేసిన ధీరకవి

# "మరణానికి మంగళా శాసనం చేసిన ధీర కవి"

ఆంధ్రభూమి సోమ వారం 07 జులై 2003

నండూరి రామకృష్ణమాచార్య. ఆవును; డాక్టర్ నండూరి రామకృష్ణ మాచార్యులు గారు పరచు పదించారన్న వార్త హఠాత్తుగా వినేప్పటికి గుండె ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది. ఇదేమిటి? ఈయన గూడా వెళ్ళిపోయారా? ఈమధ్య ఆయన్ను చూసిన ప్పుడు ఆయన శారీరకంగా కొంత విశ్లథులయినట్లు కన్పించారు గాని, ఆయన జ్ఞాపక శక్తిగానీ, వాగ్రీతిగానీ, ఆరోగ్యంగానే ఉన్నాయి. హాయిగా ఆయనకు సహజ మయిన చమత్కార మార్గంలో మాట్లాడుతూనే ఉన్నారు. ఎనభయికి ఆటో ఇటోగా ఉన్న ఆయన ఇంత లోనే వెళ్ళిపోతారని ఏ కోశానా అనుకోలేదు. మా ముందు తరం వారు ఒక్కొక్కరుగా వెళ్ళిపోతూనే ఉన్నారు. ఈయన కూడా ఆగకుండా వెళ్ళిపోవటం తట్టుకోలేకపోయింది మనస్సు. నిజానికి ఎవరూ పోకుండా ఉండరు. కాని, పోకుండా ఉంటే బాగుంటుందనిపించే వ్యక్తిత్వం గల వారు పోయారనగానే ఒణికి పోతుంది హృదయం. ఆయన హృదయం, మృత్యు వంటే ఆయన ఎప్పుడు భయపడిన జాడ కన్పించదు. ఆయన మరణానికి మంగళా శాసనం చేసిన సుధీరుడు. అంతేకాదు.

**మరణ సమయమందు || మధుర గానము చాలు**
**వద్దు, మందులేవి వాడవద్దు. || ఏగతించినప్పుడేద్వారా రెవరేని,**
**ఏడ్పు అనిన నాకు ఏవగింపు**

అంటారాయన. ఈ పద్యం చదివినప్పుడు కుల శేఖరాళ్వారులు ముకుంద మాలలో 'ఇదం శరీరం పరిణామ పేశలం / పతత్యవశ్యం శతసంధి జర్జ | రమ్ కిమౌషధైః క్లిశ్యసి మూఢ ! దుర్మతే / నిరామయం కృష్ణ రసాయనం పిబ ' అన్న శ్లోకం గుర్తుకు వస్తుంది. మధుర గానం వింటూ మరణించా లన్న ఆయన ఆశ ఆయన వ్యక్తిత్వానికి జీవన దర్శనానికి మచ్చుతునక,

ఏడుపు అంటే, ఆయనకు ఏవగింపు. ఆయన జీవితమంతా హాయిగా సుస్మితంగానే సాగింది. ఆయన శిష్య సంతతి దేశమంతా వ్యాపించి ఉంది. ఆ శిష్యు లకు ఈయన- ఒక విధంగా ఆరాధ్య దైవం. ఆయనకు శిష్యులమీద అపారమయిన వాత్సల్యం. విశ్వనాథ సత్యనారాయణగారి శతజయంతి సందర్భంగా రాజోలులో రాజకుమారి గారు నిర్వహించిన విశ్వనాథ సాహితీ సప్తాహం సందర్భంగా ఆయ నతో అతి సన్నిహితంగా ఉండే అవకాశం కలిగింది. అప్పుడాయనతో మాట్లాడుతున్నప్పుడు జీవితాన్ని ఎంత తృప్తిగా, ఎంత సముత్సాహం గడిపారనేది అవగతమయింది. 1946 జనవరిలో ఆయన గాంధీగారిని దర్శించి, సన్నిహితంగా మెదిలి నప్పటి నుంచి ఆయన చెప్పిన రకరకాల సన్నివేశాలు, అనుభవాలు, ఉద్యమాలు వంటి వాటిని గూర్చి వింటుంటే ఆయన జీవితాన్ని ఎంత విస్తృతంగా, ఎంత ఉదారంగా స్వీకరించారో, అనుభవించారో తెలిసి వచ్చింది. ఆయన విద్యాశాఖలో కళాశాలా ప్రాచార్యులుగా సుదీర్ఘకాలం పనిచేసిన సంద ర్భంలో విద్యార్థుల విషయంగా ఆయన ప్రేమాభిమానాలకూ, చేసిన సహాయాలకూ, గుప్తదానాలకు ఒక పరిమితి లేదు. ఆయన వాక్ చమత్కృ తులు ఆయన విద్యార్థులతో బాటు ఇతరులను గూడా ఎంతగానో ఆప్తుల నూ ఆత్మీయులనూ చేసింది. ఆయన రచనలు పాఠకులను ఆత్మీయుల నుగా మలచుకొంది. నిజానికి నాకు వారి పరిచయం వారి "తెలుగు గడ్డ" అనే రచన చదవటం ద్వారానే కలిగింది. చాలా ఏళ్ళ క్రితం తెలుగు స్వతంత్రలో అది వెలువడినప్పుడు చదివాను. తెలుగు వాడి విచిత్ర మనస్తత్వాన్ని ఒక వింతగా, వ్యంగ్య దోరణిలో - ఆరణ్యవాసంలో " తెలుగు ప్రాంతంలో అడ్డుగుపెట్టిన సీతారామ లక్ష్మణుల మీద ఆరోపించి రచించిన ఆ చిరు నాటిక ఇప్పటికీ నాకు కళ్లముందు ఆడుతూనే ఉంది. ఆయన 'తారా తోరణం' అనే ఖండికా సంకలనాన్ని చదివి ఉత్తేజితుడి నయి- అప్పుడు భాషా ప్రవీణ- బందరు దగ్గరి లిట్టిగూడూరు సంస్కృత కళాశాలలో విద్యార్థినిని - ఒక విస్తృత వ్యాసం రాసి కృష్ణా పత్రికకు పంపాను. అది పత్రికవారు వేసు కోకపోవటం. అది వేరే కథ. ఈ సన్నివేశం ఆయన నన్ను కదిలించిన తీరుకు ఒక గుర్తు . ఆ రోజుల్లో కరుణశ్రీ తరహా మృదుత్వ ప్రధానమయిన జీవిత విధానాన్ని ఇష్టపడుతూ ఉండేవాడిని. ఆ కోవలోనే రామకృష్ణమాచార్యులు గూడా అప్రత్యక్షంగా అప్తు లయినారు. అయితే, ఆచార్యులవారి వరం బహుముఖీ నమయింది. కవితాప్రభాస, తారా తోరణం, ఆలోచనము వంటి పద్య రచనలల్లా ఉంచితే ఆయన ధర్మ చక్రం నాటకం చాలా ప్రసిద్ధ మయింది. బౌద్ధం నేపథ్యంలో బిందుసారుని కథలో ముని కథలో శృంగారాన్ని అన్వయింపజేసిన ఉత్తమ నాటకం. బహుః ప్రదర్శనలు: పొంది ప్రేక్షకుల సమాదరాన్ని పుష్కలంగా సంపా దించుకొంది. జ్యోత్స్నాభిసారిక, గోదావరి అనేవి అంద మయిన నాటికలు,

హాస్య, వ్యంగ్యమయమయిన తెలుగు గడ్డ వంటి చిరు నాటికలే కాక కథలు కూడా విరివిగా రచించారు. అవన్నీ అట్లా ఉంచి జనతాదళ్ ప్రభుత్వం మొరార్జీ దేశాయి నాయకత్వంలో ఏర్పడిన సన్నివేశాన్ని, అప్పటి పరిస్థితులనూ, కీచు లాటలనూ చిత్రించిన 'అభినవ కురుక్షేత్రం' మరొక ఉత్తమ నాటకం. ఆయన రచనల్లో వస్తువు ప్రాచీనమయినా, ఆధునిక మయినా వర్తమానం ప్రాధాన్య వహించటం వ్యక్తుల్నీ దేశాన్నీ వ్యక్తిత్వాల నూ ఆయన పరిశీలనా రీతికి అద్దంపడుతుంది. రెండు సంపుటాలుగా ఆయన రచించిన భారతంలోనూ ఈ విమర్శనాత్మకతను స్పష్టిగా గుర్తించవచ్చు. భారతంలోని ఉదంకుని కథను తీసుకుని రాసిన 'శ్రమ ఏవ జయతే అనేది ప్రత్యేకంగా గుర్తించవలసిన పద్య నాటిక. చరిత్ర విషయంగా ఆయన ఆసక్తి 'బుద్ధుడు, జీసస్, గాంధీ"; ఛత్రపతి శివాజీ వంటి రచనలలో నిశితంగా కన్పిస్తుంది. ఆయన రచనల విశ్లేషణ కాదు గాని ఆయన తెలుగు పద్యం కోసం నిర్వహించిన ఉద్యమం ఇటీవలి సంవత్సరాలలో సాహిత్య రంగంలో సంచలనం కలిగించింది. ఆయన మిత్రులతో కలిసి నిర్వహించిన ఈ ఉద్యమం దేశమంతటా వ్యాపించింది. కొందరు పద్య శత్రుత్వాన్ని వ్యాపింపజేస్తున్న సందర్భంగా పద్యశిల్పాన్ని గూర్చి ఆకాశవాణిలో ధారావాహికంగా "రూపకో' నిర్వహణ చేయటం, అనేక సభలూ సమావేశాలూ నిర్వహించటం చూస్తే ఈ వయస్సులోనూ ఆయనలో ఉద్యమోత్సాహం ఏ మాత్రం తరిగిపోలేదనటానికి నిదర్శనం. అధికార భాషా సంఘానికి ఆయన అధ్యక్షులు కావటం వంటివి ఆయన జీవితం తెలిసిన వారికి చాలా చిన్న విషయం. ఆయన ఏ గౌరవాలకోసం పాటుపడలేదు. ఆయన సాహిత్యం కోసం పాటుపడ్డారు. మనుషుల్లో మానవత్వం కోసం ఆరాటపడ్డారు. మైత్రి కోసం ప్రేమకోసం, అన్ని విషయాల్లో సామరస్యం కోసం జీవిత మంతా తన సాహిత్యం - వ్యక్తిత్వంతో ప్రయత్నించారు. అట్లాంటి ఉదార కవితా సౌమనస్యాన్ని సాధించిన ఆచార్యుల వారు పరమ పదించారన్నది గుండెను వణికించ కుండా ఎట్లా ఉంటుంది. ఆయనకు శ్రద్ధాంజలి సమర్పిస్తూ, ఆయన మరణా మంగళా శాసనంలో చివరి పద్యాన్ని గుర్తుచేసుకుంటున్నాను.

**అంతము చెందు నీ భువి సమస్తము - సృష్టియె దిగ్గి గంత వి**
**శ్రాంత మశాశ్వతమ్ము రవి చంద్రుల తోడు మనుష్యు చావు ఓ**
**వింత ఉదంతమా! వేదన లెందుకు? సర్వ తాప ని**
**ష్కాంత మవశ్య మంగళము, చావోక సృష్టి వరప్రసాదమే.**

- కోవెల సంపత్కుమారాచార్య


ఆంధ్రప్రభ ఆదిత్య హృదయం ఆదివారం 13 జూలై 2003

జందెము నేలగొట్టిన నవయుగ వైతాళికుడు

నండూరి

# జందెము నేలగొట్టిన నవయుగ వైతాళికుడు- నండూరి.

ఆంధ్రప్రభ ఆదిత్యహృదయం (13 జులై 2003)

“జందెము నేలఁగొట్టి, జప జాడ్యము లెల్లను పూడ్చి పెట్టి, మేమందరమున్ సమానమని, మానవ కేతన మెత్తిపట్టి, ఆనందము నొందు 'నండురికి' నా హృదయాబ్దము గోసి యిత్తు. నేనుందునె యిట్టిరీతి, ఒక ఊపున బ్రాహ్మణ జన్మనెత్తినన్.”

జందెము నేలగొట్టాడు. జపాలు, తపాలు పూడ్చి పెట్టాడు. మానవ కేతన మెత్తి పట్టాడు. తెలుగు తల్లికి ముద్దు బిడ్డడై, భరతమాతకు బంగారు కొండయై, నవ యుగ వైతాళికుడై పయనం సాగించిన 'నండూరి రామకృష్ణమాచార్య' గారి జీవితం 'విలసన్మంజుల భావపూరిత విన్యాస మైంది:-

"మనిషి వెడల వచ్చు మాతృభూమిని వీడి మసలు మనసులోన మాతృభాష” అన్న నండూరి పద్యం అక్షర సత్యం. అతను తెలుగుతల్లి ముద్దు బిడ్డడు అనుటకు అద్దం పట్టిన తార్కాణం, నిదర్శనం.

**"తెలుపు స్వచ్ఛమైన తేజస్సునకు గుర్తు**
**పంట పొలుపు తెలుపు, పచ్చరంగు**
**తలప ఎరుపు రంగు త్యాగరక్తము గుర్తు,**
**ఎగురు మా ధ్వజమ్ము గగనమందు.'**

అన్న నండూరి ‘జాతీయ పతాకం' పద్యం అతను భరతమాతకు బంగారు కొండ అని నిరూపిస్తుంది.

**“నేను నాస్తికుడను గాను జీవితములో**

**మంచితనము మీద మమతగలదు**
**మతము మీద గాక మానవత్వముపైన**
**కలదు గొప్ప నమ్మకమ్ము నాకు".**

మతము పైనగాక మానవత్వముపైనే నాకు గొప్ప నమ్మకమని నండూరి పద్యంలో నిక్కర్షగా నినదించాడు.

**"మతము కులాది వర్గములు మాపును దృష్టిని సంఘమందు**
**మంచితనము మానవత్వము నశింపగ జేయును.**
**సర్వదా జగ ద్ధితమును కోరునట్టి నరుడే నిజమైన నరుండు**
**ధాత్రి ధన్యత మానవుండు వసుదైక కుటుంబిగ నిల్వగల్వేటే"**

అన్న నండూరిగారి పద్యం మతాలు కులాల పాచికలతో ఆడుకునే వారికి కన్ను విప్పు.

**"మెదడులోన మార్క్స హృదిలోన**
**బుద్ధుడై విప్లవమ్ము కరుణ రంగరించి**
**పుట్టుగాక సుకవి భువ నైక పౌరుడై**
**ప్రగతి కొరకు నూత్న జగతి కొరకు."**

పై పద్యం కవి సుకుమార హృదయాన్ని, సునిశిత మనస్తత్వాన్ని తెలుపు' తుంది.

**"పాఠశాల లేక ప్రథమ వైద్యము లేక**
**బస్సు లేక మంచి బాట లేక**
**త్రాగునీరు లేక గ్రంథాలయము లేక**
**ఒక్క ఊరు గూడ ఉండ రాదు."**

`పై పద్యం 'నండూరి' విశ్వ శ్రేయస్సును కోరే విశ్వ కవి అని చెప్పక చెపుతుంది.

**"ఈ ధరిత్రి మేటి మేధావులెందరో**
**కరుణ యున్నవారు కలరు. నేడు**
**తలప రేల? ఏకధరణీ ప్రభుత్వమ్ము**
**వసుధ కెల్ల ఐక్యపార్లమెంటు.'**

ప్రపంచానికి ఒకే ప్రభుత్వం ఉండాలని ప్రపంచ పార్లమెంటును కోరుకొన్న విశ్వవిఖ్యాత కవి నండూరి. నండూరి వారి రచనలలో 'శీర్ణ మేఖల' కీర్తి

కిరీటం. అందులోని పద్యాలు నండూరి చేయి తిరిగిన కవి అని చాటి చెప్పుతాయి.

**క్వణదణు కింకిణీ కలిత కాంచన మేఖలయై, ఝుళంఝుళ**
**న్మణిమయశింజినీ ధ్వనులు మార్మొగమై విదలించె ఆమె కొం**
**గును; అపరంజి కాంచి తెగి కూలెను కర్ణుని హస్తవేగ చా**
**రణమున, హేమరత్నమణిరంజిత కోమల కుట్టిమమ్మునన్.**

నండూరి వారికి నచ్చిన పద్యం, తను వ్రాసుకొన్నదే ఇంటిలో తగిలించారు. అదేంటంటే,

**"క్షామము దాపురించి పలుమారులు చచ్చెను జంతు సం**
**తతుల్ వేమరు చచ్చినారు ప్రజవేలకు వేలు ధరిత్రి లోపలన్,**
**క్షామము లెన్ని వచ్చిన రసజ్ఞత యించుక చావలేదు జ్ఞా**
**నామృత వృష్టి కిన్ కొరత నందని రాయలసీమ లోపలన్".**

రాయలసీమలో రసజ్ఞత, కవితా జిజ్ఞాస ఎంత గొప్పవో నండూరి పై పద్యంలో చక్కగా వర్ణించారు. నదులన్నింటినీ అనుసంధానం చేసి మాతృదేశాన్ని సస్యశ్యామలం చేయాలని, అట్లు చేయలేనివారు బుద్ధి హీనులని ఈ క్రింది విధంగా పద్యాలు వ్రాశారు.

**"కరవు నీటి కొరత వరద భీభత్సమ్ము**
**ఏక కాలమందె ఎచట నుండు?'**
**బుద్ధిహీను లేలు పుడమి లోపలగాక**
**మార్చలేని దేది మనిషి యందు?**
**చెరువు లెల్లనింపు భరతదేశము నందు**
**ఊరు ఊర"త్రాగు నీరు" చేర్చు**
**పడుగు పేకవోలె పంటకాల్వలు త్రవ్వి**
**నదులు కలుపు ప్రజల హృదులు కలుపు."**

చివరగా కవిగారు నండూరి వారు 'మరణ మంగళా శాసనం' చేశారు. అందులోని పద్యాలు కవి యోగదృష్టిని తెలుపుతాయి.

**"మరణ సమయమందు**
**మధురగానము చాలు**
**వద్దు మందులేవి వాడవద్దు.**
**ఏ గతించినప్పు డేద్వారా దెవరేని**
**ఏడ్పు అనిన నాకు ఏవగింపు. "**

**"మైల పట్టవద్దు మంత్ర తంత్రము వద్దు".**
**"జరుప వద్దు నాకు శ్రాద్ధ కర్మలనేవి**
**వద్దు పెట్టవద్దు తద్దినాలు"**
**"ఏది పూర్వజన్మ మెట పునర్జన్మమ్ము"**
**"భార్య ముగ్గరాదు పసుపు కుంకుమవీడి"**

మరణ మంగళాశాసనం చేసిన మహామనీషి. యుగ కవి నండూరి. జీవితంలో అందరితో కలసి పోతూ, అందరినీ చేరదీస్తూ, పంతులుగా, ప్రిన్సిపాలుగా, అధికార భాషా సంఘం అధ్యక్షునిగా, ఆంధ్రపద్య కవితా సదస్సు అధ్యక్షునిగా ఎన్నో పదవులు నిర్వహించారు. 'సాహిత్య అకాడమీ అవార్డు' 'జాషువా పీఠం అవార్డు' దాశరథి అవార్డు, కరుణశ్రీ అవార్డు మొదలైన సన్మానాలనంది, అనేక శిష్య పరమాణువులను తయారుచేసికొని పద్యం కోసం ప్రాణం పోసిన పద్య కవి. హృద్య కవి. నండూరి కన్ను మూయడం తెలుగు కవితా లోకానికి తీరని లోటు. స్వర్గసీమకు తీరిన లోటు.

**- పాడేటి జాన్సన్**



వార్త మంగళవారం 8, జూలై 2003

'హృదయ మమృత సముద్రము,
వదనము కవితా లతాంగికి నర్తనశాల,
సదన మతిథికోటికి నాటి ఋష్యాశ్రమము,
విశాల వసుధా కుటుంబి నా సాటి నీవె'-

ఈ పద్యం నండూరి రామకృష్ణమాచార్యులపై వారి శిష్యులు శనగన నరసింహస్వామి చెప్పినది. ఈ పద్యం రామకృష్ణమాచార్యుల స్వరూప, స్వభావాలకు అద్దం పడుతుంది. ఆయన మహాకవి. శీర్ణమేఖల అనే ఖండిక వారికి గొప్ప ఖ్యాతి నార్జించిపెట్టింది. పండితుడు, పరిశోధకుడు, రూపక కర్త, శిష్యవత్సలుడు, అధికార భాషాసంఘ మాజీ ధ్యక్షులు, గాంధేయవాది. విశ్వప్రేమ మూర్తి రామకృష్ణమాచార్యులు నేడు భౌతికంగా మన ముందు లేరంటే దిగ్భ్రాంతికరంగా ఉంది.

రామకృష్ణమాచార్యులు 1921 ఏప్రిల్ 29న

'విశాల వసుధా కుటుంబి'

సిద్ధాంత గ్రంథానికి డాక్టరేటు లభించింది. రామకృ... చక్కని కావ్యాన్ని సంతరించారు. అది వారికి

ను తెలుగులోనికి అనువాదం చేశారు.

చరిత్రపై మక్కువ

రామకృష్ణమాచార్యులకు చరిత్రపై అభిమానం మెండు. ఆయన ఆనర్స్ చదివే రోజుల్లో దక్షిణ భారతదేశ చరిత్ర అధ్యయనం చేశారు. ఫలితంగా 1966లో 'ప్రాచీన దక్షిణ భారతదేశ చరిత్ర' రచించి ప్రకటించారు. ఆంధ్రుల సంస్కృతిపై ఆయనకు ఎనలేని మక్కువ. అందువల్లనే 1976లో 'ఆంధ్ర సంస్కృతి వికాసము' అనేపేరుతో ప్రకటించారు. 'కావ్యాలోకం' రామకృష్ణమాచార్యుల రచనలలో ఒకటి. తెలుగు పద్యం పుట్టిన దగ్గరనుండి అనేక మహాకవులు రాసిన పద్యాలతో 'పద్యశిల్పం' ప్రకటించారు. బుద్ధచరిత- ధమ్మపదము, వెలుగుబాట వీరి ఇతర రచనలు. భీమవరంలో పాలగుమ్మిప ద్మరాజుతో కలిసి 'మహాంధ్ర' అనే పత్రిక కొంత

# విశాల వసుధా కుటుంబి

(వార్త మంగళ వారం 08 జులై 2003)

**"హృదయ మమృత సముద్రము,**
**వదనము కవితా లతాంగికి నర్తనశాల,**
**సదన మతిథికోటికి నాటి ఋష్యాశ్రమము,**
**విశాల వసుధా కుటుంబి నా సాటి నీవె"**

-ఈ పద్యం నండూరి రామకృష్ణమాచార్యులపై వారి శిష్యులు శనగన నరసింహస్వామి చెప్పినది. ఈ పద్యం రామకృష్ణమాచార్యుల స్వరూప, స్వభా వాలకు అద్దం పడుతుంది. ఆయన మహాకవి శీర్ణమేఖలఅనే ఖండిక వారికి గొప్ప ఖ్యాతి నార్జిం చిపెట్టింది. పండితుడు, పరిశోధకుడు, రూపక కర్త, శిష్యవత్సలుడు, అధికార భాషాసంఘ మాజీ ధ్యక్షులు, గాంధేయవాది. విశ్వప్రేమ మూర్తి రామకృష్ణమాచార్యులు నేడు భౌతికంగా మన ముందు లేరంటే దిగ్భ్రాంతికరంగా ఉంది. రామకృష్ణమాచార్యులు 1921 ఏప్రిల్ 29న పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం తాలూకా లోని అగ్రహార గోపవరంలో జన్మించారు. తల్లి వెంకటమ్మ. తండ్రి శోభనాద్ర్యాచార్య, ఆయన కానుమోలు గ్రామకరణం. స్వాతంత్ర సమరయోధుడు, ఆత్మకూరి గోవిందాచార్యులు నండూరి వారి మేనమామ. బాల్యంలో రామకృష్ణమాచార్యులు కోరుకొండలో తెలికిచెర్ల కందాళై గోపాలాచార్యులు దగ్గర సంస్కృతం, పంచకావ్యాలు, కౌముది అభ్య సించారు. మరింగంటి వేంకటాచార్యుల దగ్గర ఆంగ్లం నేర్చారు. ఏలూరు మునిసిపల్ హైస్కూ లులో ఎస్ఎస్ఎల్సి ఉత్తీర్ణులయ్యారు. విజయ వాడ ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివారు. అక్కడ కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారా యణ ప్రియతమ శిష్యుడయ్యారు. కవిత్వంలో విశ్వనాథని మెప్పించిన విద్యార్థి శిఖామణి రామకృష్ణమాచార్య. తర్వాత ఆంధ్ర విశ్వవిదా యంలో తెలుగులో బిఏ(ఆనర్స్) చదివారు. ఆ రోజుల్లో తెలుగు విద్యార్థులు విధిగా ఆంగ్లం కూడా చదవాలి. నండూరి ఇంగ్లీషులో

ప్రప్రథముడుగా ఉత్తీర్ణులయ్యారు. వారికి సర్ జార్జ్ స్టాన్లీ ప్రైజ్ లభించింది. ఆనర్స్లో నండూరి గురువులు- చెళ్ళ పిళ్ళ వెంకటశాస్త్రి శిష్యుడైన పింగళి లక్ష్మీకాంతం, ప్రఖ్యాత వ్యాకరణ శాస్త్ర పండితుడు వఝల చిన సీతారామశాస్త్రి, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి, దక్షిణ భారత చరిత్ర బోధించిన గొర్తి వెంకటరావు, శాసనాల శర్మ, మల్లంపల్లి సోమశేఖరశర్మ.

## వృత్తి, ఉద్యోగాలు

ఆ తర్వాత రామకృష్ణమాచార్యులు గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఉపన్యాసకుడిగా ఒక సంవత్సరం పనిచేశారు. మద్రాసు యూనివర్సిటీలో తిక్కనపై కోరాడరామకృష్ణయ్య పర్యవేక్షణలో పరిశోధన ప్రారంభించి 1945 వరకు కొనసాగించారు. కాని ఆపరిశోధన పూర్తికాలేదు. ఆయన అనంతపురం ప్రభుత్వ కళాశాలలో పనిచేసే కాలంలో మైసూరు విశ్వవిద్యాలయంలో కె. సుబ్బరామప్ప నిర్దేశకత్వంలో తిక్కన భారత దర్శనం' అనే సిద్ధాంత గ్రంథానికి డాక్టరేటు లభించింది. రామకృ ష్ణమాచార్యులు భీమవరంలోని ది వెస్ట్ గోదావరీ భీమవరం కాలేజీలో ప్రాచ్యభాషా శాఖాధికారిగా పనిచేశారు. పిమ్మట ఆయన విద్యాశాఖలో గెజిటెడ్ లెక్చరర్గాచేరి అనంతపురం ప్రభుత్వ కళాశాల ఆంధ్రశాఖాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రిన్సిపాల్గా తాడేపల్లిగూడెం సమీపంలోని పెంటపాడు. డిఆర్ గోయంకా ప్రభుత్వ కళాశాలలో పనిచేశారు. తరువాత హైదరాబాదులో ఎస్సిఇఆర్టిలో రీడర్ గా పనిచేశారు. పిమ్మట విశాఖలో డా.వి. యస్. కృష్ణ కళాశాలలో, కాకినాడ పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాలలో పనిచేసి 1976లో పద వీవిరమణ గావించారు. తరువాత రామకృష్ణమాచార్యులు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నేషనల్ యుజిసి ప్రొఫెసర్గా, తిరుమల-తిరుపతి దేవస్థానం రచనల ఎడిటర్గా, ధర్మప్రచారక పరి షత్ స్పెషల్ ఆఫీసర్ గా, ఆ తరువాత 1987లో అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ , ఆంధ్రపద్యకవితా సదస్సు రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా చివరివరకు కొనసాగారు.

## కవితా వ్యాసంగం

శ్రీ రామకృష్ణమాచార్యులు హృదయాన్ని రంజింప చేసే కవితా ఖండికలు రచించారు. అందు శీర్ణ మేఖల అద్వితీయం. భారతీయ భాషలలోనికి, ప్రపంచభాషలలోకి అనువాదమై వారికి ఎనలేని కీర్తి తెచ్చిపెట్టింది. నిజకాంతుడులేని సమయంలో "భానుమతి ఏకశయ్యాంతరవర్తియై కర్ణునితో చదరంగమాడడంచూచి తారలు పుల్కరించాయట. ఏమి సుందర కవిత! 'ఎంతటి మాట! హస్తినగరే శ్వరు పట్టపు రాణి యట్టులే/ కాంత గృహమ్ము లోన నిజకాంతుడు లేని నిశీధి ఏక శ/ య్యాంతర వర్తియై

తమిని అన్యునితో చదరంగ మాడు నా! వింతను తొంగిచూచె వినువీధిని తారలు పుల్కరిం చుచున్' – శీర్ణమేఖల.

రామకృష్ణమాచార్యులు 'ఆలోచనము' అన్న పేరుతో సుమారు రెండువేల ఆటవెలది పద్యాలతో చక్కని కావ్యాన్ని సంతరించారు. అది వారికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇందలి హాస్యరస స్ఫోరకమైన రెండు పద్యాలు- 'ఏను తరచు మార్చి నాను- ఉద్యోగముల్/ ఊళ్ళు- ఇళ్ళు- కార్లు- కళ్ళ జోళ్ళు/ మార్చినాడ నన్ని- మా శ్రీమతిని తప్ప/ మధుర కవిత మీది- మమత తప్ప'- ఈ గ్రంథర చనవల్ల వారు అభినవ వేమనయైనారు. రామకృ ష్ణమాచార్యుల తారాతోరణము ఒక ప్రసిద్ధ ఖండకా వ్యం. అమరజీవులు (బుద్ధుడు క్రీస్తు-గాంధి) ప్రగ తిగీత- కవితా ప్రభాస- కవితా సంహిత- ముత్యాల గొడుగు- మానససరసి మొదలైన పద్య కావ్యాలు రచించారు.

ఈయన పలు నాటికలు కూడా రచించారు. అవి వందల కొలది ప్రదర్శనలకు నోచుకొన్నాయి. వాటిలో ఛత్రపతి శివాజీ, ఉరికంబం, శ్రీకృష్ణదే వరాయలు, ధర్మచక్రము (చారిత్రక నాటకాలు). త్యాగరాజు భక్తిరసపూరితమైన నాటిక. తెలుగు గడ్డ వ్యంగ్యనాటిక. మరణాంతకము, అభినవ కురుక్షేత్రము హాస్యనాటికలు. జ్యోత్స్నాభిసారిక, గోదావరి, శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి, శ్రమయేవజ యతే నృత్యనాటికలు. కాళిదాసు రచించిన 'సంస్కృత నాటకం 'విక్రమోర్వశీయము'ను తెలు గులోనికి అనువదించారు. రామకృష్ణమాచార్యులు ప్రఖ్యాత పరిశోధకుడు, విమర్శకుడు. ఆయన తిక్కన భారత దర్శనము అనే పరిశోధనా గ్రంథం ప్రకటించారు. కవిత్రయము- తిక్కన, ఆంధ్రసాహిత్యము- తిక్కన మహాయుగము అనే గ్రంథాలు రచించారు. ఆంగ్లంలో సరళ సుందర మైన భాషలో ఆయన రాసిన 'ది మహాభారత్' అనే గ్రంథాన్ని టిటిడి ప్రచురించింది. ది గాంధి యన్ యేరా అనే గ్రంథాన్ని 'విజ్డ్మ ఆఫ్ ది 'వరల్ ఇంగ్లీషులో ప్రచురించారు.

రామకృష్ణమాచార్యులు హైస్కూలు విద్యార్థు లకు తెలుగు దళవాయి' నవలను రచించారు. ఇది ఆరవీడు వంశానికి చెందిన వెంకటపతి రాయల దగ్గర ఉన్న తెలుగు దళవాయి యాచమనాయకుడి కథ. ఆయన టేల్స్ ఆఫ్ జెంగీ అనే జపానీస్ నవలను తెలుగులోనికి అనువాదం చేశారు.

## చరిత్రపై మక్కువ

రామకృష్ణమాచార్యులకు చరిత్రపై అభిమానం మెండు. ఆయన ఆన ర్స్ చదివే రోజుల్లో దక్షిణ భారతదేశ చరిత్ర అధ్యయనం చేశారు.

ఫలితంగా 1966లో 'ప్రాచీన దక్షిణ భారతదేశ చరిత్ర రచించి ప్రకటించారు. ఆంధ్రుల సంస్కృతిపై ఆయనకు ఎనలేని మక్కువ. అందువల్లనే 1976లో 'ఆంధ్ర సంస్కృతి వికాసము' అనేపేరుతో ప్రకటించారు. 'కావ్యాలోకం' రామకృష్ణమాచార్యుల రచనలలో ఒకటి. తెలుగు పద్యం పుట్టిన దగ్గరనుండి అనేక మహాకవులు రాసిన పద్యాలతో 'పద్యశిల్పం' ప్రక టించారు. బుద్ధచరిత- ధమ్మపదము, వెలుగుబాట వీరి ఇతర రచనలు. భీమవరంలో పాలగుమ్మిప `ద్మరాజుతో కలిసి 'మహాంధ్ర' అనే పత్రిక కొంత కాలం నడిపారు. డా॥ సి. జాకబ్ నండూరి 'ఆలో చనము' కావ్యంలోని 40 పద్యాలను 'రాండమ్ థాట్స్' పేరుతో ఇంగ్లీషులోకి అనువదించారు. ధియోడోర్ నండూరివారి 'శీర్ణమేఖల'ను ఇంగ్లీషు లోనికి అనువదించారు.

నండూరి రచనలపై డా॥ మునిరత్నం (శ్రీ వెంక టేశ్వర విశ్వవిద్యాలయం) డా॥ వింజమూరి లక్ష్మి. (పిహెచ్ నాగలక్ష్మి (ఎంఫిల్)లు పరిశోధనా గ్రంథాలు వెలయించారు. బొమ్మకంటి శ్రీనివాసా చార్యులు 'ఓవరి', ఆశావాది ప్రకాశరావు మెరుపు తీగెలు, డా॥నందుల గోపాలకృష్ణమూర్తి ఋతు సంహిత, డా॥ మలయశ్రీ హృదయ స్పందన, నరహరిరాజు స్నేహసుధ, భాస్కర చౌదరి, జి. చెన్నయ్య కృష్ణశాస్త్రి కవిత్వం, ఎన్స్. శేషాచార్యకవి కలుపుమొక్కలు, ఉషశ్రీ, కె. వీరభద్రాచారి రాగ హృదయం, కొర్లపాటి శ్రీరామమూర్తి నన్నెచోడుని కుమారసంభవం అనే తమ రచనల్ని రామకృష్ణమాచార్యులకు అంకిత మిచ్చారు. ఆంధ్రదేశంలో లబ్ధ ప్రతిష్టులైన కవులు, పండి తులు విద్యావేత్తలు నండూరి వారి శిష్యులే. వారికి జరిగిన అనేక సన్మాన సభలలో శిష్యులు బ్రహ్మ -రథం పట్టి, గండపెండేర సన్మానం, సింహత లాటాలు, అంగుళీకాలు మొదలైనవెన్నో బహూక రించారు. రామకృష్ణమాచార్యులు సహస్ర చంద్ర దర్శనం చేసుకుని కేశం లేని జీవితాన్నిగడువుతూ 2003 జూన్ 6న పరమపదించారు. భౌతికంగా వారీ నాడు లేకపోయినా వారి రచ నలు ప్రజలను ప్రగతి పధాన పయనింపచేయగలవు.

*(ఆదివారంనాడు మరణించిన నండూరి రామకృష్ణమాచార్యులకు నివాళిగా)*

**రాపాక ఏకాంబరాచార్యులు, హైదరాబాదు**

# పాండిత్యానికి పెద్ద దిక్కుగా భాసిల్లిన మహాకవి

## కీ॥శే॥ నండూరి రామకృష్ణమాచార్యులు గురించి

## యువకవి ఆచార్య ఫణీంద్రతో ముఖాముఖి

## పరిచయకర్త: శిష్ట్లా వెంకట్రావు, యలమంచిలి

**శిష్ట్లా వెంకట్రావు:** *సాహితీకౌముది జూలై 2004 సంచికను ఆంధ్రపద్యకవితాసదస్సు దివంగత అధ్యక్షులు, మహాకవి డా. నండూరి రామకృష్ణమాచార్య ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాను. నండూరి రామకృష్ణమాచార్యుల జీవిత చరమాంకంలో ఒక దశాబ్ద కాలంపాటు ఆయన ప్రియశిష్యులుగా ఎంతో సన్నిహితంగా మెలగిన మిమ్మల్ని ఈ సందర్భంగా ఆయన గురించి విశేషాలడిగి మా పాఠకులకు అందించాలని కోరుకుంటున్నాను.*

*ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో నండూరి రామకృష్ణమాచార్య గారికి గల ప్రత్యేక స్థానాన్ని గురించి వివరించండి.*

**ఆచార్య ఫణీంద్ర:** నలభై ఏళ్ళ క్రితం కేంద్ర సాహిత్య అకాడమీ CONTEMPORARY INDIAN LITERATURE అన్న గ్రంథాన్ని ప్రచురించింది. దానిలో తెలుగు సాహిత్య విభాగానికి చెందిన పుటలలో ఇలా ఉంది -

"Within recent years, one notices the beginning of a new movement, the return of classicism. The Neo-Classicists like Nanduri Krishnamacharyulu, Jandhyala Papayya Sastry and G.Jashua are questioning the values of Surrealism of the years from 1935 to 1960. Harmony, instead of strife is their ideal. They are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true."

దీనిని బట్టి ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో ఒక నవ్య సాంప్రదాయవాదిగా మా గురువుగారు నండూరి రామకృష్ణమాచార్యుల విశిష్ట స్థానం సుస్పష్టం. అందులో గురువుగారి పేరు జంధ్యాల పాపయ్య శాస్త్రి కన్న ముందు పేర్కొనబడడం గమనార్హం.

ఆపైన గురువుగారు రచించిన 'ప్రగతిగీత' కావ్యానికి పీఠిక వ్రాసిన ఆచార్య గంటి సోమయాజి - "Dr. Krishnamacharya is a future tense amongst the modern poets. Telugu Literature will reserve a coveted place for him amongst the galaxy of the illustrious poets of Andhra" అని పేర్కొన్నారు. నండూరి వారు ఒక ద్రష్టగా ఆధునిక తెలుగు కవులందరి కన్న మెట్టు పైన నిలుస్తారన్న సోమయాజి గారి ప్రశంస అతిశయోక్తి కాదు. ఈ సందర్భంగా ఆచార్యుల వారి గురించి కట్టమంచి రామలింగారెడ్డి గారి వ్యాఖ్యను స్మరించుకోవాలి.

"Dr. Krishnamacharya's style is a confluence of the old & new and is the best blending of the east and west literary outlooks"

నిజమే! గురువుగారు ప్రాచీనత, నవ్యతల మధ్య ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాల మధ్య సమన్వయం సాధించిన మహాకవి. అందుకే...

**"మెదడులోన మార్క్సు, హృదిలోన బుద్ధుడై**
**విప్లవమ్ము కరుణ వింగడించి**
**వ్రట్టవలయు సుకవి భువనైక పౌరుడై**
**ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు!"**

వంటి పద్యాలు రచించడం గురువుగారికి తప్ప అన్యులకు సాధ్యం కాదు.

**శిష్ట్లా:** *నండూరి వారి బాల్యం, విద్యార్థి దశలను గురించి వివ రించండి.*

**ఫణీంద్ర:** నండూరి వారు కింది స్థాయి మధ్యతరగతి వైష్ణవ కుటుంబంలో జన్మించారు. అయితే వారి మేనమామ ఆత్మకూరి గోవిందాచార్యులు సంపన్నులు, మంచి కవి. 'గోవింద రామాయణ' కర్తగా సుప్రసిద్ధులు. గురువుగారు ఆయన సంరక్షణలోనే ఉన్నత విద్యను అభ్యసించారు. విద్యార్థి దశలో గురువుగారు కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. పది పదిహేను రోజులు జైలుశిక్ష అనుభవించినట్టుగా కూడా చెప్పారు. కొన్నాళ్లు వార్ధా ఆశ్రమంలో గాంధీగారికి సన్నిహితంగా మెలిగారు. గాంధీగారు మద్రాసు విచ్చేసినపుడు ఆయనకు సభాముఖంగా పద్యాలతో స్వాగతం పలికారు.

స్వాతంత్ర్యనంతరం గురువుగారు ఉన్నత విద్యను పూర్తిచేసుకొని తెలుగులో మొట్టమొదటి గజిటెడ్ లెక్చరర్‌గా ఉద్యోగం పొందారు. ఆ తరువాత లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా కవిగా ఎందరో విద్యార్థులపై తన ప్రభావం చూపి, స్ఫూర్తిని కలిగించారు.

**శిష్టా్ల:** *నండూరి రామకృష్ణమాచార్యులు గారి ముఖ్య రచనలను పేర్కొనండి.*

**ఫణీంద్ర:** గురువుగారి ప్రతిభ త్రివేణీ సంగమమై ప్రవహించింది. ఒకటి పద్యకవిత - 'తారాతోరణం', 'ప్రగతిగీత', 'కవితా సంహిత', 'మానస సరసి', 'కచ్ఛపి కింకిణీకం' అన్న గ్రంథాలు ఈ శాఖకు చెందిన గ్రంథాలు. రెండు నాటక రచన - 'ఛత్రపతి శివాజీ', 'ధర్మచక్రం', 'శ్రీకృష్ణదేవరాయలు', 'విక్రమోర్వశీయము', 'గోదావరి', 'జ్యోత్స్నాభిసారిక', 'వాసవికన్యక', 'శ్రమయేవ జయతే', 'ఉరికంబం', మొదలైనవి నాటక రచనలు. మూడవ విభాగంలో చరిత్ర మరియు విమర్శ గ్రంథాలు పేర్కొనవచ్చు. ఇవన్నీ వచన గ్రంథాలు. 'కావ్యలోకం', 'ప్రాచీన దక్షిణ భారత చరిత్ర', 'కవిత్రయము', 'తిక్కన భారత దర్శనము', 'ఆంధ్ర సంస్కృతి వికాసము', 'పద్యశిల్పం', 'గెంజి గాథ', 'అమర జీవులు', మొదలైనవి తెలుగు గ్రంథాలు. ఆంగ్లంలో Maha Bharata, Gandhian Era, Wisdom of the world మొదలైన గ్రంథాలను రచించారు. ఆవిధంగా గురువుగారు బహుముఖ ప్రజ్ఞతో బహుగ్రంథకర్తగా రాణించారు.

**శిష్టా్ల:** *'తారాతోరణం' గ్రంథ విశిష్టతను వివరించండి.*

**ఫణీంద్ర:** 27 తారలున్నట్టు ఇందులో 27 కవితలుండటం.

గురువుగారు రచించిన తొలి గ్రంథం అది. 1949లో అచ్చయింది. తెలుగు సాహిత్యంలో జాషువా, కరుణశ్రీలతో బాటు మహోన్నత ఖండకావ్యకర్తగా గురువుగారికి ప్రత్యేక స్థానం సంపాదించి పెట్టింది. అందులోని ప్రతి కవిత ప్రత్యేక వైశిష్ట్యాన్ని సంతరించుకొంది. ముఖ్యంగా అందులోని 'శీర్ణ మేఖల' ఖండకావ్యం తెలుగు సాహిత్యంలోనే ఒక అపూర్వ ఖండకావ్యంగా, ఒక అనన్య సాధ్యమైన అద్భుత కల్పనగా పేరుపొందింది. కర్ణ, సుయోధనుల మైత్రిని రససాంద్రంగా చిత్రించిన ఘనత గురువుగారిది. కౌరవనాథుడు లేని సమయంలో ఆయన భానుమతితో కర్ణుడు చదరంగమాడుతూ

ఆటమైకంలో మధ్యలో లేచిపోతున్న ఆమె కొంగును పట్టి లాగడం, కౌరవేశ్వరుడు చూచినా, స్నేహితునిపై గల అపారమైన నమ్మకంతో ఏమాత్రం అనుమానించకపోవడం - మహాకవి హృదయంలో మెరిసిన మనోహర కల్పన. ఈ అపూర్వ కల్పనను చూచి ఆంధ్ర దేశమంతా అచ్చెరువొందింది. ఆ మహాకవికి ప్రత్యేక గుర్తింపు పట్టింది. ఈ కథనం అలా అలా పాకి, గురువుగారికి తెలియకుండానే 1960 దశకంలో నిర్మించబడిన సినిమా 'కర్ణన్'లో కూడా చేరింది. అది 'కర్ణ' పేరుతో తెలుగులోకి 'డబ్' అయి విజయవంతంగా ప్రదర్శించబడింది. సాహిత్య రసజ్ఞులు 'నండూరి రామకృష్ణమాచార్య' అనగానే 'కర్ణుడు గుర్తుకొస్తుంది' అంటారు. ఒక్క కవితా ఖండికతోనే ఇంతటి కీర్తి ఆర్జించుకోవడం బహుశః ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అరుదైన విషయం. అలాగే ఈ గ్రంథంలోని మరో రసవత్తరమైన ఖండకావ్యం 'అజ్ఞాత కౌంతేయం'. దీని గురించి గురువుగారు నాతో తన గత స్మృతి నొకదానిని చెప్పారు.

కరుణశ్రీ 'కుంతీ విలాపం' రాసి, అఖండఖ్యాతి నార్జించాక, గురువుగారు 'కుంతి కర్ణుని విసర్జించే సన్నివేశం రచించాను. కదా! మళ్ళీ కర్ణుడు ఎదిగాక వాళ్లిద్దరూ మళ్ళీ కలిసే సన్నివేశాన్ని కూడా రచించు' అని ఆయనతో అన్నారట. ఆయన చాలా ప్రయత్నించి ఆ తరువాత 'నా వల్ల కాదు. ఏదీ నువ్వు రాయి చూద్దాం!' అని సవాల్ విసిరారట. వెంటనే మూడు రోజుల్లో గురువుగారు ఆ ఖండకావ్యాన్ని రచించి చూపారట. ఆ తరువాత కొన్నాళ్ళకు గురువుగారి శిష్య ప్రముఖులు 'ఉషశ్రీ' - కరుణశ్రీ గారి 'కుంతీ విలాపం', గురువుగారి 'శీర్ణమేఖల', 'అజ్ఞాత కౌంతేయం' ఖండకావ్యాలను కలిపి 'భారతీయం' అన్న ఒక గ్రంథరూపంలో ప్రచురించారు. 'ఆ రెంటి నడుమ నా కుంతీ విలాపం అణగారిపోయింది' అని కరుణశ్రీ నాతో అన్నారంటూ గురువుగారు నాతో చెప్పినపుడు ఆయన కళ్ళు ఆనందంతో మెరిసాయి.

'తారాతోరణం'లో ఓం శాంతిః శాంతిః శాంతిః అన్న కవిత కూడా ఉత్తమోత్తమ రచన కదా! దాని గురించి, గురువుగారికి కూడా అది మిక్కిలి నచ్చిన రచన, తన యావత్ సాహిత్య జీవితంలో అదే అత్యుత్తమ రచనగా ఆయన భావించారు. నిజమే! ఏభయ్యేళ్ళయినా ఆ కవిత ఇప్పటికీ నిత్యనూతనంగా నిలిచి

మానవాళిని హృదయకంపితులను చేస్తూనే ఉంది మరి! భవిష్యత్తులో అణుయుద్ధం జరిగి మానవజాతి నశిస్తే - ?

**'ఈ పెనుమంటిదిబ్బ వసియించి రొకానొక నాడు మానవుల్**
**పాపము ! శేముషీవిభవపారగులై ప్రకృతిన్ జయించి వి**
**శ్వాపరసృష్టి సల్పి, ప్రళయాంతక బుద్ధిని గుండె లేక ఆ**
**త్మోపహతిన్ వినాశనము నొందిరి యందరు జ్ఞానశూన్యులై.**

**అనుచు- హతశేషమై యంత అవని మిగులు**
**ఏ పిపీలికలో రచియించు కొనును ,**
**కరుణ గీతులను తమ వాఙ్మయములోన!**
**ఇయ్యది అవశ్యభవితవ్య మేమొ మనకు."**

అన్న పద్యాల్లోని దార్శనికత అన్య కవులకు సాధ్యమేనంటారా? 'చీమలు కరుణ గీతులను రచియించుకొనును' అనడం ఒక లలితమైతే 'తమ వాఙ్మయములోన' అనడం ఎంత చమత్కృతి!
ఒక్క విషయం ఇక్కడ మనం గమనించాలి - తెలుగు సాహిత్యంలో అత్యుత్తమ ఖండకావ్యకర్తలుగా జాషువా, కరుణశ్రీలను పేర్కొనాలి. అయితే తెలుగు సాహిత్యంలో అత్యుత్తమ ఖండకావ్య సంకలనంగా మాత్రం 'తారాతోరణం'నే పేర్కొనాలి.

**శిష్ట్లా:** *'క్వణదణు కింకిణీ కలిత కాంచన మేఖల' వంటి సమాసాలతో ప్రౌఢ వృత్తాలను రచించిన నండూరివారు తరువాతి కాలంలో 'ఆటవెలది'పై మక్కువ చూపడానికి గల కారణమేమిటి?*

**ఫణీంద్ర:** 'తారాతోరణం' తరువాత దాదాపు ముప్పైయేళ్ళపాటు గురువుగారు చారిత్రిక, నాటక, విమర్శ గ్రంథాలను వెలువరించారు గాని, కవిత్వ గ్రంథం వెలయించలేదు. 1978లో 'ప్రగతిగీత'తో మళ్లీ గురువుగారి కవన ప్రస్థానం కొనసాగింది. ఆలోపు ఆయన ఆలోచనలో పెనుమార్పు సంభవించింది. 'ప్రౌఢ రచన మణగు గ్రంథాలయాలలో గాలి తేలు తేట కవితలెల్ల' అని నిశ్చయించుకొన్నారు. అభినవ వేమన అవతారమెత్తి 'ఆటవెలది'ని ఆశ్రయించి, ఆనాటి నుండి ఆయన కేవలం కవిగా కాక ఒక ద్రష్టగా, తాత్వికునిగా మారారు. ఎన్నో జీవిత సత్యాలను, లోక రీతులను తర్కించి, మథించి, జీవితానుభవ సారాన్ని పద్యాలరూపంలో

అందించారు. ఇరువయ్యేళ్ళ కాలంలో సుమారు 6,500 ఆటవెలది పద్యాలను రచించారు. అంటే రోజుకు కనీసం ఒక పద్యమైనా రాయకుండా ఆయన నిద్రపోయేవారు కాదన్నమాట. ఆయన పరమపదించేనాటికి రెండు రోజుల ముందు నేను కలసినప్పుడు కూడా ఆయన కొత్త పద్యాలు వినిపించారు. అవిశ్రాంత కవితా వ్యవసాయం ఆయనది.

**"చాలనాళ్ళ బ్రతుకు సమకూర్చెగా నాకు**
**పెక్కు అనుభవాలు విలువగలవి -**
**జగతికిచ్చినాడ చక్రవడ్డీ చేర్చి**
**పద్యరూపమందు భద్రపరచి!"**

**"లేదు దేవుడనెడు వాడెచ్చటను లేదు -**
**అనుచు నొక్కి పలికె నాస్తికుండు**
**లేదు - ధరణిమీద లేదుగా కంసాలి -**
**పసిడి ఉంగరమ్ము బదులు పలికె!"**

**"విత్తనమ్ము నొచ్చు వృక్షమ్ముగా మారి**
**ఆవరింపదలతు ఆకసమ్ము!**
**వీలుకాని ఎడల వేరు విత్తునకైన**
**ఎరువునగుటకేను ఇచ్చగింతు"**

వంటి పద్యాలు ఆయన తాత్త్వికతకు మచ్చుతునకలు. ఆయన పద్యాలన్నీ ఆలోచనాత్మకంగా, అభ్యుదయాత్మకంగా ఉన్నాయి.

**శిష్ట్లా:** *ఆధునిక కవులు వచన కవితలో ప్రకటించే అభ్యుదయాన్ని నండూరి వారు పద్యకవితలో ఎలా సాధించారు?*

**ఫణీంద్ర:** అదే గురువుగారి ప్రత్యేకత - ఈ పద్యం చూడండి.

**"ఎంతమంది చెమట - ఎందరి రక్తమ్ము**
**పీల్చకుండనెవడు పేర్చెధనము?**
**దొరలు చేయునట్టి దోపిడీయే ఆస్తి -**
**అంతరించవలయు ఆస్తిహక్కు!"**

మొత్తం మార్క్సిజం సారాన్ని ఏ మార్క్సిస్టు కవీ ఏ వచన కవితలో ఇంత స్పష్టంగా, క్లుప్తంగా పొందుపరచగలిగాడో చెప్పండి!

**శిష్ట్లా:** *నండూరి వారి పద్యాల్లో సునిశితమైన హాస్యం కూడా తొణికిసలాడేది కదా!*

**ఫణీంద్ర:** అవునండి! ఉదాహరణకు ఈ పద్యాన్ని వినండి.

> **"ఏను తరచు మార్చినాను ఉద్యోగముల్ -**
> **ఊళ్ళు - ఇళ్ళు - కార్లు - కళ్ళజోళ్ళు -**
> **మార్చినాడనన్ని - మా శ్రీమతిని తప్ప**
> **మధుర కవిత మీది మమత తప్ప!"**

ఇలాంటి పద్యాలు కోకొల్లలు.

**శిష్ట్లా:** *నండూరి వారి నాటకాల గురించి చెప్పండి.*

**ఫణీంద్ర:** తెలుగు సాహిత్య జగత్తులో పద్య నాటకాల రచనలో ఇద్దరు రామకృష్ణమాచార్యులు అఖండ ఖ్యాతిని ఆర్జించారు. ఒకరు ధర్మవరం రామకృష్ణమాచార్యులు, మరొకరు నండూరి రామ కృష్ణమాచార్యులు. నండూరివారు ఎప్పుడో ఏబైయ్యేళ్ళ క్రితం రచించిన 'ఛత్రపతి శివాజీ', 'శ్రీకృష్ణదేవరాయలు' వంటి పద్య నాటకాలను ఈ నాటికీ 'సంస్కార భారతి' వంటి సంస్థలు ప్రదర్శిస్తూనే ఉన్నాయి. పద్య నాటకాల వల్ల పద్యం పామరులకు కూడా చేరువై చిరంజీవిగా నిలుస్తుందని ఆయన విశ్వసించేవారు. ఇటీవలే డా. నూనె వెంకటయ్య గారు నండూరి వారి నాటకాలపై పరిశోధన చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. పట్టా పొందారు.

**శిష్ట్లా:** *నండూరి వారి వచన రచనలు ఆయనను ఒక మహామేధావిగా నిలబెట్టాయనవచ్చు. మీరేమంటారు?*

**ఫణీంద్ర:** అవునంటాను. ముఖ్యంగా ఆంగ్లంలో ఆయన రచించిన Gandhian Era, Maha Bharata ఆయనకు ఎనలేని ప్రఖ్యాతిని ఆర్జించి పెట్టాయి. Gandhian Era కు అప్పటి రాష్ట్రపతి డా. శంకర్‌దయాళ్ శర్మగారు పీఠికను సంతరించారు. Maha Bharata చదివి, ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఒక మేధావి గురువుగారి ఇల్లు వెతుక్కుంటూ వచ్చి ఆయనకు పాద నమస్కారం చేసి వేనోళ్ల పొగడటం నా కళ్ళారా చూసాను. ప్రస్తుతం

తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆ గ్రంథం పునర్ముద్రణను చేపట్టారు.

తెలుగులో 1955లో గురువుగారు రచించిన 'కవిత్రయము' గ్రంథానికి తెలుగు భాషాసమితి పురస్కారం లభించింది. ఈ పురస్కారం అప్పటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ గారి చేతులమీదుగా స్వీకరించడం ఒక విశేషం. 'కావ్యాలోకం' గురువుగారి మరొక విశిష్ట రచన. తెలుగు అకాడమీ ప్రచురించిన ఈ గ్రంథం విద్యార్థులకు ఒక కల్పతరువు వంటిది. ఆంధ్ర సాహిత్యానికి మార్గదర్శకం చేసే అనేక వ్యాకరణ, లక్షణాలంకార గ్రంథాల సారాన్ని పిండి ఒక్క గ్రంథంలో పొందు పరిచారాయన. ఆ గ్రంథం వెంట ఉంటే కవులకు సైతం ఇక ఏ లక్షణ గ్రంథం అక్కర లేదని ఆచార్య తిరుమల గారు నాతో స్వయంగా అన్నారు. అదే విషయం నేను గురువుగారితో అంటే - 'అందులో ఒక్క వాక్యం నా స్వంతం కాదుగద!' అని అనడం గురువుగారి వినయ శీలతకు నిదర్శనం. ఆయన తరువాతి కాలంలో రచించిన 'పద్యశిల్పం' గ్రంథం ఆధునిక పద్యకవులకు ఒక మానిఫెస్టో వంటిది. ఇవన్నీ ఒక ఎత్తు - నండూరి వారు కరుణశ్రీ కావ్యాలకు సంతరించిన పీఠికలు మరొక ఎత్తు. చాలా వేదికలపై గురువుగారిని, కరుణశ్రీ గారి కావ్యాలకు పీఠికలు రచించినది ఈయనే అంటూ పరిచయం చేసేవారట. గురువుగారు రచించిన చారిత్రక గ్రంథాలు చరిత్ర విభాగంలో విభిన్న దృక్పథాలను ప్రకటించి ప్రత్యేకతలు సంతరించుకొన్నాయి. కాళిదాసు దేశ కాల నిర్ణయాలపై ఆయన ప్రామాణిక పరిశోధన చేసి చక్కని ఫలితాలను రాబట్టారు. అయితే అది గ్రంథరూపం దాల్చకముందే ఆయన పరమపదించారు.

**శిష్ట్లా:** *నండూరి వారికి లభించిన సత్కారాలు, పురస్కారాలను గురించి తెల్పండి!*

**ఫణీంద్ర:** గురువుగారికి ఇందాక చెప్పినట్టు తెలుగు భాషాసమితి పురస్కారం 1955లో లభించింది. చరమాంక దశలో 2003లో తెలుగు విశ్వవిద్యాలయం పద్య కవితా పురస్కారం లభించింది. అంతకు మించి ఆయన ప్రతిభకు తగ్గ ప్రభుత్వ పురస్కారాలేవీ ఆయనకు రాకపోవడం నిజంగా శోచనీయం. అయితే వివిధ సాంస్కృతిక సంస్థల నుండి, ఆంధ్రదేశంలోని నాలుగు

చెరగులలోని ప్రజలనుండి ఆయనకు లభించని పురస్కారాలు గాని, సత్కారాలుగాని లేవు. హైదరాబాదులో స్వర్ణకంకణం తొడిగారు. పాలకొల్లులో గండపెండేరం అలంకరించారు. వడ్లమన్నాడులో కనకాభిషేకం జరిపించారు. కరుణశ్రీ సాహితీ పురస్కారం లభించింది. దాశరథి సాహితీ పురస్కారం లభించింది. బి.యన్. సాహితీ పురస్కారం లభించింది. ఇలా, ఇంకా.. ఎన్నో.. ఎన్నో. అయితే వీటన్నిటి కన్నా ఆంధ్రుల ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు తనకు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా పిలిచి పెద్ద ఉద్యోగం ఇచ్చినందుకు ఆయన ఎంతో సంతృప్తిని ప్రకటించేవాడు.

**శిష్ట్లా:** *నండూరి వారికి అసంఖ్యాక శిష్యబలం ఉందంటారు. అదెలా సాధ్యమయింది.*

**ఫణీంద్ర:** అటు అత్యుత్తమ అధ్యాపకులుగా, ఇటు సహృదయ కవిశేఖరులుగా నండూరి వారు అసంఖ్యాకంగా శిష్యులను సంపాదించుకున్నారు. ఒక రకంగా చెప్పాలంటే తెలుగు సాహిత్య చరిత్రలో పింగళి లక్ష్మీకాంతం గారి తర్వాత అంతటి శిష్య బలం మళ్ళీ నండూరి వారికే దక్కిందంటే అతిశయోక్తి కాదు. కొర్లపాటి శ్రీరామమూర్తి, ఉపశ్రీ, పోలాప్రగడ సత్యనారాయణమూర్తి, మాడుగుల నాగఫణిశర్మ, వివెల్‌యస్ భీమశంకరం, ఆశావాది ప్రకాశరావు ఇలా ఎందరో లబ్ధప్రతిష్ఠ కవి పండితులు నండూరి వారి శిష్యగణంలో ప్రముఖులు. ఆయన ప్రోత్సాహంతో నాలాంటి పద్యకవులు ఎందరో ఎంతో స్ఫూర్తిని పొందారు. పద్యకవితారంగంలో ఆయన అధిష్ఠించిన గురుపీఠం ఆయన పరమపదించాక భర్తీ చేయ లేనిదిగా మిగిలిపోయింది.

**శిష్ట్లా:** *ఆంధ్ర పద్య కవితా సదస్సు అధ్యక్షులుగా, ఆయన పద్యకవి త్వోద్యమానికి చేసిన కృషిని వివరించండి.*

**ఫణీంద్ర:** 1992లో ఆంధ్ర పద్యకవితా సదస్సు ద్వితీయ వార్షి కోత్సవం విజయవాడలో మీ ఆధ్వర్యంలో జరిగినప్పుడు గురువు గారు అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. కదా! ఆనాటి నుండి ఆయన పద్య కవిత్వ ప్రతినిధిగా ఆంధ్రదేశంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించారు. తెలుగునేల నాలుగు చెరగుల లోని పద్య కవులు

ఆయనను పద్యానికి పెద్ద దిక్కుగా భావించారు. గత దశాబ్ద కాలంలో అసంఖ్యాకమైన పద్యకవితా సంకలనాలకు అత్యుత్తమ పీఠికలను సంతరించి ప్రోత్సహించారు. పద్యకవితా గ్రంథానికి ఆయన పీఠిక ఒక రాజముద్రలా భాసిల్లేది. ఆంధ్ర పద్యకవితా సదస్సు తృతీయ వార్షికోత్సవాలను హైదరాబాదులో శిష్ట్లాగారి సహకారంతో సంయుక్తంగా ఘనంగా జరిపించారు. ఆధునిక పద్యానికి ఎలా రూపుదిద్దాలో, ఎన్నో అపూర్వమైన సూచనలను ఆయన 'పద్య శిల్పం' గ్రంథం ద్వారా సాహితీ లోకానికి అందించారు. ఆధునాతన అభ్యుదయ వస్తువులను సరళంగా, చమత్కృతితో పద్యాలుగా మలచే మావంటి యువకవులను ఆయన ఎంతో ప్రోత్సహించారు. ఆయన మృతి ముఖ్యంగా యువకవుల పాలిట ఆశనిపాతమయింది.

**శిష్ట్లా:** *నండూరి వారితో మీ విశేషానుభవాలేమైనా.*

**ఫణీంద్ర:** 1994లో నేను గురువుగారిని తొలిసారి కలిసినప్పుడు ఆయన వయస్సు 73సంవత్సరాలు. ఆనాటి నుండి ఆయన పరమపదించే వరకు, నేను వారానికి కనీసం ఒకటి రెండుసార్లు, నాలుగయిదు గంటలపాటు ఆయనతో గడపడం విధిగా జరిగేది. కన్యాశుల్కంలో గిరీశం అన్నట్టు గురువుగారితో మాట్లాడడమే ఒక ఎడ్యుకేషన్. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఆయన జీవిత చరమాంకంలోని దశాబ్దకాలంలో ఆయన రచించిన ప్రతి పద్యానికి ప్రథమ శ్రోతగా ఉండే భాగ్యం నాకు కలిగింది. 'ఆలోచనం' గ్రంథం మొదలుకొని, ఆ తరువాత వచ్చిన ప్రతి గ్రంథానికి నేను ప్రూఫును చూసే అదృష్టం నాకు కలిగింది. ఆయన నాపై వర్షించిన వాత్స ల్యం నిజంగా వర్ణనాతీతం. ఆయనను కలవకుండా నాకు ఆది వారం గడిచేది కాదు. ఏ ఆదివారమైన అనివార్యకార్యాలవల్ల ఆయనను కలవకపోతే వెంటనే ఫోను చేసేవారు. చివరికి 6 జూలై 2003 ఆదివారం ఉదయం 11గంటల సమయం గురువుగారిని కలు సు కోవడానికి బయలుదేరబోతున్నాను. ఫోను మోగింది. గురువు గారు పరమపదించారని దుర్వార్త. ఆ రోజుకూడా ఆదివారం కావడం కాలవైచిత్రి.

**శిష్ట్లా:** *నండూరి వారి పేర సాహిత్యపీఠం నెలకొల్పారు కదా! మీరు దానికి కార్యదర్శిగా ఉన్నారు. ఆ పీఠం కార్యకలాపాలను వివరించండి.*

**ఫణీంద్ర:** మంతెన వేంకట సూర్యనారాయణరాజుగారు అధ్యక్షులుగా నేను కార్యదర్శిగా నండూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠం ఏర్పడింది. నండూరి వారి సాహిత్య ప్రచారం చేయడం, విశిష్ట సాహిత్య కృషి సల్పిన కవి పండితులను సత్కరించడం, పేద విద్యార్థులకు, కవులకు ఆర్థిక సహాయం అందించడం వంటి లక్ష్యాలతో ఈ సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించింది. గత మాసం (ఏప్రిల్ 29)న గురువుగారి జయంతిని హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహిత్య పీఠం తరపున ఘనంగా జరిపించాం. ఈ కార్యక్రమంలో డా. ఆశావాది ప్రకాశరావుగారి సాహిత్య కృషికి గుర్తింపుగా సత్కారం. నండూరి వారి రచన 'తిమ్మరుసు స్వగతం' ఏకపాత్రాభినయం డా. అక్కిరాజు సుందరరామకృష్ణ గారిచే నిర్వహించబడింది.

**శిష్ట్లా:** *చాలా సంతోషం. నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం తరపున మీరు మరిన్ని కార్యక్రమాలు జరపాలని ఆకాంక్షిస్తూ 'సాహితీ కౌముది' తరపున అభినందనలు తెలియజేస్తున్నాము.*

**ఫణీంద్ర:** ధన్యవాదాలండి.

🙏 🙏 🙏

*మా గురుదేవులు డా. నండూరి రామకృష్ణమాచార్యులు గారికి - భక్తి పూర్వక శ్రద్ధాంజలి!* - డా. ఆచార్య ఫణీంద్ర.

* * * * *

మన తెలంగాణ
www.manatelangana.news
హైదరాబాద్

# మానవత్వం లేని వ్యక్తిత్వం వ్యర్థం

* ప్రముఖ ఆధ్యాత్మిక శాస్త్రవేత్త విఎస్ఆర్ మూర్తి



**మన తెలంగాణ/గోషామహల్:** మానవత్వం లేని వ్యక్తిత్వం వ్యర్ధమని ప్రముఖ ఆధ్యాత్మిక శా స్త్రవేత్త విఎస్ఆర్ మూర్తి అన్నారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, నండూరి రామ కృష్ణమాచార్య సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయ ంలో ఆదివారం తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాలు 25వ సమా వేశం ఘనంగా నిర్వహించారు. ఆచార్య వంగపల్లి విశ్వనాథం అధ్యక్షతన జరిగి న ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథి హాజరై నండూరి రామకృ ష్ణమాచార్య సాహితీ జీవన ప్రస్థాన ం గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా విఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ మనిషికి డిగ్రీ లు కొలమానం కాకపోయినా, అవి కవచాలుగా పనికొస్తాయని అన్నారు. తాను నండూరి రామకృష్ణ మాచార్యులకు మానస పుత్రుడిగా ఆయన అభివర్ణించుకున్నారు. నండూకి మాటలను గుర్తు చేసుకుంటూ, నండూరి వారి 'రమ్యహాసలోల' రామకృ ష్ణ అన్న పద్య మకుటం వారి స్వరూప స్వభావాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశిష్ట అతిథి సుధామ, గ్రంథ సమీక్షకు లు ఆచార్య ఫణీంద్ర. ఆత్మీయ అతిథులు కె సాగర్‌రావు, ఆత్మకూరి గాంధీ, గ్రంథ సంపాదకులు నండూరి గోవిందరాజులు, విద్యారణ్యస్వామి, వే దవ్యాస్ తదిత రులు మాట్లాడుతూ నండూరి రామకృష్ణమాచార్యల జీవితం, ముఖ్యంగా సాహి తీ జీవితంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, నండూరి స్మృతులను జ్ఞప్తి చేసుకున్నారు. అనంతరం ప్రముఖ సినీనటులు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ చేసిన మహాకవి నండూరి రామకృష్ణమా చార్యులు రచించిన తిమ్మరసు స్వగతం ఏకపాత్రాభినయం సభికులను ఆకట్టుకుంది.

వార్త

06 Oct 2026 - Page 2

## మనిషికి డిగ్రీలు కవచాలుగా పనికొస్తాయి : విఎస్ఆర్.మూర్తి



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మూర్తి, సుధామ, ఫణీంద్ర, గోవిందరాజులు తదితర అతిథులు

**నాంపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త :** మనిషికి డిగ్రీలు కొలమానం కాకపోయినా అవి కవచాలుగా పనికొస్తాయని ప్రముఖ ఆధ్యాత్మిక, సాహితీవేత్త వి.ఎస్.ఆర్.మూర్తి అన్నారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో ఆచార్య వంగపల్లి విశ్వనాథం సభాధ్యక్షతన తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాల 25వ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన విఎస్ఆర్.మూర్తి విశిష్ట అతిథులు సుధామ, డా. ఆచార్య ఫణీంద్ర, కె.సాగరరావు, ఆత్మకూరి గాంధీ, గ్రంథ సంపాదకులు నండూరి గోవిందరాజులు, విద్యారణ్యస్వామి, వేదవ్యాస్ తదితరులతో కలిసి నండూరి రామకృష్ణమాచార్య సాహితీ జీవిత ప్రస్థానం గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. నండూరి వారి రమ్యహాసలలో రామకృష్ణ అన్న పద్యమకుటం వారి స్వరూప స్వభావాలకు నిలువెత్తు సాక్ష్యం అన్నారు. నండూరి కవిత్వానికి వ్యక్తిత్వానికి పెద్ద అన్నారు. మానవత్వంలేని సాహిత్యం వ్యర్థమని నండూరి అభిప్రాయమని తెలిపారు. రామకృష్ణ ఆచార్య జీవితం ముఖ్యంగా సాహిత్య జీవితమని స్మరించుకున్నారు. డా. ఆచార్య ఫణీంద్ర గ్రంథ సమీక్ష కావించారు. సభాకార్యక్రమం అనంతరం ప్రముఖ కవి, సినీనటుడు డా. అక్కిరాజు సుందరరామకృష్ణ ప్రదర్శించిన మహాకవి నండూరి రామకృష్ణమాచార్య రచించిన తిమ్మరుసు స్వగతం ఏకపాత్రాభినయం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది.

సాక్షి

# మానవత్వం లేని సాహిత్యం వ్యర్థం

సుల్తాన్‌బజార్: యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, నందూరి రామకృష్ణచార్య సాహిత్య పీఠం సంయుక్తాధ్వర్యంలో తెలుగు వెలుగు సమైఖ్య కార్యక్రమాల 25వ సమావేశం ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా నందూరి రామకృష్ణచార్య, సాహిత్య జీవన ప్రస్థానం గ్రంథావిష్కర్త వీఎస్ఆర్ మూర్తి, సభా అధ్యక్షులు ఆచార్య వంగపల్లి విశ్వనాథం, విశిష్ట అతిథిగా సుధామ, గ్రంథ సమీక్షికులుగా ఆచార్య ఫణింద్ర, అతిథిగా సాగర్ రావు, ఆత్మకూరి గాంధీలు పాల్గొన్నారు. ప్రముఖ సినీ కవి నటులు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణచే మహా కవి శ్రీమాన్, నందూరి రామకృష్ణచార్యులు రచించిన తిమ్మరసు స్వాగతం, ఏక పాత్రాభినయం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఎస్ఆర్ మూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను నందూరి రామకృష్ణాచార్యులు మానస పుత్రులుగా అభివర్ణించుకున్నారు. మనిషికి డిగ్రీలు కొలమానం కాకపోయిన అవి కవచాలుగా పనికి వస్తాయని నందూరి మాటలను గుర్తు చేసుకున్నారు. మానవత్వం లేని సాహిత్యం వ్యర్థమన్నారు. ఈ సభలో పాల్గొన్న అతిథులు పుస్తక సమీక్షులు రామకృష్ణచార్య జీవితం ముఖ్యంగా సాహిత్య జీవితంపై తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.




**తిమ్మరసు స్వగతం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు**

# నమస్తే తెలంగాణ

## సాహితీ జీవన ప్రస్థానం గ్రంథావిష్కరణ




గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 3 : తెలుగు సాహిత్య, వ్యక్తిత్వంలో నండూరి రామకృష్ణమాచార్య గొప్ప వ్యక్తి అని వక్తలు అన్నారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాలలో భాగంగా సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆడిటోరియంలో ఆదివారం 25వ సమావేశం జరిగింది. యువభారతి వ్యవస్థాపకులు ఆచార్య వంగపల్లి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సభలో నండూరి రామకృష్ణమాచార్య 'సాహితీ జీవన ప్రస్థానం' గ్రంథాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆధ్యాత్మిక శాస్త్రవేత్త వి.ఎస్.ఆర్ మూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు సుధామ, ఆచార్య ఫణీంద్ర, కె. సాగరరావు, ఆత్మకూరి గాంధీ, సాధన నరసింహాచార్య, కె.వి.ఎన్ ఆచార్య, డాక్టర్ నండూరి విద్యారణ్య స్వామి పాల్గొని నండూరి సాహిత్య జీవితంపై విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు.

05/10/2026 | Hyderabad | Page : 3
Source : https://epaper.ntnews.com/

# నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

## కార్య వర్గ సభ్యులు



శ్రీ కళ్ళేపు సాగర రావు
అద్యక్షులు



డా||ఆచార్య ఫణీంద్ర
ప్రధాన కార్యదర్శి



ఆత్మకూరి గాంధి
కోశాధికారి



నండూరి గోవింద రాజు



డా||నండూరి
విద్యారణ్య స్వామి



వేమరాజు విజయకుమార్



నండూరి రామకృష్ణ

# Nanduri Ramakrishnamacharya
# Sahitee Jeevita Prastanamu





గురువు శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారితో ..        సాహిత్య ప్రసంగం చేస్తూ ...





తాడేపల్లిగూడెం మరియు కాకినాడ  కళాశాల ప్రిన్సిపాల్ గా



నండూరి వారికీ స్వర్ణ కంకణం బహూకరణ
డా.సి.నారాయణరెడ్డి, డా.ఆచార్య తిరుమల, డా.మాడుగుల నాగఫణి శర్మ గార్లు

*Chief Editor: Nanduri Govinda Raju*